ORIENTAL RESEARCH INSTITUTE
LIBRARY

ACCESSION No. 108814

T

CALL No. 81:0731 T

SRI VENKATESWARA UNIVERSITY
TIRUPATI

శ్రీ రామానుజ కీర్తి కౌముది

తిరుమల తిరుపతి దేవస్థానములవారిచే సంభావింపఁబడిన

శ్రీ వైష్ణవ ధర్మ విజ్ఞాన సర్వస్వము

-: సచిత్రము :-

మొదటి భాగము

-: సంపాదకుఁడు :-

విద్యా భూషణ

ఉపన్యాసక రత్న - కవితా విశారద

ధనకుధరం పరదాచార్యులు

-: ప్రకాశకులు :-

శ్రీ రామానుజ కీర్తి కౌముదీ గ్రంథమాల

శ్రీ లక్ష్మీ నారాయణ పురము

గుంటూరు - 522 006.

VJORI LIBRARY
23/1/58
10 & 14

శ్రీ రామానుజ కీర్తి కౌముది

తిరుమల తిరుపతి దేవస్థానముల వారిచే సంభావింపఁబడిన

శ్రీ వైష్ణవ ధర్మ విజ్ఞాన సర్వస్వము

సచిత్రము

మొదటి భాగము

10881C
237398

సంపాదకుఁడు :

విద్యా భూషణ

ఉపన్యాసక రత్న - కవితా విశారద

ధనకుధరం వరదాచార్యులు

ప్రకాశకులు :

శ్రీ రామానుజ కీర్తి కౌముదీ గ్రంథమాల

శ్రీ లక్ష్మీ నారాయణ పురము

గుంటూరు - 522 006

శ్రీ రామానుజ వర్ణ శతము

మొదటి భాగము

రెండవ ముద్రణము

వేయి ప్రతులు

ప్రమోదూత - విజయ దశమి

సెప్టెంబరు - 1990

రామానుజ శకము ౯౨౩.

మూల్యము :—



ముద్రణము :
విజయా ప్రింటింగ్ వర్క్స్
కొత్తపేట, గుంటూరు 1.

సమాలోచన సమితి

వ్యాకరణ విద్యా ప్రవీణ - భాషా ప్రవీణ
శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులు, M. A.
విశాఖపట్టణము

*

భాషాప్రవీణ - విద్వాన్ - లలితకవి
శ్రీమాన్ కొమాండూరు రామానుజాచార్యులు
కందుకూరు తాలూకా రచయితల సంఘాధ్యక్షులు
ఉలవపాడు

*

న్యాయ విద్యాప్రవీణ
ప్రొఫెసర్ : **యస్. వి. రఘునాథాచార్యులు, M. A; Ph.D.**
సంస్కృత శాఖాధ్యక్షులు : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము
తిరుపతి

*

శ్రీమాన్ చిలకపాటి విజయరాఘవాచార్యులు, M. A; B. Ed.
లెక్చరర్ : ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ కాలేజి
నాగార్జున సాగర్ – విజయపురి సౌత్

*

శ్రీమాన్ శ్రీపెరుంబూదూరు శ్రీరంగాచార్యులు, M. A.
ఉపన్యాసకులు : శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ప్రాచ్యకళాశాల
పాలెమ్

*

కవికోకిల - విద్వత్కవి - కావ్యకళానిధి
శ్రీమాన్ వేమురుగంటి నరసింహాచార్యులు
సాహిత్య వికాస మండలి అధ్యక్షులు
సిద్ధిపేట

డాక్టరు : చించాపట్టణం శ్రీరంగాచార్యులు, M. A; Ph. D.
ఆంధ్రోపన్యాసకులు : ప్రభుత్వ ఆర్ట్సు & సైన్సు కళాశాల
ఆర్మూరు
(నిజామాబాదు జిల్లా)

*

మహోపాధ్యాయ - ఉభయ వేదాంత శిరోమణి
శ్రీమాన్ మరింగంటి శ్రీరంగాచార్యులు, M. A; B. L. O.
సంస్కృతోపన్యాసకులు :
శ్రీ వేంకటేశ్వర వివేకవర్ధనీ సంస్కృత కళాశాల
హైదరాబాదు

*

కవిశాబ్దికకేసరి - ఉభయ వేదాంత విద్వాన్
శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు, B. L. O.
వరంగల్

*

విద్యా ప్రవీణ - భాషాప్రవీణ - ఉభయవేదాంత శిరోమణి
శ్రీమాన్ కిడాంబి శ్రీనివాస రామానుజాచార్యులు, M. A.
రిటైర్డు ప్రిన్సిపాల్ : వేద సంస్కృత కళాశాల
నెల్లూరు

*

సాహిత్య విద్యాప్రవీణ
డాక్టర్ : తట్టా విజయరాఘవాచార్యులు, M. A; Ph. D.
ఉపన్యాసకులు : విశిష్టాద్వైత విభాగము
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠము
తిరుపతి

★

శ్రీనివాసాయ నమః

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ వైష్ణవ దర్శనము

(సంపాదకీయము)

" నమో నమో వాఙ్మనసాతిభూమయే
నమో నమో వాఙ్మనసైకభూమయే
నమో నమోఽనంత మహా విభూతయే
నమో నమోఽనంత దయైక సింధవే. "

శ్రీమంతము - పరమ పావనము నగు మన భరత ఖండమున ఆధ్యాత్మిక తత్త్వములను ప్రకాశింపఁజేయు దర్శనము లనేకము లున్నవి. అట్టి వానిలో - శ్రీ విశిష్టాద్వైత దర్శనము వేద వేదాంగ ఆగమాదులలో ప్రాతిపాదింపఁ బడిన తత్త్వ విశేషముతోఁ గూడి, అత్యంత విశిష్టమై, సకల చేతన సముద్ధరణ సమర్థమై పరమార్థ పద్రమై యలరారుచున్నది.

'చిదచి ద్విలక్షుఁ డగు శ్రీమన్నారాయణుఁ డొక్కఁడే తత్త్వము. సూక్ష్మ చిదచి ద్విశిష్ట మగు బ్రహ్మము జగత్కారణము. స్థూల చిదచి ద్విశిష్ట మగు ఆ పరబ్రహ్మమే కార్యభూత మగు జగత్తు. విశిష్ట కార్య కారణములు రెండును అభిన్నములు. చేతనుల కతఁడే ప్రాప్యము; ప్రాపకము' అను అతి విశిష్టము లగు తత్త్వము లను బోధించుటచే, ఈ దర్శనమునకు 'విశిష్టాద్వైతము' అను పేరు -

ప్రసిద్ధి కలిగినవి. మతీయు - విశిష్టులచే విశిష్ట క్రమమున నుపదే శింపఁబడిన ఉపనిషత్సిద్ధ మగు 'అద్వైత' మగుటచేతను ఇది విశిష్టాద్వైత మని వ్యవహరింపఁబడుచున్నది.

ఈ దర్శనమునకు - శ్రీ సంప్రదాయము, శ్రీ వైష్ణవ సంప్ర దాయము, శారీరక మీమాంసా దర్శనము, ఉభయ వేదాంత దర్శ నము, శుద్ధాంత దర్శనము, భాగవత మతము, శ్రీ రామానుజ దర్శనము - అని అనేక నామధేయము లున్నవి.

అనాది పరంపరాసిద్ధమై, ప్రమాణ - ప్రమేయ - బంధ - మోక్షాదుల పరమ తత్త్వములను బోధించుటచే నియ్యది నిఖిల దర్శన శిరోభూషణమై యుండుట యటులుండ, భగవన్నిర్హేతుక కృపా కటాక్షముచే ప్రవర్తితము లగు సంస్కృత - ద్రావిడ - రహస్య - ఆగమ ప్రస్థానము లను చతుర్విధ ప్రస్థానములచే సకల చేతన హిత ప్రబోధకమై వెలుగొందుచున్నది.

అందు సంస్కృత వేదాంత ప్రస్థానము మొదటిది. అది ఉప నిషత్ప్రస్థాన మనియు, సూత్ర ప్రస్థాన మనియు, భగవద్గీతా ప్రస్థాన మనియు, మూఁడు విధములై యున్నది.

ఉపనిషత్తులు ప్రతి కల్పము నందును సాక్షాత్తుగ పరమాత్మచే నుపదిష్టములే. బ్రహ్మ సూత్రములు నారాయణుని అపరావతారుఁ డగు శ్రీ వేదవ్యాసునిచే ప్రణీతములు. గీతా ప్రస్థానము శ్రీకృష్ణ వతారుఁ డగు శ్రీమన్నారాయణునిచే ప్రవర్తితము.

ఇట్లు సంస్కృత ప్రస్థాన మంతయు సాక్షాత్తుగ సకల జగ త్కారణకర్త యగు భగవంతునిచే ప్రవర్తితమై యున్నది. కనుకనే,

శ్రీ విశిష్టాద్వైతమున 'ప్రథమాచార్యుఁడు శ్రీమన్నారాయణుఁడే' యని కీర్తింపఁబడుచున్నది.

అనాది నిధన మగు ఈ విశిష్టాద్వైత ప్రస్థానము-బాదరాయణ, బోధాయన, టంక, గుహదేవ, భారుచి, ద్రమిడాచార్య, బ్రహ్మనంది, భర్తృమిత్ర, భర్తృ ప్రపంచ ప్రముఖు లగు ఆచార్యవర్యులచే విశిష్ట సంప్రదాయ క్రమమున అవతరింపఁజేయఁబడినది.

శ్రీమన్నారాయణుఁడే తనకు అంతరంగ కైంకర్య నిర్వాహకు లగు నిత్య సూరులను నిఖిల చేతనోజ్జీవనార్థము నియమింప, వారలు భగవ న్నియమానానుసారము భూ లోకమున దక్షిణ భారతములో నవతరించిరి. వారలే దివ్యసూరులు. వారలు - 'ఆళ్వారులు' అను పేర సుప్రసిద్ధులు. వారలకు శ్రీమన్నారాయణునియందలి నిరుపాధిక నిరవధిక ప్రావణ్యముచే, ఆ భగవంతుని యనుగ్రహము వలన ప్రాప్తము లగు పరభక్తి, పరజ్ఞాన, పరమ భక్తులు మిక్కుటములు కాఁగా - భగవ దనుభవ పరీవాహ రూపముగ వారి దివ్య వదనార విందముల నుండి దివ్య ప్రబంధము లావిర్భవించినవి. అవియే ద్రావిడ వేదాంతములు.

అందు, శ్రీ విష్వక్సేనుని అపరావతారులును - ఇతర దివ్య సూరుల కెల్ల ఱుకు అవయవ స్వరూపులును - ప్రపన్న జన కూటస్థులు నగు నమ్మాళ్వారుల వదనారవిందమునుండి ఋగ్యజు స్సామాథర్వణము లను సంస్కృత వేద చతుష్టయము - తిరువిరుత్తము, తిరువాశిరియము, పెరియ తిరువన్దాది, తిరువాయిమొళి అను పేరులతో నవతరించెను. ఇట్టి వీరి ద్రావిడ వేదములకు - ఇతర దివ్య సూరులు ప్రసాదించిన దివ్య ప్రబంధము లన్నియు సంస్కృత వేదమునకు శిక్షా

దులవలె అంగములుగా నమరి యున్నవి. ఇది ద్రావిడ వేదాంత ప్రస్థానము.

శ్రీమన్నారాయణుఁడు తాను ప్రవర్తింపఁజేసిన సంస్కృత వేదాంత ప్రస్థానము కేవలము శాస్త్ర విజ్ఞానము గలవారికి మాత్రమే తప్ప, ఇతరులకు గ్రహింప నలవిగాని దగుట చేతను, త్రిగుణాత్మకమైన ప్రకృతియొక్క పరిణామ రూప మగు దేహము ననుసరించిన ఆత్మ ధర్మములను ప్రబోధించుట చేతను, సకల చేతనుల కది అందు బాటులో లేనందున, ఆబాల గోపాల మెల్ల ఱకును ఉజ్జీవనము గలుగ జేయుటకై, అర్థపంచక జ్ఞానోపదేశములును - ఆత్మ స్వరూపమున కనుగుణము లగు ధర్మములకు ప్రబోధకములు నగు రహస్యముల నుపదేశించెను.

అట్టి రహస్యములలో మూఁడు ముఖ్యములై యున్నవి. వానికే 'రహస్య త్రయము' అని ప్రసిద్ధి. అందు 'తిరుమంత్రము' అను మొదటి రహస్యమును బదరికాశ్రమమునందు తన యంశతో నవత రించిన నరుని వ్యాజీకరించుకొని, ఆ శ్రీమన్నారాయణుఁడే, నిఖిల లోకోజ్జీవనార్థము ప్రవర్తింపఁజేసెను. రెండవ రహస్య మగు ద్వయ మును శ్రీలక్ష్మీ దేవిని వ్యాజీకరించుకొని, సకల లోకములకును ఉప దేశించెను. మూఁడవ రహస్య మగు చరమ శ్లోకమును కురు పాండవ యుద్ధారంభ సమయమున కురుక్షేత్రమునందు ఆస్థాన స్నేహ కారు ణ్యములచే ధర్మాధర్మ ధియూకులుఁడును - పరమ ప్రపన్నుఁడు నగు పార్థుని వ్యాజీకరించుకొని, నిఖిల ప్రపంచములకును బోధించెను. ఇట్టి రహస్యము లింకను అనేకము లున్నవి. దీనికే రహస్య ప్రస్థాన మని పేరు.

మఱియు - స్వాంతరంగ కైంకర్య నిర్వాహకు లగు అనంత గరుడ విష్వక్సేనాదులకు శ్రీ పాంచరాత్ర శాస్త్రమును ఆ శ్రీమన్నా

రాయణుఁడే ఉపదేశించెను. అష్టోత్తర శత సంహితాత్మక మగు ఆ శాస్త్రము భగవ న్ముఖోద్గత మగుట చేతను, భగవ త్సంబంధమైన విషయమును బోధించున దగుటచేతను 'భగవ చ్ఛాస్త్రము' అను పేర సుప్రసిద్ధమై యున్నది. దానికి ఆగమ ప్రస్థాన మని పేరు. అందు - శ్రీరంగము, శ్రీ వేంకట్రాది, శ్రీహస్తిగిరి మొదలగు దివ్య క్షేత్రములందు నిఖిల లోకోజ్జీవనార్థము అర్చారూపమున నెలకొని యుండు పరమాత్ముని దివ్య మంగళ విగ్రహ విభవ విభూత్యాదులు అభివర్ణింపఁబడియుండుటయే గాక, విశిష్టము లగు తత్త్వ హిత పురు షార్థములు పరమ సులభముగ విపులీకరింపఁబడి యున్నవి.

ఇట్లు శ్రీ విశిష్టాద్వైతమునందలి ప్రస్థానము లన్నియు సాక్షా త్తుగ పరమ కారుణికుఁ డగు శ్రీమన్నారాయణునిచే ప్రవర్తితము లగుటచే, ఇయ్యది పరమ వైదిక సిద్ధాంతముగ సుప్రసిద్ధమై, సకల చేతనులకు పరమార్థమును ప్రసాదించి, ముముక్షు జనులను తరింపఁ జేయ గల్గుచున్నది.

ఈ విధముగా అనూచానముగ అతి విలక్షణమై, విశాల భార తమున విలసిల్లు ఈ సంప్రదాయము - ఈ నడుమ, కలి ప్రాబల్యముచే నుచ్ఛిన్నమై, శోభ దక్కి- యుండుట తటస్థించెను. అట్టి తరుణమున, ఏత న్మత పునరుద్ధరణార్థమై, మహనీయులు కొందఱు ఈ భరత ఖండ మున అవతరింపవలసిన యవసర మేర్పడెను. అట్టి యవసర సమయ మున, ప్రపన్న జన భాగధేయ పరిపాకముచే, తొలుత - 'శ్రీమ న్నాథమునులు' అను నొక మహా ప్రాజ్ఞు లవతరించిరి.

ఆ మునిచంద్రులు నిష్కళంక మగు తమ ప్రతిభా విశేషము వలనను - అష్టాంగ యోగానుష్ఠానాది తపః ప్రభావము వలనను నమ్మాళ్వారులను సాక్షాత్కరింపఁ జేసికొని, వారి వలన పూర్వోప

దర్శితము లగు ప్రస్థానముల నన్నింటిని తత్త్వ రహస్యములతోఁ బాటు సాంగోపాంగముగ నధికరించి, తా మనుభవించిన పరమాను భవమును ఎల్ల అును అనుభవించి ఉజ్జీవింపవలె నను విశా లాశయము గలవారై, మహోదార మనస్కులై, పరమ కారుణికులై, సకల జన సముద్ధరణార్థము ఈ ప్రస్థానముల నెల్ల తాము లోకమున స్వయముగా ప్రవర్తింపఁజేయుటయే గాక, తమ శిష్య ప్రశిష్యుల మూలమునఁ గూడ ఈ సంప్రదాయమునకు తగిన ప్రాచుర్యమునుఁ గల్గింపఁజేసిరి.

అదియునుఁ గాక, శ్రీ విశిష్టాద్వైత దర్శన వైశిష్ట్యము నుగ్గ డించుచు - 'న్యాయ తత్త్వము' అను పేర నొక మహా గ్రంథమును రచించి, ఈ సిద్ధాంత స్వరూపమును లోకమునకు బాగుగా దర్శింపఁ జేసిరి. 'పురుష నిర్ణయము' అను పేర సంతరించిన మఱి యొక గ్రంథ ములో - పరమ పురుషుఁ డగు శ్రీమన్నారాయణుని అప్రతిమ ప్రతిభా విశేషములను, దివ్య వైభవమును తనివితీర అభివర్ణించుచు, పురు షోత్తముఁడును, షడ్గుణైశ్వర్య పరిపూర్ణుఁడు నగు శ్రీమన్నా రాయణుఁడే సకల చేతనులకును ఆశ్రయణీయుఁ డని ప్రబోధించిరి. ఇఁక 'యోగ రహస్యము' అను మూఁడవ గ్రంథమున, అష్టాంగ యోగములకు సంబంధించిన విధి విధానములను విపులముగాఁ దెలు పుచు, ఆ యోగ ప్రభావములను అద్భుతముగా అభివర్ణించిరి. ఇట్లు శ్రీమన్నాథమునులు లోక కల్యాణ కాంక్షతో తమ తప శ్శక్తిని బహు ముఖములుగా వెచ్చించి, ఈ సంప్రదాయమునకు వన్నెను - వాసిని చేకూర్చి, చిరస్మరణీయులు కాఁగల్గిరి.

అనంతరము వీరి పౌత్రు లగు శ్రీ యామున మునీంద్రులు పండితోద్దండులై, ప్రచండమైన ప్రజ్ఞా ప్రాభవములు గలవారై, ప్రతి పక్షుల గర్వాటోపముల నణంచుచు, అసదృశ మగు తమ ప్రతిభా విశేషమున ఎల్ల అును సంభ్రమాశ్చర్య పులకిత గాత్రుల గావించుచు,

పరతత్త్వ నిర్ణయ మొనరించి రాజాధిరాజులై, పరమ యోగి పుంగవులై, ద్రుమిన స్థాపనాచార్యులై, దిగ్విజయము గావించి, 'ఆళవందారులు' అను పేర విఖ్యాతి గాంచిరి.

ఈ మునిపుంగవులు - వారి పితామహులవలె ఉభయ వేదాంత సంప్రదాయముగా ప్రసిద్ధిఁ జెందిన శ్రీ విశిష్టాద్వైత సిద్ధాంతమును తమ శిష్య ప్రశిష్యులకు ఉపదేశించుచు ప్రవర్తింపఁజేయుటయేగాక, సంప్రదాయ ప్రబోధకము లగు అనేక గ్రంథములనుఁ గూడ రచించిరి.

అట్టి వానిలో - 'గీతార్థ సంగ్రహము' అను గ్రంథమున, శ్రీ విశిష్టాద్వైత మతానుసారముగ భగవద్గీత యందలి రహస్యములు తేట తెల్లము గావింపఁబడినవి. 'శ్రీ చతుశ్లోకి' అను గ్రంథమున, శ్రీ వైష్ణవ ధర్మమునకు ప్రథమ ప్రవర్తిక యగు శ్రీలక్ష్మీదేవి సంస్తుతింపఁబడినది. ఆత్మ సిద్ధి, ఈశ్వర సిద్ధి, సంవిత్ సిద్ధి అను త్రివిధ సిద్ధులతోఁగూడిన 'సిద్ధి త్రయము' అను గ్రంథమున, చిదచి దీశ్వర తత్త్వములు విపులముగాఁ దెలుపఁబడినవి. శ్రీ వైష్ణవ దర్శనమునకు మూలాధారమై, భగవచ్ఛాస్త్రముగా ప్రసిద్ధి జెందిన శ్రీ పాంచరాత్రాగమమునకుఁ గల ప్రామాణ్య ప్రాముఖ్యములు 'ఆగమ ప్రామాణ్యము' అను గ్రంథమున నిరూపింపఁబడినవి. మధుర మంజులములైన గంభీర భావములతో - లలిత కోమలములైన పద విన్యాసములతో నొప్పారుచు, ఎనుబది శ్లోకములు గల 'స్తోత్ర రత్నము' అను గ్రంథమున, శరణాగతి తత్త్వము అత్యంత విలక్షణముగా ప్రబోధింపఁబడినది. ఇది 'ఆళవందార్ స్తోత్రము' అను పేర వ్యవహరింపఁబడుచు, నిత్యపారాయణ యోగ్యమై విలసిల్లుచున్నది.

శ్రీ యామున ముని విరచితము లగు ఈ విశిష్ట గ్రంథములు శ్రీ విశిష్టాద్వైత సంప్రదాయ సౌధమునకు మూల స్తంభములుగా రూపొంది, ప్రశస్తి గాంచియున్నవి. ఇట్లు శ్రీ యామున ముని చంద్రులు ఈ సంప్రదాయ వైశిష్ట్యమును లోకమున బహు ముఖములుగా వెల్లడించి, అఖండ యశమును బడయ గల్గిరి.

మఱియు, అనంతావతారులును - శ్రీ వైష్ణవ ఘంటాపథ నిర్ధారకులు నగు శ్రీ రామానుజ ముని పుంగవులకు, వీకలవ్యునకు ద్రోణాచార్యులవలె సాక్షాత్తుగ ఆచార్య శేఖరులై, వారిచే శ్రీ విశిష్టాద్వైత సంప్రదాయానుసారముగ, బాదరాయణాది ప్రణీతము లగు బ్రహ్మసూత్రాదులకు శ్రీ భాష్యాదుల నవతరింపఁజేసి, వ్యాస పరాశర నామములకు సుప్రసిద్ధిని గల్గించి, ఈ సంప్రదాయమునకు పరమాచార్యులై విరాజిల్లిరి.

ఱటుపిమ్మట ఈ విశిష్ట సంప్రదాయమును సంస్థాపించుటకై - "అనంతః ప్రథమం రూపం, ద్వితీయం లక్ష్మణ స్తథా, తృతీయం బలభద్ర స్సాన్యత్, కలౌ కశ్చి ద్భవిష్యతి" అను పురాణ వాక్యాను సారముగ, సర్వ దేశ సర్వ కాల సర్వావస్థలయందును భగవంతుని నిరంతర కైంకర్య నిర్వాహకు లగు ఆదిశేషులే, భగవ న్నియమనామ సారముగ, దక్షిణ భారతమునఁ గల భూతపురీక్షేత్రమునందు శ్రీకాంతి మతీ కేశవయజ్వలకు పుత్రరత్నమై, 'శ్రీ రామానుజులు' అను పేర నవతరించిరి.

వీరు బాల్య దశ నుండియు శ్రీమన్నారాయణ చరణారవింద ద్వంద్వ రుకైంకర్య వ్యాముగ్ధులై, పరభక్తి - పరజ్ఞాన - పరమ భక్తు లతిశయింప, పరమాత్మనియందు పరమ రతులై, ఇతర విషయము లందు విరక్తులై, పాపధ్వాంతములను శమింపఁ జేయుచు, పుణ్యాం

భోజముల వికసింపఁజేయుచు, అతి విలక్షణ దివాకరులై విరాజిల్లుచు, శ్రీ విశిష్టాద్వైత సిద్ధాంత స్థాపనమునకై దీక్ష వహించి, లక్ష్యమును సాధించి, విజయ ధ్వజమును సంస్థాపించిరి.

ఈ యతి సార్వభౌములు బోధాయన వృత్తి, ద్రమిడ భాష్య, సిద్ధిత్రయాదుల ననుసరించి సూత్ర ప్రస్థానమునకు విశిష్ట మగు శ్రీభాష్యమును రచించి, కాశ్మీర దేశమున సుప్రసిద్ధముగాఁ గల సరస్వతీ పీఠమున 'శ్రీభాష్యకారులు' అను బిరుదముతోఁ బాటు – బంగారు మయమైన శ్రీ లక్ష్మీహయగ్రీవ విగ్రహమును బహుమాన పురస్సరముగా బడయఁగల్గిరి. మఱియు – 'వేదాంత సారము', 'వేదాంత దీపము' అను రెండు గ్రంథములను బ్రహ్మసూత్రములకు వ్యాఖ్యాన ప్రాయములుగా రచించిరి. ఉపనిషత్తులలో అద్వైతులకు – విశిష్టాద్వైతులకు భేదాభిప్రాయములుగాఁ గల వాక్యములకు అర్థమును తమ శేముషీ విశేషముచే సముచిత విధానమున సమన్వయించి, ఆ వాక్యములలోని గంభీర భావములను, రహస్యములను విపులీకరించుచు – 'వేదార్థ సంగ్రహము' అను గ్రంథమును రచించిరి. భగవద్గీతా ప్రస్థానమునకు భావ మధురమైన శైలిలో భాష్యమును రచించుచు – అందు భగవద్వైభవమును, భక్తి ప్రపత్తుల వైలక్షణ్యమును విశదీకరించిరి. 'శరణాగతి గద్య', 'రంగనాథ గద్య', 'వైకుంఠ గద్య' అను పేర గద్యత్రయమును రచించుచు, అందు పరమపదనాథుని అప్రాకృత దివ్య మంగళ విగ్రహమును – కల్యాణ గుణములను – అఖిల జగన్మాతయు, అపార కరుణా స్వరూపిణియు నగు శ్రీ లక్ష్మీదేవియొక్క విభవ విభూత్యాదులను తనివితీర అభివర్ణించుచు,

ఆ శ్రీ శ్రియఃపతులను బహు భంగుల సంస్తుతించిరి. భగవదారాధన విధానమును బోధించుచు 'నిత్య గ్రంథము' అను గ్రంథమును రచించి, ముముక్షువులకు తరణోపాయముఁ జూపిరి.

మఱియు – ఆసేతు శీతాచల పర్యంతము దిగ్విజయ యాత్ర జేయుచు, శ్రీ వైష్ణవ మతమునందలి పరమ సౌభాగ్యమును – సకల చేతన శుభదాయకత్వమును వెల్లడించి, దేశమం దంతటను శ్రీ వైష్ణవ మత సంఘములను సంస్థాపించి, ఆ సంఘములలో సర్వ వర్ణముల వారికిని ప్రవేశములను లభింపఁజేసి, విశ్వ విఖ్యాతి బొంచిరి.

అదియునుఁ గాక, నిఖిల లోకోజ్జీవనార్థమై శ్రియఃపతి స్వయముగా నవతరించుటచే, స్వయం వ్యక్త స్థలములుగా ప్రశస్తి గన్న శ్రీరంగ, శ్రీ వేంకటాద్రి, హస్తిగిరి, యాదవాద్రి ప్రముఖము లగు దివ్య దేశము నెల్ల సమీకరించి, అనేక విధము లగు కట్టుబాట్లు నేర్పఱచి, మఠ మందిరములను నెలకొల్పి, సకల జనులకు ఒక నూతన చైతన్యమును గల్గించి, ఈ సంప్రదాయమునందు అభిరుచిని, అభినివేశమును సముద్భవింపఁజేసి, తద్ద్వారా శ్రీ వైష్ణవ సిద్ధాంతమునకు విశేషముగ పరిపుష్టిని చేకూర్చుటయే గాక, ఈ విశిష్టాద్వైత మత ప్రచారమునకై, డెబ్బదినాల్గు సింహాసనముల నేర్పఱచిరి.

బహుముఖములైన ఇట్టి మహోద్యమములను నిర్వహించి, విజయ తేజముతో విరాజిల్లుచు, శ్రీ వైష్ణవ ధర్మ సుమ సౌరభమును దేశమం దంతటను ఈ యతి సార్వభౌములు వెల్లివిరియఁజేసిన కార

ణమువలననే, ఈ దర్శనమునకు 'శ్రీ రామానుజ దర్శనము' అను అన్వర్థనామ మేర్పడి, సుప్రసిద్ధమై యున్నది.

శ్రీ రామానుజులవారి యనంతరము ఆచార్యవర్యు లనేకులు ఈ సంప్రదాయమును ప్రచార మొనరించిరి. శ్రీ పిళ్ళలోకాచార్యులు ఈ విశిష్టాద్వైతమునందలి ప్రస్థానముల నన్నింటిని సామాన్య జనులకుసైతము కరతలామలక మొనరించుటకై, ద్రవిడ భాషామయము లగు సులలిత మధుర రమణీయ సూత్రములుగ అష్టాదశ రహస్యము లను రచించి, ఈ సంప్రదాయమునకు ఒక నూతన తేజమును సంత రించిరి. వీరి గ్రంథములలో - ద్రావిడ వేదాంతముల యంతరి పరమ విలక్షణము లగు భగవద్దివ్య కల్యాణ గుణ గణ వైభవాదులు ప్రతి ఫలించుచుండుట కడుంగడు విశేషము.

శ్రీ శేషాచలాధీశుని దివ్య ఘంటావతారు లగు శ్రీ వేదాంత దేశికులు భగవదనుగ్రహ విశేషముచే సర్వతంత్ర స్వతంత్రులై, ముప్పది నాలుగు శ్రీభాష్యమును అధికరించినవారై, తత్త్వ టీక, శత దూషణి, గీతాభాష్య వ్యాఖ్యానము, అధికరణసారావళి, తత్త్వ ముక్తాకలాపము, న్యాయ సిద్ధాంజనము, న్యాయ పరిశుద్ధి మొదలగు అనేక గ్రంథములను రచించి, సంస్కృత వేదాంత ప్రస్థానమునకు ఒక నూతనోత్తేజమును గలుగజేసిరి. మఱియు - ద్రమిడోపనిషత్తాత్పర్య రత్నావళిని రచించి ద్రావిడ వేదాంత ప్రస్థానమునకును, ద్వాత్రింశ ద్రహస్యములను రచించి రహస్య ప్రస్థానమునకును, పాంచరాత్రరక్ష మొదలగు వానిని రచించి శ్రీ పాంచరాత్ర ప్రస్థానమునకును విశేష ప్రాచుర్యమును గల్గించుటయే గాక, సంస్కృత భాషామయము లగు

నిరర్గళ ప్రౌఢ గంభీర స్తోత్రజాలములవలె ద్రావిడ భాషామయము లగు దివ్య ప్రబంధములనుఁ గూడ రచించిరి. వీనికే 'దేశిక ప్రబంధము' అను వ్యవహారము ప్రసిద్ధము. వే యేల ? వీరు రచింపని గ్రంథములు ఏ భాగమునను లేవన్న, అతిశయోక్తి కానేరదు. ఇట్లు శ్రీ దేశికులు బహు గ్రంథకర్తలై, 'కవి తార్కిక సింహ' అను బిరుదమును బడసి, అఖండ యశమును సముపార్జించిరి. శ్రీ విశిష్టాద్వైత మత వికాసమునకై వీరొనరించిన నిరుపమాన సేవా త్యాగములు శ్రీ వైష్ణవ లోకమునకు చిరస్మరణీయములై యున్నవి.

శ్రీమద్రామానుజ యతి సార్వభౌములు ఈ లీలా విభూతిలో నూట యిరువది సంవత్సరములు నివసించి, నిమిషమాత్రమైనను వ్యర్థము చేయక, ఈ సంప్రదాయమునకు అతి విశిష్ట మగు సంస్కరణమును, నిస్సమాభ్యధిక మగు అభ్యుదయమును గలుగఁజేసిరి. కాని, ద్రావిడ వేదాంత ప్రస్థానమునకు విశిష్ట వైశద్యమును గలుగఁ జేయుటకై, వారికితగిన అవకాశములేకపోయెను. కావున, మఱుల భగవన్నియమనానుసారము వారే, పాండ్యదేశమున 'మణవాళ మహా మునులు' అను పేర నవతరించిరి. వీరు శ్రీ యతివర పునరవతారభూతు లగుటచే, సంప్రదాయార్థముల నెల్ల సులభముగా గ్రహించినవారై, వాని నెల్ల సర్వతోముఖముగ ద్రావిడ వేదాంత ప్రస్థాన సమభ్యుదయమునకే వినియోగము గావింపవలె నని సంకల్పించి, నమ్మాళ్వారు లనుగ్రహించిన ద్రావిడ దివ్య ప్రబంధములకు వ్యాఖ్యాన ప్రాయము లగు ఈడు ముప్పత్తారాయిరప్పడి (భగవద్విషయము) మొదలగు గ్రంథములను పరిశీలించి, పరిష్కరించి, ప్రమాణాకర నిర్దేశాదుల సంతరించి, శ్రీ పెరియవాచ్చాన్‌పిళ్ళ కృత మగు 'పెరియాళ్వార్ తిరుమొళి వ్యాఖ్యానము' శిథిలము కాఁగా - ఆ దివ్య ప్రబంధమునకు మఱుల

సులలిత మగు శైలిలో వ్యాఖ్యానమును రచించియు, ద్రావిడ వేదాంత ప్రస్థానమునకు సముచితము లగు సరళ గంభీర వ్యాఖ్యాశ ములను గ్రహించి, శ్రీ విశిష్టాద్వైత సిద్ధాంతమును దేశమునం దంత టను వ్యాపింపఁజేయుటయే గాక, శ్రీమద్రామానుజులవలె దేవాల యములందును - శ్రీ వైష్ణవ సంఘముల యందును అనేక విధము లగు సమీకరణముల నొనర్చి, శ్రీరంగనాథుని కృపా విశేషమునకు పాత్రులై, ఆ శ్రీరంగనాథునిచే 'పెరియ జీయర్' అని కొనియాడ బడినవారై, యశశ్చంద్రికలతో విరాజిల్లిరి.

ఇట్లు ఈ విలక్షణ సిద్ధాంతము శ్రీమన్నారాయణుని వద్దనుండి శ్రీ మణవాళ మహామునుల వఱకును అవిచ్ఛిన్నముగ ప్రచలితమై ప్రకాశించునది. ఈ సంప్రదాయము ననుసరించి తెలుఁగులో - ఆచార్య సూక్తి ముక్తావళి, ఆముక్త మాల్యద, ముముక్షు జన కల్పకము మొదలగు కొన్ని గ్రంథములు వెలువడినవి. తద్ద్వారా - శ్రీ వైష్ణవ సంప్రదాయ వైశిష్ట్యమును ఆంధ్ర మహా జనులు కొంత వఱకు అవగతము గావించుకొని, ఈ సంప్రదాయమును సమాశ్ర యించి, సత్ఫలితములను పొందియే యున్నారు. ఐనను, సంస్కృత - ద్రావిడ - రహస్య - ఆగమ ప్రస్థానములలోఁ గల విశిష్ట విషయ ములతో, సంప్రదాయ విశేషములతో ఒక సమగ్ర గ్రంథమును తేట తెన్గున సర్వాంగ సుందరముగా రూపొందించి, ఆంధ్ర మహా జనులకు అందఁజేయవలసిన యవసర మెంతగనో ఉన్నది. అట్టి యవసరమును గుర్తించియే ఈ సంప్రదాయ విశేషముల నన్నిటిని సర్వతోముఖముగ సమీకరించి, వాని నెల్ల - ఒక మహా గ్రంథముగా సిద్ధ మొనరించి,

త న్మూలమున ఆంధ్ర మహా జనులకు ఆత్మ సంతర్పణము గావింప వలె నని మేము సంకల్పించితిమి. ఇది యొక మహా సంకల్పము. ఈ మా మహా సంకల్పము సఫల మగుటకు - శ్రీనివాస భగవానుని కృపా కటాక్షము, భాగవతోత్తముల సమాదరణము అత్యావశ్యక ములై యున్నవి.

ఇది శ్రీ రామానుజ కీర్తి కౌముది. ఇయ్యది పదునారు కళలతో ప్రకాశించి, రసజ్ఞు లగు వారికి మోద ప్రమోదములను ప్రసాదింపఁగలదు.

ఇపు డిది ప్రతిప త్కళ. ఇట్లే, శేషించిన కళలు కూడ వరుస వరుసగా వెలువడుచున్న వని ఇందు మూలమున పాఠక మహాశయు లకు విజ్ఞప్తి చేయుచు, ఈ గ్రంథ ప్రచురణ మహోద్యమము ఆచిర కాలములో ఫలాయిత మగుటకై, సహృదయుల సహకారము తప్పక లభింపఁగల దనియే మేము విశ్వసించుచున్నాము.

విషయానుక్రమణిక

1. శ్రీ వేంకటేశ్వర స్తవము 1 - 2

శ్రీమాన్ కొమాండూరు రామానుజాచార్యులు

2. హిందూ మత వైశిష్ట్యము 3 - 32

శ్రీమాన్ గొట్టుముక్కల రామాకాంతాచార్యులు

భగవత్ స్తుతి

పరమ భాగవత స్తుతి

శ్రీ రామానుజ భాష్యకార స్తుతి

వేదమత సనాతనత్వము

మహా భారత కాలము

భగవద్విభూతి

భగవదవతరణము

సాత్త్వికోపబృంహణ వాఙ్మయము

వేదోక్త భాగవత మత సంస్థాపనము

భగవన్ (భాగవత) మత వైభవము

శ్రీ గీతాచార్య వైభవము

అవతార రహస్య జ్ఞానము మోక్షప్రదము

దేవర్షి నారదుఁడు శ్రీ భాగవత పాంచరాత్ర శాస్త్ర ప్రవర్తకుడు

భాగవత మత గురుపరంపరా వైభవము

వేదోక్త 'భాగవత మత' స్వరూపము

అవైదిక దర్శన విమర్శనము

భాగవత మత పరంపరా విచ్ఛేదము - తదుద్ధరణము

భాగవత గురుపరంపరా విచ్ఛేదము - తదుద్ధరణము

భాగవత గురుపరంపర విచ్ఛిత్తి గాకుండ జేయబడిన జాగ్రత్తలు

మాయ

నిర్గుణము

మోక్ష స్వరూపము
తత్త్వత్రయ వివేచన
భగవానుఁడు చిదచి ద్విశిష్టుఁడు
మోక్షవిద్య 'దహర' విద్యయే
దహర విద్య - ప్రపత్తి - మోక్షము
ప్రపత్తి వై భవము
సంన్యాసాశ్రమీయులకును ఈ ప్రపత్తియే తారకము
(ప్రపత్తి శ్రుతి సిద్ధము)

పరబ్రహ్మము - ఆనందమయ స్వరూపుఁడు
పరబ్రహ్మము - త దంశ యగు అక్షరుఁడు (జీవుఁడు)
పరబ్రహ్మయొక్క వ్యక్తావ్యక్త స్వరూపము
తత్త్వత్రయ విమర్శ
వేదోక్త భాగవత మతోద్ధరణము
(శ్రీ రామానుజ భాష్యకారోదయము)

3. శ్రీ పాంచరాత్రము - త ద్విశేషము 33 - (
శ్రీమాన్ పొడిచేటి శ్రీరంగాచార్యులు

అవతరిణిక
భగవ ద్వైభవము
పాంచరాత్ర శాస్త్రోదయము
తంత్రము
ఆగమము
ఏకాయనము
ప్రకృతి వేదము
మూలవేదము
ఉపనిషత్తులలో పాంచరాత్రము

వేదములలో పాంచరాత్రము
వైదిక మత ప్రవర్తకుల దృష్టిలో పాంచరాత్రము
పాంచరాత్ర శాస్త్ర ప్రామాణ్యము
ఆగమములు - దేశ వ్యాప్తి
సంహితలు - విషయ విభాగము
వేదములలో పాంచరాత్రము
పాంచరాత్రము - వైష్ణవ మతము
ఆలయములు - ఆరాధకులు
ఆలయములు - పరిపాలకులు
అనుష్ఠానము - ఆరాధనము
సగుణోపాసనము - ప్రయోజన విశేషము
పాంచరాత్ర శాస్త్రము - దేశాభ్యుదయ సాధకము
దేవాలయములు - ధార్మిక దుర్గములు
ఆలయ భేదములు - ప్రభావ విశేషములు
కృతజ్ఞత
నివేదన

4. శ్రీ వైష్ణవ మత వైభవము 60 - 85
శ్రీమాన్ వేదాంతం జగన్నాథాచార్యులు
మంగళాచరణము
శ్రీ వైష్ణవ మతోదయము
మహర్షులు - మత వ్యాప్తి
వైష్ణవ మత వాక్య వ్యుత్పత్తి
వేద ప్రాపాణ్యము - వైష్ణవ మతము
పురాణేతిహాసములలో వైష్ణవము
వైష్ణవ మతమే విశిష్టాద్వైతము

శ్రీ వైష్ణవ సిద్ధాంత స్వరూపము
యోగ మార్గములు
బౌద్ధ యుగము - ఆస్తిక మత విపర్యయము
ఆస్తిక మత పున రుద్ధరణము - శ్రీ శంకర యుగము
శ్రీ వైష్ణవ మత పున రుజ్జీవనము - శ్రీ రామానుజ యుగ

5. శ్రవణ భక్తి 86 -
శ్రీమాన్ బృందావనం రంగాచార్యులు

6. భక్తి తత్త్వము 93 - 1
శ్రీ రావూరు ప్రసన్న సత్యనారాయణ

అంజలి
భాగవత వైశిష్ట్యము
భాగవతము - పరబ్రహ్మము
భాగవత భక్తి - వేదాంత భక్తి
భక్తి - ముక్తి
భాగవత పాంగత్య ప్రభావము
భక్తి సాధనములు
భక్తికి అధికారులు
భక్తికి అనర్హులు
భక్తుని లక్షణములు
భక్తుని ధర్మములు
నవ విధ భక్తులు
పరభక్తి స్వరూపము
భాగవత లక్షణములు
భక్తుని వైశిష్ట్యము

7. భక్తి వాఙ్మయము 122 - 151

ఆచార్య – యస్వీ జోగారావు

భగవద్గీర - భక్తి యోగము

భాగవతము - భక్తి మార్గము

విశిష్టాద్వైతము - భక్తి యోగము

భక్తి - కవిత

భక్తిరస వాదము

మధుర భక్తి

భక్తి వాఙ్మయము - భారత దేశము

భక్తి వాఙ్మయ ప్రక్రియలు - తత్త్వానుశీలనము

ఉదాహరణము

పల్లకిసేవా ప్రబంధము

ఏకాంత సేవ

హరి కథలు

8. నామ సంకీర్తన మహిమ 152 - 169

శ్రీ కల్లూరి చంద్రమౌళి

భగవద్వైభవము

నామ వైభవము

మానవుడు - జనన మరణములు

అజప జపము - భగవత్సాక్షాత్కారము

నామ రూపములు

అష్టాంగ యోగములు - వాని ప్రభావములు

నామ ప్రభావము

పర బ్రహ్మము - శబ్ద బ్రహ్మము

9. సంఘ సాహిత్యము - వైష్ణవ తత్త్వము 170 - 2
శ్రీమాన్ ధనకుధరం వరదాచార్యులు

అంజలి
అవతరిణిక
తమిళ భాషోత్పత్తి
తమిళ భాషా వికాసము
సంఘ కాలము - ప్రకృతి పూజ
తమిళ భూ భాగములు - త తధిదేవతలు
తమిళ ప్రదేశములో వైష్ణవ ధర్మము
సంఘ సాహిత్యములో వైష్ణవము
ఆలయములలో తిరుమాలార్చన
ఆళ్వారులు - భక్తి ప్రచారము

10. పన్నిద్దరాళ్వారుల వైభవము 212 - 2
శ్రీమాన్ రొంపిచర్ల పార్థసారధి భట్టాచార్యులు

భూమిక
పరిచయము
నాలాయిర దివ్యప్రబంధము - త ద్వివరణము
నాలాయిర వ్యాఖ్యానములు
ఆళ్వారులు - అవతార వైభవము





శ్రీ పద్మావతి

శ్రీ వేంకటాచలపతి

శ్రీ వేంకటేశ స్తవము

'భాషా ప్రవీణ - లలిత కవి'

శ్రీమాన్ కొమాండూరు రామానుజాచార్యులు

★ ★ ★

శ్రీమద్వేంకట శైలమందిర ! నమ శ్శ్రీరస్తు తే సర్వదా
భూమీనాథ ! సమేధతాం స్వకరుణాస్ఫూర్తి ర్మయి ప్రత్యహమ్
శ్యామాంభోద సమానగాత్ర ! సుషమా సౌభాగ్యమూర్తే ! జయ
స్తోమ స్నాత్ భవతే విశ్రమజనబంధో ! వేంకటేశ ప్రభో !

ఫలమో పుష్పమొ గంధమో తులసియో పానీయమో శాకమో
కలమాన్నంబొ ఘృతంబొ పాలు పెరుగో కర్పూర తాంబూలమో
సులభ ప్రాప్య పదార్థ మేదయిన సంశుద్ధాత్ములై యిచ్చినన్
గొలువన్ వచ్చిన మెచ్చుతండ్రి ! యివె మ్రొక్కుల్ వేంకటేశ ప్రభూ !

నీ కారుణ్య కటాక్ష మెవ్వని రవంతే జెందు, నవ్వాడె యీ
లోకైక ప్రభవిష్ణుడాతడె దయాళుం డాతడే యాచకా
లీ కల్పద్రుమ మాతడే విబుధపాళీమూళి రత్నంబు డే
వా ! కల్యాణగుణాంచితా ! జగదధీశా ! వేంకటేశ ప్రభూ !

తెలుగుం బల్కుల నూత్న నూత్న రుచులం దీపించు క్రొందేనెలున్
దెలుగుం బిడ్డల సత్కళా గటమయున్ దేజంబు సౌహార్దమున్
వెలుగుం బాటల దిద్ది తిర్చినను - నీవే వాని తార్కాణగన్
దెలుగుం భూమి నలంకరించితివి తండ్రీ ! వేంకటేశ ప్రభూ !

జేజే లెందఱు లేరు ధారుణిని ? మా చిత్తంబు నీయండె బల్
మోజుం బూనెను శ్రీనివాస ! యిక మా పుణ్యం బగణ్యంబు, ని
ర్వ్యాజంబౌ దయ బాపముల్ దులిపి నీ భక్తావళిం బ్రోవు మ
వ్యాజ ప్రేమ సపర్య చేయుదుము దేవా ! వేంకటేశ ప్రభూ !

కరి రక్షించితి – ద్రౌపదిన్ మనిచితిన్ – కల్యాణ సంధాతనై
పరిపాలించితి మాని సంఘములఁ దాపం బొర్చి మేల్గొల్చి యా
దర మొప్పారఁగ భక్తరక్షణమె నా తాత్పర్యమా నంటి వా
కరుణం జూపుము వక్ష్మి భాసి తిలకాంకా వేంకటేశప్రభూ !

లలితంబై – సురభిచ్ఛటా మధుర్మమై – లక్ష్మీప్రదంబై – మహా
జ్వల నానా సుమ చిత్రపత్రయుతమై – త్వద్దివ్య కంఠస్థలిన్
గల 'తోమాలియ' గా వసింపఁగల భాగ్యం బిమ్మ మాణిక్య కుం
డల ! మా పున్నెపు బంటు పెల్ల తెగఁబండన్ వేంకటేశప్రభూ !

భక్తత్రాణ పరాయణుండ వగుచున్ బాలింపవేమయ్య ! నీ
భక్తత్రాణ పరాయణత్వ బిరుద ప్రాగల్భ్య మే మయ్యెనో !
ముక్తిం గూర్చుము – శక్తి నిమ్ము – దయ పోషింపఁగా రమ్ము
భక్తత్రాణ పదంబు సార్థకత నొప్పన్ వేంకటేశప్రభూ !

నీ వాద్యుండవు – నిన్ భజింతు – హితముల్ నీచేత గైకొందు –
నీ వాక్యాజ లొనర్తు – నీ వలన లక్ష్యం బెల్ల సిద్ధించు – నీ
కే వేల్పుల్ సరి వత్తురయ్య ? మది నూహింపంగ; నీయండెపో
నా విశ్వాసము – లోక రక్షణ ముకుందా ! వేంకటేశప్రభూ !

* * *

ఇది 'రామానుజ కీర్తి కౌముది' కళాహేవాక మాధ్వీక సం
పదకుం దావల, మిద్ది వైష్ణవ జన ప్రత్యక్ష మందార, మి
య్యది లోకాభ్యుదయైక మూల, మిది కల్యాణ ప్రభాసారముల్
పిదుకన్ వేలువుగిడ్డి భక్తులకు – దీపించున్ శుభోదర్కమై.



హిందూమత వైశిష్ట్యము

"కవిత్రయ మిత్ర - కవితా కళానిధి - కవి కంఠీరవ-విమర్శక శిరోమణి - విద్యారత్న"

శ్రీమాన్ గొట్టుముక్కల రమాకాంతాచార్యులు, బి. ఏ.

భగవత్ స్తుతి

నమోఽస్తు చిద చిన్మిశ్ర జగ జ్జన్మాది హేతవే
శ్రీవిష్ణవే ముముక్షూణాం సంసారార్ణవ సేతవే.

పరమ భాగవత స్తుతి

" ప్రహ్లాద నారద పరాశర పుండరీక
వ్యాసాంబరీష శుక శౌనక భీష్మ దాల్భ్యాన్
రుక్మాంగ దార్జున వసిష్ఠ విభీషణాదీన్
పుణ్యా నిమాన్ పరమ భాగవతాన్ స్మరామి. "

శ్రీ రామానుజ భాష్యకార స్తుతి

" శ్రీ భాష్యకారో జయతు రామానుజ జగద్గురుః
ముముక్షూణాం చ సర్వేషాం శ్రీమ దష్టాక్షరప్రదః. "

" తస్మై రామానుజార్యాయ నమః పరమయోగినే
యన్మతి స్మృతి సూత్రాణా మంత ర్జ్వర ముశీమత్."

వేదమత సనాతనత్వము

శ్రీ భారతీయ జ్యోతిశ్శాస్త్ర ప్రమాణము వలననే గా పాశ్చాత్య విజ్ఞాన శాస్త్ర ప్రమాణము వలనఁ గూడ నేటికి సుమా 195 కోట్ల సంవత్సరములు క్రిందఁ జగత్సృష్టి ప్రారంభ మయ్యెన నిశ్చయింపఁబడినది.

దేవవాణీ మయ మగు మన వేద వాఙ్మయము సృష్టి ప్రభ మున శ్రీమన్నారాయణుఁడు తన బొడ్డుఁదామరఁ బుట్టిన పుత్రుఁడ చతుర్ముఖ బ్రహ్మకు ఉపదేశ పురస్సరముగ నొసఁగబడుటచే, వాఙ్మయ మంతయు 'అపౌరుషేయ' మని ఆస్తికు లగు భారతీఁ లంఁ జేతను విశ్వసింపఁబడుచున్నది.

ఈ వేద కలాపము ఐతిహాసికదృష్టిచే గూడ ఇప్పటికి పది సంవత్సరములకు ముందే మన భరత ఖండములోఁ బ్రచారమున నుం దని శ్రీ. శే. శ్రీ బాలగంగాధరతిలక్ మహాశయులు సోపపత్తికమ స్థాపించియుండుటచే, ప్రపంచమందలి సమస్త ప్రసిద్ధ మతముల ఈ వేద మతమే 'అత్యంత ప్రాచీన' మని రూఢి యగుచున్న ఏలనఁగా, లోకములో బహు సంఖ్యాకు లగు మానవులచే ఆశ్రయిఁ బడుచున్న బౌద్ధ - క్రైస్తవ - మహమ్మదీయ మత కర్తలఁ గౌతమ బుద్ధుఁడు కలియుగమున 2638 - వ సంవత్సరమునను, క్రైస్త మతకర్త కలియుగమున 3101 - వ సంవత్సరమునను, మహమ్మదీ మతకర్త కలియుగమున 3672 - వ సంవత్సరమునను జన్మించి ప్రపంచ మతేతిహాసమువలన సుస్పష్ట మగుచున్నది.

మహా భారత కాలము

భారతీయుల ఇతిహాస ప్రవాహమున మహాభారత యుద్ధకాలము ఒక మహాఘట్ట మని తెలియవలయును. అది ద్వాపర యుగాంతమున నను, కలియుగారంభమునకును సంధికాలము. సృష్టిప్రారంభమునుండి ద్వాపర యుగాంతమునకు 195,58,80000 సంవత్సరములు గతించెను. కలియుగ ప్రవేశమగునాఁటికి శ్రీకృష్ణావతార సమాప్తి యయ్యెను.

భగవద్విభూతి

సత్య మగు ఈ భగవద్విభూతిలో మూఁడు పాదములను[1] త్రిపాద్విభూతి యనియు, మిగిలిన ఒక పాదమునకు ఏకపాద్విభూతి యనియు పేరులు. త్రిపాద్విభూతి యనఁగా, శాశ్వతమును - పునరావృత్తిరహితమును నగు విష్ణుభగవానుని పరమపద స్థానము. ఇది సత్యమే గాక, త్రికాలాబాధ్యమును-నిత్యమును నగు స్థాన విశేషము. ఏకపాద్విభూతి యనఁగా, పరిదృశ్యమానమగు విశ్వప్రపంచ మంతయును. ఇది త్రిపాద్విభూతివలెనే సత్యమే యైనను, అనిత్య మని తెలియవలయును. ఈ రెండు విభూతుల మధ్యగా ప్రవహించుచుండు విరజానదియే ఈ విభూతి ద్వయమునకు మధ్య ఎల్ల. ఏకపాద్విభూతిలో జరుగు సృష్ట్యాది భగవల్లీలకు క్రీడా పరికరమయి, త్రిగుణాత్మక యగు మాయకు ఏకపాద్విభూతిలోనే ప్రచారము. త్రిపాద్విభూతిలో అడుగు పెట్టుటకు అధికారము లేదు. ఏకపాద్విభూతికి అవిద్యాపాద మని పేరు. ఏకపాద్విభూతి నుండి దాని ప్రక్కగాఁ బ్రవహించు విరజా నదిని దాఁటినముక్తాత్మలు, విరజానదికి ఆవల నున్న త్రిపాద్విభూతిలో అడుగు పెట్టు మొదటి పాదమునకు సువిద్యాపాద మనియు, దాని కవ్వల ఆనందపాద మనియు,

---

1. త్రిపాద్విభూతిని గూర్చి నారాయణోపనిషత్తు చూడుము.

ఆనందపాదమునకు పైన తురీయపాద మనియు పేరులు. ఈ మూడు పాదములు నిత్యమైనను, భగవన్నారాయణునితో ముక్తులు బ్రహ్మానందము ననుభవించు పాదము తురీయ పాదము.

భగవదవతరణము

అవతరణ మనగా – 'దిగుట' అని యర్థము. సృష్టి ప్రారంభము నుండి, శాశ్వత ధర్మగోప్త యగు శ్రీమన్నారాయణుడు ద్వాపర యుగాంతములోగా, వేద శాసనము నుల్లంఘించు స్వభావము గల అసురుల బారినుండి సాధువులం బరిరక్షించుటకుగా ధరించిన అవతారములలో, మత్స్య – కూర్మ – వరాహ – నారసింహ – వామన – పరశురామ – శ్రీరామావతారములు ముఖ్యములు. భగవానుని సాధు పరిత్రాణ శక్తికి క్రియాశక్తి యని పేరు. ఈ యవతారములలో క్రియాశక్తిని వినియోగించి, దుష్టుల వధించి, సాధులం గాపాడుటయే జరిగెగాని, ఈ అసురుల చేతిలో గ్లానిం జెందిన స్వ (భాగవత) ధర్మమును సంస్థాపించుట మాత్రము జరిగియుండలేదు.

సృష్టి ప్రభాత సమయమున శ్రీమన్నారాయణుడు చతుర్ముఖ బ్రహ్మకు వేదవాఙ్మయ మొసంగుటయే గాక, ఆ వేదముల యర్థ మంతయును 108 సంహితల వ్యాఖ్యతో ఆయనకు విశదీకరించెను.

ద్వాపరాంతమున వేదోక్త స్వధర్మోద్ధరణ మొనరింప సాత్త్వత వంశమున నవతరించిన శ్రీకృష్ణ భగవానునకు కుడి భుజముగ నిల్చిన బ్రహ్మర్షులలో శ్రీ వ్యాస – పరాశర – శుకబ్రహ్మర్షులు ముఖ్యులు. రాజర్షులలో భీష్మాచార్యులు ఏకైక వీరుడు.

సాత్త్వికోపబృంహణ వాఙ్మయము

కృతయుగము నుండి ద్వాపరాంతము వఱకును, ఈ లోగా వేదోక్త బృంహణాత్మకముగా – సనాతన ధర్మకముగా లభించిన గ్రంథ

ములలో — (౧) శ్రీమన్నారాయణ ముఖోద్గతమగు 108 సంహితల పరిమిత మగు శ్రీపాంచరాత్రశాస్త్రము, (౨) బ్రహ్మచే నిర్మింపఁబడి, మనువుకు ఉపదేశింపఁబడిన మనుధర్మ శాస్త్రము, (3) శ్రీ పాంచ రాత్ర శాస్త్ర ప్రవర్తకుఁడును, దేవర్షులలో ఉత్తముఁడు నగు నార దుని ఉపదేశ ఫలముగా వాల్మీకి మహర్షిచే రచింపఁబడిన శ్రీ రామాయణేతి హాసము - ఈ మూఁడును ముఖ్యములు. వేదోక్త భాగవత మత విరుద్ధ మగు కాపిల - సాంఖ్య ద్యవైదిక దర్శనముల వలెనే, వేద మతానురోధముగాని పురాణ వాఙ్మయము గూడ నుండెను గాని అది వ్యాస పరాశరాదులకు సమ్మతము గాకపోయెను.

వేదోక్త భాగవత మత సంస్థాపనము

వేదోక్త భాగవత మత పునఃప్రతిష్ఠాపనమునకుగా శ్రీ కృష్ణ భగవానుఁడు కురుక్షేత్ర సంగ్రామమున అర్జునుని నిమిత్తీకరించి, సర్వ వేదాంత మత సార సర్వస్వ సంగ్రహముగా శ్రీమద్భగవద్గీతా శాస్త్రము ననుగ్రహించెను. శ్రీ కృష్ణ భగవానుఁడు వేదవేద్యుఁడు - వేదార్థ విదుఁడు - వేదాంత సంప్రదాయకర్త గదా ! (శాం. గీ. భా. 15-15) వేదాంతులకు పరమాచార్యుఁడగు జగద్గురువు. (శాం.గీ.భా. 3-31, 13-18, 18-68) శ్రీకృష్ణ భగవ దనుగ్రహ పాత్రుఁ డగు శ్రీపరాశర మహర్షి, వేద వేదాంత తత్త్వ విశదీకరణ ప్రవృత్తముగా శ్రీవిష్ణు పురాణమును రచించెను. భగవదావేశావతారమూర్తియగు వేదవ్యాస మహర్షి, భగవత్పరిపూర్ణావతారమూర్తి యగు శ్రీ శ్రీకృష్ణుని భగవద్గీతా మార్గమును తన పితృపాదు లగు శ్రీపరాశర మహర్షిపురాణోపదేశము ననుసరించి, ద్వాపరాంతములోఁగా ఆ యా కాలములయందు వేద వేదాంత వాఙ్మయమునకు కుత్సితులచేఁ జొప్పింపఁబడిన కృతక భాగములను తొలఁగించి, వేద వాఙ్మయ మంతయు సంస్కరించి, యావద్వేద వాఙ్మయమునకు వ్యాఖ్యాన

ముగా నుపకరించుటకుఁగాను - మహా భారతమును రచించి, వేదాంత రాభ్భగ మగు ఉపనిషత్తుల యర్థము సంశయ విపర్యయ రహితముగా జిజ్ఞాసువులకు లభించుటకుఁగాను బ్రహ్మ సూత్రములను పేర వేదాంత దర్శనమును రచించి, ఈ సూత్రములు మరల దురర్థముల పాలు గాకుండ, తానే పరమ కృపతో సూత్రములకు సరియైన వ్యాఖ్యాన ముగా నుపకరించుటకుఁగాను శ్రీమద్భాగవత మహా ప్రబంధమును గూడ ననుగ్రహించెను.

భగవన్ (భాగవత) మత వైభవము

తన బొడ్డుఁదామరఁ బుట్టిన చతుర్ముఖునకు సృష్టి ప్రబంధ రచనా కౌశలము లభించుటకుఁగానుఁ, వేదార్థమును సరహస్యముగా - సంగ్రహముగా ఐదు రాత్రులు భగవన్నారాయణుఁ డుపదేశించుటచే ఈ రహస్య శాస్త్రమునకు 'పాంచరాత్ర' మని పేరు గల్గెను. భగవానునిచే ఈ శ్రీపాంచ రాత్ర ధర్మము కృతయుగ ప్రారంభమున ప్రచారిత మగుటచే, ఈ ధర్మము ఆద్యము - సనాతనము - చతుర్వేద సమ్మతము - కర్మ జ్ఞాన సముచ్చిత ప్రవృత్తి మార్గ ద్వయాత్మకము యతుల చేతను, వైఖానసుల చేతను, ముముక్షువులగు సర్వాశ్రమీయు లగు సాత్వతుల చేతను ఉపదేశ పరంపరంగా అనుష్ఠీయ మని తెలియవలయును. (మహాభారత శాంతి పర్వాంతర్గత మోక్షధర్మ పర్వము : 340-11, 12; 346-9, 10; 347-1; 349-2, 11 మొ 18 వఱకు; 30, 34, 39 మొ 53 వఱకు, 55, 56; 351-67) 108 సంహితల పరిమిత మగు ఈ విపుల గ్రంథమును వేద వ్యాసుఁడు సంగ్రహించి వేదార్థ సర్వస్వముగాఁ దా రచించిన మహా భారతమునకు సార మగు శాంతి పర్వములో, త త్సారభూత మగు మోక్ష ధర్మ పర్వమునకు చరమ వాక్యముగా 'నారాయణీయ ధర్మ' మను పేర నిబంధించుటచే, ఇది - 'వేద సార సర్వస్వ' మని

ప్రమాణ తమముగా ఆస్తికు లందఱి చేతను శిరసా వాహ్యమని స్పష్ట మగుచునే ఉన్నది. ముముక్షువులగు సాత్త్వికుల కుపాదేయ మగుటచే, ఈ శ్రీపాంచరాత్ర శాస్త్రమునకు సాత్త్వత మని పేరు. (శాంతి : 343–49).

" ఏవ మేష మహాన్ శబ్దః మైత్రేయ భగవా నితి
పరమ బ్రహ్మ భూతస్య వాసుదేవస్య నాన్యగః. "

.... (విష్ణు పురాణము : 6–5–79)

అను శ్రీపరాశరీయ శ్రీ సూక్తిచే, భగవచ్ఛబ్దము నారాయణునియందే ముఖ్యవృత్తిగా నన్వయింపవలయు ననుఆర్ష శాసనముచే – 'నారాయణీయ ధర్మ' 'భాగవతధర్మ' శబ్దము లన్యోన్య పర్యాయవాచకములై, శ్రీపాంచరాత్ర శాస్త్రోక్త మతమునకు 'భాగవతమత' మను వ్యపదేశము కల్గినది. వేదార్థ సర్వస్వమును శ్రీపాంచరాత్ర రూపమున భగవానునిచే ఉపదేశమును బొందిన చతుర్ముఖుడు దాని ననుసరించి రచించిన స్మృతిని, విరాట్టు ద్వారా–మనుమహాముని ద్వారా – భృగుముఖముగా దశ ప్రజాపతుల కుపదేశించెను. (మను స్మృతి : 1–32 మొ 35; 58 మొ 50 వఱకు; భ. గీ. 4–1 మొ 3 వఱకు) కృతయుగీయ మగు ఈ మనుధర్మశాస్త్రమునకును, ద్వాపరాంతమునందు శ్రీకృష్ణభగవానునిచే ననుగ్రహింపఁబడిన భగవద్గీతా శాస్త్రమునకును, మాతృక శ్రీ పాంచరాత్ర శాస్త్రమే యని తెలియవలయును.

శ్రీ గీతాచార్య వైభవము

శ్రీకృష్ణ భగవానుఁడు శ్రీమన్నారాయణుని పరిపూర్ణావతార మని కీర్తింపఁబడుచున్నాఁడు. కారణ మేమని విచారింపఁ దగినది.

మొదటి కారణ మే మనఁగా – మాండూక్యోపనిష ద్ముక్త చతుష్పాత్ప్రణవ స్వరూపుఁడగు పరవాసుదేవుఁడు (తురీయమూర్తి) అఖిలహేయ ప్రత్యనీక జ్ఞాన శక్త్యాది పాడ్గుణ్య పూర్తితో సంకర్షణ సోదర (ప్రాజ్ఞమూర్తి) ప్రద్యుమ్నానిరుద్ధ కుమారాత్మక (తైజస వైశ్వానరమూర్తి) సమేతముగా, మనుజ నయన గోచరుఁడై అవతరించుటయే. (విష్ణు సహస్రనామ శంకర భాష్యము: 185, 332, 639, 640, 695, 709 నామములు చూడుఁడు.) శ్రీకృష్ణావతారమునకు ముందు సాక్షాత్కరించిన అవతారములలో శ్రీమన్నారాయణుని చతుర్వ్యూహాత్మక మగు ఔపనిషద పురుషుని సేవ ముముక్షువులకు లభించియుండలేదు. తాను వేద వేద్యుఁడనని- వేద హృదయుఁడనని- వేదాంత సంప్రదాయ కర్తనని (శాం. గీ. భా. 15-5) ప్రకటించుకొని, వేద స్వరూపుఁడగు గరుడుని తన రథమునకు ధ్వజముగాఁ బెట్టుకొని, వేద ప్రతిభటములగు దుర్మతముల ఖండించుటకై స్వధర్మ ప్రస్థానము గావించి, తన ప్రకృష్ట జ్ఞాన శక్తిని ప్రవర్తించి, సాధు పరిత్రాణముఁ జేసిన అవతార మిది యొక్కటియే! శ్రీమద్భాగవత మత ప్రకాశముగ తన వేదాంత సూత్రములకు భాష్యముగా రచించిన శ్రీమద్భాగవత పురాణము యొక్క మంగళ శ్లోకములో – శ్రీకృష్ణభగవానునే, వేదాంత దర్శనములోని 'జన్మాద్యస్య' స్వేత్యాది ప్రతిష్ఠిత పరబ్రహ్మముగా – గాయత్రీ గీయమాన ముముక్షు వరేణ్యునిఁగా – వ్యాసభగవానుఁడు వేద వేదాంతోక్త సకల దేవతా సార్వభౌమునిగా ప్రకటించుట గొప్ప కారణము. కృత యుగము నుండి ద్వాపరాంతము దనుక, నారదాచార్యకముగ, అవిచ్ఛిన్న పరంపరగా వచ్చుచున్న సాత్వత వంశములో శ్రీకృష్ణు డవతరించుట మఱి యొక కారణము. వేదాంతు లందఱికిని పరమా చార్యుఁడైన ఈ భగవానుఁడు శ్రీకృష్ణ రూపమున నవతరించి, 'కృష్ణస్తు భగవాన్ స్వయమ్' 'భగవాన్ సాత్వతాంపతిః' అను బిరు

దములు ధరించి, సాత్వతులకు (= పాంచరాత్రులకు, భాగవత మతస్థు లగు వైష్ణవులకు) యోగక్షేమకరుఁడై, తన శ్రీపాదములను శరణించిన మాత్రమునే, స్త్రీ పురుషు లని – బ్రాహ్మణు లని – క్షత్రియులని – వైశ్యులని – శూద్రులని – దురాచారు లని – పాప యోను (అంత్యజు) లని – ధర్మాధర్మపరులని ఏ భేదము నెంచక, ఆర్తులు – జిజ్ఞాసులు – అర్థార్థులు – జ్ఞానులు అను భేదము నెంచక, నిర్హేతుక కృపచే, చతుర్విధ పురుషార్థములలో ఏది కోరుకొనిన ఆ యా వరముల నొసఁగుమని ప్రపన్నుల కంటతికిని వాగ్దానముఁ జేసిన భగవదవతార మూర్తి ఎందుఁ గలదు ? (శాం. గీ. భా. 7–14, 16 మొ 20 వఱకు; 9–22 మొ 34 వఱకు; 18–61, 62, 65. 66) నా భక్తుఁడు నశింప డని ఏ దేవాది దేవుడు ఇట్లు ప్రతిజ్ఞ పట్టెను ? (శాం. గీ. భా. 9–31) భగవానుఁడు భక్త్యేక సులభుఁడు. (శాం. వి. స. నా. 818 భా.) ముముక్షువులకు ఈయన కంటె వేఱుగతి లేదు. (శాం. వి. స. నా. 450 భా.).

అవతార రహస్య జ్ఞానము మోక్షప్రదము

సామాన్య మానవుల జన్మ-కర్మాధీనము, గర్భ దుఃఖ సహిత మైనది. ప్రాకృత మానవుల జన్మ చేష్టితము గాదు. భగవ దప్రాకృత దివ్యావతారములు "ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" 'ధర్మ సంస్థాపన నిమిత్తము ఆ యా యుగములందు నే నవతరింతు' నను గీతోక్తిలోని (శాం. గీ. భా. 4-8) 'సంభవ' అను పదమునకు (విష్ణు సహస్రనామము 31, శాం: భాష్యములో —) "స్వేచ్ఛయా సమీచీనం భవన మస్యేతి సంభవః" అనఁగా, భగవానునకు 'సమీచీన మగు జన్మము స్వేచ్ఛగా జరుగు' ననియు —

"అథ దుష్టవినాశాయ సాధూనాం రక్షణాయ చ
స్వేచ్ఛయా సంభవా మ్యేవం గర్భదుఃఖ వివర్జితః."

'దుష్ట వినాశము కొఱకును – సాధు రక్షణ కొఱకును స్వేచ్ఛగా నవతరింతును' అని భగవానుఁడు తనకు ఇచ్ఛగల్గినప్పుడు త్రిపాద్విభూతి నుండి సకిపాద్విభూతికి దిగుటయే అవతార మనఁగా. నృసింహావతారము 'అచిత్తు' అగు స్తంభము నుండియు – శ్రీరామ కృష్ణావతారములు ధన్య 'ఁవుల'లో నుండియు ఆవిర్భవించినవి. ఇందు వలన, భగవానుఁడు అంతర్యామి బ్రాహ్మణ ముద్దోషించునట్లు చిద చిదంతర్యామి యగు అమృత స్వరూపుఁడు గదా! శ్రీకృష్ణ భగవదవతారమును చేష్టితము – ఆప్రాకృతము – దివ్యము అని ఎవఁడు తెలిసికొనునో అట్టివాఁడు దేహపాతానంతరమే 'పునర్జన్మము' ను పొందగలఁడని భగవానుఁడే ఆనతిచ్చుచున్నాఁడు (శాం. గీ. భా. 4–9).

దేవర్షి నారదుఁడు శ్రీ భాగవత (పాంచరాత్ర) శాస్త్ర ప్రవర్తకుఁడు

"ధర్మ బ్రహ్మ ప్రతిపాదకం అపౌరుషేయం స్వతఃప్రమాణ వాక్యం వేదః." అనఁగా, ధర్మ బ్రహ్మ ప్రతిపాదకమై – అపౌరుషేయమై – స్వతఃప్రమాణ మగు వేదమునకు తత్పూర్వభాగోక్త ధర్మమును – తదుత్తర భాగోక్త బ్రహ్మమును రెండు పక్షము లనుట ఉచితమే గదా! శ్రీభాగవతశాస్త్ర ప్రవర్తకుఁడగు నారద మహర్షి భగవానునిచే త్రిలోకాచార్యత్వము నెఱపుటకు అధికృతుఁడై, ధర్మమును ప్రజలచే ననుష్ఠింపఁజేయు విధి గల రాజర్షులను – బ్రహ్మ విద్యను ప్రకాశింపఁజేయు విధి గల బ్రహ్మర్షులను పరిపాలించుచు, గడచిన మూఁడు యుగములలో విశ్వ రంగమున జరుగు మహా సంఘటనములలో ఉచిత రీతిని జోక్యము గలుగఁజేసికొనుచుండె నని

పురాణేతిహాసము వలనఁ దెలియనగును. గర్భస్థుఁడగు ప్రహ్లాదునకు ఈయవ చేసిన భగవన్మంత్రోపదేశ ఫలముగానే, 'విశ్వాంతర్యామియు' 'అమృత స్వరూపుఁడు' నగు భగవానుఁడు నృసింహ రూపమున నవతరించి, భాగవతోత్తముఁడగు ప్రహ్లాదుని, తదితర సాధువులను అసురుఁడగు హిరణ్యాక్షుని బారి నుండి పరిరక్షించెను. ఇది కృత యుగపు మాట. త్రేతాయుగమున పరశురాముఁడు ముయ్యేసు మాఱులు దుష్ట క్షత్రియ వధ గావించిన పిదప, రావణాది ఘోర రాక్షసుల వధించి, సాధువు లగు ఋషులను, భక్తులను రక్షించిన కారణమున, శ్రీరామచంద్రమూర్తి – 'రామో విగ్రహవాన్ ధర్మః' 'రాముఁడు రూపము దాల్చిన ధర్మము' అను స్తోత్రమునకు పాత్రుఁడు కాఁగా, శ్రీమన్నారాయణునకు శయ్య యగు అనంతుఁడు లక్ష్మణస్వామిగా – శ్రీదేవి శ్రీ సీతా మహాదేవిగా – శ ఖ చక్ర దివ్యాయుధములు భరత శత్రుఘ్నులుగా నవతరించిన ఈ రామచంద్ర భగవానుఁడు —

" రమన్తే యోగినో యస్మిన్ నిత్యానందే చిదాత్మని
ఇతి రామపదే నైతత్ 'పరంబ్రహ్మ' భిధీయతే ".

అను పద్మపురాణోక్తి ప్రకారము (విష్ణు. స. నా. శాం. భా. 394) సాక్షా ద్భగవదవ తార మని యెఱుఁగి, తచ్చరితమును రామాయణ మహా కావ్యముగ నిబంధింపవలయు నని వాల్మీకి మహాముని కి ఉప దేశించుటయు, నారదుని 'ధర్మాచార్యత్వ'మును ప్రకాశింపఁజేయు చున్నది. ఈ రామచంద్రమూర్తి ఇక్ష్వాకు మహారాజర్షి వంశములో నవతరించిన పరబ్రహ్మమూర్తి. శ్రీరాముని కాలము నుండి శ్రీకృష్ణ భగవాను ఁడవతరించిన ద్వాపరాంతము నాఁటికి కొన్ని కోట్ల సంవ త్సరములు గతించెను. భగవాను నుండి మను మహాముని ద్వారా దశరథమహారాజు వఱకు వచ్చిన 'వైదిక కర్మయోగము' శ్రీరామ

చంద్రుని రాజ్యములో చక్కగా నిర్వహింపబడుటచే, ఆదర్శ రాజ్యమునకు 'రామరాజ్య' మను నామము సార్థక మగు చున్నది. శ్రీరామునికాలము నుండి, శ్రీకృష్ణుని కాలము వఱకును గడచిన కోట్ల కొలఁది సంవత్సరములలోఁగా, రాజర్షులచే భాగవత మత సంప్రదాయము సరిగా పరిపాలింపఁబడని హేతువుచే, 'నష్టప్రాయ' మై పోయె నని వేదోక్త స్వధర్మమగు భాగవత మత సంప్రదాయము నుద్ధరించు టకే తాను శ్రీకృష్ణ భగవానుఁడుగా నవతరించితి నని, గీతా శాస్త్రములో తాను ప్రతిపాదించుచున్న వైదిక కర్మయోగము ఉత్తమమైన గీతా రహస్యమని భగవానుఁడు సెలవిచ్చెను. (శాం. గీ. భా. 4-1 మొ 9 వఱకు) శ్రీకృష్ణభగవానుఁడు పరబ్రహ్మమూర్తి యొక్క పరమావతార మనియు, వేద వేద్యుఁ డనియు పైన సోప పత్తికముగ ప్రతిపాదింపఁబడినది. త్రేతాయుగమున 'ధర్మస్వరూపు' డగు శ్రీరామచంద్ర భగవానుని వైభవమును శ్రీ రామాయణ మహాప్రబంధముగ నిబంధింప నుపదేశించిన త్రిలోకాచార్యుఁ డగు శ్రీ నారద మహర్షి యే మఱల ద్వాపరాంతమున 'బ్రహ్మ స్వరూపు' డగు శ్రీకృష్ణ భగవానుని వైభవమును శ్రీమద్భాగవత మహా ప్రబంధమున నిబంధింప శ్రీ వేద వ్యాస మహర్షికి ఉపదేశించెను. 'అంత ర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః' అను శ్రుతి ప్రకారము శ్రీ పరబ్రహ్మమూర్తి యొక్క బాహ్య స్వరూపము శ్రీరామచంద్ర 'ధర్మమూర్తి', అంతస్స్వరూపము 'శ్రీకృష్ణబ్రహ్మ మూర్తి'. ఈ మూర్తి ద్వయ కల్యాణ గుణ సంపదయే ముముక్షువు లకు భుక్తి ముక్తి ప్రద మని భగవత్ప్రపన్నులు తెలియవలయును.

భాగవత మత గురుపరంపర వైభవము

ఈ వ్యాస ప్రారంభమునఁ జేయఁబడిన పరమ భాగవత స్తుతినిఁ బరిశీలించినచో - దేవర్షులలో శ్రేష్ఠుఁడును (భ. గీ. 10-26) భగవ

దావేశావతారమూర్తియు నగు (శ్రీభాగవతము : 1-3-8) నారద మహర్షియు, త్రేతాయుగమునందలి ఇక్ష్వాకు వంశ గురు వగు వసిష్ఠ మహర్షియు, (శాం. గీ. భా. 11-15) ద్వాపరాంతమున శ్రీకృష్ణ భగవానుఁ డవతరించిన సాత్వత వంశీయు లగు రాజర్షులకు ఆచార్యత్వము చేయుచు వచ్చిన శ్రీ వసిష్ఠ బ్రహ్మర్షి వంశ పరంపరోద్భవు లయిన శ్రీ శక్తి - పరాశర - వ్యాస - శుక బ్రహ్మర్షులును, కృత యుగ ప్రారంభము నుండి శ్రీకృష్ణ భగవ దవతారము వఱకును, ఈ మధ్యకాలములోను, ఇతిహాస పురాణ ప్రసిద్ధు లగు పుండరీక - అంబరీష - రుక్మాంగద - దాల్భ్యది రాజర్షి వుంగవులును, ప్రహ్లాద - విభీషణాది దైత్యకుల పవిత్రులును, శ్రీకృష్ణ భగవ త్సమకాలీను లగు భీష్మార్జునులును - 'భాగవత మతస్థు' లని విస్పష్టముగాఁ దెలియఁ గలదు.

వేదోక్త 'భాగవత మత' స్వరూపము

" ఏవ మేకం సాంఖ్య యోగం వేదారణ్యకమేవ చ
పరస్పరాంగా న్యేతాని పాంచరాత్రం తు కథ్యతే ."

— (మ. భా. శాం. 349-80.)

సాంఖ్యము, యోగము, (సంహితాత్మక మగు) వేదము వేద శిఖర మగు వేదాంతము ఇవి నాల్గును ఒకే తత్త్వమును ప్రతిపాదించు సందర్భమున పరస్పర సాహాయ్యమును గోరుచున్నవి, ఈ శాస్త్రము లన్నియు పరస్పరాంగములుగాఁ జేరిన ఏకైక శాస్త్రమునకే శ్రీ పాంచరాత్ర మని పేరు. ధర్మ స్వరూప ప్రతి పాదకము వేదము. బ్రహ్మ స్వరూప ప్రతిపాదకము వేదాంతము. (ఆరణ్యకములు) అత్మ స్వరూప యాథార్థ్య ప్రతిపాదకము సాంఖ్యము. ధర్మ ప్రకాశిత కర్మాంగ భూత యమ - నియమ - ప్రాణాయామ - ప్రత్యాహార -

ధ్యాన - ధారణాది పరమగునది యోగము. కృత యుగమున భగవన్నారాయణునిచే ప్రవర్తింపఁబడినప్పుడు గల ఈ పాంచరాత్ర స్వరూపము ద్వాపరాంతమగునఁటికి భగవన్ (భాగవత) మతాంగ భూతము లగు ఈ నాల్గు శాస్త్రములును - వేద ప్రామాణ్య విముఖులును, స్వోత్ప్రేక్షితార్థ ప్రవణులును, స్వతంత్ర - ప్రజ్ఞులు నగు తీక్ష్ణ కరుల చేతులలోఁ బడి, విరూపము నొంది, భగవన్మత విరుద్ధము లగు సిద్ధాంతములను ప్రచారములోఁకిఁ దెచ్చెను.

అవైదిక దర్శన విమర్శనము

ఇంద్రియ ప్రత్యక్ష సిద్ధ మగు జగత్తు సత్యమే. ఇందు ప్రకృతి (అచిత్తు) కంటె వేఱగు ఆత్మనంటి గాని, బ్రహ్మమువంటి గాని వేఱు తత్త్వములు లే వని చార్వాకులు నిర్ణయించిరి. పూర్వమీమాంసక (= కేవల వైదిక) దర్శనము, కాపిల సాంఖ్యము, పాతంజలీయ యోగము (తర్క- దర్శనము లగు న్యాయ వైశేషికములు సహా), పాశుపతము ను ఆత్మస్వరూప నిరూపణ చేయుటలో వేదాంత సిద్ధాంతమునకు అనుగుణముగానే యుండెనని, అందువలన ఈ విషయములో ఏవియో యుక్తులు చెప్పి, ఈ మతములను తత్త్వ జిజ్ఞాసువులు ఖండింపరా దని —

" సాంఖ్యోయోగః పాంచరాత్రం వేదాః పాశుపతం తథా
ఆత్మ ప్రమాణా న్యేతాని న హంతవ్యాని హేతుభిః. "

అని వేదాంత దర్శనకారుఁ డగు వేదవ్యాసుఁడు తన భారతమున నెల విచ్చియున్నాఁడు. (శాంతి: 350-63) వేదవ్యాసుఁడు భాగవతాగ్రగణ్యుఁడు. శ్రీపాంచరాత్రమును, శ్రీపాంచరాత్రశాస్త్ర రూపాంతరములగు శ్రీభగవద్గీతను, మనుస్మృతి ననుసరించి, ఉపనిషద్వాక్య

సమన్వయము చేసి, తత్ఫలముగా బ్రహ్మ సూత్రముల రచించిన భాగవత మతస్థుఁడు. వేదాంత సూత్రములలో పరబ్రహ్మము జగ జ్జన్మాది లక్షణ లక్షితుఁ డని, (1-1-2) బ్రహ్మ ఇట్టి లక్షణములు గలవాఁ డని తెలిసికొనుటకు ఒక్క– వేదమే ఆధార మని (1-1-3) శ్రుతు లన్నియు బ్రహ్మ స్వరూపముల నిరూపించునని (1-1-4) ఈ పరబ్రహ్మము స్వ సంకల్పముచే జగత్సృష్టి చేసె నని (1-1-5) సంకల్పము లేని జడ పదార్థమగు ప్రకృతి – సృష్టి చేయఁజాలదని నిర్ణ యము చేసెను. సృష్టి కర్తను ధ్యానించినచో మోక్షము లభించు నని వేదము చెప్పుచున్నది. ప్రకృతిని ధ్యానించినచో జడ పదార్థము మోక్ష మిచ్చు ననుట అసందర్భము గదా ! (1-1-7) జగత్సృష్టికి పరబ్రహ్మము యొక్క– బహు భువన సంకల్పమే కారణ మని ఇట్లు చెప్పఁబడిన వేదాంత మతమునకు విరుద్ధముగా – జగత్తు ప్రవాహతః నిత్య మగుటచే, జగత్సృష్టికిఁగా ఈశ్వరుఁడే అవసరము లేదని కేవల వైదికులగు పూర్వమీంసకులు చెప్పిరి. ప్రకృతియే సృష్టికి కారణ మని కాపిల సాంఖ్యులు చెప్పిరి. సేశ్వర సాంఖ్య లగు యోగులు – నైయాయికులు – వైశేషికులును ఈశ్వరతత్త్వమును ప్రతిపాదించిరి గాని, 'అతఁడు సృష్టి కర్త కాఁడు; ముక్తి ప్రదుఁడు కాఁ' డనుటచే, వేదాంతుల దృష్టిలో ఆ ఈశ్వరుఁడు ఘృతకోశాతకీ కల్పుఁడు. ఇంతేగాక, కాపిల సాంఖ్యుల వలెనే, సేశ్వర సాంఖ్యులును సృష్టికి కారణము ప్రకృతి యని చెప్పిరి. పాశుపతుల ఈశ్వర కల్పన 'వేద బాహ్య' మని వేదాంతుల అభిప్రాయము. (శాం సూ. భా. 2-2-37) మఱియును. జగత్తునకు నైయాయికులు – పాశుపతులు – పరమాణు వులు ఉపాదాన కారణ మనుట వేదాంత మత విరుద్ధము. ఇట్లు వివిధ దార్శనికుల మధ్య రేగిన వాదోపవాద ధూళిలో – పరస్పర స్పర్ధ

కారణముగా, వేదాంతులకు పర మతములయం దుపాదేయ భాగము లను గ్రహింప వలయుఁగాని, త్యాజ్యములతోఁ బాటుగా ఉపా దేయములఁ త్రోసిపుచ్చుట దోష మని వేదాంత దర్శనకారులు పై శ్లోకములో మందలించిరి. వేదాంత దర్శనకారుని దృష్టిలో - పూర్వ మీమాంసకాది పూర్వోక్త దర్శనము లన్నియు ఆత్మ విషయమై చేసిన సిద్ధాంతము వేదాంతమునకు అనుకూల మని మందలించుటయే గాక, వేదాంతులపై (= భాగవతులపై) ఆత్మ స్వరూప నిరూపణ వేదాంతా నుకూలముగా లేదని, తదితర దార్శనికులు చేయుట గూడ అన్యాయ మని తెల్పుటకుఁగా, పాంచరాత్రమునుగూడ పై శ్లోక ములో వ్యాస మహర్షి చేర్చి యుండె నని తెలియవలయును. ఇట్లే, కల్లోల స్థితి వేదాంతి (భగవన్) మత ప్రచారములో గల్గుటకు కారణ మే మన - ఉపనిషత్తులును, శ్రీ పాంచరాత్రమును రహస్య శాస్త్ర ములై, గురుపరంపరా ముఖతః ఉపదేశైక గమ్యము లగుటయు - స్వతంత్ర ప్రజ్ఞు లగు తీర్థకరులు అట్టి గురుపరంపరాయాత జ్ఞానము నుండి చీలిపోయి, స్వోత్ప్రేక్షిత సిద్ధాంతములను ప్రాయికముగా వేద వేదాంత విరుద్ధము లనునవి స్థాపించుటయే యని తెలియ నగును.

భాగవత మత పరంపరా విచ్ఛేదము - తదుద్ధరణము

నారదుని వంటి మహాజ్ఞాని సనత్కుమారుని యొద్ద (ఛాందో గ్యము 1-2) నర నారాయణ మహర్షుల యొద్ద గురూపసదనముఁ జేసినట్లు కానవచ్చుచున్నది. ఇది కృతయుగపు మాట. కాని, ద్వాప రాంతమున వేద వేదాంత ప్రకాశక భగవన్మత ప్రతిపాదితమై, పర బ్రహ్మోపాసనా పర మగు వైదిక కర్మ యోగమునకుఁ గల్గిన పరం పరా విచ్ఛేదము భగవానుఁడు జ్ఞానయోగారంభమున నెలవిచ్చి, తాను సర్వజ్ఞుఁడును, శ్రీమన్నారాయణుని పూర్ణావతారము నగుటచే,

మఱల వేదోక్త భాగవత ధర్మాంగముగా ఈ యోగము నుద్ధరించు చున్నాఁడ నని సెలవిచ్చెను.

భాగవత మత గురు పరంపర పునఃవిచ్ఛిత్తి గాకుండఁ జేయఁబడిన జాగ్రత్తలు

ప్రథమ జాగ్రత్త :....

" ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్
బిభే త్యల్ప శ్రుతా ద్వేదః మా మయం ప్రతరిష్యతి. "

దురవగాహ గంభీర మగు వేదమునకు తన పితృపాదులగు శ్రీ పరాశరు లనుగ్రహించిన విష్ణు పురాణమును, తాను రచించిన భార తేతిహాసమును వ్యాఖ్యానము లనియు, ఈ వ్యాఖ్యానముల సహా యము చేతనే బహు శ్రుతు లగు పండితులు వేదార్థమును గ్రహింప వలెనని, వీఁడు నన్ను మోసగించుటకు వచ్చినాఁ డని, అల్ప శ్రుతినిఁ జూచి వేదము భయపడు నని, వ్యాస భగవానుఁడు తత్త్వ జిజ్ఞాసువు లను హెచ్చరించి యున్నాఁడు. మఱియును, ఉపనిష ద్వాఙ్మయము నకు శ్రీకృష్ణ భగవానునిచే ననుగ్రహింపఁబడిన శ్లోకమయ వ్యాఖ్య యగు భగవద్గీతలకును - భగవ దవతారమూర్తియును, భాగవత మత ప్రవర్తక శిఖామణియును నగు తాను రచించిన సూత్రమయ వ్యాఖ్యను వేదాంత సూత్రములకు అన్యార్థ కల్పన జరుగకుండ రక్షణార్థమై తాను స్వాంతముగా భాగవత ప్రబంధము ననుగ్రహించుటయే గాక, తన శిష్యుఁ డగు బోధాయన మహర్షి చే, భగవద్గీతలకును - తన వేదాంత సూత్రములకును 'వృత్తు' లను పేర విపుల వ్యాఖ్యానము రచింపఁజేసెను. (భగవద్గీతను ఇంగ్లీషులోనికి తర్జుమా చేసిన మహాదేవ శాస్త్రిగారి గీతా ప్రారంభోక్తు లఁ జూడుఁడు.)

ద్వితీయ జాగ్రత్త :....

మోక్ష విద్యా (పరమ విద్యా) రంగము లగు భగవద్విగ్రహ లయ ప్రతిష్ఠ సృష్టి ప్రారంభము నుండి శ్రీ పాంచరాత్రాగమ ప్రసిద్ధమైన మన్వాది మహర్షుల కాలము నుండి జగద్వ్యాపకముగా నున్న ఈ మహా సంస్థ, ద్వాపరాంత మగు సకి దుర్ఘములపాలై, బహు దేవతారాధనకు దారి తీసెను. ఇది తుదముట్టించుటకే విష్ణు పారమ్యము నారాయణీయ ధర్మములో సుస్పష్టంగా ప్రతిష్ఠింపఁబడెను.

మాయ

'మాయ' యనగా, భగవానుఁడు విష్ణువునకు స్వభావ భూత యగు శక్తి విశేషము. దాని నతిక్రమించుటకు ఎట్టి వానికిని శక్తి చాలదు. ఎవఁడు భగవానుని చరణముల యందు శరణించునో, అట్టి వాఁడు 'సర్వధర్మాన్ పరిత్యజ్య' ఇత్యాది చరమ వాక్యోక్తిలో చెప్పఁబడినట్లు మోక్షము చూఱగొనఁగలఁడని (శాం. గీ. భా. 7-14) గీత లుద్ఘోషించున్నవి.

నిర్గుణము

గుణ శబ్దమునకు సత్త్వ రజ స్తమోగుణము లని పారిభాషికార్థము. (శాం. గీ. భా. 14-5) సర్వేశ్వరుఁడు అమృత స్వరూపుఁడు. అమృతము నిర్మల మన్నట్లుగాఁ అమృతము మాలిన్య రహిత మని అర్థమే గాని, అమృతమునందు సహజముగా నున్న మాధుర్యాది గుణములు లేవని కాదు గదా ! అట్లే, అమృత స్వరూపుఁడగు భగవానుఁడు నిర్గుణుఁడన్నట్లు తుచ్ఛిపాసాది ప్రాకృత గుణములు లేవనియేగాని, ఆయనకు సహజ సిద్ధమగు సత్యకామత్వ - సత్య సంకల్పత్వాది కల్యాణ గుణములు లేవని కా దనుట విశద మగుచునే

యున్నది. పరబ్రహ్మ భూతుఁడగు పరవాసుదేవుని స్వరూపమును భగవన్మత ప్రవర్తకుఁడగు శ్రీ పరాశరమహర్షి ఇట్లు వర్ణించి యున్నాఁడు :—

" జ్ఞాన శక్తి బలైశ్వర్య వీర్య తేజాం స్యశేషతః
భగవచ్ఛబ్ద వాచ్యాని వినా హేయై ర్గుణాదిభిః. "

అనఁగా - భగవానుఁడు అఖిలహేయ ప్రత్యనీక జ్ఞాన శక్తి బలైశ్వర్య వీర్య తేజః ప్రభృతి సమస్త కల్యాణ గుణాకరుఁ డని యర్థము. సహస్రనామస్తోత్రములోని నిర్గుణేతర మగు 999 నామము లును భగవానుని అసంఖ్యాక దివ్య గుణ సంకీర్తనము చేయు చున్నవి గదా ! భగవన్మత ప్రతిష్ఠాపక మగు శ్రీమద్భాగవత ప్రబంధ ములో - 'మ న్నిష్ఠం నిర్గుణం స్మృతమ్' 'మన్నికేతం తు నిర్గు ణమ్' 'నిర్గుణో మదుపాశ్రయః' 'శ్రద్ధా మత్సేవాయాం నిర్గుణా' (స్కం. 11-25, 24 మొ 27 వఱకు) అని నిర్గుణ శబ్దము 'ప్రాకృత గుణ రహితము' అను అర్థములో ప్రయోగింపఁబడినది.

మోక్ష స్వరూపము

మోక్షమనఁగా, అర్చిరాదిగతిగమ్యము - శాశ్వతము - నిత్యము - అవ్యయము - పునరావృత్తి రహితము నగు విష్ణుని పరమ స్థాన మని 'సోఽధ్వనః పార మాప్నోతి' 'త ద్విష్ణోః పరమం పదగ్ం సదా పశ్యంతి సూరయః' ఇత్యాది శ్రుత్యనుగుణముగా, భగవద్గీత యందును - బ్రహ్మ సూత్రములయందును - స్పష్టీకరింపఁబడినది. (శాం. బ్ర. సూ. భా. 3-3-32) (శాం. గీ. భా. 2-51, 5-5; 8-21, 26; 11-38; 12-20; 13-28; 15-6; 18-56, 62) (శాం. బ్ర. సూ. భా. 1-3-33; 4-3-10).

తత్త్వత్రయ వివేచన

లోక మున నాశనంతమగు సర్వభూతజాతమును 'క్షర' మనఁ బడును. కూటస్థుఁ డగు జీవాత్మ 'అక్షరుఁ' డనఁబడును. పరమాత్మ ఈ క్షరాక్షర తత్త్వముల కంటె విలక్షణుఁడును – అతీతుఁడు కూడను. చిదచిన్మయ మగు లోకత్రయమందు వ్యాపించి, దానిని భరించు చున్నాఁడు. క్షరమున కంటె అతీతుఁడై, అక్షరునకంటె గూడ ఉత్తముఁ డగుటచేతనే, ఆయనను లోకమందును – వేదమందును గూడ పురుషోత్తముఁ డను విఖ్యాతి గల దని శ్రీకృష్ణ భగవానుఁడు తన స్వరూపమును గుఱించి సెలవిచ్చియున్నాఁడు. (శాం. గీ. భా. 15–16, 17, 18).

భగవానుఁడు చిదచిద్విశిష్టుఁడు

తానే జగత్కారణుఁ డని, తన స్వరూపమందే భూమా ద్యష్టధా భిన్నమును, సంసారహేతుకము నగు అపరా (= స్థూల) ప్రకృతియు, క్షేత్రజ్ఞ లక్షణమును, జీవ సముదాయ రూపమును నగు పరా ప్రకృతియును, ఈ రెంటు ప్రకృతులును సూత్రమందు మణి గణముల వలె నా యందు అనుస్యూతములు (గుచ్చఁబడినవి) గా నున్నవి. (శాం. గీ. భా. 7-4 మొ 7 వఱకు) అనియును, భగ వానుఁడు సెలవిచ్చియున్నాఁడు.

మోక్ష విద్య 'దహర' విద్యయే

పరబ్రహ్మోపాసనకుఁగా, 32 విధములయిన విద్యలు ఉప నిషత్తులయందుఁ జెప్పఁబడియున్నవి. వేదసారము సామవేదము. (భ. గీ. 10–22) సామవేద శిరోభూత మగు ఛాందోగ్యోపనిషత్తులో 13 విద్యలు గలవు. మొదటి విద్య అంతరాదిత్య విద్య. ఇందు, పర

బ్రహ్మను ఆదిత్య మండలములో హిరణ్మయ విగ్రహుండై, రవి కిరణ వికసిత పుండరీక నయనుఁడుగ వర్ణింపఁబడి యున్నాడు. (ఛాం. 1-6 - 6, 7) ఛాందోగ్యోపనిష న్మధ్య విద్య యగు మధు విద్యలో (ఛాం. 3-11-4) ఉపాస్యుఁడు మాధవుఁడు. (విష్ణు. స. నా. 72, 167, 735 శం. భా.) త చ్ఛరమ విద్య దహర విద్య. (ఛాం. 8-15-1) దహర విద్య యనగా - హృదయ విద్య. ఛాందోగ్యోపనిష చ్ఛరమ వాక్య మగు 'న చ పునరావర్త తే న చ పునరావ ర్త తే' అను వాక్యము, మోక్ష మన, పునరావృత్తి రహితమైనదని వర్ణించుచున్నది. ఈ వాక్యమే, వేదాంత సూత్రములలో - 'అనావృత్తి శ్శబ్దాత్ అనా వృత్తి శ్శబ్దాత్' అను 'వేదాంత దర్శన' చరమ సూత్రమునకు విషయ వాక్యముగ నున్నది. ఇందువలన 'దహర విద్యయే మోక్ష ప్రద మగు విద్య' యని స్పష్టమగు చున్నది. మోక్ష మనఁగా, విష్ణుని పరమపద స్థానమే యని పైన నిరూపింపఁబడినది. పర బ్రహ్మముతో సహా, సరిసమానముగా ముక్తాత్మలు శాశ్వతానందము ననుభవిం చుటకుగాను, శ్రుతి స్మృతులలో ప్రశంసింపఁబడిన విష్ణుని పరమ పద స్థానమును స్థాపించుటకుఁగా వేదాంత సూత్రములలోని చరమ సూత్రమునకు మొదటి నాల్గు సూత్రములును (శాం. బ్ర. సూ. భా. 4-4-17 మొ 21 వఱకు) ప్రవర్తింపఁగా, ఆ శాశ్వత లోకమునకుఁ జనిన ముక్తులు తిరిగి సంసారమునకు రారని చరమ (22 వ సూ.) సూత్రం స్థాపించుచున్నది. ఈ దహర విద్యయు, త త్ఫల మగు మోక్షమును, భగవద్గీతలలో ఇట్లే వ్యాఖ్యానింపఁబడి యున్నవి. (శాం. గీ. భా. 18-61, 62).

దహర విద్య - ప్రపత్తి - మోక్షము

" ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశే2ర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా. "

" త మేవ శరణం గచ్ఛ సర్వ భావేన భారత :
త త్ప్రసాదా త్పరం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్. "

— (శాం. గీ. భా. 18-61-6

ఈశనశీలుఁ డగు శ్రీమన్నారాయణుఁడు సర్వ భూతముల శరీరము లనెడి యంత్రములపై నెక్కించి, తన మాయచే వానిని తిరుగట్లు చేయుచు, ఆ భూతముల హృదయ దేశమందు వసించియున్నాఁడు. ఓయి భారతా ! సంసారార్తి హరణార్థము, సదాత్మనా ఆయనను ఆశ్రయింపుము. ఆయన ప్రసాదముచే ఉత్కృష్ట శాంతికి స్థానమగు విష్ణు పరమపద స్థానమును పొందఁగలవు - అను ఈ రెండు శ్లోకములలో శాస్త్ర సార మంతయు ఇమిడి యున్నదని తెలియవలయును.

ప్రపత్తి వైభవము

మనూక్త వైదిక కర్మ యోగము సంసారుల కుపాదేయ మగు ప్రపత్తి మార్గమును, ముముక్షువుల కుపాదేయ మగు నివృత్తి మార్గమును కల్గియున్నది. ఈ రెండు మార్గములను అసురు లెఱుఁగరని (శాం.గీ.భా.16-7) ఈ వైదిక కర్మయోగము శ్రీకృష్ణ భగవానుఁడు గీతలలో ననుగ్రహించిన రహస్యాష్టకములో ప్రప్రథమమును - ఉత్తమమును నగు రహస్యము (శాం. గీ. భా. 4-3) ప్రవృత్తిమార్గము 'బంధ' హేతు వనియు, నివృత్తిమార్గము 'మోక్ష' హేతువగు సన్యాసమార్గ మనియు, ఈ సంగతి అర్థము చేసికొన్న బుద్ధి స్వాత్త్విక మని భగవ దభిప్రాయము. (శాం. గీ. భా. 18-30

భగవద్గీతా శాస్త్రమంతయు రహస్య శాస్త్రమే. (శాం. గీ. భా. 18-67) అందులో నుత్తమ రహస్యము కర్మయోగమే. (శాం. గీ భా. 4-3) ఈ కర్మయోగము యొక్క పరమ రహస్యమును - కర్మయోగ నిష్ఠా ఫలమును - సర్వ వేదాంత సార విహితమును అగు సమ్యగ్దర్శనమే 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య' ఇత్యాది గీతా చరమ వాక్యోక్త భగవచ్ఛరణాగతి యను శ్రీ శంకర భాష్యముచే, వైదిక కర్మయోగ ప్రాశస్త్యము విశద మగుచున్నది. (శాం. గీ.భా. 18-66) బహు జన్మములయం దాచరింపఁబడిన వైదిక కర్మయోగాంగభూత 'నివృత్తి నిష్ఠ'కు ఫలముగా తయారైన జ్ఞాని చేయవలసినది భగవచ్ఛరణ ప్రపత్తి యని, అట్టి పరిశుద్ధ ప్రపన్నుఁడు వాసుదేవుఁడే ప్రాప్య ప్రాపకముగా సర్వ విధముల నధ్యవసించునని, గీతయే ఉద్ఘోషించి, అతఁడే 'మహాత్ముఁ' డని, అట్టివాఁడు సుదుర్లభుఁ డని ప్రశంసింపఁగా, (శాం. గీ. భా. 7-19) ఎట్టి వానికిని అతిక్రమించుటకు దుర్ఘటమై, సర్వేశ్వరుఁడును - విష్ణువును అగు తనకు స్వభావ భూతమై, త్రిగుణాత్మికయు - సర్వ భూత మోహినియు నగు మాయను 'సర్వధర్మాన్ పరిత్య' జ్యేత్యాది చరమ వాక్యోక్త రీత్యా (శాం. గీ. భా. 18-66) సర్వాత్మనా తన యందే ప్రపత్తి చేసిన వాఁడు ఆ మాయనుఁ దాఁటి, మోక్షము చూఱఁగొనవచ్చు నని ఉపదేశించి, సర్వేశ్వరుఁడును-నారాయణుఁడును నగు తనను మూఢులు - పాపకర్ములు - నరాధములు - మాయను జ్ఞానమును కోలుపోయిన వారు - అసురులు తన చరణారవిందముల శరణింపరని, ఆ యా కామములచే జ్ఞానము గోలుపోయిన వారు అన్యదేవతల యందు శరణింతురని, భగవానుఁడు కఠినముగా నిందించియున్నాఁడు. (శాం. గీ. భా.

7–14, 15, 20) ఈ సందర్భమున 9 – వ అధ్యాయము 20 మొ 27 వఱకు శంకర భాష్యము కూడ చూడుఁడు.)

సన్యాసాశ్రమీయులకును ఈ ప్రపత్తి యే తారకము, ప్రపత్తి శ్రుతిసిద్ధము

సన్యాసాశ్రమియు లందఱకిని త్రికాల హరిపూజయు – తచ్చరణ ప్రపత్తియును ధర్మశాస్త్రము విధించుచున్నది. (నిర్ణయ సింధువులోని యతి ధర్మ నిర్ణయమును చూడుఁడు.)

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాం శ్చ ప్రహిణోతి తస్మై
తగ్ంహ దేవ మాత్మబుద్ధి ప్రకాశం ముముక్షు ర్వై శరణ మహం ప్రపద్యే."

అనఁగా – పూర్వము చతుర్ముఖ బ్రహ్మను సృజించి, అతనికి వేదము లొసఁగినట్టి ఆత్మ బుద్ధి ప్రకాశకుఁడగు భగవానుని ముముక్షువైన నేను శరణంచుచున్నాఁడ' నను శ్వేతాశ్వతరోపనిషద్వాక్యములను స్మరించుచు, హరిచరణముల యందు సన్యాసాశ్రమీయుఁడు 'ప్రపత్తి' చేయవలయును. ఇదియవలన, హరిచరణ ప్రపత్తి – శ్రుతి సిద్ధమని విశదపడుచునే యున్నది. ఈ ప్రపత్తి, సర్వాధికార మని పైన నిరూపింపఁబడినది. (శా. గీ. భా. 9-30 మొ 33 వఱకు) నిష్కామ కర్మయును సర్వాధికారమే. (శాం. గీ. భా. 18-46) బహుజన్మల సుస్థిత నిష్కామ కర్మయోగమువలన జ్ఞాన సిద్ధి, జ్ఞానమునుండి ప్రపత్తి యు సిద్ధించుటయే గీతా సిద్ధాంతము. (శాం. గీ. భా. 7–19)

పరబ్రహ్మము ఆనందమయ స్వరూపుఁడు

తైత్తిరీయోపనిషద్వాక్యములగు అన్నమయ – ప్రాణమయ – మనోమయ – విజ్ఞానమయ – ఆనందమయ కోశము లైదింటిలో, ఆనందమయ కోశమే శిఖరము. 'రసో వైసః' అను వేదాంత

వాక్యము ఆనందమయ కోశమున కన్వయించుచున్నది గదా ! ఆనంద మయకోశము క్రింద నున్న విజ్ఞానమయకోశములోని 'విజ్ఞాన' శబ్దము జీవునకు అన్వయించునని, ఈ కోశముల ఆరోహక్రమము సూచించు చున్నను - 'మయట్' శబ్దసామ్యముచేఁ గల్గు సందేహమును దీర్చు టకై, ఆనందమయకోశములోని 'మయట్' శబ్దము ప్రాచుర్యార్థము గాని, వికారార్థము గాదనియు .. (1-1-13) జీవునకు ఆనందహేతువగు వాఁడు పరబ్రహ్మమని శ్రుతి చెప్పుటచే, ఆనందప్రచురుఁడైనఁగాని, బ్రహ్మము జీవుని ఆనందింపఁజేయఁజాలఁడు గదా యని (1-1-14) శ్రుతిలోనే, 'విజ్ఞానమయా దన్యోంతర ఆత్మానందమయః' విజ్ఞాన మయునకంటె ఇతరుఁడే ఆనందమయుఁ డని ఉన్నది గదా !

పరబ్రహ్మము - తదంశ యగు ఆక్షరుఁడు (జీవుఁడు)

పర బ్రహ్మమును సూర్యునితోఁ బోల్చిన, జీవుఁడు సూర్య కిరణములతోఁ బోల్పఁదగినవాఁడు. మోక్షమును గమ్యస్థానముగఁ బెట్టుకొన్న ముముక్షువు-మోక్షము చేరవలయు నన - బ్రహ్మోపాస నయా, అక్షరోపాసనయా ఎక్కువ ఉపయోగకారి యన, అక్షరో పాసకుల కంటెను, పరబ్రహ్మోపాసకులే యోగ విత్తము లని భగ వానుఁడు తీర్మానించియున్నాఁడు. (శాం. గీ. భా. 12-1, 2) గమ్య స్థానము చేఁబోవు ఇద్దరిలో ఒకఁడు - పగలు సూర్య ప్రకాశము నాశ్రయించి ప్రయాణము చేయువాఁడు. మఱి యొకఁడు - రాత్రి వేళ ఒక లాంతరో, దివిటీయో సహాయముగాఁ బెట్టుకొని ప్రయాణించు వాఁడు. సూర్య ప్రకాశము నాశ్రయించి పోవ్రవ టి వాఁడు బ్రహ్మో పాసకుఁడు. అక్షరోపాసకుఁడు రాత్రి వేళ దివిటీ వెల్గున ప్రయా ణించువాఁ డని తెలియవలయును.

పరబ్రహ్మము యొక్క వ్యక్తావ్యక్త స్వరూపము

'మానుష చర్మచక్షుర్గోచర' మగు శ్రీకృష్ణుని కిరీట చక్ర గదా విభూషిత మగు స్వరూపము 'వ్యక్త రూపము.' విశ్వ రూపమునందు 'దివ్య దృష్టి సహాయముతో' భగవత్ప్రపన్నులచే సేవింపఁదగిన అప్రాకృత దివ్య తేజోమయ కిరీట చక్ర గదా విభూషిత, దివ్య మాల్యాంబర, దివ్య గంధానులేపనాల కృత దివ్య మంగళ స్వరూపము శ్రీకృష్ణ భగవానుని 'అవ్యక్త' స్వరూపము. ఎప్పుడును సేవింప నలయునని కాంక్షించు బ్రహ్మాది దేవతలకుఁ గూడ 'సుదుర్దర్శ' మగు ఈ దివ్య రూపము (శాం. గీ. భా. 11-11, 17, 18, 46, 52) ఋగ్యజు స్సామాది చతుర్వేదములచేఁగాని, చాంద్రాయణా ద్యుగ్ర తపస్సులచేఁగాని, గో భూ హిరణ్యాది దానములచేఁగాని, యజ్ఞ యాగాదులచేఁగాని సాక్షాత్కరింపఁ దనియను - (శాం. గీ. భా. 11-53) శ్రీకృష్ణ భగవానుని యందలి అనన్యమును - అవ్యభిచారమును నగు భక్తిచేతనే సాక్షాత్కరింపఁగల దనియు, ఇట్లే మోక్షము లభింపఁగల దనియు (శాం. గీ.భా. 11-54; 13-10) గీత స్పష్టీకరించుచున్నది. ఇట్లే - అనన్య భక్తి గల ప్రపన్నుల 'దివ్య చక్షువు' అర్జునాదులకు వలె ఉన్నులనము కాగా, భగవత్సాక్షాత్కారము లభింపఁగలదు. (శాం. గీ. భా. 11-8) శ్రీకృష్ణ భగవానుని మానుష దేహమున చర్మ చక్షువులకు వ్యక్తమయిన కిరీట చక్ర గదాది భూషిత స్వరూపమే, అర్జునాదుల 'దివ్యదృష్టి'కి సాక్షాత్కరించిన భగవద్దివ్య 'తేజో' మయ విగ్రహము. భగవానుని యందు అనన్య భక్తి లేని వారల మానుష దృష్టికి (దివ్య దృష్టి లేని హేతువుచే) భగవద్దివ్య మంగళ విగ్రహము పరిత్రాణము.

తత్త్వత్రయ విమర్శ

చిదచిదీశ్వరులకు తత్త్వత్రయ మని పేరు. వేదాంతులతో పాటుగా - ఆత్మ స్వరూపమును వేదమున కనుకూలముగానే సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, పూర్వమీమాంసక, పాశుపత మతస్థులు ఉపవర్ణించి రని చెప్పబడినది. అట్లే, జగత్తు సత్యమైనదనియే వీరి సిద్ధాంతము. తత్త్వత్రయములో ఒక్క- అచిత్తు మాత్రమే కలదు గాని- చిత్తుగాని, ఈశ్వరుడుగాని 'నాస్తి' అన్నాడు చార్వాకుడు. ఈశ్వర విషయములో, యోగ - న్యాయ - వైశేషికుల ఉపవర్ణనము వేదాంతులకు సమ్మతము గాదు. పాశుపతుల ఈశ్వర కల్పన - వేద బాహ్యమే. భాగవత మతస్థులగు వ్యాస పరాశరాదులు తత్త్వత్రయ స్వరూపమును ఉపనిషదనుసోధముగా చిత్రించిరి. జగత్తు అసత్య మనియు, అది ధర్మమందు ప్రతిష్ఠితము కాదనియు, జగత్తు పాలించు ఈశ్వరుడే లేడనియు, నేనే ఈశ్వరుడ ననియు అనువారు అసురులని భగవానుడు నిందించి యున్నాడు. ఇట్లే, భగవచ్ఛరణ ముపయించు శరణు చేయని వారిని అసురులనియే నిందించి యున్నాడు. ప్రవృత్తి నివృత్త్యాత్మక కర్మయోగము నంగీకరింపనివారును అసురులే. జ్ఞానులలో గూడనైన తన యందు శరణించిన వారినే మహాత్ములని స్తుతియించి యున్నాడు. (శౌం. గీ. భా. 7-14, 15, 19; 16-7, 8, 14.)

వేదోక్త భాగవత మతోద్ధరణము - శ్రీరామానుజ భాష్యకారోదయము

క్రీ. శ. 1017-వ సంవత్సరమున శ్రీకృష్ణ పునరవతారభూతుడగు శ్రీ రామానుజాచార్యులు 'వేదోక్త భాగవత మతమును' భాష్య రచనచే పునరుద్ధరించి, భగవత్ప్రపన్నులకు సన్మత మార్గమును ప్రదర్శించి, ఉభయ విభూతివాసుల కృతజ్ఞతకు పాత్రుడాయెను.

అనాదిసిద్ధముగా తెనుగుదేశమైన చెన్నపురికి సుమారు 26 మైళ్ళ దూరమున నున్న 'శ్రీ పెరుంబూదూరు' అను గ్రామములో శ్రీ రామానుజాచార్యులు అవతరించెను. ఆ గ్రామవాసులలో కొందరు అరవ దేశమునకు నలస వెళ్ళిన బ్రాహ్మణులను వడమలు (ఉత్తరాది వాండ్లు) అని పిల్చుచుండిరి. శ్రీ రామానుజాచార్యులు వడమ వైష్ణవ కుటుంబములో జన్మించినవాడు. శ్రీ శంకర భాష్యకారులు తన వేదాంత భాష్యత్రితయమునందును, విష్ణుసహస్రనామభాష్యమునందును విష్ణుపారమ్యమును బహు ముఖముల స్థాపించిన పరమ వైష్ణవ శిఖామణి. భాగవత మతములోని వేదాంత తత్త్వభాగము బోధాయన సృష్టికారుని ద్వారా, రామానుజుని తండ్రి వఱకును అవలంబింపబడిన భాగవత సంప్రదాయములోనివాడే - శ్రీ రామానుజులు. శ్రీ రామానుజుని తండ్రిపేరు కేశవ భట్టారకుడు. ఈయన ఇప్పటి రామానుజీయ సంప్రదాయములోని వడగల శ్రీవైష్ణవుల వలె శ్రౌత యజ్ఞములొనర్చి, 'సోమయాజి' యను బిరుదముగల యజుర్వేద శిక్షా శ్రౌతసూత్రాదుల, నానేకములగు ఉద్గ్రంథములను రచించిన విద్వాంసుడు. ఈయన యింటి పేరు ఆసూరివారు. మేనమామలు తిరుమలవారు. భాగినేయులు కందాడవారు. తిరుమల యనగా - తిరుపతి. తిరుపతి వలెనే 'కందాడ' యనునది గ్రామ నామధేయము. శ్రీవారి యింటి పేరు ఆసూరివా రనుటకూడగా-వీరి వంశము విద్వద్వంశమేయని తోచుచున్నది. తండ్రిగారు విద్వాంసుడనుట సత్యమే గదా ! ఆయన తల్లిగారి పేరు కాంతిమతీదేవి. ఆ కాలములో భరతఖండమున విద్యాపీఠములలో కాంచీపురము ఒక విద్యాపీఠముగా నుండెడిది. 15 సంవత్సరముల వయస్సు వఱకు తండ్రియొద్దనే వేద వేదాంగముల నధ్యయనము చేసి, ఆయనమ్మట తండ్రిగారు పంపగా - కాంచీపురికి వెళ్ళి, అచటి విద్యాపీఠములో వేదాంతశాస్త్ర ప్రవచన చేయుచున్న యాదవ

10814
23/3/58

శ్రీ భగవద్రామానుజులు

ప్రకాశుఁడను అద్వైత యతి యొద్ద శంకరీయ వేదాంత భాష్యమును పఠించుచుండెను. ఒకనాఁడు చేయు ఉపనిష త్ప్రవచనములో - ఛాందోగ్యోపనిషత్తునకు శ్రీ శంకర వ్యాఖ్య ననుసరించి - 'కప్యాసం పుండరీక మేవ మక్షిణీ' అను వాక్యమునకు (ఛాందోగ్య. 1-6-7) అర్థము చెప్పుటలో - శ్రీయాదవప్రకాశులు-కోతియొక్క ఆసనము వలె ఎఱ్ఱగా నున్న తామరలవంటి కన్నులుగలవాఁడు పర బ్రహ్మమని చెప్పఁగా, వినిన రామానుజులు - వేఁడి నిట్టూర్పుతో అశ్రు బిందువులు రాల్చెను. గురువు కారణమడుగగా 'పరమపురుషుని వర్ణించుచున్నది-శ్రుతిపురుషుఁడు భగవన్నేత్రము' ను కోతి ఆసనమువకు అర్థిలముగా నుపమించునా?' యని తన విచార కారణమును వ్యక్తము చేయఁగా- 'ఏదీ! నీవు అర్థము చెప్పు' మని ప్రశ్నచేయుటయు - 'కం పిబతీతి కపిః, అస్ వికసనే' అని కప్యాస శబ్దమునకు విలక్షణార్థము చెప్పి, 'కప్యాసం పుండరీక మేవ మక్షిణీ' అనఁగా -'రవికిరణ వికసిత పుండరీక నయనుఁ' డని వ్యాకార్థము వినిపించుటతో - గురువునకు సంతోషము గలుగు టకు బదులుగా ఆగ్రహము కలిగెను. అంతటితోఁ దనివిఁజెందక, కాశీ యాత్ర మిషచే రామానుజునిఁ గూడ దీసికొనిపోయి, మధ్యఁ జంపవలె ననుఁ యోచన చేయఁగా, కాంచీ వరదరాజ కరుణచే తప్పించుకొని వచ్చె నని కథ కలదు. ఈ కథమాట యెట్లున్నను - రామానుజులు యాదవప్రకాశునియొద్ద చదువు చాలించి, ఉపనిష ణ్మత వివేచనను స్వతంత్రముగాఁ జేయుచు, విశిష్టాద్వైత మతమును బోధాయన వృత్తి కారుల తచ్ఛిష్యపరపరలో నాథ - యామునా ద్యాచార్య వర్గము త చ్ఛిష్యపరంపర నుండి గ్రహించి, యామునమునివరుల శిష్య లగు మహాపూర్ణులకు శిష్యులైన తిరుకోట్టూరునంబి వలన చరమవా ర్త ఉపదేశ మంది, తిరుకోట్టూరు గోపురము నుండి తిరుమంత్రార్థ మును జగత్తులోని ముముక్షువుల కందఱికిని ప్రకాశింపఁజేసి, పిదప

శ్రీరంగములోను, మేల్కోటలోను చిర నివాసము చేసి, వేద భగవన్మతోద్ధరణకై, శ్రీ (బ్రహ్మసూత్ర)భాష్యము, గీతాభాష్యం వేదార్థ సంగ్రహము, గద్య త్రయము, నిత్య గ్రంథము మొదలా దార్శనిక గ్రంథముల ననుగ్రహించి, విశిష్టాద్వైత సిద్ధాంతమ స్థాపించిరి.

జయతు జయతు కృష్ణో వేద వేదాంత వేద్యః
నిఖిల నిగమమౌళి న్యస్త పాదాబ్జ హృద్యః
జయతు జయతు వేద వ్యాస యోగీంద్ర చంద్రః
ప్రకటిత నిగమాంత స్యాంతర జ్ఞాన సాంద్రః.



శ్రీ పాంచరాత్రము - తద్విశేషము

' సాహిత్య శిరోమణి - వేదాంత కోవిద -
రాష్ట్ర భాషా భూషణ్ - విద్వాన్ '

శ్రీమాన్ పొడిచేటి శ్రీరంగాచార్యులు

★ ★ ★

" యమ శ్రీ వాసుదేవాయ సత్య జ్ఞాన స్వరూపిణే
స్వాశ్రితావన దీక్షయ మోక్షైక ఫలదాయినే. "

అవతరణిక

ప్రపంచమందలి వివిధ ఖండములలో - ఆసియా ఖండము అతి ప్రాచీనముగా సువిఖ్యాతమైనది. ఇది-వివిధ మతములకు, సంస్కృతులకు నాగరికతలకు, సంప్రదాయములకు ఆలవాలమైనది. మహర్షులకు జన్మ స్థాన మగుటచే - 'ఆర్షేయ దేశ' మని సంస్కృతమున వాడబడి, క్రమముగా వికృతమై, 'ఆసియా' యను పేరుబరగినది. ఇందలి సువిశాల భూభాగమున కే 'భారత వర్ష' మని నామాంతరము. మనము నివసించు భరత ఖండము గంగాది పుణ్య నదులతోడను - హిమాలయాది మహోన్నత శైలరాజములతోడను - విరాజితమై, ఆర్యావర్తమై, పుణ్యభూమియై తనరారినది. బౌద్ధ క్రైస్తవ మహమ్మదీయాది మతము లన్నియు ఆధునికములు. రెండు మూడు వేల సంవత్సరముల లోపు చరిత్ర సంపద మాత్రమే కలవి. కాని, సృష్ట్యాదియందే సకల జగత్కారణ భూతుడగు శ్రీమన్నారాయణునిచే కోట్లకొలది సంవ

త్సరములకు పూర్వమే ఉపదేశింపఁబడి, పరంపరాగతమై, వివిధానస్థల
నొంది, సంరక్షింపఁబడిన గ్రంథ జాతములే మన వేద సమామ్నా
యము. మన దేశమున అన్ని మతములును గలవు. తత్త్వ న్మతానుసా
యాయులును గలరు. వైదిక, అవైదిక, ఆస్తిక, నాస్తిక మతావలంబు
లును గలరు. కాని, ద్వైతాద్వైత విశిష్టాద్వైత మతములు
మూఁడు మాత్రమే శిష్టజనాంగీకృతములైనవి. ఇవి ముఖ్యముగా వేద
పారమ్యము నంగీకరించినందున, వైదిక మతములుగా పరిగణింపఁ
బడినవి. సర్వ దేశముల యందలి ప్రాచీన సభ్యతలు, నాగరికతలు నశించి
నను, తన పూర్వాస్తిత్వమును సంరక్షించుకొని, అమరత్వము నందిన
మహా గౌరవము వైదిక ధర్మమునకే చెల్లినది. ఇట్టి వేదము
లన్నియు - 'అనంతా వై వేదాః' అనునట్లు - అనంతములుగా నున్నవి.

భగవద్వైభవము

'వేదోఽఖిలో ధర్మమూలమ్' అని శాస్త్ర ప్రమాణము. సర్వ ధర్మములకును వేదమే ప్రాతిపదిక. ఇట్టి శ్రుతుల నాధార మొనర్చుకొనియే - స్మృతులు, ఇతిహాసములు, పురాణములు, ఆగ మములు, ద్వైతాద్వైతాది సంప్రదాయ భేదములు ఉద్భవించినవి. సమస్త వైదిక మతానుయాయుల యందును - విష్ణువును కీర్తింపని వారు లేరు. కాన, (శ్రీ) మహావిష్ణువు సర్వజనాంగీకృతుఁడు. విశిష్టా ద్వైతులగు (శ్రీ) వైష్ణవులు విష్ణు పరత్వమే నుడువుదురు. అద్వైతులు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను ఒకే తేజముగా భావింతురు. పంచా యతన పూజలో విష్ణువుకు ప్రత్యేక స్థానము కల్పింపఁబడినది. ద్వైతులు శ్రీహరినే పరతత్త్వముగా గొల్చుచున్నందున, విష్ణువు సర్వజనాంగీకృతుఁడనుటలో విప్రతిపత్తియే లేదు.

'హరిః ఓమ్' అని వేదములు ప్రారంభింపఁబడుటచే, ఓంకార మందలి అకార ఉకార మకారములలో మొదట గల అకారము - విష్ణు బోధక మగుటచేతను, రజ స్సత్త్వ తమోగుణ స్వరూపు లగు బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో శుద్ధ సత్త్వ గుణోపేతుఁడు శ్రీమన్నారాయణుఁడే యగుట చేతను, శ్రీ హరియే పరాత్పరుఁడు; ప్రధాన తముఁడు ననుట నిర్వివాదాంశము.

" యేఽప్యన్యదేవతా భక్తా యజంతే శ్రద్ధయాన్వితాః
తేఽపి మామేవ కౌంతేయ ! యజ న్త్యవిధిపూర్వకమ్ "

— (భగవద్గీత 9-23.)

అర్జునా ! శ్రద్ధతో నితర దేవతల నారాధించుచున్న వారందును న న్నారాధించుచున్నట్లే భావింపుము. కాని, అట్లితర దేవతల నారాధించుట కేవలము అజ్ఞాన మూలకము."

ఇది నారాయణ స్వరూపుఁడైన శ్రీకృష్ణ భగవానుఁడు నర స్వరూపుఁడైన అర్జునున కుపదేశించిన పరమ రహస్యము. ఇందు వలన, సర్వ దేవతా రూపములలో శ్రీమన్నారాయణుఁడే అంత ర్యామిగా నున్నట్లు తెలియనగును. మఱియు —

" సర్వ దేవ నమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి. "

'ఎవ రే దైవమును గూర్చి నమస్కరించినను, ఆ నమస్కారము లన్నియు విష్ణు భగవానునకే చెందగలవు' అను ప్రమాణము కూడ ఇచ్చట సార్థక మగుచున్నది. జీవునకు రక్షణయే అత్యావశ్యకమై యున్నందున, సర్వ రక్షకుఁడైన శ్రీమన్నారాయణుఁడే సర్వ జనులకును సమాశ్రయణీయుఁడు.

" మోక్ష మిచ్ఛే జ్జనార్దనాత్. "

అనెడి ప్రమాణోక్తరీత్యా, మోక్షాధికారి యగు శ్రీ మహా విష్ణువే భవ బంధములను నశింపఁజేయ సమర్థుఁ డని స్పష్ట మగు చున్నది గదా !

పాంచరాత్ర శాస్త్రోదయము

ఇట్టి శ్రీమన్నారాయణుఁడు సృష్ట్యాదియందు బ్రహ్మకు వేదముల నుపదేశించెను. కాని, ఆ వేదములు అనంతములుగా - మువ వగాహ గంభీరములుగా నున్నందున, లోక హితార్థమై, వేద సంప్రదాయము అత్యంత సులభముగా వ్యక్త మగునట్లు బోధిం పుమని అత్యంత గరుడ విష్వక్సేన బ్రహ్మేంద్రు లైదుగురను వైకుంఠ వాసుని ప్రార్థింపఁగా - శ్రీహరి ప్రసన్నుఁడై, అయిదు రాత్రులలో శాస్త్ర రహస్యములను వారికి సులభ మార్గమున విపులముగా బోధించెను. ఇందువలననే, ఈ శాస్త్ర గ్రంథములకు 'శ్రీ పాంచ రాత్రాగమ' మను అన్వర్థనామ మేర్పడినది, దీనికి ప్రమాణముగా నారద మహర్షి వాక్యములను పరిశీలించుఁడు :—

" శ్రూయతాం మునయ స్సర్వే య దుష్మాభి రపేక్షితం
భగవచ్ఛాస్త్ర రాహస్యం యథా శక్తి వదా మ్యహమ్
పురా త్వేత న్మహా శాస్త్రం లోకానుగ్రహ కామ్యయా
మమ పిత్రా విధాత్రే తు వైకుంఠ నగరే శ్రుతమ్
శ్రీమన్నారాయణో శౌరిః హరిః పరమపూరుషః
పంచరాత్రిషు తత్సర్వం బ్రహ్మణే ష్వవద త్స్వయం
తదస్యేత న్మయాఽధీతం సమగ్రం మమ పితృతా
స రహస్యం చ శ్రీవిష్ణో రారాధన పరం పరం
ఏతత్ జ్ఞాత్వా భవాంభోధి నిమగ్నా మానవా భువి
శాశ్వతం శ్రీహరే స్థానం ప్రాప్నువంతి న సంశయః. "

— (పరమ పురుష సంహిత - ప్రథమాధ్యాయము)

" మునులారా ! వినుడు. మీరు కోరిన విషయములను యథా శక్తి గా వచించెద. ఈ మహాశాస్త్రమును ఆమూలాగ్రముగా మున్ను నా జనకుఁడగు బ్రహ్మదేవుఁను లోకుల ననుగ్రహింపఁదలఁచి, శ్వేత వైకుంఠమున పరమపురుషుఁడగు శ్రీమన్నారాయణుని ప్రార్థింపఁగా, ఆతఁడైదు రాత్రులలో నిద్దానిని బ్రహ్మ కనుగ్రహించెను. పిమ్మట నేను--సర్వశ్రేష్టములై వెలసిన శ్రీవిష్ణు భగవానుని ఆరాధించు విధానములతోఁ గూడిన రహస్యముల నన్నింటిని నా తండ్రికడ సమూలముగాఁ దెలిసికొంటిని. ఈ శాస్త్రమును సంసార సాగర నిమగ్నులైన మానవు లవగాహ మొనరించుకొనఁగల్గిరేని, వారు నిశ్చయముగా శాశ్వత విష్ణు సాయుజ్యమును పొందగలరు. "

ఇట్లు పాంచరాత్ర శబ్దమునకు వివిధ వ్యుత్పత్త్యర్థములు ప్రచారములో నున్నవి.

"పాంచరాత్రం నామ, పంచరాత్రీయన్తే యస్మిన్ శాస్త్రే తత్ పాంచరాత్రం. యస్య దేహినః మహాభూతగుణాః శబ్ద స్పర్శ రూప రస గంధాత్మికాః పంచ సంఖ్యాకాః రాత్రీయన్తే ఇతి వా పాంచరాత్రం. అథ వా, యస్య దేహినః యస్మిన్ శాస్త్రే రాత్రయః సుఖప్రదాః జ్ఞాయన్తే తత్ పాంచరాత్రమ్. "

" మహాభూతగుణాః పంచరాత్రయో దేహినస్స్మృతాః
తద్యోగా ద్వినివృత్తేర్వా పాంచరాత్ర మితి స్మృతమ్.
భూత మాత్రాణి గర్వం చ బుద్ధి రవ్యక్త మేవ చ
రాత్రయః పురుషస్యోక్తాః పాంచరాత్ర మితి స్మృతమ్. "

— (పరమ పురుషః సంహిత - ప్రథమాధ్యాయము.)

" పాంచరాత్రస్య శబ్దస్య వక్ష్యే స్యర్థ మతః పరం
వియ ద్వాయు శ్చ వహ్ని శ్చ ఆప శ్చైవ ధరా తథా
రాత్రయో దేహినాం ప్రోక్తాః అవిద్యా సంభవా స్స్మృతాః
త ద్యోగా ద్వినివృత్తం తు కారయేయు ర్యత స్తతః. "

ఇంతకును పాంచరాత్ర శబ్దమునకుఁ దేలిన అంతరార్థ మేమనఁగా – పాంచభౌతిక వికార జనకము లగు శబ్ద స్పర్శ రూప రస గంధాది విషయ సుఖ భోగములనుండి మానవుని విముఖునిఁజేసి, భగవత్సేవలో నిమగ్నత నొందించునదియే శ్రీపాంచరాత్ర శాస్త్రము. ఈ పాంచరాత్ర శాస్త్రమునకు తంత్రము, ఆగమము, ఏకాయనము, ప్రకృతి వేదము, మూల వేదము, సాత్త్వత విధి, భగవచ్ఛాస్త్రము, మహోపనిషత్తు, ఏకాయన ఖ్య శ్రుతి – అను నీ మొదలగు నామాంతరము లున్నవి.

తంత్రము

తంత్ర మనఁగా – షోడశోపచార తంత్రములచే భగవానుని ప్రసన్న మొనర్చుకొనుట. లేక, ఉపచారాదులచే భగవదనుగ్రహమును సాధించువానికి సకలాష్టభీముల నొసంగి, సంసార సాగరమునుండి తరింపఁజేయను గాన, తంత్ర మనియు పేరుఁ బొందినది.

ఆగమము

"ఆగమో నామ ఆజ్ఞిత్యుపసర్గాత్ గమ్ ధాతోఃఅక్ ప్రత్యయే నిష్పన్నఃతంత్రశాస్త్రావబోధకఃఃః

౧. సృష్టిక్రమము ౨. ప్రళయాది వర్ణనము ౩. నారాయణ-విష్ణు-వాసుదేవ - సుదర్శన-నృసింహ-హయగ్రీవాది సమస్త దేవతార్చనా విధానములు ౪. విద్య - రాజ్యము - ఐశ్వర్యము మొదలగు సర్వ కామ్య సుఖప్రాప్తి సాధనా విధానములు ౫. సకల మహామంత్రముల పురశ్చరణ క్రమములు ౬. వశ్యాకర్షణ-విద్వేషణ-మారణ-మోహనోచ్చాటనము లను షట్కర్మసాధనములు ౭. చతుర్విధ ధ్యాన యోగములు అను నీ సప్త లక్షణములతో గూడిన శాస్త్రము గుటచే నిది 'ఆగమ' మని చెప్పఁబడుచున్నది.

ఏ కా య న ము

" శృణుధ్వం మునయ స్సర్వే వేద మేకాయనాభిధం
మోక్షాయనాయ వై పంథా ఏత దన్యో న విద్యతే
తస్మా దేకాయనం చేతి ప్రవదంతి మనీషిణః. "

మోక్షప్రాప్తికి ఈ శాస్త్రమే ముఖ్య మార్గముగా నున్నందున నిది 'ఏకాయన' మనియు వ్యవహరింపబడుచున్నది.

ప్ర కృ తి వే ద ము

" అస్మా చ్ఛాస్త్రం తు తంత్రాఖ్య మస్మా న్మన్వాదయోఽపి వ
ధర్మశాస్త్రా ణ్యనేకాని కరిష్యంతి యథా తథం
అన్యేషా మపి శాస్త్రాణా మయి రేత శ్చవిష్యతి
ఋగాది మంత్రా స్సర్వేఽపి తథా యస్మిన్ ప్రకీర్తితాః
ఏష ప్రకృతివేదేభ్యో వాసుదేవై క గోచరః
ప్రవర్తతే కృతయుగే తత స్త్రేతా యుగాదిషు
వికార వేదా స్సర్వత్ర దేవతాంతర గోచరాః. "

మన్వాది స్మృతులకును-బహుళ శాస్త్రములకును ఇది కారణమైనందున, కృత-త్రేత-ద్వాపర యుగములలో పాంచరాత్రాగమము నకు 'ప్రకృతి వేద' మనియు వ్యవహారము కల్గినది. మన్వాది మహర్షులు తమ ధర్మశాస్త్రరచనకు పాంచరాత్ర శాస్త్రమునే ప్రాతిపదికగా గైకొనియున్నట్లు ఇందువలన సుస్పష్టమగుచున్నది.

మూలవేదము

" మహతో వేద వృక్షస్య మూలభూతో మహోనయం
ఋగాద్యా స్కంధభూతా స్తే శాఖాభూతా శ్చ యోగినః
జగన్మూలస్య వేదస్య వాసుదేవస్య ముఖ్యతః
ప్రతిపాదకతా సిద్ధా మూలవేదాఖ్యతా ద్విజాః. "

— (పురుషోత్తమ సంహిత - ప్రథమాధ్యాయము.)

వేద మొక మహా వృక్షము. ఋగ్యజుస్సామాథర్వణములు నాల్గును దానికి శాఖాభూతములు. జగన్మూలకమైన ఇట్టి వేదము ముఖ్యముగా వాసుదేవ భగవానుని ప్రతిపాదించుచున్నది. ఇందువలన నిది 'మూలవేద' మని మునియు చెప్పబడుచున్నది.

ఈ వివరణములచే-ఈ పాంచరాత్ర శాస్త్రము భారతీయ తత్త్వ శాస్త్రములలో ప్రముఖ స్థానము నాక్రమించి యున్నట్లును, పరమ ప్రమాణముగా పరిగణింపబడగీయున్నట్లును విశద మగుచున్నది.

ఉపనిషత్తులలో పాంచరాత్రము

ఈ శాస్త్రమునందలి యాదర్శములను, గంభీరభావములను, ప్రాచీనతను, ఛాందోగ్యోపనిషత్తునందలి భూమ విద్య ఇట్లు నిరూపించుచున్నది :—

" ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేదం అథర్వణం వాకో వాక్య మేకాయనం చేతి. "

ఇందలి ఏకాయన శబ్దము పాంచరాత్ర బోధకము.

" నాన్యః పంథా అయనాయ విద్యతే. "

ఏకాయన శబ్దము పురుషసూక్తములో నిట్లు స్పష్ట మొనర్చ బడినది. శతపథ బ్రాహ్మణ మంతను పాంచరాత్ర శాస్త్ర ప్రశంస కలదు.

వైదిక మత ప్రవర్తకుల దృష్టిలో పాంచరాత్రము

శ్రీ శంకర – రామానుజ – వేదాంత దేశికాచార్యాది మహా సీయు లందఱును పాంచరాత్ర శాస్త్రమునుండి ఉదాహరణము లనేకములను తమ గ్రంథములలో నుల్లేఖించి, శాస్త్ర ప్రామాణికతను బాగుగా చాటియున్నారు. పూజ్యులైన శ్రీ యామున చార్యుల వారు ఈ పాంచరాత్ర శాస్త్రమును పంచమ వేదమని ప్రశంసించియున్నారు. ఈ శాస్త్రము సృష్ట్యాది నుండియు బహుళ ప్రచారములో నున్నది. అన్ని యుగములయందును ఇది విలసిల్లియున్నది. పదియవ శతాబ్దమున కాశ్మీరు దేశములో 'స్కాందప్రదీపికా' కారుడైన ఉత్పల వైష్ణవ మహాసీయుడు – ఈ పాంచరాత్ర శాస్త్రమును మిక్కిలి ప్రశంసించి యున్నాడు.

ఇతిహాసములలో పాంచరాత్రము

" ఇదం శత సహస్రార్ధ భారతాఖ్యానవిస్తరాత్
ఆవిష్య ద్యుతిమథనం దర్శోపనిషత్ ప్రదీపితం

నవనీతం యథా దధ్నో ద్విపదాం బ్రహ్మణో యథా
ఆరణ్యకం చ వేదేభ్యః ఓషధీభ్యో యథాఽమృతం
ఇదం మహోపనిషదం చతుర్వేద సమన్వితం
సాంఖ్యయోగకృతాం తేన పాంచరాత్రాను శబ్దితం
నారాయణ ముఖోద్గీతం నారదో శ్రావయన్ మునీన్
బ్రహ్మణ స్సదసే తాత యథా దృష్టం యథా శ్రుతం
ఇదం శ్రేయ మిదం బ్రాహ్మ్య మిదం హిత మనుత్తమం
ముగ్యజుస్సామభి ర్జుష్ట మధ్వాంగిరసై స్తథా
భవిష్యతి ప్రమాణం వై ఏత దేవానుశాసనం
ఏతద్ధి సర్వశాస్త్రాణాం శాస్త్ర ముత్తమ సంజ్ఞితం
పంచరాత్ర మితి ఖ్యాతం నారాయణ ముఖోద్గతం
తస్మాత్ ప్రవర్తతే ధర్మాన్ మను స్స్వాయంభువ స్స్వయం
అన్యేషాం ధర్మశాస్త్రాణాం ఏత ద్యోని ర్భవిష్యతి. "

— (మహా భారతః

ఇట్లు - ఇతిహాస పురాణాము లన్నింటియందును పాంచరాత్ర శబ్ద ప్రశంస లనేకములు కలవు. ఇది సాక్షా న్నారాయణ ముఖోద్గతమైన ధర్మ మునియు, హితకర మునియు, సర్వశాస్త్రములలో నుత్తమమైన దనియు బ్రహ్మసభలో నారదుఁడు విని, మహర్షులకు వినిపించినియు, సకల ధర్మముల కిది కారణభూతమైన దనియు బహు విధములుగా ఈ పాంచరాత్ర శాస్త్ర ప్రాశస్త్యము స్తుతింపఁబడినది.

పాంచరాత్ర శాస్త్ర ప్రామాణ్యము

పాంచరాత్ర శాస్త్రము ప్రామాణికమా ? కాదా ? ఈ సంశయగ్రస్తులైన వారు - శ్రుతి స్మృతీతిహాస పురాణాదులు పాంచరాత్ర శాస్త్రము నెట్లు పూజ్య భావముతో నిర్వచించియున్న

ఉదాహరణ పూర్వకముగా నుల్లేఖింపఁబడిన 'శ్రీ పాంచరాత్ర రక్ష' 'ఆగమ ప్రామాణ్యము' 'తంత్ర శుద్ధాఖ్యము' మొదలగు గ్రంథములను శ్రద్ధతోఁ బఠించినచో, సంశయము లన్నియు సులభముగా సమసిపోగలవు.

ఆగమములు - దేశవ్యాప్తి

ఈ యాగమములు నేఁడు దక్షిణ భారతమున మాత్రమే విశేష ప్రచారములో నున్నవి. ఇవి కొన్ని మాత్రమే ముద్రణ భాగ్యము నందియున్నవి. ఇంకను చాలమువ్రిత గ్రంథములశేషములుగా నున్నవి. అవి యన్నియు తాళ పత్రలై గ్రంథములుగా నుండుట వలన, ప్రభుత్వ గ్రంథాలయములలో భద్రపరుపఁబడి యున్నవి. ముద్రిత గ్రంథములకు నేఁడు ప్రతులు లభించుట కూడ కష్ట సాధ్యము.

ఉత్తర భారతములో 'నారద పాంచరాత్రము' విశేష ప్రచారములో నున్నది. ఈ గ్రంథమునకు జన్మ స్థానము ఉత్తర భారతమనియే విమర్శకుల యభిప్రాయము. కాని, దీని యభివృద్ధి - ప్రచారములు దక్షిణ భారతమునందే విశేషముగా కాన నగును.

ఏది యెట్లున్నను, ఈ పాంచరాత్ర శాస్త్రము మొక మహా సముద్రము. ఇది యొక గొప్ప ఆధ్యాత్మిక సాహిత్యము. దీనినుండి మన పూర్వు లెంతయో ప్రయోజనమును సాధించి యున్నారు. వర్తమాన - భావి తరములవారును దీనినుండి బహుళ ప్రయోజనములను సాధింపవలసియున్నది. పాశ్చాత్య పండితు లనేకులు ఈ పాంచరాత్రాగమమున్పై అత్యంతము పూజ్య భావమును ప్రదర్శించి యుండుట గమనార్హమైన యంశము.

విమర్శకు లీ యాగమునందు దాదాపు 15 లక్షల శ్లోకములు (ఒకటిన్నర మిలియన్) ఉన్నవని తెలుపుచున్నారు. కాన నిది యెంత

విస్తృతమైనదో గ్రహింపఁదగును. ఈ యాగమమును సవ్యగ్రముగా పరిశీలింపఁదలచినవారు - తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయములో, మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయములో, అడయార్ గ్రంథాలయములో భద్రపరుపఁబడియున్న తాళపత్ర గ్రంథములను సావధానముగ పరిశీలింపవచ్చును.

సంహితలు - విషయ విభాగము

ఈ పాంచరాత్ర శాస్త్రమునకు సంబంధించిన సంహితలు నూట యెనిమిది కలవని చాల మంది అభిప్రాయము. కాని, ఈ సంఖ్య - మనకు నిర్దుష్టముగాఁ దోచదు. ఏల యన —

" అష్టోత్తర శతం భేదం శాస్త్ర స్యాస్య స్వయంభువ
ఆద్యం సనత్కుమారాఖ్యం చతుర్మూర్తి శ్చ సంహితా
నారదీయం చ కపిలం వారాహం శౌనకం తథా
విహగేంద్రం మహాతంత్రం పురుషోత్తమ మేవ చ
ఏతాని నామధేయాని అష్టోత్తరశతాని చ
ఇత్యేవం కీర్తితం విప్ర మార్కండేయేన మే పురా. "

ఇట్లు కపింజల సంహితలలో మఱి కొన్ని పేర్లు ఉదహరింపఁబడియున్నను, నూట యెనిమిది పేరు కానరావు. కొన్ని సంహితలలో 108 పేర్లు కలవు. మఱి కొన్నింటిలో కొన్ని పేరు మాత్రమే ఉదహరింపఁబడినవి. కొన్నింటిలో 108 సంఖ్య కూడ మించినది. ఉదాహరణకు - పద్మ తంత్రములో 112 సంహితల పేర్లు కనఁబడుచున్నవి. విష్ణు తంత్రములో 114 పేర్లున్నవి. హయశీర్ష సంహితలో 34 పేర్లు కలవు. జ్ఞానామృతములో 7 పేర్లు మాత్రమే ఉన్నవి. అగ్ని పురాణములో, 39 - వ అధ్యాయమునందు 25 సంహితల పేర్లున్నవి. ఇట్లు లెక్కింపగా, మొత్తము 110 సంహితల పేర్లు కానవచ్చుచున్నవి.

ఇవిగాక, 5 సంహిత లింకను గలవు. నేడు 215సంహితల పేర్లు సంపూర్ణముగా లభ్యమగుచున్నవి. రాధారాధనము, శ్రీరామార్చనము మొదలగు విషయములను బోధించు సంహితలను కొందఱు కృత్రిమము లందురు. అట్టి పాశ్చాత్య నిమర్శకుల వాదమును - ధర్మైక ప్రాణులగు భారతీయ తత్త్వజ్ఞులకు రుచింపవు. జర్మన్ దేశస్థుడును, అడయార్ లైబ్రరీ డైరక్టరు నగు స్కార్ట్రరు మహాశయుడు ఈ శాస్త్రమ్ముపై అమూల్యమైన పరిశోధన గావించెను 215 సంహితల పేర్లు తెలిసికొనఁగోరువారు - అహిర్బుధ్న్య సంహితకు ఆ స్కార్టర్ మహాశయుఁడు వ్రాసిన ఉపోద్ఘాతమును పరిశీలింపవచ్చును.

ఈ 115 సంహిలను మనము మూఁడు విధములుగా విభజింప వచ్చును. ఒకటి - మూల సంహితలు. ఇవి మిక్కిలి శుద్ధములును - ప్రాచీనములునై యున్నవి. రెండు - మూలాధారముగా ఉత్తర దేశమున నుద్భవించినవి. వీనిలో ఆధునిక విషయములు గల వనియు, నృత్రిమము లనియు, నవీనము లనియు విమర్శకుల యభిప్రాయము. ఈ యభిప్రాయమునే సత్యముగా భావించి, ఈ శాస్త్రమునందలి విషయ గౌరవమునకు న్యూనత నాపాదించుట చాల పొరపాటు. వీని పవిత్రతనుగాని, ప్రయోజనమునుగాని శంకించుట అజ్ఞుల లక్షణము. ఈ సంహితలలో - ఏది ప్రాచీనమో, ఏది నవీనమో నిర్ణయించుట సులువైన పని కాదు. ఏల ననఁగా - ఒక సంహిత పేరు రెండవ సంహితలో గూడ ఉల్లేఖింపఁబడినందున, ఏది ప్రాచీనమో, ఏది నవీనమో గ్రహించుట కష్టతరము.

ఇందు చాల సంహితలు అధ్యాయములుగా విభాగింపఁబడి యున్నను. ప్రతిష్ఠ, సంకర్ష, లింగ, సౌర - అను నాల్గు కాండలుగా హయశీర్ష సంహిత విభాగింపఁబడినది. జ్ఞాన, క్రియా కాండలుగా పారమేశ్వర సంహిత విభజింపఁబడినది. ఈ సంహితలలో కొన్నింట -

జ్ఞాన, యోగ, క్రియా, కార్యములను నాల్గు పాదములు కాననగును. ఇందు జ్ఞాన యోగములకంశెను, క్రియా – కార్య భాగములే బహుళ వ్యాప్తి నందినవి.

శ్రీమన్నారాయణునకు సంబంధించిన విజ్ఞానమే శ్రీ పాంచరాత్రాగమములోని ముఖ్య విషయము. పరాత్పరుడగు శ్రీ సుహృ విష్ణువు అచింత్యాద్భుత శక్తి యగు సుదర్శన రూపము గైకొని, తన దివ్య తేజమును, పర – వ్యూహ – విభవ – అంతర్యామి – అర్చా రూపములుగా విభజించి, పాంచరాత్ర సత్ర మొవర్చి, బ్రహ్మాండ మంతయు వ్యాపించెనని తెలుపబడినది. భాగవత పురాణమున వర్ణింపబడిన రీతిగా, పాద్మతంత్రము సృష్టిక్రమమును ఇంచుమించుగా వర్ణించినది.

వేదములలో పాంచరాత్రము

ఈ పాంచరాత్ర శాస్త్రము శ్రీ వైష్ణవ మత సిద్ధాంతమునకు పరమ ప్రమాణము. ఇది సర్వ ప్రాచీన శ్రీ వైష్ణవ మత సిద్ధాంతము లందును మూల గ్రంథము. ఇందలి ముఖ్య విషయములను మనము పది విభాగములుగా విభజింపవచ్చును.

౧. తత్త్వము ౨. మంత్రము ౩. యంత్రము ౪. మోక్ష ౫. యోగము ౬. మందిర నిర్మాణము ౭. ప్రతిష్ఠ ౮. సంస్కారాత్మకము ౯. వర్ణాశ్రమ ధర్మము ౧౦. ఉత్సవము అనునవి.

ఇట్లు వివిధ విషయ బోధకములగు సంహిత లకనేకములున్నను, విష్ణు తంత్రములో —

"అష్టోత్తర సహస్రాణి అష్టోత్తర శతాని చ
పాంచరాత్రాణి తంత్రాణి సంతి మే కమలోద్భవ ! "

అను భగవ ద్వచన మున్నందున, అష్టోత్తరశత సహస్ర సంఖ్యలో (1108) సంహిత లున్నవని గ్రహింప వగును. అయినచో - ఇవి యన్నియు భూలోకమున ప్రచారమునకు వచ్చినట్లు కానరాదు. వీనిలో, ప్రధానతమములైన 108 సంహితలు మాత్రమే భగవ న్ముఖోద్గతములై, మానవ లోకమునకు లభించుచున్నవి. పిదప, ఋషులు వివిధములుగా గ్రహించి, సంహితలుగా రచించియుండిరి. అట్టివే నేడు మనకు 215 సంఖ్యలో కానవచ్చుచున్నవి.

ఈ సంహితలను ప్రధానముగా రెండు విభాగములను చేయుట సమంజసము. ౧. తత్త్వము లేక దైవికములు. ఇవి సాక్షాత్తుగా భగవ న్ముఖోద్గతములైనవి. ౨. కారణ దైవములు. అనగా - భగ వంతుని మూలమున దెలిపికొనిన పిమ్మట, ఆ శాస్త్రముల నాధార మొనర్చుకొని ఋషులు రచించినవి. ఇవి, విధి - ప్రయోగ రూపము లలో నుండును.

కొన్ని కొన్ని విషయములలో - కొన్ని కొన్ని సంహితలు ప్రముఖస్థాన మలంకరించియున్నవి. మంత్ర సిద్ధాంత మార్గములలో - ఈ క్రింద పేర్కొనబడిన సంహితలు ప్రధానము లని భావింపబడు చున్నవి.

౧. పాద్మ తంత్రము ౨. విష్ణు తంత్రము ౩. కపింజల సంహిత ౪. బ్రహ్మ సంహిత ౫. మార్కండేయ సంహిత ౬. శ్రీధరసంహిత ౭. భారద్వాజ సంహిత ౮. పరాశర సంహిత.

అష్టోత్తరశత సంహితలలో - పంచరత్నములని ఈ క్రింది సంహితలకు ప్రసిద్ధి యున్నది.

౧. పాద్మ సంహిత ౨. ననత్కుమార సంహిత ౩. పరమ సంహిత ౪. పద్మోద్భవ సంహిత ౫. మహేంద్ర సంహిత.

కణ్వతంత్ర, అమృత తంత్రములను మఱికొంద ఱందు చేర్చు చున్నారు. వై పరమ సంహితి శ్రీభాష్యకారు లగు శ్రీమద్రామానుజులచే ఉత్పత్త్య సంభవాధికరణ భాష్యమున పరమ ప్రమాణముగా గైకొనఁబడి, వాఁచే రచింపఁబడిన నిత్య గ్రంథమున కిదియే మూలాధారమైనది.

అతి ప్రాచీనము లనియు, అత్యంత ప్రధానము లనియు ఎంచఁబడుచున్న కొన్ని సంహితల నామము లిట నూచింపఁబడుచున్నవి. వీనికి నవరత్నము లని ప్రసిద్ధి యున్నది. పాశ్చాత్య విద్వాంసులు సైతము వీనిని సర్వశ్రేష్ఠములుగా సంభావించుచున్నారు.

౧. పౌష్కర సంహిత ౨. వరాహ సంహిత ౩. బ్రహ్మ సంహిత ౪. సాత్త్వత సంహిత ౫. అహిర్బుధ్న్య సంహిత ౬. పారమేశ్వరసంహిత ౭. పద్మ సంహిత ౮. ఈశ్వర సంహిత ౯. జయాఖ్య సంహిత.

ఇవి నవరత్నము లనుట అతిశయోక్తి కానేరదు. ఇందలి 'జయాఖ్య సంహిత' అనేక సంహితలకు మూలభూతమైనందువలన, విషయ ప్రాశస్త్యముచేతను నాయకమణి యనఁదగియున్నది.

ఈ మహాశాస్త్రము మొదట మోక్షోపాయ ప్రదర్శనముగా - అనంత గరుడ విష్వక్సేనాదుల కుపదేశింపఁబడినది. అయినను, పిదప వారు వారి శిష్యుల కుపదేశించుండ, వారు తమ ప్రియ శిష్యుల కుపదేశించుచుండ, వారు తమ ప్రియ శిష్యుల కుపదేశించుచుండగా నిది యిట్లు పరంపరాగతమై, ఛందోబద్ధమై, అనుష్టుప్ శ్లోకములుగా

రూపొందినది. ఆ యా మహర్షులచే వారి వారి శైలిలో అనేక సంహితలుగా ఉపదేశ సౌలభ్యమున్నకై రచింపబడియున్నవి. ఇవి — ౧. దివ్య సిద్ధాంతము ౨. మంత్ర సిద్ధాంతము 3. తంత్ర సిద్ధాంతము ౪. తంత్రాంతర సిద్ధాంతము అను ప్రధాన ప్రభేదములతో లోకమునకు వెల్లడి యైనవి.

ఈ శాస్త్రమునందు వివిధ విషయములు ప్రసక్తానుప్రసక్తముగ ప్రవచింపబడినవి. వేదాంతము, యోగము, పాకము, శిల్పము, జ్యోతిషము మొదలగు ఉత్తమ శాస్త్రీయ విషయము లెన్నియో ఇందు ప్రతిపాదింపబడినవి. ముఖ్యముగా - విష్ణ్వారాధన విధానములు, ఆలయ - మంటపాది నిర్మాణములు, ఉత్సవ విశేషములు, ప్రతిష్ఠా విధులు, యంత్రోద్ధరణములు, మంత్ర పురశ్చరణములు, ప్రాయశ్చిత్తములు, శాంతి పౌష్టిక కర్మలు, కామ్యకర్మ సాధనములు ఇందు విశదీకరింపబడినవి. వీనికి అంగభూతములుగా - భూగోళ విజ్ఞానము, ఖగోళ విజ్ఞానము, రత్న పరీక్ష, శిలా పరీక్ష, భూ పరీక్ష మొదలగు ప్రకృతి శాస్త్ర సంబంధములైన పెక్కు విషయములు నిర్దుష్టముగను, నిష్కృష్టముగను అచ్చటచ్చట నిరూపింపబడినవి.

సంహితలు - విషయ ప్రాశస్త్యము

ఇందు ఒక్కొక్క సంహిత ఒక్కొక్క విషయమును ప్రధానముగా మనకు బోధించుచుండును. మిగిలిన విషయములు అంగ భూతములుగా నుండును. **ముఖ్యము** - ఏదో నొక విషయమును కూలంకషముగా నెఱుంగవలెనన్న, కొన్ని సంహితలను బాగుగా పరిశీలించి, ఆ విషయమును గ్రహించవలసియుండును. ఆరాధన విధానమునకు విష్ణు,

పాంచ్మ, కపింజల సంహితలు ఆధారముగా నైకొనఁబడుచున్నవి. కొందఱు మఱికొన్ని సంహితలను స్వీకరింతురు. విష్ణ్వాలయముల యందలి నిత్యోత్సవ విధానములు, బ్రహ్మోత్సవాదులు, ప్రతిష్ఠా విధులు ఈ యాగమముల ననుసరించియే నేఁడు దేశమున జరుపఁబడుచున్నవి. కపింజలాది సంహితలు కొన్ని ఆరాధన మార్గములను బోధించును. పురుషోత్తమ సంహితలో నూతన విగ్రహ ప్రతిష్ఠలకు సంబంధించిన విధానము లన్నియు విపులముగా గలవు. విష్ణు సంహితలో – విష్ణు దీక్షాపరాయణు లగుట, అర్చనాది విధానములు, ఉత్సవములు, ప్రాయశ్చిత్తములు, ధ్యానాదులు, కామ్యకర్మ సాధనములు మొదలగునవి బోధింపఁబడును. విష్ణు తిలక సంహితలో – మహా మంత్రోపాసనలను, ముఖ్యముగా అష్టాక్షరీ మహా తంత్ర పురశ్చరణాదికము, దానికి వలయు నియమములు మున్నగునవి తెలియనగును. పరాశర సంహితయు మంత్ర శాస్త్ర గ్రంథమే. ఇది వివిధ మంత్రములు, పురుష సూక్తాదులకు పురశ్చరణాదికములు, కేశవాది చతుర్వింశతి మూర్తులకును – ఇతర విష్ణు పరము లగు అనేక మంత్రములకును జపాదికముల నెఱింగించును. దేవాలయ మెట్లుండవలయును ? అర్చకు లెందఱు ? వారికి జీవనోపాధి యెట్లు ? ఈ మొదలగు ఆలయ పరిపాలనా విధానములు, వాని లక్షణములు పరమ పురుష సంహితలో నిరూపింపఁబడినవి. అహిర్బుధ్న్య సంహితలో – నారాయణాస్త్రమును సాధించుట, వివిధాస్త్రములు సుదర్శనమున కంగములుగా నైన విధానము ఈ మొదలగు విషయములు కాననగును. సృష్టి క్రమ విధానములు గూడ ఇందు రమణీయముగ వర్ణింపఁబడినవి. శ్రీమద్రామాయణమున విశ్వామిత్రుఁడు శ్రీరామ లక్ష్మణుల కుపదేశించిన మహాస్త్ర సాధనము లన్నియు ఇందు గలవు. గారుడ సంహితలో – నైనతేయ సాధనము, విషవైద్య చికిత్సా విధులు విపులీకరింపఁబడినవి. భారద్వాజ సంహిత ముఖ్యముగా ప్రపత్తి యోగమును

ప్రతిపాదించును. జయాఖ్య సంహిత సర్వ విషయములను సంగ్రహముగా దెలుపును. పాద్మ సంహిత సృష్టి క్రమాదులను, సర్వ ద్వీప - ద్వీపాంతర విషయములను వర్ణించును. ఈ పాద్మ సంహితలో అమూల్య విషయము లనేకములు గలవు. సర్వ విషయములను ఇది సూచించును. ఈ సంహితను అధ్యయనము చేయని వారి ఆగమ జ్ఞానము అసంపూర్ణమే యగును. ఇట్లు సంహితలన్నియు అనేక విషయములను బోధించుచున్నను, ముఖ్యముగా విష్ణుపరములైన సకలారాధనములను, మంత్రోపాసనా విధానములను, విగ్రహ ప్రతిష్ఠలను, వైదికాచారములను నిరూపించుచుండును.

పాంచరాత్రము - వైష్ణవ మతము

ఇట్లు శ్రీ పాంచరాత్రాగమము భాగవత పురాణాయులును, పరమ వైదిక శిఖామణులును, మహానీయులు నగు శ్రీ వైష్ణవులకు ప్రాణప్రదమైన శాస్త్రమని బుజువగుచున్నది. ఈ శాస్త్రమే లేనిచో, వైష్ణవ మతము లేదని చెప్పుట అత్యుక్తి కానేరదు. వైష్ణవ మతమునకును, పాంచరాత్ర శాస్త్రమునకును మిక్కిలి సన్నిహిత సంబంధమున్నది. నిద్ర లేచినది మొదలు - మరల శయ్యా నధిరోహించు వఱకు నడచుకొనవలసిన విధుల నుపదేశించేటి కిదియే మూలాధారము. శ్రుతి స్మృతులలోని విషయములు సర్వ వర్ణ సామాన్యములు. శ్రీ వైష్ణవ మత దీక్ష, లేక - పంచ సంస్కారము, విష్ణ్వారాధన విధానములు, మహా మంత్ర పురశ్చరణాదికములు మొదలగు విషయములన్నియు పాంచరాత్ర శాస్త్రము నుండియే గ్రహింపవలసియున్నది. విష్ణు భక్తుల నిత్య నైమిత్తిక కామ్యముల కీదియే కల్పవృక్షమైనది. ఈ సంహిత లన్నియు ముఖ్యముగా - ఆచార, అనుష్ఠాన, ఆరాధన విధానముల బోధించుటకే కేర్పడినట్లు వానిని బాగుగా నవలోకించినచో నవగతము కాగలదు. ఈ యాగమ గ్రంథములలోని మిగిలిన విష

యము లన్నియు, పై వానికే పుష్టి గల్గించుట కేర్పడినవని గ్రహింప నగును. ఆచారానుష్ఠానములు రెండును ఆరాధనకు పుష్టి నిచ్చును. ఇట్టి శ్రీ పాంచరాత్ర మత వైభవ మంతయు, శ్రీమన్నారాయణుని దివ్య చరణారవింద సంసేవలలో, సందర్శనములలో విలీన మగు నని తెలియనగును.

౧. ఆచారము ౨. అనుష్ఠానము 3. ఆరాధనము అను మూడు ప్రధాన విషయములలో మొదటిది యగు ఆచారమున, శ్రీ వైష్ణవులు నిర్వర్తించవలసిన స్నాన సంధ్యాది నిత్యనైమిత్తికాది విశేష విధు లన్నియు ఇమిడియున్నవి. వీనిని బోధించుట కీ శాస్త్రము కొంత విస్తరించినది.

ఆలయములు - ఆరాధకులు

మంత్రానుష్ఠానము లేని మానవ జీవితము వ్యర్థము. మంత్ర జపము లేని అర్చకుని యారాధనము ఫల శూన్యము. అతడు రాధించు విగ్రహమునందు దైవ శక్తి శశవిషాణప్రాయము. మంత్రోపాసనా పరుడై, నియమపూర్వకముగా దేవతారాధనము చేయు మహనీయుని కుటీరమునూడ శ్రీరంగాది దివ్యక్షేత్రముల కంటెను మహా మహిమో పేతముగా విలసిల్లుచుండెను. ఆచారహీనులై, దంభాదులకు మంత్ర పురశ్చరణలు చేయుట నిరర్థకము. ఆరాధనము విధి విధానముగా ఒకే వ్యక్తిచే, కనీసము ఏకకాలమందైనను చేయఁబడుచున్నచో, అది విశేష ఫలవంతము కాఁగలదు. పూటకొక అర్చకుడు మారుచు చేయఁబడు ఆరాధనము కేవలము కార్యక్రమము నిర్వర్తింపఁబడినట్లు తృప్తి నొందుటకేగాని, ఆలయ మహత్త్వమునకు, ఫలసిద్ధికిని సాధకము కాఁజాలదు. నియమ పూర్వకముగా జప ధ్యానములు సల్పుచు, ఆచారవంతుడై, అర్చకుఁడు ఆలయమున ఆరాధన చేయుచున్నచో,

అట్టి ఆలయమందు మట్టిముద్దను నిల్పినను, అది మహా మహిమోపేత ముగాఁ గన్పడగలదు. అట్టి దేవతామూర్తులను అచంచల భక్తి భావముతో మూఁడు దినములు సేవించినచో – స్వప్న సాక్షాత్కారమును పొంది, అభీష్ట సిద్ధిని బడయగలరు. ఆచారవంతుఁడును – మంత్రోపాసనాపరుఁడును నగు అట్టి యర్చకుని ఆశీర్వాద బలముచే, దేశము సుభిక్షమై, శాంతి సౌఖ్యములతో విలసిల్లగలదు. విగ్రహము లోహమైనను, పాషాణమైనను, పూజా బలముచే – తపోబలముచే – దైవ శక్తికి కేంద్రము కాఁగలదు.

" అర్చకస్య తపోయోగాత్ పూజాయాశ్చాతిశాయనాత్
ఆవిరూప్యా చ్చ బింబస్య సదా సన్నిహితోఽస్మ్యహమ్. "

అర్చకుని తపోబలము చేతను, అత్యధిక పూజాబలము చేతను, విగ్రహము శుభ లక్షణము గల్గియుండుట చేతను అచ్చట సన్నిహితుఁడనై యుండగల' నని భగవానుఁడు స్వయముగా వక్కాణించి యున్నాఁడు.

ఆలయములు - పరిపాలకులు

దేవాలయములు పై రీతిగా మహిమాన్వితములు కావలె నన్నచో, దైవ భక్తి గలిగిన ధర్మకర్తలుండుట యవసరము. కాని, నేఁటి వలె కేవలము పదవులకు ప్రాఁకులాడువారి సంఖ్య అధికముగా నున్నంత వఱకు – ఆలయములు లేశమైనను అభివృద్ధి నొందఁజాలవు. ఆలయ పరిపాలకులకు వలయునది ఆగమ జ్ఞానము గాని, ఆంగ్ల భాషా విజ్ఞానము కాదు.

అనుష్ఠానము - ఆరాధనము

ఆరాధకులు ప్రథమమున ఏ యే మంత్రముల నెట్లు సాధించి వశ మొనర్చుకొని సిద్ధులు కావలయునో, ఆ విధానము లన్నియు

పాంచరాత్ర శాస్త్రమున కానవగును. దేవాలయమున ముఖ్యమైనవి మంత్రానుష్ఠానము, ఆరాధనము. ఇవియే భక్తుల యభీష్టములఁ దీర్చుటకు సమర్థము లగును. మిగిలిన ఉత్సవాది కార్యక్రమము లన్నియు దేవాలయమునకు పవిత్రతా నాపాదించుటకును, ప్రజా సీకమును పరమార్థమునకు అభిముఖము చేయుటకును ఏర్పడియున్నట్లు తెలియ నగును.

మంత్రముల నెట్లు జపింపవలయును ? ఎన్ని పర్యాయములు జపింపవలయును ? మంత్రసిద్ధికి గురు లెవ్వి ? మంత్రము లే యే కార్యములను సాధింప గలవు ? మంత్ర జపములు చేయు వారికి సంభవించు విఘ్నము లెట్టివి ? దీక్షాభంగమైనచో ఎట్టి ప్రాయశ్చిత్తము చేసికొనవలయును ? ఈ మొదలైన విషయములను పాంచరాత్ర శాస్త్రము విశదముగా నుపదేశింపఁగలదు. మంత్రానుష్ఠాన పరులై, శాస్త్రజ్ఞాన శూన్యు లగు కొందఱకు గల్గిన దివ్యానుభూతుల కును – పాంచరాత్ర శాస్త్ర ముపదేశించిన విషయములకును సమన్వయ మేర్పడినందున, ఈ శాస్త్రమును మహర్షులు బాగుగా పరిశోధించి రసియు, వారి యనుభవమును ప్రకాశింపుకొనియే మనకిట్లు బోధించి రనియు విశ్వసించుట కవకాశము గల్గుచున్నది. ఈ విధముగా అనుష్ఠానమున్కై ఈ శాస్త్రము కొంత విస్తరించినది.

ఆలయమున నన్నింటికంటెను ముఖ్యమైనది ఆరాధనము. యోగము, ధ్యానము అను ప్రక్రియల కంటెను విలక్షణమై, సజీవమై, సార్థకమై, నయనానందకరమై, లౌకిక సాధనములతో చేయఁబడుచు, పండితులకు – పామరులకు – అందఱకు అలౌకికానందమును గల్గించునది అర్చనా విధానమే.

సగుణోపాసనము - ప్రయోజన విశేషము

నిరాకారుడగు ఈశ్వరుని ప్రార్థించుట ఎన్నటికిని పొసగదు. నిరాకారుడగు ఈశ్వరుని ప్రార్థించు స్థాయి వేత్తలకు ద్వైత సాక్షాత్కారము పరమ దుర్లభము. ఈశ్వరుడు నిరాకారుడైనను - భక్త జనుల కొఱకు సాకారుడగు చున్నాడు. అతడు పెట్టి యాకారములను ధరించునో, అట్టి యాకారములకే మహర్షులు చక్కని ప్రార్థనలు గల్పించిరి. అట్టి రూపముల నర్చించుటయే సగుణోపాసనము. భారతీయ సంస్కృతిలో - సగుణ నిర్గుణోపాసనలు రెండును సమానములే. నిర్గుణోపాసనము జ్ఞానులకు మాత్ర మే సుగమము; ఫలవంతము నగును. సకల జనులకును సగుణోపాసనయే పరమ ప్రధానము; పరమ ప్రయోజనకరము. ఆగమములు సగుణోపాసనకే ప్రాధాన్యము నిచ్చియున్నవి. విష్ణ్వారాధనమే పాంచరాత్ర శాస్త్రాంతర్గత పరమ రహస్యము. విష్ణ్వాలయములం దంతటను దక్షిణ భారతమున ముఖ్యముగా శ్రీ పాంచరాత్రగమ విధానము ననుసరించియే ఆరాధనములు జరుగుచున్నవి. భద్రాచలమునందలి యారాధన ననుసరించి ఆంధ్రప్రదేశమున కొన్ని ప్రాంతములందును, సైదరాబాదు పరిసర ప్రాంతములలో చాల వఱకును అర్చనా విధానములు జరుపబడుచున్నవి. వైఖానసాగమము ననుసరించి తిరుపతి మొదలగు కొన్ని పుణ్యక్షేత్రములలో ఆరాధనములు జరుగుచున్నవి. ఇట్లు విభిన్నారాధన విధానములకు ఆలయములు కావలయును. విగ్రహములు కావలయును. వీనికి ఆలయ నిర్మాణయోగ్య ప్రదేశము, నిర్మాణ విధానము, వాస్తు విషయములు, శిలా పరీక్షలు, భూపరీక్షలు, శిల్ప శాస్త్ర విషయములనేకము లుద్భవించినవి. వీనిని విశదీకరించుటకే శాస్త్రము విశేషముగా విస్తృతిఁజెందినది.

పాంచరాత్ర శాస్త్రము - దేశాభ్యుదయ సాధకము

ఈ పాంచరాత్ర శాస్త్రము దేశాభ్యుదయమును సాధించుటలో మిగుల సమర్థనీయమైనది. ఈ శాస్త్రములలో ఉత్తమోత్తమమై, పాంచరాత్రాగమము మన భారతీయ సంస్కృతికి ఆత్మభూతమైనది. భారతీయ నాగరికతకు పరాకాష్ఠయనఁదగిన మూర్తి పూజా విధానము బోధించు వానిలో సత్ప్రవృత్తమైనది. మనుజులు లేకున్నచో గృహమునకు శోభ కలుగదు. ఆలయము లేకున్నచో గ్రామమునకు సౌందర్యము లేదు. గ్రామమునకు, దేశమునకు ఆలయము ఆత్మవంటిది. యంత్రశాలలు భౌతిక శక్తికి కేంద్రము లైనట్లు - ఆధ్యాత్మిక శక్తికి ఆలయములే బలమైన కేంద్రములు. భారత జాతీయ జీవనమున ఆధ్యాత్మిక శక్తికిఁ గల స్థానము ప్రజ లందఱికిను సుస్పష్టమే. ఆలయములు నూతన సృష్టితో ప్రస్ఫోటంపఁబడినచో - భారత జాతీయ జీవనము కలుషిత్వమై, పాశ్చాత్య నాగరికతకు పరుగు లిడగలదు. పాఠశాలలు, వినోదశాలలు, క్రీడామందిరములు ఉత్తమ సంస్కృతీ నిర్మాణమునకు, సాధనకు హేతుభూతములు కాఁజాలవు. విద్యావంతులు, విజ్ఞాననిధులు, పండితప్రకాండులు నగు వా రెట్లో ధర్మైక పరాయణులు కానే కాఁగలరు. కాని, నూటికి ఎనుబదివంతులుగల నిరక్షరకుక్షులును - జ్ఞానదూరులు నగు పామర - స్త్రీ - బాలాదులను ధర్మనిష్ఠము చేయుటకు దేవాలయమే దివ్య మగు ప్రాచీన సాధనము. ఇ త ర మతస్థులు, విదేశీయులు అనుసరించని వినూతన విధానములతో మన దేవాలయములు శోభిల్లుచుండును. సమున్నతములైన శిఖరముల తోడను, మహోత్తుంగములైన గోపురాగ్రములతోడను, నవం నవములైన శిల్పవిలసిత ప్రాకార కుండ్యాంతరార్భగ స్తంభాది వివిధాకృతుల తోడను, రత్న ఖచిత సువర్ణాభరణాధారులై జీవ కళలతో నొప్పు దివ్య సుందరములైన దేవతా మూర్తులతోడను తేజరిల్లు దేవాలయ మును గాంచినప్పుడు ఎవ్వని యాత్మ ఆనందకందళితము గాకుండును ?

దేవాలయములు - ధార్మిక దుర్గములు

వేదఘోషలకును, పురాణ శ్రవణములకును, హరికథా కాలక్షేపములకును, భరత నాట్యములకును, శాస్త్ర ప్రసంగములకును, వివిధ మహోత్సవములకును, శ్రవణానందకరములైన సంకీర్తనములకును, రుచ్యములగు దేవతా ప్రసాదములకును, భక్తుల యావేశములకును నిలయమై, సంసార దుఃఖసంతప్తులగు మహా జనములకు ఆత్మ సంతర్పణ మొనరించుచు, ఆధ్యాత్మిక శిక్షణ గఱపుచున్న దేవాలయముల మహా మహిమను సహస్రఫణాన్వితుడగు శేషుడైనను సమర్థముగా వర్ణింపజాలడు. ఇట్టి దివ్యాదర్శములతో ఈ యాలయమును మనకు ప్రసాదించు పాంచరాత్ర శాస్త్ర మెవనికి శిరోధార్యముగాకుండును ?

రాజువలె బోధించు వేదములును, హితులవలె బోధించు పురాణాదులును మానవులలో ధర్మ ప్రవృత్తిని సులభముగా గల్గింపజాలవనియే మన పూర్వులు వ్యంగ్య వైభవము గల కావ్యమార్గమునాశ్రయించియుండిరి. అట్లు, కేవలము విరక్తులగు వారికి మాత్రమే సాధ్యములగు జప ధ్యాన యోగాదులు సామాన్య ప్రజానీకమునకు ఉపయుక్తములు కావుజాలవనియే మన పూర్వులు చక్కని శిల్ప నిర్మాణములతో - మహోత్సవములతో నేత్రేంద్రియములను, హరికథలతో - సంకీర్తనములతో శ్రవణేంద్రియములను, ప్రసాదాదులతో జిహ్వేంద్రియములను, హోమ ధూమ గంధములతో - పుష్పమాలికా పరిమళములతో నాసికేంద్రియములను, మంద మారుతములతో - ప్రశాంత వాతావరణములతో త్వగింద్రియములను ఆనందము నొందించుచు, పంచేంద్రియతర్పణ మొనరించి, బాహ్య వ్యాపారముల

నుండి వానిని బంధించి, ఆధ్యాత్మిక మార్గ ప్రయోగాములుగా నొనర్చి, దైవ భక్తిని పెంపొందింపఁజేయు దేవాలయములను మనకు ప్రసాదించి యున్నారు.

ఆలయ భేదములు - ప్రభావ విశేషములు

దేవాలయములు దేశమున నేఁడు మూఁడు విధములుగా గనఁ బడుచున్నవి. అవి - శక్త్యాలయములు, శివాలయములు, విష్ణ్వాలయ ములు. ఇందు శక్త్యాలయములు మద్య మాంసాదుల కాకరములై, శిష్ట జనులకు జుగుప్సావహములఁ గల్గఁజేయుచున్నవి. శివాలయములు ఆకర్షణ శూన్యములై, ప్రతిభా రహితములై, ఉత్సవాదులు లేక భవకళ దక్కియున్నవి. ఇక ప్రధానముగా విష్ణ్వాలయములే ప్రజల నాకర్షించుటలో సమర్థములై, అత్యంత ప్రతిభా సంపన్నములై యల రారుచున్న వనుట అతిశయోక్తి కానేరదు.

రాజునకును, రాష్ట్రమునకును వృద్ధి గోరుచు, బ్రహ్మఘోషలు పలికి - 'సర్వే జనా సుఖినో భవన్తు' అని స్వస్తి వాచకములు చెప్పుచు, ఆలయములు ప్రజలతో - రాష్ట్రములతో - తమ సంబంధ మును దృఢతర మొనర్చుకొనుచున్నవి. ఈ యాగములు, ఈ యాలయములు లేకున్నచో - మన విజ్ఞానము, కళలు, ధర్మములు, ఆచారములు, జాతీయత నష్టప్రాయములై యుండెడి వనుట నిర్వివాదాంశము.

శ్రీ రంగాది పుణ్యక్షేత్రములు మన జాతీయైక్యతా బంధములను దృఢతర మొనర్చినవి. ఆలయములలో శిల్పము, నాట్యము, భాషలు, శాస్త్రములు, వేద పురాణాదులు పోషింపఁబడినవి. ఆలయములలో సంస్కృత పాఠశాలలే లేకున్నచో, యేనాఁడో దేవభాష నష్టమై

యుండెడిది. మన భవిష్యత్తును తీర్చి దిద్దుటకై ఆలయములు గొప్పగా సేవఁజేసియున్నవి. అట్టి యాలయములను ప్రవర్తింపఁజేయు సూత్ర ములే మన పాంచరాత్రాగమములు. కాని. నేఁ డీ శాస్త్ర నిపుణులు తమ భవిష్యత్తుపై దివ్య స్వప్నములు గాంచలేకున్నారు. పర భాషాంగనా వ్యామోహా విషబంధముల నుండి భారతీయ మహాజనుల దివ్యాత్మకు విముక్తి లభింప నంత వఱకును ఈ దుర్దశ మనకు తప్ప దనియే భావింపనలసివచ్చుచున్నది. యావ ద్భారత ప్రశస్తి గత ఈ పాంచరాత్ర మహా వృక్షము సర్వ కాల సర్వావస్థలయందును నిరా బాధమై జీవించుగాక !

కృతజ్ఞత

శ్రీ యామున – రామానుజులు, వేదాంతదేశికాది మహా నీయులు, పిళ్ళలోకాంజీయరు మొదలగు ప్రవక్తలు, తాతాచార్య – రామానుజాచార్య – రంగభట్టాది మహా విద్వాంసులు, డాక్టరు – యస్. ఆట్టో స్కాడరు మున్నగు పాశ్చాత్య విద్వాంసులు, నృసింహా భట్టరు, అళహసింగరుసూరి, శ్రీ వైకుంఠ దీక్షిత, వైద్యనాథ దీక్షిత వైదిక సార్వభౌమాది లనేకులు ఈ మహాశాస్త్రమును బాగుగా పరిశోధించి, ఎల్లఱకు సులభముగా బోధపడుటకై వ్యాఖ్యానములు, ప్రయోగ గ్రంథములు, దీపికలు, భాష్యములు మున్నగు వానిని రచి చి, ఎంతయో మహోపకారము గావించియున్నారు. వారి కీ సందర్భమున కృతజ్ఞతఁ దెల్పుట మన విధియై యున్నది.

నివేదన

ఈ రీతిగా – దేశమునకు, జాతికి, సంస్కృతికి, మతమునకు పరమ ప్రయోజన సాధనమైన ఈ పాంచరాత్ర శాస్త్ర వైభవము నెల్ల ఱును గ్రహించి, ఐహికాముష్మిక సుఖ సాధనకై శాస్త్రము నుజ్జీవింపఁజేసి, లోక కల్యాణ సంధాయకు లగుదురుగాక !

o)—(o

శ్రీ వైష్ణవ మత వైభవము

'విద్యాభూషణ - సాహిత్యరత్న - వేదాంతరత్న - పండిత శిరోమణి - మహా విద్వాన్,

శ్రీమాన్ పండిత - వేదాంతం జగన్నాథాచార్యులు

★ ★ ★

మంగళాచరణము

" ప్రతద్విష్ణు స్స్తవతే వీర్యేణ
మృగో న భీమః కుచరో గిరిష్ఠాః
యస్యోరుషు త్రిషు విక్రమణేషు
అధిక్షియన్తి భువనాని విశ్వా. "

— (ఋగ్వేదము : 1-154-2.)

శ్రీ వైష్ణవ మతోదయము

శ్రీ వైష్ణవ మతము అతి పురాతనమైనది. ఇది - నారాయణీయ మత మనియు, విశిష్టాద్వైత మత మనియు వ్యవహరింపబడుచున్నది. ఈ మతములో ప్రధాన దైవము శ్రీ మహావిష్ణువు. అందువలన - ఈ మతము అన్వర్థనామధేయము గలదై, శ్రవణ మాత్రమునే ఆస్తికుల హృదయ ప్రాంగణమున ప్రచారము చేయుచున్నది. సిద్ధాంతములను చవిజూడ నాసక్తి గల్గించుచున్నది. ఆ సిద్ధాంతములు మధుర భావములతో నొప్పారుచు, ఆశ్రితులకు బ్రహ్మానందమును చేకూర్చుచున్నది.

మహర్షులు - మతవ్యాప్తి

ఋషికుల గరిష్ఠుఁడగు వసిష్ఠ మహర్షి - ఈ వైష్ణవ మతమునే పరిగ్రహించి, శ్రద్ధాసక్తులతో సత్కారముల నందుకును ఈ మత ప్రాశస్త్యమును వెల్లడించి, సంతృప్తి నందెను. పర దేవతా పార పూర్ణవేత్త యగు పరాశర మహర్షియు - ఈ వైష్ణవ మతమునే ఆశ్రయించి, తన పౌరాణిక వాక్కులను, ఈ మతము నందలి తత్త్వ మహత్త్వమును వ్యక్తీకరించి, చరితార్థుఁడయ్యెను. బ్రహ్మ సూత్ర ప్రణేతయగు వేద వ్యాస మహర్షియు - విష్ణు సహస్రనామ సంకీర్తన, భగవద్గీతా తత్త్వ ప్రబోధములచే ఈ వైష్ణవ మత చైతన్యమునే తర తమ భావములు పాటింపక ప్రజాస్వీకమునఁ గల్గించి, గౌరవ భాజనుఁడయ్యెను. యోగికుల చక్రవర్తి యగు శుక మహర్షియు - ఈ వైష్ణవ మతము నందలి ప్రధాన సాధనము లగు భక్తి ప్రపత్తు లను భాగవత గాథల మూలమున హృదయంగమముగా లోకమున కుపదేశించి, పరమానందభరితుఁడయ్యెను. భగవన్నామామృత రస పాన వ్యసనుఁడగు వాల్మీకి మహర్షియు - తన వాఙ్ఝరీ లహరిని ప్రపంచమున ప్రసరింపఁజేసి, ఈ వైష్ణవ మతమునకే పట్టాభిషేక మొనరించి, శాశ్వత కీర్తి నార్జించెను. మునికుల మూర్ధన్యుఁడగు భృగు మహర్షియు - సర్వర్షి సమాదృత మగు తన నాయకత్వమున సర్వలోక ప్రచారము గావించి, సర్వతత్త్వములను సవిమర్శముగా సమాలోకించి, మహర్షి మండలములో - వైష్ణవ మతమునే స్థిరీకరించి, నన్నె కొక్కించి, వాసి గాంచెను. లోకత్రయ సంచారశీలుఁడగు నారద మహర్షియు, తన గానామృతముచే శిశు పశ్వాదులకుఁ గూడ శ్రేష్ఠ్యమున ఈ వైష్ణవ మతమునే హృదయ వేదికలయం దధిరోహింపఁజేసి, అఖండ యశమును సముపార్జించెను. ఈ రీతిగా - అతి పురాతనమై, దేవర్ష్యాదుల హృదయ సీమలలో విహరించు ఈ వైష్ణవ

మతము - భారత దేశమున నాటి నుండి నేటి వఱకు ప్రచారములోఁ గల వైదికములైన ఆస్తిక మతములలో మేటియై ప్రకాశించు చున్నది.

వైష్ణవ మత వాక్య వ్యుత్పత్తి

'వైష్ణవ మతము' అను వాక్యము - రెండు పదములతోఁ గూడి యున్నది. మొదటిది :— 'వైష్ణవ' అను పదము. రెండవది :- 'మతము' అను పదము. ఇందు 'వైష్ణవ' అను పదము — 'తస్యేదం' అను పాణినీయ సూత్రము (4-3-120) ననుసరించి, 'విష్ణో రిదం వైష్ణవమ్' అను వ్యుత్పత్తిచే, అది విష్ణువునకు సంబంధించిన మత మని స్పష్ట మగు చున్నది. ఈ విష్ణు శబ్దము - సువర్ణ, సుధాకరాది శబ్దముల వలె, స్వార్థమందలి మహత్వమును, సర్వ వ్యాపకత్వాకారమును ప్రబోధించుచు, సర్వేశ్వరునియందు రూఢమై యొప్పుచున్నది.

వేద ప్రామాణ్యము - వైష్ణవ మతము

మన భారతదేశము నందలి ప్రమాణములలో - ప్రథమ ప్రమాణముగాను, ప్రధాన ప్రమాణముగాను, ప్రబల ప్రమాణము గాను ప్రకాశించుచున్నది వేదము. ఆ వేదము - ఋగ్యజుస్సామాథర్వ ణములుగా చతుర్విధము. 'అనంతా వై వేదాః' అనునట్లుల, ఆ వేదము లనంతములుగా నున్నవి. అట్టి వేదము లన్నింటిలో - ఈ విష్ణు శబ్దము ఇతర పర్యాయ పదముల వలె గాక, అధిక ప్రచారము గలదై విరాజిల్లు చున్నది.

సర్వేశ్వరునకు మోక్షప్రదత్వము - ముముక్షూపాసత్వము - జగత్కర్తృత్వము (జగద్వ్యాపారము) - లక్ష్మీపతిత్వము మొదలగు అసాధారణ ధర్మము లనేకములు ప్రబోధించు సందర్భమున,

వేదములు తఱచుగా - ఈ విష్ణు శబ్దమును పురస్కరించుకొని చెప్పుటకే ప్రారంభించినవి. ఋగ్వేదములో - ఐతరేయ బ్రాహ్మణ ప్రారంభమున —

" అగ్ని ర్వై దేవానా మవమః, విష్ణుః పరమః
త దంతరేణ సర్వా అన్యా దేవతాః. "

అని యున్నది. దేవతలలో అగ్ని దేవత తక్కువ వాఁడనియు, విష్ణువు - దేవత లందఱికంటెను గొప్ప వాఁడనియు, వా రిరువురి మధ్యలో బ్రహ్మ రుద్రేందాది దేవత లందఱును నిలిచియున్నారనియు ఈ మంత్ర తాత్పర్యము. అదియునుఁ గాక, సావధారణ న్యాయముచే విష్ణువు నెప్పుడును - యే దేవతను బట్టియు తక్కువ వాఁడు కాఁడనియు, అగ్ని నెప్పుడును - యే దేవతను బట్టియు గొప్పవాఁడు కాఁడనియు, ఇతరులగు బ్రహ్మ రుద్రేందాది దేవతలువిష్ణువు కంటెను తక్కువవారనియు, క్రింది దేవతలకంటెను గొప్ప వారనియు పై వేద వాక్యము విశదీకరించుచున్నది. ఇందువలన, విష్ణువునకు పరమత్వమే (ఉత్తమత్వమే) కాని, అవమత్వము (అధమత్వము) లేదనియు, అగ్నికి అవమత్వమే (అధమత్వమే) కాని, పరమత్వము (ఉత్తమత్వము) లేదనియు గ్రహింపనగును. ఇట్లే, యజుర్వేదమునందలి పంచమ కాండములో పంచమ ప్రశ్నమున —

" అగ్ని రపమో దేవతానా విష్ణుః పరమః. "

దేవతలలో - 'అగ్ని - అవముఁడు; విష్ణువు పరముఁడు' అని యున్నది. ఇంకను యజుర్వేదములో నచ్చటచ్చట భంగ్యంతరముగ నిట్లే విష్ణు వై శిష్ట్యము విపులీకరింపఁబడియున్నది. యజుర్వేదములో నాల్గవ కాండమందలి నాల్గవ ప్రశ్నాంతమున —

" అస్యేశానా జగతో విష్ణుపత్నీ. "

అని యున్నది. ఈ వచనము - సర్వ ప్రపంచమునకు విష్ణుపత్నియే నియంత్రి (రాణి) యని తెల్పుచున్నది. ఇందువలన, విష్ణువే సర్వ జగత్తునకు నియంత (ప్రభువు) అని స్పష్టమగు చున్నది గదా! అదియునుగాక —

"సోఽధ్వనః పార మాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్."

అని కఠ, శాండిల్యోపనిషత్తులు - సమ్యాచీన విజ్ఞానశాలియై, ఇట్టివై చెప్పఁబడునట్టుల ప్రవర్తించెడు జీవుఁడు సంసారాధ్వపారభూత మగు పరమాత్మయైన విష్ణువు యొక్క స్థానమైన పరమ పదమును (మోక్షమును) పొందుచున్నాఁడని వ్యక్తీకరించుచున్నవి. ఇట్లు - తక్కిన వేదములు కూడ, ఈ విశేషములనే చేర్కొనుచున్నవి. కావున, విష్ణు సంబంధమైన వైష్ణవ మతమునకును వేదములే ప్రమాణము లనుట - సుస్పష్టము.

పురాణేతిహాసాదులలో వైష్ణవము

పురాణములు, ఇతిహాసములు ముస్సగున వన్నియు ఆఖ్యానముల మూలమునను, విధి వచనముల ద్వారమునను విష్ణు పరత్వమునే పల్కుచున్నవి. నిఘంటు కర్తలలో ప్రధానతముఁడు, ప్రాచీనుఁడు నగు అమరసింహుఁడు కూడ పర్యాయ వాచకము లగు శబ్దము లన్నింటికంటెను, విష్ణు శబ్దమును ముందుగా చేర్కొనుచు, వైదికాశయమును వెల్లడించుటయేగాక, ఆ పదముచే - అనేక భావములను ప్రబోధించుచున్నాఁడు. ప్రాజ్ఞులీ ప్రబోధములను గుర్తింపఁగలరు.

వైష్ణవ మతమే విశిష్టాద్వైతము

ఇట్లు సర్వ ప్రమాణములందును అగ్రగణ్యమైన వైదిక మగు ఈ విష్ణుశబ్దమును, తదర్థ మగు విష్ణు దైవమును పురస్కరించుకొని

వెలువడిన ఈ వైష్ణవ మతము - అద్వైతము యొక్క సర్వ వ్యాపకత్వముతోఁబాటు సర్వదేశ వ్యాపకత్వము కూడ కలదై, విశిష్టాద్వైత తత్త్వమును ప్రబోధించుచున్నది.

శ్రీ మహావిష్ణువే చిదచి ద్విశిష్టాద్వైత తత్త్వ మనియు, భక్తి ప్రపత్తులచే ప్రసన్నుఁడగు శ్రీ మహావిష్ణువే ఉపాయ మనియు, అపాకృత దోష విశిష్టుఁడగు శ్రీ మహావిష్ణువే ఉపేయ మనియు సంప్రదాయవేత్తలు సిద్ధాంతీకరించియున్నారు. ఇట్లు విశిష్టాద్వైత ప్రబోధకమై, దిన దిన ప్రవర్ధమానమై ప్రకాశించుచున్న ఈ వైష్ణవ మత సిద్ధాంతమునందలి కొన్ని ప్రధానాంశములు - ప్రకృత మిటనుట్టంకింపఁబడుచున్నవి.

శ్రీ వైష్ణవ సిద్ధాంత స్వరూపము

చిత్తు, అచిత్తు, ఈశ్వరుఁడు - అను మూఁడు పదార్థములు సత్యము లనియు, నిత్యము లనియు శ్రీ వైష్ణవ మతము సిద్ధాంతీకరించుచున్నది. ఇందులకు - వేదములను, వేదాంతములను ప్రమాణములుగా వేరొక్కొనుచున్నది. చిదచిదీశ్వరు లనఁబడు తత్త్వత్రయమును గుఱించి శాస్త్రకారులు - ఈ క్రింది రీతిగా వివేచించియున్నారు.

చిత్తు అనఁగా - జీవులు. 'జ్ఞానమున కాశ్రయభూతులు ఆత్మలు' అని వ్యవహరింపఁబడుచున్నారు. వీరు - నిత్యులు, ముక్తులు, బద్ధులు అని మూఁడు విధములుగా నుందురు.

నిత్య లనఁగా - ఎన్నఁడేనియు సంసార సంసర్గము లేక, జ్ఞాన సంకోచము లేక, పరమ పదమునందే నిత్య నివాసము జేయు ఆత్మలు. వారు - అనంత గరుడ విష్వక్సేనాదులు.

ముక్తులనఁగా - మొదట సంసార సంబంధము కలవారై, అనంతరము నివర్తింపఁబడిన సంసార సంబంధము కలవారు. అనఁగా - ఈ లీలా విభూతిలో ప్రాకృతములై, చతుర్దశ లోకయుక్తము లగు బ్రహ్మాండములయందు - అనాది కర్మబద్ధు లగు జీవాత్మలు ప్రారబ్ధము ననుభవించుచు, నిత్యములు - నైమిత్తికములు నగు భగవదాజ్ఞానుజ్ఞాకైంకర్యరూపములైన కర్మలను స్వప్రయోజనమున్నకై అచరించుచు —

" తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః. "

— (భగవద్గీత. 4-34.)

అను ప్రమాణానుసారముగ జ్ఞానము నార్జించి, కర్మజ్ఞానముల సంగము లుగా నిడుకొని, వివేక వివేకాది నియమయుక్తుఁడై, దర్శన సమాకారము - ప్రీతిరూపాపన్నము - అవిచ్ఛిన్న స్మృతిసంతాన రూపము నైన భక్తిని సముపార్జించి, ఆ భక్తినిఁగాని, లేక - గురూపసదన సంసిద్ధ మగు ప్రపత్తినిఁగాని ఉపాయముగా నైకొని, క్రమముగా - దేహావసానకాలమందు తన సుకృత దుష్కృతములను మిత్రా మిత్రులం దుంచి, హార్ద పరమాత్మానుగ్రహముచే ముక్తికి ద్వార భూత మగు సుషుమ్నానాడిని 1 ప్రవేశించి, ఆ నాడీ మార్గముననే

---

1. సుషుమ్నానాడిని గుఱించిన వివరణము :—

శరీరమునందు 101 ప్రధాన నాడులు కలవు. అవి - ప్రతి శాఖలతో, ఉప శాఖలతో గలసి 72, 72, 10, 201 నాడు లగుచున్నవని ఆనందగిరి పక్కాఁజించి యున్నాఁడు. కాని, తదితరుల అభిప్రాయములలో - అన్నియు 72,000 నాడులేయని. వీనిలో ప్రధానము లగు 101 నాడులకు నాభి కందమే ఉత్పత్తిస్థాన మని కొందఱు యోగులును. హృదయమే కేంద్రస్థాన మని మఱికొందఱు నిర్ధారణ చేసియుండిరి. ఏది యేమైనను - ఈ మొత్తము నాడులలో 101 నాడులే ప్రధానము లనియు,

దానిలో - ఇడా, పింగళా, సుషుమ్నా అను మూడు నాడులు అతి ప్రధానము లనియు, ఆ మూడు నాడులలో సుషుమ్నా నాడి అగ్రగణ్యమైన దనియు, ఈ నాడి-హృదయము నుండి బ్రహ్మరంధ్రము వఱకు వ్యాపించియుండు ననియు, ఇదియే బ్రహ్మనాడి యనియు అందఱును ఏకగ్రీవముగ నంగీకరించియే యుండిరి. ముక్త పురుషుడు పరమపదమునకు ప్రయాణము చేయు నాడి - ఈ సుషుమ్నా నాడియే యని, వేదాంతము ఘోషించుచున్నది.

బ్రహ్మరంధ్రమును భేదించుకొని బయలుదేరి, సూర్యకిరణముల ద్వారముగా అగ్నిలోకమున కేగి, దిన - పూర్వపక్ష - ఉత్తరాయణ - సంవత్సరాధ్యభిమాన దేవతలచేతను, వాయుదేవునిచేతను ముక్తి మార్గమందు గౌరవింపఁబడినవాఁడై, సూర్యమండలమును భేదించుకొని, సూర్యలోకమునకుఁబోయి, చంద్ర - విద్యుత్ - వరుణ - ఇంద్ర - ప్రజాపతులు అనఁబడు మార్గదర్శకులగు ఆదివాహక గణముచే సుపచరింపఁబడిన వాఁడై, ఆయా లోకముల నధిగమించి, ప్రకృతి మండల మనెడు లీలావిభూతికి - నిత్య విభూతికి మధ్య సరిహద్దుగా గల విరజా నదిని దాఁటి, సూక్ష్మశరీరమును వదలినవాఁడై, అచట - అమానవకర స్పర్శము వలన, అప్రాకృత దివ్యమంగళ విగ్రహమును - చతుర్భుజములును - బ్రహ్మాలంకారములును గల వాఁడై, ఇంద్ర - ప్రజాపతి అను నామధేయములు గల వైకుంఠ నగర ద్వారపాలకుల యనుజ్ఞచే శ్రీ వైకుంఠ నగరమును ప్రవేశించి, సర్వాలంకార సంశోభిత మగు గోపురమును దాఁటి, విరజ్మా నది అమృత సరస్సును, సోమవనమును, అశ్వత్థమును పరిశీలించి, పంచశత (500) దివ్యాప్సరోగణములచే నుపచరింపఁబడినవాఁడై, బ్రహ్మగంధాదులచే నలంకరింపఁబడి, అనంత గరుడ విష్వక్సేనాదులకు నమస్కరించి, వారిచే నాదరింపఁబడినవాఁడై, మహామణి మండపమును ప్రవేశించి, పర్యంక సమీపమునకుఁ జేరి, ధర్మాధిపీఠోపరికమలమున

అనంతునియందు విమలాది చామర గ్రాహిణులచే సేవింపఁబడుచున్న శ్రీ భూ నీళా సమేతుండును - శంఖ చక్రాది దివ్యాయుధోపేతుండును - కిరీటా ద్యపరిమిత దివ్యభూషితుండును, అఖిలహేయ ప్రత్యనీక కల్యాణ గుణాకరుండును నగు భగవంతుని దర్శన భాగ్యమును పొంది, వారి పాదారవిందములకు ప్రణమిల్లి, వారిచే కటాక్షింపఁబడినవాఁడై, సర్వదేశ సర్వకాల సర్వావస్థలచే సర్వవిధ కైంకర్యములయందు పరమానుర క్తితో నావిర్భవించిన గుణాష్టకముచే విరాజిల్లువాఁడై, ఉత్తరావధిలేని బ్రహ్మానుభవము కలవాఁడే ముక్తుఁడని, వేద వేదాంతములు స్పష్టముగా చెప్పుచున్నవి. కావున, భగవత్ప్రాప్తియే మోక్ష మనియు, మోక్షము గలవారే ముక్తు లనియు తెలియవలెను.

బద్ధు లనఁగా - అనాదికర్మబంధముచే అనువృత్త సంసారము గలవారై, చతుర్దశ భువనములతోఁ గూడిన బ్రహ్మాండ కటాహ మందు గల బ్రహ్మాది తృణ పర్యంత మగు జీవాత్మలు. అనఁగా - బ్రహ్మ, రుద్రుఁడు, సనక సనందనాది యోగులు, నారదాది దేవర్షులు, వసిష్ఠాది బ్రహ్మర్షులు, పులస్త్య మరీచి దక్ష కశ్యపాది ప్రజాపతులు, దిక్పాలకులు, ఇంద్రులు, మనువులు, అసురులు, పితృ దేవతలు, సిద్ధులు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు, విద్యాధరులు, వసువులు, రుద్రులు, ఆదిత్యులు, అశ్వినీదేవతలు, దానవులు, యక్షులు, రాక్షసులు, పిశాచములు, గుహ్యకులు మొదలగు దేవయోని విశేషులు, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాది జాతిభేదములతోఁ గూడిన వివిధ మానవులు, పశు పక్షి సరీసృప గుల్మ లతా వీరు తృణాధిభేదములు గల స్థావరములు - ఇటుల దేవ, మానవ, తిర్యక్, స్థావర భేదములతోఁ గూడిన జీవాత్మ లన్నియు - 'బద్ధులు' అని చెప్పఁబడుచున్నారు.

ఇట్టి బద్ధులు - బీజాంకుర న్యాయముగ, అనాదికాలము నుండియు ప్రవర్తించెడు అవిద్యా, కర్మ, వాసనా, రుచి, ప్రకృతి సంబంధులచే - గర్భ జన్మ బాల్య యౌవన జాగర స్వప్న సుషుప్తి మూర్ఛా జరా మరణాది రూపము లగు బహు విధములైన విచిత్రా నష్టలు గలవా రగుచు, అతి దుస్సహము లగు ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికము లనెడు తాపత్రయముచే అభితప్తు లగుచు, భగవదనుభవ విచ్ఛేదము గలవారును అగుచున్నారు. ఇట్టి బద్ధజీవులు - చతుర్దశ లోకములతో గూడిన ఈ బ్రహ్మాండమందే కాక, ప్రతి బ్రహ్మాండమునందును అసంఖ్యాకముగ నున్నారు. ప్రతి బ్రహ్మాండము - పదునాల్గు లోకములతో గూడి, ఉత్తరోత్తరము పదిరెట్లు గల సప్తావరణములతో నావరింపబడి, ఇవి యన్నియు భగవత్సంకల్పముచే జలబుద్బుదముల వలె నున్నవి. ఇట్టి బ్రహ్మాండములు అసంఖ్యాకములుగా నున్నవని పరాశరమహర్షి స్పష్టీకరించు చున్నాడు.

" అణ్డానాం తు సహస్రాణాం సహస్రా ణ్యయుతాని చ
ఈదృశానాం తథా తత్ర కోటి కోటి శతాని చ. "

— (విష్ణు పురాణము 1-7-27.)

బద్ధ జీవులలో - తిర్యక్ స్థావరములు గాక, ఇంద్రియసిద్ధమైన జ్ఞానము గల బద్ధాత్మలయందు శాస్త్రములు ప్రవర్తించుచున్నవి. తిర్యక్ స్థావరములయందు శాస్త్రములు ప్రవర్తింప నేరవు కాన, మానవులు ముఖ్యముగా శాస్త్రజ్ఞానమును పొంది, తదనుసారముగ ప్రవర్తింపవలసియున్నదని మహర్షులు ప్రబోధించి యున్నారు. ఇదు వలననే ఈ బద్ధజీవులు - శాస్త్రవశ్యు లనియు, తద్వశ్యు లనియు ఇరు తెగలుగా నుందు రని శాస్త్రకారులు చెప్పియున్నారు. శాస్త్ర వశ్యు లగు బద్ధులు - బుభుక్షువు లనియు, ముముక్షువు లనియు రెండు విధములుగా నుందురు.

బుభుక్షువు లనఁగా – ధర్మార్థకామమోక్షము లనెడు చతుర్విధ పురుషార్థములలో – ధర్మార్థకామము లనెడు త్రైవర్గిక పురుషార్థనిష్ఠులై యుండువారలు. ఐహికము లగు అనిత్య సుఖములయం దభిలాషగలవారుగాగాని, ఆముష్మికమగు స్వర్గాద్యనిత్య సుఖములయం దాకాంక్షగలవారుగాగాని ప్రవర్తించుచుండువార లని ఇందలి సారాంశము.

ముముక్షువు లనఁగా – బుభుక్షువులు కోరెడు అనిత్య సుఖముల నొల్లక, నిరవధికమై – నిరవచ్ఛిన్నమై – అవాఙ్మానసగోచరమై – ఆముష్మికమైన నిత్యసుఖము నాకాంక్షించు వారలు. పర్వభేదముచే బుభుక్షువులును – ముముక్షువులును పలు తెరంగులుగా నుందురు.

అచిత్ అనఁగా – అచేతన ద్రవ్యము. ఇది – వికారముల కాలవాలమై, జ్ఞాన శూన్యమై యుండునది. చైతన్యము లేని దని దీని తాత్పర్యము. ఇది – శుద్ధసత్త్వము, మిశ్రసత్త్వము, సత్త్వశూన్యము అని మూఁడు విధములుగా నుండును.

శుద్ధసత్త్వ మనఁగా – రజస్తమోగుణములతోఁ గలియక, కేవల సత్త్వము గలది. ఇదియే 'నిత్య విభూతి' యని చెప్పఁబడు చున్నది. ఇది – నిత్యము, జ్ఞానానంద జనకము, కర్మ లేకనే భగవదిచ్ఛామాత్రమున – విమాన గోపుర మణ్డప ప్రాసాద ప్రాకారాది రూపములుగా పరిణమించినది. నిరవధిక తేజోరూపమైనది. నిత్యులకు, ముక్తులకు, భగవంతునకు నివాసస్థానమై యున్నది.

మిశ్రసత్త్వ మనఁగా – సత్త్వ రజస్తమోగుణములతోఁ గూడియుండునది. ఇది – బద్ధచేతనుల జ్ఞానానందములకు అవరోధకమై, విపరీత జ్ఞాన జనకమై, నిత్యమై, పరమాత్మకు క్రీడాపరికరమై ప్రదేశ

భేదముచేతను – కాలభేదముచేతను సదృశ వికారములను, అసదృశ వికారములను గలుగఁజేయుచుండును. ఈ అచిత్పదార్థమే మహాదాది వికారములకు కారణ మగుటచే, ఇది 'ప్రకృతి' యని చెప్పఁబడు చున్నది. ఈ అచిత్పదార్థము గుణత్రయాత్మక మగుటవలన, రజ స్తమోఽంశములచే బద్ధచేతనుల జ్ఞానానందములను అడ్డగించుచున్నది. ఇందువలన నిది – 'అవిద్య' యని చెప్పఁబడుచున్నది. ఈ అచిత్పదార్థము – పరిదృశ్యనూనములగు పరస్పర విలక్షణ విస్మయనీయ విచిత్రకార్యసృష్టిని చేయుటవలన – 'మాయ' అని వచింపఁబడు చున్నది. ఈ మిశ్రసత్త్వ మను అచిత్పదార్థము – 'మూల ప్రకృతి' యనియు చెప్పఁబడుచున్నది. సర్వేశ్వరునకు సృష్టిచేయవలెనను సంక ల్పము కలిగినపుడు, ఈ మూల ప్రకృతియందు – అవిభక్త తమస్సు, విభక్త తమస్సు, అక్షరము, అవ్యక్తము అను నాల్గు వికారములు క్రమముగా నేర్పడుచుండును. చివరి దగు అవ్యక్తావస్థవలన మహత్త్వా వస్థ యేర్పడును. ఆ మహత్త్వావస్థవలన, క్రమముగా అహంకార త్వావస్థ యేర్పడును. ఆ అహంకారమువలన – త్వక్ చక్షు శ్రోత్ర జిహ్వాఘ్రాణము లను జ్ఞానేంద్రియము లైదును, వాక్ పాణి పాద పాయూపస్థ లను కర్మేంద్రియము లైదును, మనస్సు అను దానితో పదునొకండు ఇంద్రియము లేర్పడును. క్రమముగా – శబ్ద స్పర్శ రూప రస గంధము లను పంచ తన్మాత్రలును, పృథ్వి వ్యాప తేజోవాయు రాకాశము లనెడు పంచ భూతములును యేర్పడును. ఇట్లు – ప్రకృతి, మహ దహంకారములు, పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రి యములు, మనస్సు, పంచ తన్మాత్రలు, పంచ భూతములు మొత్తము చతుర్వింశతి (24) తత్త్వము లేర్పడుచున్నవి. ఈ మిశ్రసత్త్వ మను అచిత్తు (ప్రకృతి) సర్వేశ్వరునకు క్రీడాపరికర మగుటచే – 'లీలా విభూతి' యనియు, శుద్ధసత్త్వ మను అచిత్తు – 'నిత్య విభూతి' యనియు వ్యవహరింపఁబడుచుండును. ఊర్ధ్వభాగముగ నిత్య విభూ

తియు, అధో భాగముగ లీలా విభూతి (ప్రకృతి) యు గలవు. ఈ రెంటికిని మధ్య భాగమున విరజానది యున్నది. ఈ విరజానది – ఈ రెండు విభూతులకును సీమగా వెలయుచుండును. ఈ విరజానదికి అధో భాగమున అంతము లేదు. ఈ విరజకు ఊర్ధ్వ భాగమున అంతము లేదు.

సత్త్వ శూన్య మనగా – కాలము. ఇది – సత్త్వశూన్యమే కాక, రజస్తమోగుణశూన్యము కూడ వగుటచే, గుణత్రయశూన్య మనియు గ్రహింపనగును. ఈ కాలము – ప్రకృతికి (అవ్యక్తము నకు), ప్రాకృతములకు, అనగా – ప్రకృతిసిద్ధము లగు పదార్థములకు పరిణామమును గలుగఁజేయుచున్నది. ఈ కాలము – కలా కాష్ఠా ముహూర్త అహోరాత్రాది రూపములుగా ప్రవర్తించుచున్నది. ఇది – నిత్య మని నిర్ణయింపఁబడినది.

ఈశ్వరుఁ డనగా – సర్వకల్యాణగుణాకరుఁడు, సర్వజ్ఞుఁడు, సర్వవ్యాపకుఁడు, సర్వాంతర్యామి, సర్వకారణభూతుఁడు నగు శ్రీ మహావిష్ణువు. ఇతఁడు మఱియు సర్వశేషిత్వము, సర్వేశ్వరత్వము, సర్వకర్మ సమారాధ్యత్వము, సర్వకర్మ ఫలప్రదత్వము, సర్వాధారత్వము, సర్వశబ్దవాచ్యత్వము, సర్వజ్ఞాన విషయత్వము ఇత్యాది లక్షణములను గల్గియున్నాఁడు. అదియునుంగాక, సూక్ష్మ చిదచిద్విశిష్టత్వ జగత్తునకు ఉపాదానకారణముగ నున్నాఁడు. సంకల్ప విశిష్టత్వ వేషముచే జగత్తునకు నిమిత్తకారణముగా నున్నాఁడు. ఈ సర్వేశ్వరుఁడు – పర వ్యూహ విభవ అంతర్యామి అర్చావతార రూపములచే అయిదు విధములుగ నున్నాఁడు.

పర స్వరూప మనగా – కాలకృత మగు పరిణామము లేని నిత్యవిభూతి యందు మహామణి మండపమున, విశాల జ్ఞానము గల

అనంత గరుడ విష్వక్సేనాదులచేతను, లీలా విభూతియందుండి, భక్తి ప్రపత్త్యుపాయములచే క్రమముగా అర్చిరాది మార్గమున నిత్య విభూతిని ప్రవేశించిన ముక్తపురుషులచేతను అనుభవింపఁబడుచు, శేషపర్యంక భాగమున దివ్యమంగళవిగ్రహ విశిష్టుఁడై, శ్రీ భూ నీళాసమేతుఁడై వేంచేసియుండు స్వరూపము.

వ్యూహ స్వరూప మనఁగా - లీలా విభూతికి సంబంధించిన సృష్టి స్థితి సంహారముల నిర్వహించుటకును, ముముక్షువులను - ఉపాసనచేయు జీవకోటిని అనుగ్రహించుటకును, వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధ రూపములుగా వేంచేసియున్న స్వరూపము.

విభవ స్వరూప మనఁగా - సాధుపరిత్రాణము, దుష్టశిక్షణము, ధర్మ సంస్థాపనము గావించి, లోకము ననుగ్రహించుట కవతరించిన శ్రీరామకృష్ణాది స్వరూపము.

అంతర్యామి స్వరూప మనఁగా - జీవాత్మలకు ధ్యానాసక్తి గల్గినపుడు ధ్యానగోచరుం డగుచు, అంతర్నియంతయై, హృదయ కమలమున నధివసించియుండు స్వరూపము.

అర్చా స్వరూప మనఁగా - ఆశ్రితుల కభిమతము లగు ద్రవ్య ములం దావిర్భవించి, విభవావతార వైలక్షణ్యముగా - దేశ కాలాది నియమములు లేక, సర్వ సహిష్ణువై, అర్చక పరాధీనుఁడై, ఆలయ గృహాదులయం దుండు స్వరూపము.

ఇట్లు - ఈ తత్త్వత్రయ విభాగ విశేషములను శాస్త్రములు వేనోళ్ళ చాటుచు, విజ్ఞాన సంపదను సమకూర్చునవియై ప్రకాశించు

చున్నవి. కావున, అభిలాష గలవారలు – ఆ యా శాస్త్రములను ఆమూలాగ్ర మవలోకించి, సమరసమున త ద్విజ్ఞాన సంపదను సము పార్జించి, సంతృప్తి నందవచ్చును.

జీవాత్మలు ప్రకృతి పరిణామము లగు శరీరములను ఇంద్రియ ములకు సహాయముగ గైకొని, వేదశాస్త్ర ప్రచోదితము లగు కర్మ జ్ఞాన భక్తి ప్రపత్తి యోగములను సాధనములుగ నిడుకొని, ఫలాపేక్ష వదలి, పరమాత్మ నుపాసింపవలెను. అట్టి యుపాసనములలో నుత్తీర్ణు లైనవారలు – క్రమముగ దేహావసానమున పుణ్య పాపములనుండి విముక్తులై, ప్రకృతి మండలమును దాటి, నిత్య విభూతికి చేరి, భగవ త్సన్నిధానమున నిత్యానంద మనుభవించుచుందురు.

ఫలాపేక్ష గలిగి, వివిధ సాధనోపాయములతో పరమాత్మ నుపాసించువారు – క్రమముగ దేహావసానమందు పుణ్యలోకములం జేరి, ఆ పుణ్యము క్షయ మగు వఱకును అచ్చట సుఖ మనుభవించి, పుణ్యశేషముతో మఱల ఈ లోకమున కేతెంచి, జనన మరణముల నొందుచు, జలకుండికా న్యాయమున ప్రకృతియందే యుండి, సుఖ దుఃఖముల ననుభవించుచు, సంసారబద్ధులై యుండగలరు.

శరీరేంద్రియముల సహాయ మందియు – వేదశాస్త్రముల నుల్లంఘించి, స్వేచ్ఛాచారులై, కామాచార కామవాద కామభక్ష ముల నాదరించుచుండువారలు – దేహావసానమున పాపఫలదాయకము లగు నరకలోకములంజేరి, అచ్చట పాపక్షయ మగు వఱకు నానావిధము లైన యాతనల ననుభవించి, పాపశేషముతో మఱల ఈ లోకమునుం జో, జన్మ జరామరణముల నొందుచు, ఈ ప్రకృతియందే సుఖ దుఃఖముల ననుభవించుచు, సంసారబద్ధులై యుండగలరు.

యోగ మార్గములు

ముముక్షువులకు సాధనోపాయములు బహు విధములుగా చెప్పఁబడియున్నవి. అట్టి సాధనోపాయములలో – కర్మ జ్ఞాన భక్తి ప్రపత్తి యోగములు అతి ప్రధానములైనవి; అత్యుత్తమములైనవి.

కర్మయోగ మనఁగా – గురూపదేశము వలన జీవాత్మ పరమాత్మల యాథార్థ్య జ్ఞానము గలవాఁడై, శక్త్యనుసారముగ చేయు దగినవి – ఫలాపేక్ష లేనివి – నిషేధింపఁబడినవి యగు కామ్య కర్మలను, నిత్య కర్మలను, నైమిత్తిక కర్మలను ఆచరించుట. అనఁగా – దేవపూజలు, తీర్థయాత్రలు, తపస్సులు, దానములు, యాగములు మున్నగు సత్కర్మలను చేయుట. ఇట్టి కర్మ యోగము – జీవుని యందుఁ గల పాపసంచయమును తొలగించి, జ్ఞాన యోగ ద్వారమునఁగాని, సాక్షాత్తుగాఁగాని భక్తి యోగమును గలుగఁజేయును.

జ్ఞానయోగ మనఁగా – కర్మ యోగాచరణముచే నిర్మలమైన అంతఃకరణము గలవాఁడై – 'నేను పరమాత్మకు దాసుఁడను; శేష భూతుఁడను; కింకరుడను' అను భావము గల్గి, ప్రకృతి (శరీరము)తో విడబడిన ఆత్మ స్వరూపమును గుఱించిన సమాలోచన విశేషము. ఈ జ్ఞానయోగము – సాక్షాత్తుగా భక్తియోగమును గలుగఁజేయును.

భక్తి యోగ మనఁగా – వివేక వివేక అభ్యాస క్రియా కల్యాణ అనవసాద అనుద్ధర్షములనెడు సాధన సప్తక జన్యమై, యమ నియమ ఆసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యాన సమాధి రూపముచే అష్టాంగయోగయుక్తమై, తైల ధారవలె అవిచ్ఛిన్నమగు భగవద్విషయ స్మృతి పరంపరయే. ఇది క్రమముగా – దర్శన సమాకారమును, ప్రీతిరూపమును అగును. అటుల ప్రతి రూప మగు

భగవత్స్మృతియే భక్తి యని తాత్పర్యము. ఈ భక్తియే - వేదన మనియు, ధ్యాన మనియు, ఉపాసన మనియు చెప్పబడుచున్నది. ఇట్టి భక్తియే మోక్షమునకు ముఖ్య సాధన మని శ్రీ భగవద్రామానుజ యతిసార్వభౌములు సంభావించి, లోకమున కుపదేశించియుండిరి.

సాధన సప్తక వివరణము :

వివేక మనఁగా - జాతిచేతను, ఆశ్రయముచేతను, నిమిత్తము చేతను, కాలముచేతను దోషములేని ఆహారము వలన శరీర శుద్ధిని సంపాదించుట.

విమోక మనఁగా - ఇతరము లగు కోరికలు లేకుండుట.

అభ్యాస మనఁగా - అను క్షణము తన అభిమాన (ఉపాస్య) దైవమును జ్ఞప్తియం దుంచుకొనుట.

క్రియ యనఁగా - శక్తి సామర్థ్యముల ననుసరించి, ప్రతిదినము పంచ మహా యజ్ఞముల 2 నాచరించుట.

కల్యాణ మనఁగా - సత్యము, ఆర్జవము, దయ, దానము, అహింస మొదలగు గుణములు గల్గియుండుట.

అనవసాద మనఁగా - దైన్యము లేకుండుట.

అనుద్ధర్ష మనఁగా - అతి సంతోషము లేకుండుట. 3

---

2. 1. బ్రహ్మయజ్ఞము 2. దేవయజ్ఞము 3. పితృయజ్ఞము 4. భూత యజ్ఞము 5. మనుష్యయజ్ఞము అనునవి పంచమహా యజ్ఞములని చెప్పఁబడును.

3. అతి సంతోషము కూడ విరోధము గల్గించునని శాస్త్ర తాత్పర్యము.

అష్టాంగయోగ వివరణము :—

యమ మనఁగా – అహింస, సత్యము, ఆస్తేయము. బ్రహ్మ చర్యము, అపరిగ్రహము అను ఆయిదు గుణములు గలిగియుండుట.

ఎప్పుడును – ఏ భూతమునకును ద్రోహము చేయకుండుటయే అహింస.

ఎటుల తలంచితిమో – ఎటుల చూచితిమో – ఎటుల వింటిమో – ఎటుల చెప్పితిమో అటులనే చెప్పుట, చేయుట సత్య మనఁబడును.

పర ద్రవ్యము నపహరింపకుండుటయే ఆస్తేయము.

పర స్త్రీలను సాభిలాషముగఁ జూచుట మొదలగు మైనిమిది విధము లగు దోషములు 4 లేకుండుటయే బ్రహ్మచర్యము.

విషయములకు (ద్రవ్యములకు) ఆర్జనము, రక్షణము, క్షయము, సంగము, హింస మొదలగు దోషములు సహజముగ నుండును గనుక, ప్రయత్నము లేక లభించినను, అశాస్త్రీయము లగు విషయ ములకు నిందిత ప్రతిగ్రహాది రూప మగు ఆర్జవదోష మేర్పడును. శాస్త్రీయములైనను – ఉపార్జితము లగు విషయములకు క్షయాది రక్షణ దోషము లుండును. ఇందువలన, విషయములను స్వీకరింప కుండుటయే అపరిగ్రహ మని తెలియవలెను.

---

4. 1. స్మరణము 2. కీర్తనము 3. కేళి 4. ప్రేక్షణము 5. గుహ్య సంభాషణము 6. సంకల్పము 7. అధ్యవసాయము 8. క్రియానిర్వృతి అనునవి బ్రహ్మచర్యమునకు అష్టవిధ దోషములు.

నియమ మనఁగా - శౌచము. ఇది - సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము అను అయిదు గుణములు కలిగియున్నది.

మృజ్జలాదులవలన బాహ్యశుద్ధి, చిత్తమలము లగు మద మాన అసూయాదులను తొలగించుట ఆభ్యంతర శుద్ధి. ఇటుల దేహశుద్ధి, మనశ్శుద్ధి కలిగియుండుటయే శౌచము.

ప్రాణరక్షకము లగు విషయములకంటె నధికము లగు విషయములను స్వీకరింప నిచ్ఛ లేకుండుటయే సంతోషము.

శీతోష్ణాది ద్వంద్వములను సహించుటయు - చాంద్రాయణాదుల నాచరించుటయు తపస్సు అని చెప్పఁబడును.

మోక్ష రూప సాధనాది ప్రతిపాదక శాస్త్రముల నధ్యయనము చేయుటయే స్వాధ్యాయము.

సర్వకర్మ సమారాధ్యుఁడును - పరమ గురువు నగు సర్వేశ్వరునియందు సర్వకర్మలను సమర్పించుటయు - సంసార బీజక్షయము నపేక్షించినవాఁడై, సర్వకాలములయందును సర్వేశ్వరుని సంస్మరించుచుండుటయును ఈశ్వర ప్రణిధానము.

ఇటుల యమ యోపాంగమునకు అయిదు గుణములును, నియమ యోపాంగమునకు అయిదు గుణములును కలసి పది గుణములు గల వాఁడే యోగమున కధికారి యగుచున్నాఁడు. యమమునకు పది గుణములు, నియమమునకు పది గుణములు మొత్తము ఇరువది గుణములు గలవాఁడే యోగమున కధికారి యని వసిష్ఠ మహర్షి, శాండిల్య మహర్షి మున్నగువారు నిర్ణయించియున్నారు. పతంజలి, పరాశరుఁడు మొదలగు మఱికొందఱు మహర్షులు - పది గుణములు గలవాఁడే

యోగమున కధికారి కాఁగలఁ డని వక్కాణించినారు. ఇట్లు యోగాధికారమును గుఱించి భిన్నాభిప్రాయములు గలవు, ఏది యెట్లున్నను, యోగము సభ్యసించువానికి మాత్రము కొన్ని అర్హత లుండుట అవసరమని ఇంచు మూలమున స్పష్టమగు చున్నది. ఈ వివరణమునకు ముందు - యోగాంగ విభాగములు ముఖ్యముగా తెలియఁదగి యున్నవి.

ఆసన మనఁగా - కూర్చుండుట. ఇట్టి ఆసనములు తొమ్మిది విధములుగా నుండును. అవి - (1) బ్రహ్మాసనము, (2) స్వస్తికాసనము, (3) పద్మాసనము, (4) గోముఖాసనము, (5) సింహాసనము, (6) ముక్తాసనము, (7) వీరాసనము, (8) భద్రాసనము, (9) మయూరాసనము అనునవి. ఈ ఆసనములలో - బ్రహ్మాసన ప్రభృతి, పద్మాసన పర్యంతముగాఁ గల మూఁడు ఆసనములు ఉత్తమాసనములుగా పరిగణింపఁబడుచున్నవి.

ప్రాణాయామ మనఁగా - ప్రాణాపానములకు సమానయోగము. ఇది - రేచక, పూరణ, కుంభకము లని మూఁడు విధములుగా నుండును. ఈ మూఁడును కలిసి, ఒక ప్రాణాయామ మగును.

ప్రత్యాహార మనఁగా - ఇంద్రియములను సర్వ విషయముల వలనను బలాత్కారముగ మఱలించుకొని, చిత్తమున కనుసరింపఁ జేసికొనుట. ప్రాణాయామముచేత వాయు జయమును, ప్రత్యాహారము చేత ఇంద్రియ జయమును యోగాధికారి పొందనగును.

ధారణ యనఁగా - ప్రాణాయామముచే వాయువును, ప్రత్యాహారముచే ఇంద్రియములను వశమొనరించుకొనిన యనంతరము, శుభాశ్రయమందు (సర్వేశ్వరునియందు) చిత్తమును లగ్నము చేయుట.

ఈ ధారణా విషయమున మహర్షులలో మత భేదములు కలవు. ధారణ: ధ్యాన రూపము లగు యోగాంగముల పూర్వోత్తర భావములందును మత భేదము లున్నవి. అవి – అనుభవమువలననే తెలియవలసి యున్నవి. అన్యథా అవగాహము కాఁజాలవు.

ధ్యాన మనఁగా – పరమాత్మను గుఱించి జీవాత్మ చేయు చింతనము. ఇది – నిష్కల మనియు, సకల మనియు రెండు విధములు. ఇట్టి ధ్యానమే తైల ధార వలె అవిచ్ఛిన్న మగు భగవ ద్విషయక స్మృతి పరంపరా రూపముగ నుండును. యోగాంగము లగు యమ నియమాదు లారింటి చేతను, ఉపాసనా సోపాన క్రమముచే నాహూత మగు భగవ ద్దివ్య మంగళ విగ్రహ విషయక మగు స్మృతి సంతతి యని దీని తాత్పర్యము.

సమాధి యనఁగా – ప్రత్యగాత్మకు పరమాత్మతో సమాన మైన అవస్థా విశేషము. అనుష్ణమైన పాషాణ శకలము సూర్యకిరణ సంపర్కమువలన ఉష్ణత్వము పొందు పగిది, పరమాత్మ సందర్శనము వలన జీవుఁడు శక్తియుక్తుఁడై, పరమాత్మ యగు శ్రీమన్నారాయ ణుని సాక్షాత్కరించుకొని, ఆనందము ననుభవించు చుండును. ఇదియే సమాధి యనఁబడుచున్నది.

ప్రపత్తి యోగ మనఁగా – న్యాసవిద్య. ఇతర సాధ్యము కాని స్వాభీష్ట సిద్ధికై, మహా విశ్వాసముతో – ఇది యొకటియే ఉపాయ మని విశ్వసించి, యాచించుట. స్వాభీష్టభూతుఁ డగు భగవంతుఁడు – ఇతర సాధ్యముకానివాఁ డగుచుండ, ఆ భగవంతుఁడే ఉపాయ మను ప్రార్థనా బుద్ధియే ప్రపత్తి యని తాత్పర్యము. ప్రపత్తికి సంబంధించిన అనుష్ఠాన ప్రకారము – 'ఉపేయభూతుఁడ వగు నిన్ను పొందుటకు, నిన్నే ఉపాయముగ వరించుచున్నాను' అని సంభావింపవలెను.

" నిక్షేపాపరపర్యాయ: న్యాయ: పంచాంగసంయుత:. "

అను ప్రమాణముచే, ఇదియే ఆత్మనిక్షేపరూపమైనది గాన, న్యాస విద్య యని చెప్పఁబడుచున్నది. ఈ న్యాస విద్యకు – ఆనుకూల్య సంకల్పము, ప్రాతికూల్య నివృత్తి, రక్షణ విశ్వాసము, గోప్తృత్వ వరణము, కార్పణ్యము అను అయిదు అంగములు కలవు. ఇవి – అంగములుగాను, ఆత్మనిక్షేపము అనునది అంగిగాను సంప్రదాయ వేత్తలు ప్రవచించుచున్నారు.

ఆనుకూల్య సంకల్ప మనఁగా – సర్వము భగవచ్ఛరీరభూతము గాన, సర్వ పదార్థము లగు చరాచరములయందు సర్వమునకు ఆత్మ భూతుఁడగు భగవంతునియందు ఆనుకూల్యము గల్గియుండవలె ననునిశ్చయము.

ప్రాతికూల్య నివృత్తి యనఁగా – తనకు స్వామి యగు భగవంతునియందెటుల ప్రాతికూల్యము లేకుండునో, అట్లే – సర్వ భూతము లందును ప్రాతికూల్యము లేకుండుట. ఇవి – విహితానుష్ఠాన, నిషిద్ధ పరిహారములలో పర్యవసించుచున్నవి.

రక్షణ విశ్వాస మనఁగా – 'దయాసాగరుఁడగు భగవానుఁడు శేషభూతుఁడ నగు ననున్ను తప్పక రక్షించి తీరు' ననుదృఢతర మగు నమ్మకము.

గోప్తృత్వ వరణ మనఁగా – కరుణా సముద్రుఁడైనను, శక్తి సంపన్నుఁడైనను ప్రభువైనను, ప్రార్థన చేయక రక్షింపఁడని తెలిసి చేయు "గోప్తారం త్వా వృణే" అను ప్రార్థనము.

కార్పణ్య మనఁగా – శ్రుత శీలాదులవలనఁ గలిగిన గర్వము యొక్క త్యాగము. అంగ సంపత్తి లేకయు, శక్తి లేకయు, అధికారము

లేకయు కలిగిన గర్వము యొక్క త్యాగము – దైన్య మనియు, కారుణ్య మనియు చెప్పఁబడును.

ఆత్మ నిక్షేప మనఁగా – స్వస్వాతంత్ర్య ప్రతిపత్తి నివృత్తి పూర్వకముగా భగవ దధీన ప్రతిపత్తి కలిగియుండుటయే.

పైఁజెప్పఁబడిన కర్మ జ్ఞాన భక్తి ప్రపత్తి యోగములు – అధికారి భేదముచే ప్రత్యేకముగ మోక్షసాధకము లనియు, గురు – లాఘవ వికల్పము లేదనియు, సంప్రదాయవేత్తలు స్పష్టీకరించు చున్నారు. అదియునుఁగాక, కర్మ జ్ఞాన భక్తి యోగములు మూఁడును – పరస్పర సాహచర్యముచే పురుషార్థ సాధకము లగు నని శాస్త్రములు వక్కాణించుచున్నవి.

"జ్ఞాన భక్త్యన్వితం కర్మ జనకాదిషు దృశ్యతే
కర్మ భక్త్యన్వితం జ్ఞానం ప్రాయేణ భరతాదిషు
కర్మ జ్ఞానాన్వితా భక్తిః ప్రహ్లాద ప్రముఖాశ్రయాః."

జ్ఞాన భక్తులతోఁ గూడిన కర్మయోగము – జనక మహారాజు మొదలగు వారియందు కనఁబడుచున్నది. కర్మ భక్తులతోఁగూడిన జ్ఞానయోగము – తఱచుగా జడ భరతాదులయందు కనఁబడుచున్నది. కర్మ జ్ఞానాన్విత మగు భక్తియోగము – ప్రహ్లాదుఁడు మొదలగు శ్రీముఖులయందు కనఁబడుచున్నది' అని పై శ్లోకము ధృవపఱచు చున్నది. అందుచే, అచ్చ టచ్చట – ఆ యా యోగములు ప్రాధా న్యము వహించుచుండునని గ్రహింపఁబడును. ఈ త్రివిధోపాయములే కాక, ప్రపదనమును నాల్గవ ఉపాయముగా లక్ష్మీతంత్రము చెప్పి చున్నదని సంప్రదాయవేత్తలుద్బోధించుచున్నారు. ఇటుల – వేద వేదాంత సిద్ధము లగు సిద్ధాంతములతో విరాజిల్లు ఈ వైష్ణవమతము – ఆస్తిక మతములలో నగ్రగణ్యమై, మహోదశ ననుభవించినది.

బౌద్ధయుగము - ఆస్తిక మత విపర్యయము

విధి బలీయము. కావుననే, బౌద్ధయుగము ఆస్తిక మతములకు పరీక్షా సమయ మయ్యెను. ఆ కాలమున బౌద్ధుల ధాటి తోర్వలేక, ఆస్తిక మతము లన్నియు - కూర్మపాద న్యాయమున స్వధర్మములను సంకోచించుకొని, గిరి గుహల యందు ప్రవేశించియు - ప్రయోజనము కానక, సత్పురుషుల హృదయ కుహరములలో డాగియుండవలసి వచ్చెను.

బౌద్ధ మతములో బుద్ధుడు ప్రధానమైన గురువు. ఉపదేష్ట ఒక్కడే యైనను - శిష్యు లనేకులు. అందు - మాధ్యమికుడు, యోగాచారుడు, సౌత్రాంతికుడు, వైభాషికుడు అను వారలు ముఖ్యులు. ఈ నల్గురు శిష్యులును - నాల్గు విధము లగు భావములు గలవా రగుటచే, బౌద్ధ మతము నాలుగు సిద్ధాంతములతో సిద్ధ మయ్యెను.

గురు వగు బుద్ధుడు శిష్యులకు - 'సర్వం శూన్యం' అని ఉప దేశించెను. ఆ సిద్ధాంతము నంగీకరించిన శిష్యుడు - మాధ్యమికుడు.

గురువునకు ప్రేమపాత్రుడు - యోగాచారుడు. ఇతడు గురూపదేశమును తన భావనలతో తర్కించుకొని, బాహ్యార్థశూన్యత్వ వాదిగా, విజ్ఞాన మాత్రాస్తిత్వవాదిగా తెలుపరయ్యెను.

సౌత్రాంతికుడు - గురువు యొక్కయు, గురువునకు ప్రధాన శిష్యుడైన యోగాచారుని యొక్కయు అభిప్రాయముతో నేకీభవింపక, తన భావనతో బాహ్యార్థానుమేయత్వవాది యయ్యెను.

వైభాషికుడు - గురువుయొక్కయు, వై శిష్యులయొక్కయు అభిప్రాయముల నంగీకరింపక, తన భావనలతో బాహ్యార్థ ప్రత్యక్ష వాదియు, సర్వాస్తిత్వ వాదియు నయ్యెను. ఈ బౌద్ధ మతము —

" సర్వం క్షణికం క్షణికం క్షణం క్షణం
స్వలక్షణం స్వలక్షణం శూన్యం శూన్యమ్. "

అను నాల్గు భావములు గల్గియున్నది. గురువు శూన్యవాది. ఆ గురువుకు ప్రధాన శిష్యుఁడు మాధ్యమికుఁడు. మిగిలినవా రాతనికి సోదరప్రాయులు. అందుచే - నాస్తిక మతము బహు ముఖములుగా విజృంభించెను. ఈ బౌద్ధులు - ప్రచండ తార్కికులై, వైతండికులు కూడ నగుచు, ఇతర మతములకు నిలువ నీడలేకుండ చేయసాగిరి.

ఆస్తిక మత పునరుద్ధరణము - శ్రీ శంకర యుగము

భగవదనుగ్రహముచే - అట్టి సమయమున శ్రీ శంకరాచార్యులవతరించి, ఆస్తిక మత విధ్వంసకు లగు ప్రచండ తార్కికులైన ఆ బౌద్ధుల నెదుర్కొని, వారి దుర్వాదములను వేద సాహాయ్యముతో - ప్రభు సాహాయ్యముతో - ఆత్మ శక్తి సాహాయ్యముతో ఖండించి, తుదకు వేద ప్రామాణ్యమును, బ్రహ్మాస్తిత్వమును స్థాపించి, వారి నందఱిని ఆస్తికుల గావింప సమకట్టిరి. బౌద్ధులు చెప్పెడు సర్వ శూన్యత్వ మిథ్యాత్వములను బ్రహ్మ పదార్థమునకు సత్యత్వ మను పేరుతో నొక నూతన మార్గము నేర్పఱచి, దానిని సుస్థిర మొనరించుటకై, రజ్జు సర్పాదులకు ప్రాతిభాసిక సత్యత్వ మను పేర మఱియొక సత్యత్వమును నెలకొల్పి, వారిని సంతృప్తుల గావించుచు, యేదియో యొక విధమున సత్యత్వమును వదలకనే, అట్టి ప్రచండ తార్కికులగు బౌద్ధులను గూడ తమ వశము జేసికొని, ఆస్తికులను చేయఁదలంచుచు, జ్ఞానయోగమును ప్రచారములోనికి దీసికొని రాఁగలిగిరి. అప్పుడప్పుడు - శిష్యోపదేశము లందును, ఆపత్సమయము లందును, గోవింద భజనము - లక్ష్మీనృసింహ స్తవము మొదలగు వానిచే భక్తి యోగమును ప్రబోధించుచు - 'వీరి హార్దభావ మిదియేనా ?' అను

కలకలమును ప్రజలలో గలిగించిరేకాని, అచిర కాలమున - ముప్పది రెండు సంవత్సరముల ప్రాయమునకే ఇంతటి తీవ్ర ప్రచారముం గావించి, దుర్వాది మతములను పారద్రోలి, లోకమున నాస్తిక మతమును తొలగించి, లోకమును నిత్యసత్పదార్థాభిముఖముగా నొనరించి, అనిత్య శరీరమును చాలించినైచిరి.

శ్రీ వైష్ణవ మత పునరుజ్జీవనము - శ్రీ రామానుజ యుగము

శ్రీ శంకరాచార్యుల యనంతరము సుమారు మున్నూరు సంవత్సరములకు శ్రీ భగవద్రామానుజాచార్యులవా రవతరించి, కేవలము బ్రహ్మమునకే కాక, ప్రకృతికి - జీవునకుం గూడ సత్యత్వమును సమకూర్చి, భక్తియోగమే ముక్తికి సాధనోపాయమనియు, ప్రపత్తి యోగము అతి లలిత సాధన మనియు నిరూపించి, విశిష్టాద్వైత సిద్ధాంతమును లోకమున పునఃప్రతిష్ఠించి, శ్రీ వైష్ణవ మతము నుద్ధరించి, ప్రజానీకమున కెంతయో మేలు చేకూర్చి, జగద్గురువులుగా విఖ్యాతి నార్జించిరి. ఈ రీతిగా వా రొనరించిన మహోపకారమునకు కృతజ్ఞతగా - తదనుయాయులు, శ్రీ వైష్ణవ మతమును 'శ్రీ రామానుజ మత' మను పేర ప్రశంసింపసాగిరి.

" పశు ర్మనుష్యః పక్షీ వా
యే వ వైష్ణవ సంశ్రయాః
తే నైవ తే ప్రయాన్త్యన్తి
త ద్విష్ణోః పరమం పదమ్. "

శ్రవణ భక్తి

'భాషా ప్రవీణ'

శ్రీమాన్ బృందావనం రంగాచార్యులు

★ ★ ★

[భాగవతము భక్తి తత్త్వమును నవ విధములుగ పేర్కొన్నది. అందులో అందరికి సులభ సాధ్యమైనది శ్రవణ భక్తి. ఈ శ్రవణ భక్తియే భాగవత కథకు మూలము. భాగవత కథా సూత్రమునకే కాక, సత్కథా శ్రవణ సూత్రమున సత్ఫల సిద్ధికి గూడ కారణ భూతమగ నిలిచెడి శ్రవణ భక్తి మహిమను విశదీకరించుటే ఈ పద్య రచనకు పరమ లక్ష్యము. — రచయిత]

శ్రీయుతు శ్రీనివాసు పద సేవలతో దనియించి - విశ్వ సం
శ్రేయము గూర్చు, భావ సరసీరుహముల్ వెలయింప బూను లే
ధ్యేయముగా శ్రమింపవలె దీక్షగ కావ్య కళా చరిత్రలో
సోయగముల్ వహింపవలె, సొంపులు పెంపు వహింపగావలెన్

జాతికి తారకమ్ములు - ప్రశస్త రుచు వ్వెలయించు వాఙ్మయ
జ్యోతులు తేజరిల్ల - మధుసూదన పాద సరోజ పూజలో
నూతన దివ్య శోభల ననూన విధాన వెలార్పగావలెన్
పాతకముల్ హరింపవలె - భక్తి బల మ్మధికమ్ము గావలెన్

నవ విధ లీల భక్తియె మనమ్మున కిమ్ము ఘటించి, సర్వదా
భవ భయ మోహ పాశవిక పాశములన్ విదళించు కావ్య వై
భవమున కిట్టి సల్లలిత పావన భావనకన్న మిన్నగా
చవి జనియింపజేయగల సార కథా సుధి యొండు గల్గునా ?

భాగవతము ప్రవచించిన
యోగము లన్నింట భక్తి యోగమునందే
రాగమ్మ్ము పెరుగ – నరులకు
త్యాగమ్మ్మును నేర్పె కవిత – తటియింపవలెన్.

ఆసలు రేగి మానవు డహంకృతిలో పశుభక్తి ముదరన్
దోసిలి నొగ్గి – పూజ్యు జన దూషణ సల్పుచు సంచరించినన్
గాసిలి – సర్వ లోక శుభ గౌరవ దూరుడు గాక మానునా ?
చేసిన దోస మూరక నశించున ? వీసము వాసి తగ్గునా ?

నిఖిల పాతక హరము – ఘనీభవించు
కలుష తమము నడంచెడి కాంతి రేఖ
శ్రీహరి ధ్యాన మొక్కటే జీవయాత్ర
జేయువారికి నిజము – పాథేయ బలము.

కలిమి బలమ్మ్ము గాని, అధికార మదోద్ధతి గాని, స్వర్ణ భూ
షల పస గాని మానవుల శక్తిని జెంపొనరింపజాలునే !
సలలిత లోకనాథ జపసంపద యొక్కటి దక్క, ధాత్రిపై
గల సకలమ్మ్ము నిక్కముగ కల్ల యె గాదె వచింప నెంచినన్ !

చిత్తము నిశ్చయమ్ముగ ప్రసిద్ధ మహర్షి గణాలసేవ కా
యత్తమె, సర్వ వేళల – వియత్తల సీమల బాకె కీర్తి సం
పత్తియు కాని, యొక్క క్షణమాత్రపు టజ్ఞత శాపమై పరీ
క్షిత్తున కీ పరీక్ష నిజె ! జీవికి కర్మ ఫలంబు తప్పునా !

మృగయాసక్తికి లొంగి, ఘోర వన సామీప్యంబునన్ సంచరిం
పగ నేలా ? చరియించె దప్పిగొని - శుంభ ద్దర్విమై మానిపై
పగ సాధింపగ తీవ్ర యత్న మొనరింపన్ బూనగా నేల ? పూ
నగ శాపమ్ము లభింప నేల ? నిది యెన్నన్ దైవ యోగ మ్మగున్.

కర్కశ కరాళ శాప ఖడ్గ ప్రహార
వితతి నెవరించిరో ! పరీక్షితుడు శ్రవణ
భక్తి బలమున - సత్కథా ఘటిమ కలన
భాగవత భవ్య సందేశ ఫలము వలన.

శుక ముఖ నిర్గళితము - భవ
సకలాఘ ప్రవిదళనము - శాంతి ప్రద ము
త్సుకతా జనకము - హరి గుణ
నికర శ్రవణమ్ము - పుణ్య నిలయ మ్మెప్పుడున్.

శృంగి ముని ప్రసాదిత విశేష మహాబల శాప శక్తి కిన్
క్రుంగెడి యుత్తరా సుతుడు ఘోరములన్ తరియించి మార్గ మే
బ్భంగిని గానజాలక విపత్తున మున్గ - శుకుండు జేరె స
త్సంగము సర్వ సౌఖ్య శుభసాధన మన్నది సత్య మూ నుల్.

" కలిపిన దోషంబు సర్వ సామాన్యమే
యని తెల్పుకొనుట నా కనభీమతము
మానవ ధర్మమ్ము మరచి యుగ్రుడనై
సంచరించిన మాట సత్యమయ్య !

భూ రమణుని డహం కారియైనన్ పద
భ్రష్టు డౌనను నీతి బాసినాడ !
మునికుమారుం డొసంగిన శాప మొనరించి
నట్టి దుష్కృతికన్న యధిక మనను

దయ వహింప ననర్హు డ తండ్రి ! సప్త
రాత్రములలోన మోక్షమార్గమ్ము గనెడి
ఆత్మ బలము నొసంగుమయ్యా ! క్షమించి "
యనుచు ప్రార్థించె శుకయోగి నా నృపుండు.

మనుగడపైన ప్రేమ యణుమాత్రము నా కిక లేదు – ధర్మ చిం
తనమున దప్ప – సర్వ జన తాప నివారణశీల ! మంచియో !
చెనటి తనమ్ము – మౌని గణశేఖరు కంఠమునందు సర్పమున్
బెనగొనజేయ – కిల్బిషపు వెల్లువ పొర్లెను మ చ్చ్రత్రరిపై.

ఒజ్జల పజ్జ నేర్పిన మహోజ్వల ధర్మము లాగ్రహాగ్నిలో
నజ్జయి మాడిపోవ – నయనమ్ము శిరమ్మున కెక్క – నిప్పతో
మజ్జన మాడు లీల మునిమండను గేలి యొనర్పజెల్లునా !
సజ్జన పీడనమ్ము కులిశ మ్మయి రొమ్ముల గ్రుమ్మకుండునా ?

శుకమునిచేవ ! మీ మధురసూ క్తి సుధన్ ప్రవహింపజేసి, మా
మక దురితమ్ముల న్గడిగి – మాధవ పాద సరోరుహద్వయా
ర్చకునిగ నల్పరే ! అనుచు సాగిలి మ్రొక్కె పరీక్షితుండు మా
నికి – కరుణాప్రపూర్ణు డవనీపతి మాధవ సంస్పృశింపగన్.

కలియుగమ్మున జన్మ గలుగుటే కర్మమ్ము
మనుగడ దోసాల మండపమ్ము
ప్రకృతి వాంఛలు మహా బలవత్తరమ్ములు
చురితాలయమ్ముల దుర్ఘటములు
సహనమ్ము గడియింప సాధ్యమ్ముగాని సం
పద - అందగారాని ప్రమానిపండు
శాంతి ఆకాశ పుష్పము దర్పణమ్మున
గనిపించి ముట్ట వీల్గాని నీడ

సుఖము సున్నకు సాటి - నిస్తులములైన
భోగముల్ నీటి బుడగలు భూమిపై - అ
సార సంసార సువిశాల సాగరాన
భక్తి యొక్కటి మించని పడవ బిడ్డ !

నవ విధమ్ముల భక్తి మానవుల కలుష
పంక జలధులనుండి కాపాడుచుండు
నిరుపమ ఫలప్రదము లన్నింటియందు
సర్వజన సులభ మ్మహో ! శ్రవణ భక్తి.

బంధుగులున్ చెలుల్ సుతులు భ్రాతలు - మానవ జీవితమ్ములో
నందడి మంచలే ! ఎవరి స్వార్థము వానిదె ! మానవుండు వీ
రందరి నమ్మి మోద మెటు లందగజాలును ? నిక్కమైన ఆ
నందము నందగల్గు శ్రవణ మొనరించి పవిత్ర సత్కథల్.

తెలిసి యొనర్చినన్ - తెలివితేటలు లేకయె సల్పినన్ - మహో
జ్వల మగు వహ్ని ముట్టుకొనువారిని గాల్చెడు భంగి - మానవున్
గలుషము మార్చునాడు సహకార మొనర్పజాల రెవ్వరున్
సులలితమైన భాగవత సూక్తిసువృష్టియె తప్ప భూవరా !

లెమ్మిక విస్మరింపుము మలీయ సభావచయమ్ము మోద ఖే
దమ్ముల జోలిమాలి సుపథమ్ముల సచ్ఛ్రవణమ్ము సల్పు భా
గ్యమ్ము గడింపు మిప్పటి యఘమ్ము హరింపగ సత్కథా ప్రసా
దమ్మును నీకు పంచి యెడెడన్ తరియింపుమయా ముదమ్మునన్ !

పావన గాథలన్ నరమభక్తి పఠించి, తదీయ ధర్మముల్
భావము నందు నిల్పుకొని భాగవతుల్ తరియించినారు - ల
క్ష్మీవిభు దివ్య భవ్య గుణ కీర్తనలోలె ఫలప్రదమ్ము ల
య్యా ! వివరింపగా సురుచిరార్థ కథా శ్రవణమ్ము లన్నియున్.

అంశావతార మాహాత్మ్యమ్ము - మురళీ వి
లోలుని నవరసోల్లోల లీల
ప్రహ్లాద బాలుని పావన చరితమ్ము
రుక్మిణీ ప్రేమైక రుచిర భక్తి
మొరవెట్టు కరిరాజు వర గాఢ విశ్వాస
మార్త రక్షణుడైన హరి పయనము
అంబరీషుని సమగ్రాతిథి పూజా ప
రత్వ, మక్రూరుని రాయబార

మొక్కొకటి యొక్కమాటేని యొడలు మరచి
శ్రవణ మొనరించినంజాలు - చదువువార
లందుకొనెడి ఫలమ్ముల నందగలవు
శ్రవణ భక్తికి గల మహా శక్తి వలన.

అని వివరించె భాగవత మందలి పుణ్య కథా విశేష మా
మునితిలకుండు కర్ణ యుగమున్ దనియించుచు రాజు గుండెలో
పెనగొనె భవ్య భక్తి లత విష్ణు కటాక్షము లబ్ధ మాయె, మె
చ్చిన కథ యాయె, పుణ్యజన జీవిత గాథల నిద్ది మాన్యమై.

* * *

తేనియలూరు భావములు - దివ్య మహార్ష విశిష్ట సంస్కృతిన్
గాన మొనర్చు వైఖరి - యుగమ్ముల వైష్ణవ వాఙ్మయ ప్రభన్
బూని ప్రచారమున్ సలుపు ముగ్ధ మనోహర దీక్ష కల్గి 'రా
మానుజ కీర్తి కౌముది' జయమ్మును గాంచుత పోడశాంశలన్.



భక్తి తత్త్వము

శ్రీ రావూరి ప్రసన్న సత్యనారాయణ, ఎమ్. ఏ.

★ ★ ★

అంజలి

" కృష్ణం కమలి పత్రాక్షం పుణ్య శ్రవణ కీర్తనమ్
వాసుదేవం జగద్యోనిం నౌమి నారాయణం హరిమ్. "

భాగవత వైశిష్ట్యము

భక్తితత్త్వమును ప్రతివాదించు ఆధికారిక గ్రంథములలో శ్రీమద్భాగవతము అగ్రగణ్యమైనది. ఇందు - వ్యాసుడు నిరూపించిన వైష్ణవ భక్తి సంప్రదాయమునకు మూలము - వేదములు, ఉపనిషత్తులు. తత్త్వ విషయమున వేదములకు, ఉపనిషత్తులకు నున్న భేదమే, ఉపనిషత్తులకును - భాగవతమునకును ఉన్నది. అంత మాత్రమే కాదు - వేదముల రెండొక్కయు, ఉపనిషత్తుల రెండొక్కయు స్వరూపముల రెండింటిని ఈ భాగవత మిముడ్చుకొనియున్నది. ఇట్లిముడ్చు కొనుటకు పూర్వము - అనౌచిత్యములం దొలగించి, ఆ రెంటికిని ఒక చక్కని సమన్వయమును సముకూర్చినది. ఆ మార్గమున వానికంటెను మఱి కొంత దూరము పురోగమించినది. అదియే భాగవత భక్తి సంప్రదాయము.

భాగవతము - పరబ్రహ్మము

భాగవత మతానుసారము వాసుదేవుడే పరబ్రహ్మము. అతడే పరమ పురుషుడు. అతడే భగవానుడు. సర్వమును అతని పరమై

నవే. ఆతని కంటె భిన్నమైన యణువు దృశ్యాదృశ్య ప్రపంచములం దేదియు లేదు.

" వాసుదేవపరావేదా వాసుదేవపరామఖాః
వాసుదేవపరాయోగా వాసుదేవపరాః క్రియాః
వాసుదేవపరంజ్ఞానం వాసుదేవపరం తపః
వాసుదేవపరోధర్మో వాసుదేవపరాగతిః. " — (1-2-28,29)

పై శ్లోకమునకు - భక్తావతంస మగు విష్ణుపురి వ్యాఖ్యానము మనకు సత్వర గ్రహణీయము. అతఁ డీ క్రింది విధముగా ననుచున్నాఁడు ;—

" ఆసన ప్రాణాయామాది క్రియాణాం, తద్ జ్ఞానోపాయత్వేన, తత్పరత్వే, యోగశాస్త్ర మపి, తత్పరమేవ. జ్ఞానస్య, తద్విషయత్వేన, తత్పరత్వే, జ్ఞానశాస్త్ర మపి తత్పరం: తపఃపదం జ్ఞానపరం, ప్రకరణాత్, తపోవత్, జ్ఞానస్యాపి శుద్ధి హేతుత్వాత్, స్వర్గాదీనాం తదానందాంశరూపత్వాత్, తత్పరత్వే, తదర్థక ధర్మ శాస్త్ర మపి, తత్పరమేవ. "

వేదములు, యజ్ఞములు, యోగములు, క్రియలు, జ్ఞానము, ధర్మము, గతి మున్నగు సర్వమును వాసుదేవ పరములే. ఈ వాసుదేవుఁడు - ఏకైకుఁడు; అద్వితీయుఁడు.

అతఁ డొక్కఁడే. ఇతరమును గూర్చినది - నిజ మగు భయము గాదు. ద్వితీయాభినివేశము వలన భయము గలుగుచున్నది. అది - అజ్ఞాన జన్యము.

వాసుదేవుఁడే శ్రీకృష్ణుఁడు. అతఁ డవతార పురుషుఁడైనను, స్వయముగ భగవానుఁడే.

" ఏతే చాంశ కలాః పుంసః కృష్ణస్తు భగవాన్ స్వయమ్. "

అను సూక్తియే ఇందులకు పరమ ప్రమాణము.

భాగవత భక్తి - వేదాంత భక్తి

భక్తి కతి సహజమును. ఏకైకమును, పరమ ధ్యేయము నైనది భక్తి యోగము. నారదుని పరభక్తి - వ్యాసునిచే అహైతుకభక్తి యని చెప్పబడినది. ఉత్తమభక్తి, నిష్కైతుకభక్తి, అకించనభక్తి, అనిమిత్తభక్తి, అనన్యభక్తి, ఊర్జితభక్తి, ఏకాంతభక్తి, ప్రగల్భ భక్తి, అమలభక్తి, దృఢభక్తి, తీవ్రభక్తి, అనపాయభక్తి, యోగ ప్రవృత్తభక్తి, యోగపూర్వకభక్తి, శ్రద్ధాభక్తి, ఆత్యంతికభక్తి, ఉచితభక్తి, ఆత్మప్రసాదభక్తి, నైష్ఠికభక్తి, పరాభక్తి, అనపాయ రతి, పరమభక్తి మున్నగునవి పై యర్థములందే యుపయుక్తములు.

భాగవత భక్తి, - కొంత ఆధునికులచే 'వేదాంత భక్తి' యని చెప్పబడునది. కాని, అట్లు ప్రత్యేకముగ జెప్పవలసిన యవసరము లేదు. కారణము - భక్తి యనినచే వేదాంతముతోడ గూడినది. ఆ దృష్టితో - నారద శాండిల్యాదులు చెప్పినది వేదాంత భక్తియే యగును.

భక్తి - ముక్తి

ముక్తి యనునది కేవలము భక్తుని యిచ్ఛపై నాధారపడి యుండును. భక్తియోగ ప్రాశస్త్యము, ప్రాముఖ్యము ఈ క్రింది విధముగా విశదీకరింపబడినవి :—

" స వై పుంసాం పరో ధర్మో యతో భక్తిరధోక్షజే
అహైతుక్య ప్రతిహతా యయాత్మా సంప్రసీదతి. " — (1-2-6.)

" అహైతుకీ ఫలాభిసంధి విపర్జితా అప్రతిహతా నిరంతరా, అవ్యభిచారిణీ చ. "
— (కాంతిమాలా టీక : 1-10.)

అహైతుకమును - అప్రతిహతమునైన భక్తియే పరమ ధర్మము. దాని వలన, ఆత్మ సుప్రసన్న మగునని దీని తాత్పర్యము.

ఫలాభి సంధి - విసర్జితము, నిరంతరము ననుటయందు - భక్తి యొక్క 'అసలు' స్వరూపము చాలవఱకును చెప్పఁబడినట్లే. జ్ఞానమున కది సాధన భూతము. సాధ్యము ననుటయు ప్రత్యక్షముగఁ గాకపోయి నను స్పష్టమే.

ఆత్మ లబ్ధికి భక్తితో మాత్రమే భగవంతుని భజింపవలయును. భగవన్నామ గ్రహణాదులచేఁ జేయు భక్తి యోగమే పరమ ధర్మము. భక్తి వలన భూతములు (ఆత్మలు) అమృతత్వమును బొందును. భయ రహితము - క్షేమ కరము నగు భక్తి యోగమే యుత్తమమైనది.

భక్తి యోగమునకు తపముగాని, జ్ఞానముగాని, కర్మముగాని, వైరాగ్యముగాని, దాన ధర్మాది శ్రేయఃకార్యములుగాని అక్కఱ లేదు. వాని యన్నింటివలన లభించు ఫలము - భక్తిచే సత్వరముగ సాధింప నగును. దాన వ్రత తపో హోమ జప స్వాధ్యాయ సంయ మాది వివిధ ధర్మములును భక్తి యోగమునకు సాధన భూతములు మాత్రమే. ధర్మము, సత్యము, దయ, విద్య, తపము మున్నగున వెన్ని యున్నను భక్తి లేక చిత్తము పవిత్రము కాదు. యోగముగాని, సాంఖ్యముగాని, స్వాధ్యాయముగాని, తపముగాని, త్యాగముగాని, యేదయైనను భక్తివలె భగవంతుని సాధింపఁజాలవు. జ్ఞానము, యోగము, కర్మము మున్నగున వన్నియు - భక్తి ముందు శక్తిహీనములే. ముకుందుని సంసేవించుటకు లభించిన చిత్త ప్రశాంతత - అను క్షణము కామ లోభ హత మగు యమాది యోగ పథముల వలన లభింపదు. బహిర్ధములయందు (కర్మకాండయందు) శ్రద్ధ వహించు వారు - విష్ణువును తెలియఁజాలరు. కర్మకాండ యనెడి బంధముచే బద్ధులైన వారు - అంధులచే నడపింపఁబడు అంధులవంటివారు. క్రతు వులచే సాధింపఁబడు ఐహిక భోగము లన్నియు నశ్వరము. అవి - మాత్సర్య జనకము లగుటవలన, అపవిత్రములు.

భగవానుడు భక్తులకు వలె యోగులకును అంత సులభ గమ్యుడు కాడు. శ్రేయఃప్రవాహమైన భక్తియోగమును వదలి, కేవలము జ్ఞానార్జనకై ప్రయత్నించువాడికి – చివరకు మిగులునది క్లేశము మాత్రమే. వాని పరిశ్రమ మంతయు – కేవలము వట్టిపొట్టు నందు బియ్యపు గింజల కొఱకై వెదకుట వంటిదే.

మానవ జన్మమును బొంది, కేవల తత్త్వ విషయక జ్ఞాన సముపార్జనమునందే కాలము గడపువారు – భగవదారాధనమునకుఁ గడంగనిచో నే మందుము ? వారు – భగవన్మాయాశక్తిచే సమ్మోహితులైనవారని యనవలసియున్నది.

నైష్కర్మ్యధర్మముఁ గూడియున్నను, అచ్యుతభావ వర్జితమైన జ్ఞానము శోభింపదు. అమలభక్తి వలన హరి ప్రీతుఁడగును. దానము గాని, తపముగాని, యజ్ఞముగాని, శౌచముగాని, వ్రతములుగాని కేవల విడంబనములే. హరితోషకమైనదే కర్మము. అతనిని దెలుపు నదియే విద్య. అతనిని దెలిసికొనినదే మతి.

'అసలు' యోగాభ్యాసబలమున సంప్రాప్తించు సిద్ధు లన్నియు – భక్తునకు అయాచితముగా వానియంతట నవియే లభించును.

" అథో విభూతిం మమ మాయా విరచితాం
ఐశ్వర్య మష్టాంగ మనుప్రపృత్తమ్
శ్రియం భగవతీం వా స్పృహయంతి భద్రాం
పరస్య మే తేఽన్వవతే తు లోకే. "

నా భక్తులు – నా మాయచే కల్పితములైన యైశ్వర్యమును, ద్ధులను గోరకపోయినను, వారి కవి సహజముగా సంప్రాప్తించు నని భగవద్వాక్యము.

యోగులుగూడ, భగవ దర్పితబుద్ధులై, భక్తిమార్గమువలననే పరగతిని బొందిరి. పూర్వము బహు సంఖ్యాకు లగు యోగులుగూడ, భగవ దర్పితేహులయి, నిజకర్మ లబ్ధమయిన భక్తిచే నుద్బుద్ధు లయి, శీఘ్రమే అచ్యుతుని పరగతిని పొందిరి.

కర్మమార్గము - భక్తికి నుపాయ మనుట యిట స్పష్టము. సుసమృద్ధార్చులు గలిగిన యగ్ని, కాష్ఠముల నెట్లు భస్మము జేయునో - అట్లే, భగవ దర్పిత - భక్తుని పాపములను సంపూర్ణముగ భస్మము జేయును.

" భక్త్యాఽహమేకయా గ్రాహ్య శ్రద్ధయాఽఽత్మా ప్రియ స్సతామ్
భక్తిః పునాతి మన్నిష్ఠా శ్వపాకా నపి సంభవాత్. "

— (11-14-21.)

'శ్రద్ధ గలిగిన భక్తివలననే నేను గ్రహింపఁబడదగిన వాఁడను. మన్నిష్ఠమైన భక్తి - శ్వపాకులనైనను పవిత్రులఁజేయు' నని భగవ ద్వచనము.

" అవిస్మితం తం పరిపూర్ణకామం స్వేనైవ లాభేన సమం ప్రశాంతమ్
వినోపసర్పత్యపరం హి బాలిశః శ్వలాంగులేనాతి తితర్తి సింధుమ్. "

— (6-9-22.)

పరిపూర్ణ కాముఁడైన భగవానుని గాక, త దన్యుని దరిజేరుట - కుక్క తోఁక పుచ్చుకొని సముద్రమును తరించుట వంటిది.

అకామత్వముతోనైనను, సర్వకామత్వముతోనైనను, మోక్ష కామత్వముతోనైనను, ఎట్లైనను భగవానుని భజింపవచ్చును.

మోక్షము సుఖ రూప మగుట వలనను, భక్తుఁడు దాని నను భవించువాఁడగుటవలనను, మోక్షముకంటె భక్తియే యధికతరమైనది.

శర్కరగా మాఱుటకంటె, శర్కరను భుజించుట యధికతరము - అధికతరానందదాయకము. శర్కర - శర్కరను భుజింపలేదు. భక్తుడు మోక్షమును గోరకుండుట కిదియే హేతువు.

భక్తి మార్గమున కన్నులు మూసికొనియైనను పయనింప వచ్చును. ఆత్మ లబ్ధి కొఱకు భగవానునిచే నుపదిష్టములైన యుపాయముల ననుసరించుచుండువు మానవుడు - ఎన్నడును సత్ఫలమును వీడడు. కన్నులు మూసికొని పోయినను, ఆతడు డిసుమంతయు మార్గమును దప్పడు - పతనము జెందడు.

యోగులకు బ్రహ్మసిద్ధి యందును, అఖిలాత్ములగు భగవానునియం దర్పింపబడిన భక్తికంటె శుభకర మగు పథము లేదు. భగవానునియందు ప్రయుక్తమైన భక్తి, శీఘ్రముగ అహైతుకమైన జ్ఞానమును జనింపజేయును. ఇట అహైతుక మనగా - శుష్క తర్కాద్యగోచర మని యర్థము.

ఇట్టి భక్తియోగము - యేమంత కఠినమైనది గాదు. చాల సులభమైనది. దీని కధికార నియమ మేమియు లేదు. సురలైనను, అసురలైనను, వానరులైనను, నరులైనను భగవానుని భజింపవచ్చును. అచ్యుతుని ప్రీతునిఁ జేయుటయం దేమియు నాయాసములేదు. హరి నుపాసించుటయందు ప్రయాస మేమియు లేదు. ముకుందుని ప్రీతికి - ద్విజత్వముగాని, దేవత్వముగాని, ఋషిత్వముగాని, విత్తముగాని, బహుజ్ఞతగాని యేమియును అక్కఱలేదు. దానముగాని, తపముగాని, యజ్ఞముగాని, శౌచముగాని, వ్రతములుగాని, భగవానుని ప్రీతికి అక్కఱలేదు భగవదారాధనకు - ధనాభిజనరూప తపఃశ్రుతౌజస్తేజ ప్రభావ బల పౌరుష బుద్ధి యోగము లేవియును అక్కఱలేదు.

భక్తికి జ్ఞాన కర్మములు అంగభూతములు, జ్ఞాన కర్మల కంటెను భక్తి శ్రేష్ఠతరమైనది. భక్తిమార్గమున, ఇంద్రియముల సహజ వృత్తిని నిరోధింప నక్కఱలేదు. ఇదియే భక్తి యోగము యొక్క సౌలభ్యము.

భాగవత సాంగత్య ప్రభావము

భక్తికి ఉద్బోధక కారణములలో ప్రప్రథమము ముఖ్యతమము, భగవద్భక్తుల సాంగత్యము. అనఁగా – సాధుసేవ, మహత్సేవ, సత్సేవ, భాగవతసేవ యని తాత్పర్యము. ఇట, సాంగత్య మనఁగా – దర్శనము, స్పర్శనము, సంభాషణము, సేవ మున్నగునవి.

" సతాం ప్రసంగా న్మమవీర్య సంవిదో
భవంతి హృత్కర్ణ రసాయనాః కథాః
త జ్జోషణా దాశ్వప వర్గవర్త్మని
శ్రద్ధారతి ర్భక్తి రనుక్రమిష్యతి. " — (3-25-25.)

నా శక్తి నెఱిఁగిన సాధువుల ప్రసంగమందు, నన్నుఁ గూర్చిన హృత్కర్ణ రసాయనము లగు కథలు వచ్చును. వాని వలన మోక్ష ప్రాప్తి హేతువు లగు శ్రద్ధయు, రతియు, భక్తియు ననుక్రమించునని సత్సాంగత్య మాహాత్మ్యమును భగవానుఁడే స్వయముగా ప్రవచించెను.

స్వర్గము కంటెను, మోక్షము కంటెను సత్సాంగత్య మధికము. భక్తుల సన్నిధియే యెట్టివారి నయినను పునీతులఁ జేయును. భాగవత సేవ వలన అమంగళము లన్నియు హత మగును. నైష్ఠిక భక్తి యుద్భవించును.

సాధు సంభాషణము – ఎట్టి మనస్తాపమునైన శీఘ్రముగఁ బోఁగొట్టును. భాగవతులఁ గూర్చిన స్మరణమే పవిత్రము చేయు

చుండ, ఇక వారి దర్శన స్పర్శ పాదశౌచాసనాదుల విషయ మేమని చెప్పవలెను ? సాధువులతోడి ప్రసంగము - మోక్ష ద్వారమును అపావృతము చేయుము. ముక్తికి మహాత్సవ - దార్వ మని చెప్పఁ బడినది. భాగవతుల పాద సరోజ రేణువును శిరస్సుపై ధరించుట - పాపమును నశింపఁజేయుటయేగాక, సర్వ సద్గుణములను సంప్రాప్తింపఁ జేయును. సాధు సంగమము యొక్క వైశిష్ట్యము - నక్తకు, శ్రోతకు సమ్మత మగుటయేగాక, సర్వులకును సుఖకర మగును.

మహాత్ములతోడి ప్రచుర సమాగమములేని నరుని జన్మము నిరర్థకము. భగవానుని గూర్చిన జ్ఞానము మహాత్ముల పాద రజోభిషేకమువలన మాత్రమే సంపాదింపనగును. తీర్థములు, మృచ్ఛిలా మయములైన దేవతలు, దీర్ఘ కాలమునఁగాని భక్తులను పవిత్రులఁ జేయరు. కాని, సాధువులు దర్శన మాత్రమునే పునీతులగావింతురు.

సత్సంగమువలె వ్రతములు - యజ్ఞములు మున్నగునవి యేవియు భగవానుని కరుణను సంపాదింపఁజాలవు. సాధువులు మాత్రమే భక్తికి విరుద్ధములైన భావములను ఛేదింపఁగలరు. సాధువుల కిట్టి మాహాత్మ్య మబ్బుటకు హేతువు - వారియందు హరి యుండుటయే.

సాధువులే భగవానునికి హృదయము. సాధువుల హృదయమే భగవానుఁడు. వా రివురురికిని మతీయొకటి తెలియము. సాధువులే దేవతలు. 'అసలు' దేవత లనఁబడువారు - స్వార్థపరులు. సాధువు లట్లు కాదు. దేవతల చరిత్రము సుఖమును, దుఃఖమును రెంటిని గల్గించును. కాని, సాధువుల చరిత్రము - ఒక్క సుఖమును మాత్రమే కల్గించును. భక్తుల విషయమున, దేవతల నర్తనము - పిండికొలఁది రొట్టెవంటిది. కాని, సాధువుల విషయ మట్లు కాదు. దేవతలకంటెను

సాధువు లుత్తములు. ఇట్టి సాధు సాంగత్యము సులభముగ లభించునది కాదు. అది – దురాపము, దుర్లభము.

" దుర్లభో మానుషోదేహో దేహినాం క్షణభంగురః
తత్రాఽపి దుర్లభం మన్యే వైకుంఠ ప్రియదర్శనమ్. "

— (11-2-29.)

క్షణభంగురమైన మానవజన్మమే దేహులకు దుర్లభము. అందునను – వైకుంఠ ప్రియుల దర్శనము, అతి దుర్లభము. వైకుంఠ మునకు మార్గభూతులైన సాధువుల సేవ, అల్పతపమునకు దురాపము.

" యద్దుష్కరం యద్దురాపం యద్దుర్గం యచ్చదుష్కరమ్
తత్సర్వం తపసా ప్రాప్తం తపో హి దురతిక్రమమ్. "

— (మనుస్మృతి)

దుష్కరము – దురాపము – దుస్తరమునైన సర్వము తపముచే సాధ్యము. తపస్సు దురతిక్రమము. ఇట్లు చెప్పఁబడినను, అట్టి తపము నకుఁ గూడ స్వల్పమైనచో – సాధుసేవ దురాప మనుట యందు – దాని వైశిష్ట్యము స్పష్టము.

ప్రారబ్ధ, సంచిత కర్మల వలన సంభవించిన పాపము నాశ మగుటకు – భక్తి యుపకరించును. మహా త్సేవ వలన, పాపము నాశ మగును. పాపము నాశము కాఁగా – చిత్త సంశుద్ధి కలుగును. దాని వలన వివేకము కలుగును. వివేకము (జ్ఞానము) కలుగుటయే భక్తి యుద్భవించుటకు హేతువు.

" నిషేవితే నానిమిత్తేన స్వధర్మేణ మహీయసా
క్రియాయోగేన శస్తేన నాతిహింస్రేణ నిత్యశః
మద్దిష్ణ్య దర్శన స్పర్శ పూజా స్తు త్యభివందనైః
భూతేషు మద్భావనయా సత్త్వేనా సంగ మేవ చ
మహతాం బహుమానేన దీనానా మనుకంపయా
మైత్ర్యా చైవాత్మతుల్యేషు యమేన నియమేన చ
ఆధ్యాత్మిక మను శ్రవణా న్నామసంకీర్తనా చ్చ మే
ఆర్జవే నార్యసంగేన నిరహం క్రియయా తథా
మద్ధర్మిణో గుణై రేతైః పరిసంశుద్ధ ఆశయః
పురుషస్యాంజసాభ్యేతి శ్రుతమాత్రగుణం హి మామ్. "

— (3-29-15 నుండి 19.)

" ఏవం భూతాయాః భక్తే స్సాధనా న్యాహ పంచభిః నిషేవితేతి. నిషేవితేన సమ్యగనుష్ఠితేన, అనిమిత్తేన ఫలాభి రహితేన, స్వధర్మేణ నిత్యనైమిత్తికేన, మహీయసా శ్రద్ధయుక్తేన, క్రియాయోగేన, పాంచరాత్రాద్యుక్త పూజా ప్రకారేణ, శస్తేన నిష్కామేన..... ...మద్దిష్ణ్యం మత్ప్రతిమాదితస్య దర్శనాదిభిః సత్త్వేన సైర్యేణ, అసంగమేన వైరాగ్యేణ.....ఆర్జవేన ఆకౌటిల్యేన.....మద్ధర్మిణః భగవద్ధర్మానుష్ఠాతుః పురుషస్య, ఆశయః చిత్తమ్. "

— (శ్రీధరీయ వ్యాఖ్య)

సమ్యగనుష్ఠితము - ఫలాభిసంధిరహితము - శ్రద్ధాయుక్తము - నిత్య నైమిత్తికమునైన స్వధర్మ నిర్వహణము - నిష్కామము - అనతి హింసమునైన పాంచరాత్రాగమాద్యుక్త పూజ - ప్రతిమాదుల దర్శనము స్పర్శ - పూజ - స్తుతి - అభివందనము - భూతములయందు భగవద్భావన - ధైర్యము (సత్త్వము) వైరాగ్యము (అసంగము) - మహా

త్ములను సన్మానించుట – దీనులను దయతో జూచుట – సములయెడ మైత్రితో మెలగుట – శమము – నియమము – ఆధ్యాత్మికాను శ్రవణము – భగవన్నామ సంకీర్తనము – ఆర్జవము – ఆర్యసంగము – నిరహంక్రియత మున్నగువానిచే చిత్తము పరిశుద్ధ మగును – ఇట్టి భగవద్ధర్మముల ననుష్ఠించిన పురుషుడు – శ్రుతమాత్రగుణుడైన భగవానుని – శీఘ్రమే పొందును.

అనగా – చిత్తపరిశుద్ధికి సాధనము లగునవి యన్నియు భక్తికి సాధనములే యని భావము. కారణము – చిత్తము పరిశుద్ధ మగు క్షణము, భక్తి యుద్భవించు క్షణము ఒకటియే యగుట. ఈ సాధనముల విషయమున, తరువాతి శాండిల్య సూత్రములందు బహిరంతర విభజన మేర్పడినది.

జ్ఞాన వైరాగ్యములు – శౌచము – జపము – తపము – హోమము – శ్రద్ధ – ఆతిథ్యము – భగవద్దర్శనము – తీర్థాటనము – ఆచార్య సేవనము – స్వధర్మ నిర్వహణము – విధర్మ నివర్తనము – తీవ్రమైన యాత్మసమాధి – గ్రామ్యధర్మ నివృత్తి మోక్షధర్మరతి – స్వాధ్యాయము – గురూపాసన మిత భోజనము – వివిక్త సేవనము – విమన్యుత – అనుద్వేగత మున్నగు భక్తి నియమములు చెప్పబడినవి.

భక్తికి అధికారులు

భక్తికి అధికార నియమము లేకున్నను, దానికిఁ గావలసిన కనీస మైన యర్హతయు యోగ్యతయు ఆవశ్యకములే. వాని విషయమై, భాగవత మీ క్రింది విధముగా ననుచున్నది :-

" యదృచ్ఛయా మత్కథాదౌ జాతశ్రద్ధస్తు యః పుమాన్
న నిర్విణ్ణో నాతిసక్తో భక్తియోగోఽస్య సిద్ధిదః. "

— (11-20-8.)

భగవానునిగూర్చిన కథలయందు, యాదృచ్ఛికముగా నెవనికి శ్రద్ధ యుదయించునో – అనిర్విణ్ణుఁడును, అనతి సక్తుఁడునగు నాతనికి భక్తియోగము సిద్ధి నిచ్చును. నిర్విణ్ణులకు జ్ఞానయోగము, అతిసక్తులకు కర్మయోగము ఉండనే ఉన్నవి. అనఁగా – నిర్విణ్ణుఁడును, అతి సక్తుఁడును కాని వానికి భక్తి యోగము సిద్ధించు నని యర్థము. భక్తుఁడు – నిర్విణ్ణత పొందనక్కఱలేదు; అతిసక్తుఁడును కానక్కఱ లేదు. ఉన్నవానిని త్యజింప నక్కఱలేదు, లేనివానికై ఆరాటపడ నక్కఱలేదు. ఉన్నవానివలననే లేనివానిని సాధింపవచ్చును. భక్తి యోగము యొక్క యాంతర్య మంతయును ఇదియే. "ఆను మంగికముగ నిట భక్తి, జ్ఞాన, కర్మ యోగముల సంబంధమును, జ్ఞాన కర్మలకంటె భక్తికిఁ గల యాధిక్యమును జెప్పఁబడిన ట్లయినది. జ్ఞాన కర్మలు రెంటికిని కూర్పఁబడిన యొక చక్కని సమన్వయమే భక్తి యోగము.

భక్తి కలుగువఱకును కర్మ మానశ్యకమే. భక్తికలు గగనే జ్ఞానము, వైరాగ్యము వానియంతట నవియే కలుగును. జ్ఞాని యెల్లపు డును భక్తుఁడేగదా!

శ్రద్ధాధానత – భక్తి (ఇట భక్తి యనఁగా – గౌరవ భావము) – వినీతత – అససూయత – భూతకృతమైత్రి – శుశ్రూషాభిరతి – వైరాగ్యము – శాంతచిత్తత – ధీమత్త – నిర్మత్సరత – శుచి – భగవానుఁడనిన అతులమగు ప్రీతి – దోషనిహీనత – బ్రహ్మణ్యత – ప్రియత్వము (గురువునకు ప్రియుఁడై యుండుట) – సాధుశ్వము మున్నగు గుణములు గల్గిన శూద్రులైనను, స్త్రీలైనను భక్తియోగమున కర్హులే.

భక్తియోగమునకు పై గుణము లవసరము లని చెప్పుట - కేవలము ఔపచారికము మాత్రమే. కారణము - ఇట్టి గుణములు గల వ్యక్తికి భక్తి, దానియంతట నదియే యుద్భవించును. ఉద్భవించుట కాదు - ఉండితీరును.

భక్తికి అనర్హులు

పరుల నుద్వేగపఱచు ఖలత్వము - అవినీతి - స్తబ్ధత (అనగా - చెప్పినది గ్రహింపలేకుండుట) - దురాచారత్వము - ధాంభికత్వము - లౌల్యము - గృహమునందు హేయమైన చేతము (గృహ మనగా - దేహ మనియు చెప్పవచ్చును. అనగా - వైరాగ్యము లేకుండుట యని యర్థము.) - భక్తి లేకుండుట - భక్తి యెడ ద్వేషము - నాస్తికత - వంచన - అశుద్ధత మున్నగు గుణములు భక్తియోగమున కనర్హత నాపాదించుచున్నవి.

ఇట్టి గుణము లున్నచోట - ఒక్క భక్తియే కాదు - ఆధ్యాత్మిక వాసనయే లేశమైనను నుండుటకు ఏ అవకాశము లేదు. భక్తి కలుగుటకు అంతరాయములుగ, ప్రధానముగా - స్త్రీ, నిత్య, విషయ ప్రియత్వములు చెప్పఁబడినవి. స్త్రీ సంగమువలన సత్యము, శౌచము, దయ, మౌనము, బుద్ధి, సంపద, లజ్జ, యశము, క్షమ, శమము, దమము, భాగ్యము మున్నగునవి నశించును. స్త్రీ వలనఁ గలుగు అనర్థములు చాల విపులముగ నిరూపింపఁబడినవి.

స్తేయము - హింస - అనృతము - దంభము - కామము - క్రోధము స్మయము (గర్వము) - మదము - భేదము - వైరము - అవిశ్వాసము - సంస్పర్ధ స్త్రీ - ద్యూతము - మద్యము అను పదునైదును అనర్థములు.

విషయములయందలి గుణములను ధ్యానించుటవలన సంగము, సంగము వలన కామము, కామము వలన వివాదము, వివాదము వలన తీవ్ర క్రోధము, క్రోధమువలన తమముచే చేతనత నశించుట, దాని వలన – శూన్యత్వము, మృతకల్పమైన అట్టి మూర్ఛవలన పురుషార్థ భ్రష్టత సంభవించును. స్త్రీ, విత్త, విషయేచ్ఛల వలనఁ గలుగు ఫలితము లన్నియు భక్తి కలుగుటకు వలయు ప్రకృతిని జెఱుచునవియే. అందువలననే – అవి భక్తికి ఆటంకములైనవి.

స్త్రీ విత్త విషయేచ్ఛాదులవలనఁ గలుగు అనర్థములను గూర్చిన పయి నిరూపణము – 'నేతిని నెత్తురునలెను, అభ్యంగమును స్త్రీ సంగమువలెను, స్త్రీలను పాములనలెను, బంగారమును విషము వలెను భావించి, సన్యాసి వానిని పరిత్యజించవలె' నను సన్యాసోపనిషద్వచనముల వివరణమును —

"స్త్రీ ధన నాస్తిక పైశాచరిత్రం న శ్రవణీయమ్."

ఇత్యాది నారదభక్తి సూత్రాది వచనములకును – ఉపనిషత్తుల వలెనే మూలకందము నగుచున్నది. భక్తి శాస్త్ర పరిణామ క్రమము రెండొక్క విధానమును గ్రహించుటకు – పయి నిరూపణము తోడుపడు ననుట స్పష్టము.

భక్తుని లక్షణములు

భాగవతమున భిన్నములగు తావులయందు, బహుధా ప్రోక్తములైన యంశము లన్నిటినిబట్టి, నిజమగు భక్తునకు ఈ క్రింది లక్షణములుండితీరునని నిర్ణయింపవచ్చును.

అహింస :– మనోవాక్కాయములు మూఁడిటివలనను హింస లేకుండుట. హింసను గూర్చిన సంకల్పముగూడ హింసయే. అహింస –

యనగా, హింస లేకుండుటయే కాదు – పరమ ప్రేమను గలిగియుండుట గూడ. అహింసయే సత్యము, భూతమును.

సత్యము :– ఏది యనాదియై, యింతవఱకు పూర్వమున్నదో – అది. సత్య మనగా – అహింసయే. పరమ ప్రేమయే.

అస్తేయము :– తనకేని లేకున్నను, తన జీవితమున కాటంక ముండదో – అట్టి వానిని గలిగియుండుటగూడ స్తేయమే. స్తేయ విషయక భావనయు స్తేయమే. ఈయవలసిన వాని నీయకుండుటయు స్తేయమే.

అసంగము :– త్రికరణములందును సంగము లేకుండుట.

హ్రీ :– భవమును బొందినందువలన లజ్జ.

అసంచయము :– ప్రాణముల కాధార భూతము లగు వాని కంటెను ఇతరము లగు వానిని సంపాదించుట సంచయము. అట్టిది లేకుండుటయే అసంచయము. అస్తేయమునకును, అసంచయమునకును ప్రయత్నము మాత్రమే భేదము.

ఆస్తిక్యము :– ఉన్నదానిని ఉన్నదని భావింపఁగలుగుట. అట్టి భావన కవసర మగు అర్హతను సంపాదించుటకై యత్నించుట.

బ్రహ్మచర్యము :– త్రికరణములయందు బ్రహ్మచర్యమునాచరించుటయే కాదు – ఇంద్రియము లన్నిటియందును సంయమనము గలిగియుండుటగూడ. అంతమాత్రమే కాదు – బ్రహ్మభావనయందు సంతతము సంచరించుటగూడ.

మౌనము :– మనోవాక్కాయములను, వాని వాని ధర్మము లన్నింటి నుండి దూరము చేయుట.

స్థైర్యము :- త్రికరణములయందును స్థిరత్వ ముంచుటయే కాదు - వానిని భగవానుని కర్పించుటగూడ.

క్షమ :- అసహ్యము లగు వానిని త్రికరణములచే సహించు టయేకాదు - వానియందును తత్కర్తలయందును యెట్టి ద్వేషము లేకుండుటగూడ.

అభయము :- అసత్తునుగూర్చిన భీతి లేకుండుట మాత్రమే కాదు - సత్యమునుగూర్చిన స్థైర్యమును గలిగియుండుటగూడ.

పరాశ్రేహ :- ప్రాణు లన్నిటికిని ఆనందమును గోరుట మాత్రమే కాదు - ఇంద్రియము లన్నిటిని ఆ ప్రయత్నమున మగ్నము చేయుటగూడ. అంతమాత్రమే కాదు - ఆనంద వ్యతిరిక్తమైన యది త్రికరణములయందును లేకయుండుట.

తుష్టి :- జ్ఞానేంద్రియము లైదింటియందును, తన్మూలమున మనమునందును, ఉన్నదానితో తృప్తి నొందుట మాత్రమే కాదు - లేనిదాని నేమాత్రమును గోరకుండుట; కర్మేంద్రియము లయిదింటిని మనసున కవ్యతిరిక్తముగనే కాక, అనుకూలముగను ప్రవర్తింపఁ జేయుటగూడ.

శమము :- భగవన్నిష్ఠమైన బుద్ధి.

దమము :- ఇంద్రియ సంయమనము.

తితిక్ష :- దుఃఖము నణంచుట.

ధృతి :- జిహ్వోపస్థలను జయించుట.

దానము :- త్రికరణములనుండును దండమును త్యజించుట.

తపము :- కామ త్యాగము.

శౌర్యము :- స్వభావ విజయము.

సమదర్శనము :- సత్యము.

ఋతము :- ఋషులచే పొగడబడిన సూనృతవాణి, పరి
యిక ముం దసంతర్షమై యుండునో - అదియే ఋతము.

శౌచము :- కర్మములయం దసంగత్వము.

సన్న్యాసము :- దృశ్య మగు సర్వమును త్యజించుట.

ధర్మము :- నరులలో నధిక సంఖ్యాకులకు ఇష్టమైనది.

యజ్ఞము :- భగవానుండే యజ్ఞము. ఆ యజ్ఞ రూపమును
పొందుట యని యర్థము.

దక్షిణ :- జీవితము మూలమున జ్ఞాన సందేశము నిచ్చుట.

బలము :- మనస్సును భగవానునియందు లీనము చేయుట.

భగము :- భగవానునిగూర్చిన ఐశ్వర్య భావము.

లాభము :- భగవానునియందు ఉత్తమ భక్తిని గల్గియుండుట.

విద్య :- ఆత్మలయందు భేదత్వమును జూచినచో గల్గు బాధ.

జుగుప్స :- అకర్మములయెడ గలుగు లజ్జ మాత్రమే కాక,
అసహనముగూడ.

శ్రీ :- గుణములను గలిగి యుండుట.

సుఖము :- లౌకిక వ్యవహారమునందు సుఖ దుఃఖము లని చెప్పఁబడు రెంటిని అతిక్రమించిన స్థితి.

దుఃఖ రాహిత్యము :- త్రైవర్గిక సుఖాపేక్ష లేకుండుట.

పాండిత్యము :- బంధ మోక్షమును గూర్చిన విధము నెఱింగి యుండుట.

మూర్ఖత లేకుండుట :- దేహా ద్యహం బుద్ధియే మూర్ఖత. అది లేకుండుట యన్నమాట.

పథమునందు వర్తించుట :- నిగమ స్మృతమైన మార్గమున వర్తించుట. బాగుగా నడపించునది నిగమ మనబడును.

ఉత్పథము లేకుండుట :- ఉత్పథ మూర్గ మనఁగా - అకాశ మార్గము. అనఁగా - అమార్గ మని యర్థము. చిత్తవిక్షేపము అమార్గము. అట్టి యమార్గమునఁ బోకుండుట.

స్వర్గమును గలిగి యుండుట :- సత్త్వగుణోదయమే స్వర్గము.

నరకము లేకుండుట :- తమః ప్రజ్వలనమే నరకము. అది లేకుండుట.

ఆప్తత్వము :- గుణములను గలిగియుండుట.

దరిద్రత లేకుండుట :- అసంతుష్టియే దరిద్రత. అది లేకుండుట యన్నమాట.

కృపణత లేకుండుట :- అజితేంద్రియత్వమే కృపణత. అట్టిది లేకుండుట. అనఁగా - జితేంద్రియత్వ మన్నమాట.

ఈశత్వము :- గుణ - ప్రేరకత్వము.

అనీశత లేకుండుట :- గుణములకు లోబడుట యనీశత. అట్టిది లేకుండుట, అనగా - ఈశత్వము గలిగి యుండుట యని యర్థము.

దోషము లేకుండుట :- గుణదోష దర్శనము దోషము. అట్టిది లేకుండుట యని యర్థము.

సుశీలత :- భగవానుని బొందుట కనువైన శీలము.

అకించనత :- లౌకిక విషయము లేమాత్రము లేకుండుట.

నిరపేక్షత :- ఫలము గూర్చిన భావన యణుమాత్రమును లేకుండుట.

నిర్వైరము :- భేదభావము లేక, సమదర్శనము గల్గియుండుట.

భగవదనురక్తి :- భగవానునియందు పరమ ప్రేమను గల్గి యుండుట.

అఖిల జీవ వత్సలత :- అఖిల జీవములను తన పరమ ప్రియుడైన భగవానుడు, ఆత్మరూపములుగ సృజించె నని యెఱింగి, ఆ జీవులయందు వాత్సల్యమును గల్గియుండుట.

ఆత్మవద్దర్శనము :- సర్వభూతములను తన యందు, తన్ను సర్వభూతముల యందును జూచుచు, నిరంతరము వానికి మనసున మ్రొక్కుట.

నష్టాహంకారత :- తా ననెడి భావము సర్వము త్యజించి, తన్ను భువియందలి ప్రతిప్రాణికంటెను తక్కువగ జూచుకొనుట.

విత్తము నష్టమైనవానివలె నాతురత :- భగవంతునకు సన్ని హితుఁడై యుండవలసిన తాను, దూరమై, అతనిని పోగొట్టుకొంటినే యను భావముచే గలుగు నాతురత.

సన్నిపాతము లేకుండుట :- నేను, నాది అను అహంభావము సన్నిపాతము. అది లేకుండుట.

నిందా స్తుతులు విడచి, అనిమిత్తుఁడై, సూర్యునివలె చరిం చుట :- ఇష్టానిష్టములు రెంటికిని అతీతుఁడై ఏకత్వమును బొందుట.

సంశయ రహిత :- భగవానునిగూర్చియు, అతని స్వరూప మును గూర్చియు సంచయ మేమాత్రము లేకుండుట.

మోక్షముగూడఁ గోరకుండుట - భగవత్సేవను మాత్రమే కోరుట :- మోక్షమున పరమఫల రూపమైన భక్తికి అవకాశము లేక పోవుటయే కారణము.

సుహృదత్వము :- అజాత శత్రుత్వము, సాధుత్వము.

తాపము :- భగవానుని నుండి వే ఱైతి ననుదుర్భర వేదన యొక్కఫలము.

మూఢాత్మ్యము :- భగవ దబద్ధ హృదయత - భగవ దాశ్రే యము - భగవ త్కథామృష్టత - భగవ త్కథా శ్రవణము - భగవ త్కథా కథనము - స్మృతి (ఎట్టి స్థితియందైనను విచక్షణను, జ్ఞాన మును గోల్పోక యుండుట) - బుధుఁడై నను బాలకునివలె క్రీడించుట -

కులీనుడైనను జడునివలె చరించుట - విద్వాంసుడైనను ఉన్మత్తుని వలె మాటాడుట - నియత మగు చర్య లేకుండుట - కర్మములు, పాషండత్వమును, తర్కమును అధిగమించుట - శుష్కవాదమునకు దిగకుండుట - అనివార్య మగు స్థితియందు మాటాడవలసి వచ్చినను, అతివాదమునకు పోకుండుట - అట్లు మాట్లాడుట యందును ఎవరికిని ఏ మాత్రమును న్యూనత గలిగింపకుండుట - దృఢ నిశ్చయము గలిగి, బకమువలె లక్ష్యమును జేరుట మొదలగునవి భక్తున కుండవలసిన లక్షణములు.

వివేకానందుడు చెప్పిన (Bhakti yoga - The triongle of love) పరమ ప్రేమ యొక్క లక్షణములు మూడును అనగా - అభీతి, నిరపేక్షత, ఏ ప్రాణికంటెను తాను తక్కువ యని భావించుట, పై లక్షణములలోనివే.

భక్తుని ధర్మములు

భగవత్కథలందు శ్రద్ధ, భగవత్కథావ్యాఖ్యానము, పూజయందు నిష్ఠ, స్తుతి, పరిచర్యయం దాదరము, సర్వాంగములతో నభివందనముచేయుట, భక్తులను పూజించుట, సర్వభూతములయందును భగవద్భావన జేయుట, అంగచేష్ట లన్నియు భగవదర్థముసేయుట (అనగా - భగవత్కార్యార్థమే యంగము లన్నిటి నుపయోగించుట) భగవత్కథా కథనము, మనసును భగవానునియం దర్పించుట, సర్వకామములను వర్జించుట, అర్థ పరిత్యాగము, భోగ పరిత్యాగము, సుఖ పరిత్యాగము ఇష్ట దత్త హుత జప్త వ్రత తపములను భగవానుని కర్పించుట, ఈ ధర్మముల నాచరించుచు, భక్తుడు ఆత్మ నివేదన మొనర్చినచో - అతని భక్తి, మహోన్నత స్థితి నందుకొని, లక్ష్యసిద్ధికి దోహద మొసంగును. అట్టి వాని కిక గావలసిన దేమియు నుండదు.

నవవిధ భక్తులు

" శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మ నివేదనమ్
ఇతి పుంసార్పితా విష్ణో భక్తిశ్చే న్నవలక్షణా. "

— (7-5-23,24)

శ్రవణము, కీర్తనము, స్మరణము, పాద సేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మ నివేదనము అని, భక్తి – నవ లక్షణ లక్షితముగా చెప్పఁబడినది.

పై పాసియందు – శ్రవణము, కీర్తనము, పాదసేవనము, అర్చనము, వందనము అను నైదును భక్తిని వ్యక్తీకరించునవి మాత్రమే. స్మరణము, దాస్యము, సఖ్యము, ఆత్మ నివేదనము అనునవి – భక్తి భావ పరిణామ మందలి యవస్థలు.

ఈ నవ విధ భక్తుల ప్రాశస్త్యము – ఈ క్రింది విధముగా విపులీకరింపఁబడినది.

౧. శ్రవణము :

" శృణ్వతాం స్వకథాం కృష్ణః పుణ్యశ్రవణ కీర్తనః
హృద్యన్తస్థోహ్యభద్రాణి విధునోతి సుహృ త్సతామ్. "

— (1-2-17)

ఉత్తములు స్నేహితుఁడగు కృష్ణుఁడు – కథలను వినువారి హృదయమం దుండి, వారి యపరంగళములను బోఁగొట్టును. కృష్ణ కథా శ్రవణ కీర్తనములు పుణ్యావహములు.

2. కీర్తనము :

" ఇదం హి పుంస స్తపస శ్రుతస్య వా
స్విష్టస్య సూక్తస్య చ బుద్ధిదత్తయోః
అవిచ్యుతో ఽర్థః కవిభి ర్నిరూపితో
య దుత్తమశ్లోకగుణానువర్ణనమ్. " — (1-5-22)

ఉత్తమ శ్లోకుని గుణానువర్ణనమే ఋషులచే నిరూపింపఁబడిన తపమునకు, శ్రుతమునకు, అగ్నిష్టోమాది రూపేష్టమునకు, తటాకాది ప్రతిష్ఠారూపమైన పూర్తమునకు, శంసన పూర్వక దానములకును అవిచ్యుతమైన ఫలము.

3. స్మరణము :

" ఏతావా న్సాంఖ్యయోగాభ్యాం స్వధర్మ పరినిష్ఠయా
జన్మలాభః పరః పుంసా మంతే నారాయణ స్మృతి. "

— (2-1-6)

సాంఖ్యము, యోగము, స్వధర్మ పరినిష్ఠ వీని యన్నిటివలనను పురుషుని జన్మమునకుఁ గలుగు పరమ లాభము అంత్యదశయందు నారాయణుని స్మరించుటయే.

4. పాద సేవనము :

" దేవో ఽసురో మనుష్యో వా యక్షో గన్ధర్వ ఏవ చ
భజ న్ముకున్ద చరణం స్వస్తిమాన్ స్యాద్యథావయమ్. "

— (7-7-52)

దేవాసుర మనుష్య యక్ష గంధర్వాదులయం దెవరైనను ముకుందుని చరణములను భజించి, శుభమును బొందఁగలరు.

ముకుందుఁ డనఁగా - " ముకుం - ముక్తిం దదాతీతి ముకున్దః " ముక్తి నిచ్చువాఁ డని యర్థము.

౫. అర్చనము :

" యథా తరోర్మూల నిషేచనేన
తృప్యన్తి త త్స్కంధభుజోపశాఖాః
ప్రాణోపహారాచ్చ యథేంద్రియాణామ్
తథైవ సర్వార్హణ మచ్యుతేజ్యా. " — (4-31-14)

చెట్టు యొక్క మొదటిని దడుపుటవలన - స్కంధ, భుజోప శాఖ లెట్లు తృప్తి జెందునో, ప్రాణమున కిడిన యాహార మెట్లింద్రి యములం ద్రృప్తి పఱుచునో, అట్లే - అచ్యుతుని యర్చనము సర్వ దేవతలకు వర్తించును.

౬. వందనము :

" హృద్వాగ్వపు ర్భిర్వి దధ న్నమస్తే
జీవే తయో ముక్తిపదే నదాయ భాక్. " — (10-14-8)

హృదయముచేతను, వాక్కుచేతను, కాయముచేతను భగ వానునికి నమస్కరించుచు జీవించువాఁడు ముక్తి పదమున కర్హుఁడు.

౭. దాస్యము :

" య న్నామశ్రుతిమాత్రేణ పుమా న్భవతి నిర్మలః
తస్య తీర్థపదః కిం వా దాసానా మవశిష్యతే ? "

— (9-5-16)

ఎవని నామమును వినిన మాత్రమునచే పురుషుఁడు నిర్మలుఁడగునో - అట్టి భగవానుని యొక్క దాసులకు కావలసిన దేమున్నది ? (ఏమియు లే దనుట.)

ఆ. సఖ్యము :

" అహో భాగ్య మహో భాగ్యం నన్దగోప వ్రజౌకసామ్
యన్మిత్రం పరమానన్దం పూర్ణం బ్రహ్మ సనాతనమ్. "

— (10-14-32)

సనాతనుఁడు, పరిపూర్ణుఁడు, పరమానంద స్వరూపుఁడు నైన బ్రహ్మను (భగవానుని) మిత్రునిగ బడసిన నందగోప వ్రజ వాసులది యేమి భాగ్య మేమి భాగ్యము !

ఇ. ఆత్మ నివేదనము :

" మర్త్యో యదా త్యక్త సమస్త కర్మా
నివేదితాత్మా వీచికీర్షి తోమే
తదామృతత్వం ప్రతిపద్యమానో
మయాఽఽత్మభూయాయ చ కల్పతే వై. "

మర్త్యుఁ డెప్పుడు త్యక్త సమస్త కర్ముఁడయి, భగవ న్నివేదితాత్ముఁడగునో - అప్పుడు భగవానుని విశిష్ట కర్తవ్యమునకు పాత్రుఁడై, అమృతత్వమునకు యోగ్యుఁడై, భగవానునిచే భగవద్భావము పొందింపఁబడునని.

ఇందు - ఆత్మ నివేదన మనఁబడు శరణాగతి ప్రభావమును భాగవతము బహు విధములఁ జాటుచున్నది. వ్యసనాత్మయమైన

భగవత్పదములయందు శరణము పొందిన ధీరులకు, పొందరాని దనుచు నేదియు లేదు.

" కిం దురాపాదనం తేషాం పుంసా మున్మాప చేతసామ్
యై రాశ్రిత స్తీర్థపద శ్చరణో వ్యసనాత్యయః." — (3-23-42)

పరభక్తి స్వరూపము

పరభక్తుని స్థితిని భాగవత మిం క్రింది రీతిగా విశదీకరించు చున్నది :-

అతని చిత్తము ప్రణయావ ఘూర్ణ మగుటచే, పులకితగాత్రుడగును. హృదయము ద్రవించుటచే, బాష్పపూరిత నేత్రుడగును. గద్గదకంఠుడగును. కనిపించునది భగవానుడొక్కడే యగుట - నోట మాట యుండదు. ఊరక చూచును. ఊరక నవ్వును. ఊరక యేడ్చును. ఉచ్చైస్స్వరముతో పాటలు పాడును. ఒడలు తెలియక నృత్యము చేయును. ఆనందాబ్ధిలో నుక్కిరి బిక్కిరియై, అతడు - ఆమృతుడగును. భగవద్విరహముననే ఆతడు ప్రాణములు విడచును.

భాగవత లక్షణములు

ఆత్మయొక్క భగవద్భావమును సర్వ భూతముల యందును, భగవత్స్వరూపమైన ఆత్మయందును తన యందు సర్వ భూతములను జూచువాడు భాగవతోత్తముడు.

భగవానునియందును, తదధీనులయందును, మూర్ఖులయెడను, క్రమముగా ప్రేమ, స్నేహము, దయ, ఉదాసీనలతో వర్తించువాడు భాగవత మధ్యములు.

భగవత్ప్రతిమలను మాత్రమే శ్రద్ధతో పూజించుచు, భక్తుల యెడను - ఇతరుల యెడను అట్టి భగవద్భావము లేనివాడు ప్రాకృత భక్తుడు.

ఇంకను భాగవతోత్తముని లక్షణములు, భాగవత ప్రధానుని లక్షణములు, అగ్ర వైష్ణవుని లక్షణములు, హరిప్రియుని లక్షణములు విపులముగా జెప్పబడినవి. కాని, ఆ లక్షణము లెల్లను, పూర్వోక్త భక్త లక్షణములయం దంతర్లీన మగు నవియే. ఉత్తముడు - నిష్ణాతుడు నైన గురునియొద్ద జిజ్ఞాసువైన శిష్యుడు నియమముతో భాగవత ధర్మములయొక్క శిక్షణమును పొందవలెనని చెప్పబడి, ఆ శిక్షణక్రమము, భాగవత ధర్మములు విపులీకరింపబడినవి. ఆ ధర్మము లన్నియు పూర్వోక్త భక్త లక్షణములం దంతర్గత మగు నవియే.

భక్తుని వైశిష్ట్యము

భక్తుని వైశిష్ట్య మంతయు నొక్క మాటలో - క్రింది విధముగా చెప్పబడినది.

"మద్భక్తియుక్తో భువనం పునాతి." — (11-14-24)

నా భక్తుడు విశ్వమును పవిత్రము 'చేయు' నని భగవానుడే స్వయముగా పలికినాడు. ఈ భావమునే నారదుడుకూడ - 'స లోకాం స్తారయతి' ఆ భక్తుడు లోకమును తరింపజేయునని చెప్పియున్నాడు.

భగవానుడు భక్తపరాధీనుడు. సర్వమును త్యజించి, తనను శరణు బొందిన భక్తుల నెన్నటికిని ఆతడు విడలడు. అతడు కరుణా

సముద్రుఁడు. వైరముచేత నాతని గతి విలాస విలోక నాకారాదులను శయ నాసనాదులయందు ధ్యానించు శిశుపాల పౌండ్ర సాల్వాదులకే సాయుజ్య ముక్తిని ప్రసాదించినవాఁడు. ఇఁక నాతని ననురక్తితో భజించువారి విషయము చెప్పవలెనా ?

" వైరేణ యం నృపతయ శ్శిశుపాల పౌండ్ర
సాల్వాదయో గతివిలాస విలోక నాద్యైః
ధ్యాయన్త ఆకృతధియ శ్శయనాసనాదౌ
తత్సామ్య మాపు రనురక్తధియాం పునఃకిమ్ ? "

— (11-5-48)

భక్తి ప్రవాహ యోగము (3 - 33 - 24), భావ యోగము (6-3-26), భక్తి వితాన యోగము (3-25-31) మున్నగు పదములు భక్తియోగ మను నర్థమున ప్రయోగింపఁబడినవి.

శ్రీమద్భాగవతము పై విధముగ భక్తి తత్త్వ విషయమున, ప్రధానముగా నుపనిషత్తులకు వ్యాఖ్యానమును, తరువాతి కాలమున వచ్చిన భక్తి సూత్రములకు లక్ష్య శోషమును నగుచున్నది.

భక్తి వాఙ్మయము

ఆచార్య : యస్వీ జోగారావు

ఎమ్. ఏ., పి. హెచ్. డి.

★ ★ ★

మానవునిలో భక్తి భావ మతి ననాతనమైనది. ఏ నాడు మానవుడు తా నీ యనంత ప్రకృతిలో నొక అణుమాత్రుడ నని గ్రహింప గలిగెనో - ఏ నా డీ నిత్యప్రత్యగ్ర మగు ప్రకృతి యొక్క ప్రతి పరమాణువునందును నిరంతరము, అనాది కూటస్థము, అనంత వర్త్మము, పరమ భూతము నగు నొక మహోజ్జ్వల తేజఃస్ఫూర్తిని, మానవాతీత మగు నొక మహత్తర శక్తి స్వరూపమును, బ్రహ్మాండ భాండోదర మగు భగవత్కళా ప్రగల్భతను గుర్తింపగలిగెనో - అట్లు గుర్తించియు, తన అవిద్యావరణమునుండి దుర్నిరీక్ష్య మగు నా సచ్చిదానందైక స్వరూపమునకు స్వీయ స్వభావానుగోధముగ రూప గుణాద్యారోపణము గావించెనో - ఆనాడే, అతనిని భక్తి మావహించినది. క్రమక్రమముగ నతనిలో, సగుణోపాసనమును ప్రబలినది. ఆనాటి నుండియే మానన భవతారక మార్గములలో - మహాయోగములలో భక్తియు నొక కైనది.

భగవద్గీత - భక్తియోగము

పవిత్రమైన భారతీయ పరతత్త్వజ్ఞాన నవనీత మగు భగవద్గీతలో - ఏకాదశాధ్యాయము విశ్వరూప సందర్శన యోగము. ద్వాదశము భక్తియోగము. నరునకు నారాయణుని విశ్వరూప సందర్శన యోగ మబ్బిన తరువాతనే భక్తి యోగ ప్రబోధము కలిగినది.

అనగా – మానవుడు తన కతీతమైన విశ్వాతీతమైన శక్తి యొకటి (భగవచ్ఛక్తి) యున్నదని గుర్తించినచో అతనిలో ఆ శక్తియెడ నొక ప్రగాఢమైన అనురక్తి, విశ్వాసము, నిరత్యయమైన ప్రత్యయము నేర్పడును. అదియే భక్తి, ఆస్తిక్యము. భక్తికిని, భక్తికి లక్ష్యభూతుడగు నాతని రూపము గూర్చిన భక్తుని భావనకును ఒక ప్రబలమైన అనుబంధము గలదు. సగుణోపాసన రహస్య మిదియే. భగవద్గీత సగుణోపాసన తత్త్వమునుగూడ చక్కగా సమర్థించినది. ఇందులకు ద్వాదశాధ్యాయ మంతయు తార్కాణమే. అందు సగుణ నిర్గుణోపాసన పద్ధతులకు రెంటికిని గల తారతమ్యము విశదీకరింపబడినది.

" ఏవం సతతయుక్తా యే భక్తా స్త్వాం పర్యుపాసతే
యే చాప్యక్షర మవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః ? "

అని నరుని ప్రశ్నించు. అనగా – (రామానుజ భాష్యప్రకారము) కల్యాణ గుణ పరిపూర్ణుడగు భగవంతు నుపాసించువారలలోను, ప్రత్యగాత్మానుసంధానము చేయువారలలోను అనగా – సగుణ నిర్గుణోపాసకులలో నుత్తము లెవ్వరనుట.

అందులకు నారాయణుని సమాధానము :—

" మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే
శ్రద్ధయా పరయోపేతా స్తే మే యుక్తతమా మతాః. "

అని యొకవంక సగుణోపాసకులు యుక్తతము లని చెప్పుచు –

" యే త్వక్షర మనిర్దేశ్య మవ్యక్తం పర్యుపాసతే
తే ప్రాప్నువంతి మా మేవ....."

అని నిర్గుణోపాసకులును తన్నే పొందుచున్నారని చెప్పినాడు. అయితే —

" క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తా సక్త చేతసామ్
అవ్యక్తా హి గతి ర్దుఃఖం దేహవద్భి రవాప్యతే. "

అనగా - నిర్గుణోపాసన మార్గము మిక్కిలి క్లేశకారి యని వక్కాణించినాడు. అందుచేత నది సగ్వోత్తమమైన దైనను, నిరాలంబ మగు నిర్గుణోపాసన కారంభమందు సగుణోపాసనయే అవశ్య మవ లంబ్య మనియు పిదప సూచింపబడినది. (చూ. గీత. అధ్యా. 12 - శ్లో : 6, 7, 8 మొదలగునవి.) పురుషసూక్త - మంత్ర పుష్పాదు లందును సగుణోపాసన, భక్తి ధ్యానాదు లుపాదేయము లని యుద్ఘాటింపబడినది. అందు విరాట్పురుషుని స్వరూప స్వభావములు విశదీకరింపబడినవి. ('సహస్రశీర్షా పురుషః । సహస్రాక్ష స్సహస్రపాత్ .....')

భాగవతము - భక్తి మార్గము

భారతీయ భక్తి వాఙ్మయ పయఃపారావారమున ప్రభవించిన అమృత భాండము భాగవతము. అది —

" భారతీ తీర్థంబు, బాదరాయణమౌని
సాధు మేధా సహస్రార ధార
శుక ముఖ వినిస్సృత సుధాపూరంబు
రస నిర్భర కవితారామ సరసి
భక్తి భావ తరంగ బంధురావగ, భగ
వద్దివ్య గుణ గణ వర్ణనా మ
హార్ణవమ్ము ..... "

అష్టాదశ పురాణములలో భాగవత మొకటి. కాని, అది పురాణ మాత్రము గాదు. గరుడ పురాణమున దాని మహాత్మ్య మిట్లు ప్రశంసింపబడినది :—

" అర్థోఽయం బ్రహ్మ సూత్రాణాం భారతార్థ వినిర్ణయః
గాయత్రీ భాష్య రూపోఽసౌ వేదార్థ పరిబృంహితః
పురాణానాం సారరూప స్సాక్షి ద్భాగవతోదితః
ద్వాదశస్కంధ సంయుక్తః శత విచ్ఛేద సంయుతః
గ్రంథోఽష్టాదశ సాహస్రః శ్రీమద్భాగవతాభిధః. "

అనగా – భాగవతము వేద పురాణ బ్రహ్మ సూత్ర మహా భారత ప్రతిపాదితార్థము యొక్క జీవసార మనియు, గాయత్రీ మంత్రమునకు మహా భాష్యము వంటిదనియు, పరమ భాగవతప్రోక్త మైన దనియు సారాంశము. అందుచేతనే – 'విద్యావతాం భాగవతే పరీక్షా' అను నానుడి ప్రవర్తిల్లుచుండును. అందు భాగవతకథాఖ్యాతయు, పరమ భాగవతుండును అగు శుకమహర్షి – 'సంసార ప్రవిష్టుడైన వానికిఁ దపోయోగాదులయిన మోక్ష మార్గంబులు పెక్కులు గల వఁటు భక్తి మార్గంబుకంటె సులభంబు లేదు' అని ఉద్ఘాటించి యున్నాడు. (చూ. శ్రీమదాంధ్ర భాగవతము, ద్వితీయ స్కంధము : 34) అందే – తృతీయ స్కంధమున కపిలుఁడు దేవహూతికి భక్తి యోగమునుగూర్చి తెలియజేయు సందర్భమున, భక్తి – తామస రాజస సాత్త్వికాది భేదములచే త్రివిధంబై యుండునని వివరింప బడినది. అందు, సాత్త్విక భక్తి యోగము సాలోక్య – సార్షి – సామీప్య – సారూప్య – సాయుజ్యేతి పంచ విధాపవర్గ ఫలప్రద మని వక్కాణింపబడినది. మరియు, భక్తులు నిజ మనోరథ ఫలదాయ కంబులయినను – హరిసేవా విరహితంబు లయిన యితర కర్మంబు

లాచరింప నొల్లకుంఠుట యనునది ఆత్యంతిక భక్తి యోగ మని పేర్కొనబడినది.

భక్తి తత్త్వము నిరూపించుపట్ల భాగవతము భగవద్గీతనే అనుసరించినది. భాగవతములో – 'విగ్రహ దర్శన వినుతి పూజా వందన ధ్యాన సంశ్రవణములు'ను – పాంచరాత్రోక్త హరి సమారాధాన క్రియలు'ను ఆమోదింపబడినవి. పాంచరాత్ర మనగా – సనాతన శ్రీ వైష్ణవ మత సిద్ధాంతముల కెల్ల ప్రమాణ భూత మగు ఆగమము. అందు – విష్ణ్వారాధన విధానములు, ఉత్సవ విశేషములు, ప్రతిష్ఠా విధులు మొదలగు సగుణోపాసన కర్మ కలాపము లన్నియు బేర్కొన బడినవి. వీని యన్నిటిని భాగవత మామోదించినట్లే. అయితే – అవి 'నిష్కామనంబున', 'కర్మ సంగి కా కుంఠుట' అను పరిస్థితులలో జరిగినప్పుడు మాత్రమే ఉపాదేయము లని యుద్ఘాటింపబడినది.

భాగవతమున ఉత్తమ భక్తి సంప్రదాయము లనేకము బహుధా మహా భక్తి కథా సుధా మధురములుగా ప్రవచింపబడినవి. త్రిపురాసురాదుల కథలలో తామస భక్తి, విదుర భీష్మాదుల యుదంతములలో సాత్త్విక భక్తి, గజేంద్ర మోక్ష కథలో శరణాగతి ప్రాశస్త్యము, ప్రహ్లాదాదుల కథలలో ప్రపత్తి, గోపికల వృత్తాంతమున మధుర భక్తి మొదలగు భక్తి మార్గము లనేకములు చక్కగా వక్కాణింపబడినవి. విపులముగా విశదీకరింపబడినవి. సర్వదా సర్వధా భారతీయ భక్తి తత్త్వ సంప్రదాయ సర్వస్వముగా విలసిల్లగలదు భాగవతము. భక్తిభావ మావిష్కృత మగు మార్గములలో భగవన్నామ కీర్తన మొకటి. దాని వలన దైవభక్తులే కాదు – పరమ పాపాత్ములును పరిశుద్ధు లగుదు రని భాగవతము వక్కాణ.

" బ్రహ్మహా పితృహా గోఘ్నో మాతృహాచార్యహామవాన్
శ్వాదః పుల్కశకోవాఽపి శుద్ధ్యే రన్యస్య కీర్తనాత్. "

— (11-3-8)

యావజ్జీవితము పరమ నాస్తికుడై, జీవిత చరమ క్షణములో నిజముగా గాక, నిమిత్తాంతరమున నొక్కపరి హరిస్మరణ చేయు వాడును పరమ పదము ప్రాపించునట. ఇందుల కజామిళోపాఖ్యాన మును తార్కాణగా చూపుచున్నది భాగవతము. 'కలౌ సంస్మరణా న్ముక్తిః' అని ఆర్యు లందురు. భగవన్నామ స్మరణమే కాదు - శ్రవణమును మోక్షదాయకమే అనియు భాగవత ముద్ఘడించుచున్నది.

" సంకీర్త్యమానో భగవా ననంత శ్రుతానుభావో వ్యసనం హి పుంసామ్
ప్రవిశ్య చిత్తం విధునో త్యశేషం యథా తమోఽర్కోఽభ్రమివాతివాతః. "

— (12-12-47)

భాగవతమున విష్ణుభక్తికి - విశేషించి కృష్ణభక్తికి ప్రాముఖ్య మీయబడినది. పరమాదర్శప్రాయ మగు నిర్మమ నిష్కర్మసంగి భక్తి మార్గ ప్రవర్తకులుగ సదా కృష్ణచేతను లగువృష్ణివరులు చిరస్మరణీయులు. — (భా. 10-90-46)

" లలితస్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, సం
జులతా శోభితమున్, సువర్ణ సుమన స్సుజ్జేయమున్. సుందరో
జ్జ్వలవృత్తంబు, మహాఫలంబు, విమలవ్యాసాల వాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్వీన్ సద్విజశ్రేయమై. "

— (ఆం. భాగ. అవతారిక. 22)

నిజముగా భారతీయ భక్తి వాఙ్మయ నందనారామమున భాగవతము కల్పవృక్షమే యగును.

విశిష్టాద్వైతము - భక్తియోగము

భాగవత మతమును, భక్తి మార్గమును, సగుణోపాసన తత్త్వమును బహుధా సమర్థించినది విశిష్టాద్వైతము. వేదాదులందు మోక్ష సాధనములుగా ప్రతిపాదితములైన జ్ఞాన కర్మాదియోగములు రాను రాను జన సామాన్యమున కందని ద్రాక్షపండ్లయిపోయినవి. తర్క కర్కశము లగు నానేక న్యాఖ్యానములు వెలసి, వాని యర్థము దురవగాహ మైపోయినది. అనుష్ఠానము షట్పాట్యకమే యైనది. అపుడు గహనములైన ఆ వేదాంతార్థములకు బోధనా సుగమము లగు ఘంటాపథములు చీర్చుచు, పంచమ వేదమై వెలసినది మహాభారతము. భారత ప్రతిపాదితార్థ గ్రహణానుష్ఠానములును కాలక్రమమున కష్ట సాధ్యములుగా దోచినంతనే సద్యోపగమ్య మగు భక్తియోగమును ముక్త కంఠమున సముద్ఘోషించు భాగవత మతము బహుళ ప్రచారమునకు వచ్చినది. తత్ప్రచార ప్రాచుర్యమునకు పట్టుకొమ్మగా వెలసినాడు విశిష్టాద్వైత మత ప్రవర్తకు డగు శ్రీమద్రామానుజసూరి. ఆయన, కర్మ జ్ఞానాది యోగములు భక్తియోగమున కంగభూతములే యని నిరూపించుచు —

" మోక్షసాధన సామగ్ర్యాం భక్తి రేవ గరీయసీ. " *

అను సిద్ధాంతమును సాంగోపాంగముగ నిరూపించి స్థాపించెను. ఈ సిద్ధాంతమే ఆయన శ్రీ భాష్యరచనా సముద్దేశ సారాంశము. శ్రీ భాష్య ప్రార్థనా శ్లోకములోనే ఆయన —

---

* శ్రీ శంకరాచార్యుల వివేక చూడామణి : — సంపాదకుడు.

" .... బ్రహ్మణి శ్రీనివాసే
భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా. "

అని ప్రవచించియున్నారు.

భక్తి - కవిత

అది యెంత ప్రౌఢమైన దైనను, భక్తి రస ప్రసక్తిలేని యొక సామాన్య కావ్యమును జదువునప్పటికంటె భక్తిభావోజ్జ్వల మగునొక చిన్న కీర్తన విన్నను, ఒక శతకము చదివినను జాలును - ఆ యను భూతి మేల్తరముగ నుండును. పరమ నాస్తికులను హృదయ స్పంద నము గలిగించు భక్తి కావ్యములు గలవు. అయితే - ఇది భక్తి లేకున్నను స్వభావ సిద్ధముగ భావుక ప్రవృత్తి గలవారి మాట. భక్తికిని, కవితకును ఏదో సహజమైన మధుర బాంధవ్య మున్నది. కంటికిని నిసర్గ మధుర మగు మూగ్ధ్యము - నిగ్గుదేరిన ఆవేశము జీవ గఱ్ఱు. భక్తియు కవిత వలెనే హృదయ సంబంధమైన తత్త్వ మగుట దానికి వాఙ్మయ ప్రతిపత్తి సులభ సాధ్యము. కవితకు పుష్టి గూర్చు వస్తువులలో కడు దొడ్డది భక్తి. భక్తి వ్యక్తి విశిష్టమైన తత్త్వ మగుట - ఆ కవితయు దరచు ఆత్మాశ్రయ ఛక్కిక మైయుండును.

భక్తి రసవాదము

ఉత్తమ కవిత రస ప్రధానమైనది. రస రాజము శృంగారము. ఆ రస స్థాయి భావము రతి. దైవ విషయక మగు రతి భక్తి రసము నకు స్థాయిభావము. తద్విధ కథా ప్రతిపాదిత మధురార్థములే ఉద్దీపన విభావములు. భగవత్ స్మరణ విరహా ద్యనుభవములందు గలుగు రోమాంచాశ్రుతాపాదు లనుభావములు. హర్ష నిర్వేద శంకాదులు వ్యభిచారులు.

" విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రస నిష్పత్తిః. "

అని ముని వచనము. అది రస రాద్ధాంతముపై భరత వాక్యము. రస జనక సామగ్రి భక్తి పట్ల సమృద్ధిగనే కలదు. భరత మతము భక్తిపట్ల అన్వయించునట్లే యున్నది. కాని, భక్తి, రసత్వ యోగ్యత కలదనుట సర్వాంగీణమైన విషయము గాదు.

" రతి ర్దేవాది విషయా వ్యభిచారీ తథాంజితః భావః ప్రో క్తః. "

అనగా - దేవతా విషయ మగు రతియు వ్యభిచారులును భావ మని చెప్పఁబడును - 'ఇతి ప్రాచాం సిద్ధాంతమ్' - అని ప్రాచీన సిద్ధాంతము. అందుచేతనే కాబోలు - ధనంజయ హేమచంద్ర-మమ్మ టాది ప్రాచీనాలంకారికు లనేకులు భక్తిని భావమాత్రముగనే పరిగ ణించిరి. పిదపకాలమున ఈ పట్టు కొంత సడలినది. మధ్యకాలమున కొంద రాలంకారికులు భక్తిని శాంత రసాంతర్భావముగా పరిగణించు నట్లు తోచును. కాని —

" న చాఽసౌ శాంతరసే అంతర్భావ మర్హతి
అనురాగస్య వై రాగ్య విరుద్ధ త్వాత్. "

అనగా - భక్తి శాంత రసాంతర్భావము కాజాలదు. ఏల యన, భక్తి రస స్థాయి భావము అనురాగరూప మగు రతి. శాంతరస స్థాయి వైరాగ్యము. ఆ రెండును పరస్పర విరుద్ధములు - అని రస గంగాధర కారుని అభిప్రాయము. ఆ పండితరాయ మహాశయుడే తొలుత భక్తి పక్ష మవలంబించిన ట్లొక ప్రౌఢ వాదము జేసియు, తుదకు భక్తి రసత్వాంగీకారమును గంగలో ముంచినాడు.

" భగవ దాలంబనస్య, రోమాంచాశ్రుపాతాదిభి రనుభావితస్య, హర్షాదిభిః పరిపోషితస్య, భాగవతాది పురాణ శ్రవణ సమయే భగవ దృక్తే రనుభూయమానస్య దురపహ్నవత్వాత్, భగవ దనురాగరూపా భక్తి శ్చిత్రస్థాయి భావః. "

అని భక్తి రస సామగ్రీ సముద్దేశము విశదీకరించి —

" ఉచ్యతే భక్తి ర్దేవాది విషయ రతిత్వేన భావాంతర్గతతయా రసత్వానుప పత్తేః. "

అనగా – భక్తి భగవ ద్విషయక మగు రతి యగుట వలన భావమాత్రమే కాని, రసము గాదని చెప్పబడుచున్నది. అయితే —

" న తర్హి కామినీవిషయా యా అపి రతే ర్భావత్వమస్తు । రతిత్వాఽవిశే షాత్ । అస్తు వా భగవద్భక్తే రేవ స్థాయిత్వమ్ । కామిన్యాది రతీనాం చ భావత్వమ్ । వినిగమకాభావాత్. "

అనగా – రతిత్వా భేదమువలన భగవ ద్విషయక మగు రతి భావమైనచో భామినీ విషయకమైన రతియు భావమే కావలెనుగదా ! అసలు స్థాయి భావములలో నొకటిగా పరిగణింపబడిన రతి భగవ ద్విషయకమైన రతియే ఏల కారాదు ? భామినీ విషయక రతియే యేల కావలెను ? అనగా – శృంగారము రసము, భక్తి భావము మాత్రమే – అని కాక, భక్తియే రసము, శృంగారమే భావమాత్రము అని యేల యనరాదు ? అన్నట్లుగా నిట్లొక ప్రశ్న పరంపర కురి పించియు, చిట్ట చివరికి —

" భరత ముని వచనాన మేవ అత్ర రస భావాది వ్యవస్థాపకత్వేన స్వాతంత్ర్య యోగాత్. "

అని భక్తి రస వాదమును చల్లగా జారవిడచినాడు పండిత రాయలు. అయితే యిక్కడ పండితరాయలు —

" రతి ర్దేవాది విషయా వ్యభిచారీ తథాంజితః భావః ప్రోక్తః. "

అను వాక్యమునే తన వాద చరమ దశలో పరమ ప్రమాణముగా గ్రహించినట్లు తోచును కాని, అసలైన భరతాచార్యుని రస సూత్ర మునే గ్రహించియైనను భక్తి రసవాదము నతడు సమర్థింపదలచు కొన్నచో సమర్థింపగల విద్వద్ధురీణుడాయన. అందు మార్గాంతరమును లేకపోలేదు. ఆ మార్గాంతర సౌలభ్యమును వినియోగించుకొనినవారు ఉజ్జ్వల నీలమణీకర్త యగు రూపగోస్వామి, భగవద్భక్తి రసాయన కర్త యగు మధుసూదన సరస్వతి. భక్తి రసవాదముగూర్చి అంత దూరము పండితరాయలు ప్రౌఢవాదము చేసినా డనగా - అతని కాలములో ఆలంకారికులయందు భక్తి రస వాదమున కాలంబనము కొంత లభించియుండ వచ్చునని మన మూహింపవచ్చును. ఆ యాలం బనము రూపగోస్వామి - మధుసూదన సరస్వతుల చేతులలో మఱింత ప్రాబల్యము కూర్చుకొన్నది. ఇరువురును భక్తిని రసమాత్రముగా కాదు - రసరాజముగా నిరూపించినారు. అందులో భక్తిని రసముగా, సరసముగా ప్రథమతః ప్రతిపాదించిన గౌరవము రూపగోస్వామిది. దాని రసత్వ యోగ్యతను సాంగోపాంగముగా - సవిస్తరముగా ప్రమాణ ప్రమేయోపన్యాస పూర్వకముగా నిరూపించి స్థాపించిన గౌరవము సరస్వతిది. ఆయన —

" శోక క్రోధ భయాదీనాం సాక్షా త్సుఖవిరోధినాం
రసత్వ మభ్యుపగతం తథాఽనుభవమాత్రతః
ఇహానుభవ సిద్ధేఽపి సహస్రగుణితో రసః
జడే నైవ త్వయా కస్మా దకస్మా దపలప్యతే
రతిర్దేవాది విషయా వ్యభిచారీ తథాంజితః *

---

* 'తథోర్జితః' అనియు పాఠాంతరమున్నది. — సంపాదకుడు.

భావః ప్రోక్తో రసేనేతి యదుక్తం రస కోవిదైః
దేవాంతరేషు జీవత్వా త్పరానందాఽప్రకాశనాత్
తద్యోజ్యం పరమానందరూపే న పరమాత్మని
కాంతాది విషయా వా యే రసాభ్యా స్తత్ర నే దృశం
రసత్వం పుష్యతే పూర్ణ సుఖా స్పర్శిత్వ కారణాత్
పరిపూర్ణ రసా ఽుద్ర రసేభ్యో భగవ ద్రతిః
ఖద్యోతేభ్య ఇవాదిత్య ప్రభేవ బలవత్తరా. "

అని వక్కాణించియున్నాడు. అనగా - సాక్షా త్సుఖ విరుద్ధములయ్య అనుభవ మాత్రముచేతనే శోక క్రోధ భయాదులు రసములుగా పరి గణింపబడుచుండగా - అనుభవ సిద్ధమై, సహస్రధా రస్యమాన మగు చున్న భక్తిని రసముకాదని అపలపించుట తగదు. అది భావమాత్ర మని రసజ్ఞోవిదు లండ్రుగాక, జీవుని లక్షణములుగలిగి, పరమానందము గలిగింపజాలని యితర దేవతలపట్ల అది యట్ల కావచ్చును. కాని, పరమానంద స్వరూపు డగు పరమాత్ముని (శ్రీకృష్ణుని) పట్ల నట్లుకాదు (భావము కాదు, రసమే యగును.) కాంతాది విషయకము లగు రసము లందు పూర్ణ సుఖము లేదు. అవి యన్నియు క్షుద్ర రసములు. భక్తి యొక్కటే పూర్ణ రసము. అది ఖద్యోతములకంటె సూర్య కాంతి వలె కడమ రసములకంటె బలవత్తరమైనది - అని తాత్పర్యము.

నిజముగా భావుకుడైనవాడు భక్తిని రసముగా అంగీకరించు టయే లెస్స. భాగవతాది గ్రంథములలో కండపట్టు లగు కొన్ని ఘట్ట ములు చదువునప్పుడు కావ్య సామాన్యమైన అనుభూతికన్న మిన్న యగు తత్త్వ మేదో హృదయమును తాకుచుండును. ఇది భావుక ప్రవృత్తి సమృద్ధిగా నున్న వా రందరికిని అనుభవ సిద్ధ మగు విష యము. ఆ యనుభవమును సర్వాతిశాయియై, పరమానంద పర్యవ శాయి యగు రస స్వరూపమున జాలువారుచుండును.

మధుర భక్తి

రూపగోస్వామి – మధుసూదన సరస్వతులిరువురును భక్తి రస తాత్పర్యంగీకార విషయమున కృష్ణ విషయకమైన రతి మాత్రమే ఉపాదేయ మని యుద్ఘాటించిరి. కృష్ణభగవానుడు రస జగత్సమ్రాట్టు. అతని గూర్చిన భావన – భక్తి శృంగారముల సంగమ స్థానము. ఆ రసముల కది పరసీమ. రూపగోస్వామి పరిభాషలో మధురము, ఉజ్జ్వలము ననుపదములు భక్తి రస పర్యాయ వాచకములు. శృంగారము మధుర రసరాజ మనుట సర్వాంగీణమైన విషయము. ఉజ్జ్వల శబ్దము శృంగార పర్యాయ వాచి. (చూ. అమరకోశము) కృష్ణ సంబంధమైన భక్తి శృంగారముల భావబాంధవ్యము నిసర్గ మధురము, మనోహరము. అదే భారతీయుల భక్తి సంప్రదాయ మార్గములలో సర్వోత్కృష్టమైన మధుర భక్తికి మూలప్రకృతి; సార్థకమైన ఆ మహా రస రహస్యము. భగవంతునే పరమ ప్రాప్యుడైన ప్రియునిగా వలచి ఉపాసించుటయే మధుర భక్తి పరమార్థము. భక్తులైన కవుల ప్రవృత్తి గతమైన శృంగార లాలసయే భగవత్పరముగ ఆవిష్కృత మగుట, లేక శృంగారము సర్వప్రాణిహృదయ సద్యోగోచర మగునది కావున, అది యొక ఎఱుగా పాఠక హృదయములను భక్తి వైపాకర్షించుట అనునవి ఆ భక్తి రచనల యుద్దేశము కావచ్చును. మధుర భక్తి నిర్భరమైన హృదయమునుండి ప్రాదుర్భవించిన కవిత మధురాతి మధురము. ఆట్లు ప్రాదుర్భవించుటలో ఆ కవిత తరచు ఆపాత మధుర మగు గీతిధర్మము నాశ్రయించుచుండును. ఆ కోవకు చెందిన రచనలలో పదములు, కీర్తనల సంఖ్యయే అధికము. ఆ భక్తి తత్త్వమున కది సహజము. మన భక్తి వాఙ్మయమున మధుర భక్తి శాఖ దొక ప్రత్యేకత. అందును కృష్ణభక్తికే విశేష ప్రతిపత్తి, ప్రాధాన్యము. ఆ

వాఙ్మయ రస రాజము లగు భక్తి శృంగారములకును, సరస్వతీదేవి తీర్థప్రసాదము లగు సంగీత సాహిత్యములకును సంగమ స్థానము.

భక్తి వాఙ్మయము - భారత దేశము

బహుశః భారత దేశమున ప్రవర్తిల్లినంత వాఙ్మయము ఈ భూ ప్రపంచమున మరి యే దేశమునందున ప్రవర్తిల్లియుండదు. అది యీ విశాల భారతమున వివిధ భాషలు విలసిల్లిన మార్గములు బహు భంగులు. పూర్వకాలమున సర్వ భారతీయ వాఙ్మయమును – అంతో యింతో భగవత్పరమైనదే. ప్రతి కవియు మహాభక్తుడే. ప్రాయికముగా ప్రతి కృతియు భగవదంకితమే. అట నట నరాంకితము లున్నను – అవియు ప్రప్రథమున భగవ త్ప్రార్థన లేనిదే ప్రారంభమైనవి కావు. అయితే, ఆ గ్రంథము లన్నియు భగవ త్ప్రసక్తి లేనివి కావనియే గాని, అన్నియు భక్తి ప్రధానములైన రచన లని చెప్పుటగాదు.

భారత దేశమున అతి ప్రాచీనము, అఖిల ప్రాంతీయ భాషలకును అక్షరమైన సంస్కార భిక్ష పెట్టిన సంస్కృత వాఙ్మయమునందు భక్తి రచనలు సమృద్ధిగ నున్నవి. లీలాశుక జయదేవ తీర్థ నారాయణాదుల భక్తి రచన లెన్నియో అందు ప్రసిద్ధి వహించియున్నవి. లీలాశుకుని కృష్ణ కర్ణామృతము, జయదేవుని గీతగోవిందము, నారాయణ తీర్థుని శ్రీకృష్ణ లీలాతరంగిణి-మూఁకును మధుర సాహిత్యకోవకు మకుటాయ మానములైన రచనలు. అందు గీతగోవిందము రాధాకృష్ణ ప్రణయ వాఙ్మయమున కెత్తిన పతాక. కృష్ణ లీలా తరంగిణీ భాగవత సాగ రోన్ముఖముగా పరవళ్ళు త్రొక్కిన భక్తిభావ కూలంకష. ఆ యీ గ్రంథము లందలి ఒక్కొక శ్లోక మొక్కొక రసగుళిక. ఒక్కొక అష్ట పది యొక్కొక మధురోపనిషత్తు. ఒక్కొక తరంగ మొక్కక మోహన మంత్రము. ప్రప్రథమముగా భక్తి నొక మోక్షదాయక

మహాయోగముగా నుద్ఘాటించిన భగవద్గీత - గీర్వాణవాణీ వీణాక్వణన పాణింధమముగా వెలసినది. సర్వ భారతమును భక్తి బంధముతో నొక్క- కొలికికి తెచ్చిన భాగవతమును ఆ దైవభాషలో అవతరిల్లినదే. అది కేవలము భక్తితత్త్వాశ్రయమైనదేకాదు - కావ్యోచితపథ బహు విధ కథా విలసిత మగుట వలన, భవ్యకవితాశ్రయమును. అందుచే నది భారతీయ భక్తి వాఙ్మయ సర్వస్వ మగుటయే కాదు - అటు సాధారణ వాఙ్మయ కోటిలో చేర్చి చూచినను, సాహిత్య మకుట కోటీర మాణిక్యమే. ఇది ప్రాంతీయ భాష లన్నిట ననూదితమై, తర తరాలుగా ఇంటింట వెలుగై అలరారుచున్నది.

సంస్కృతమువలెనే భారతీయ భాషలలో మిగుల ప్రాచీన మైనది తమిళము. ద్రవిడ దేశమున వైష్ణవ మత ప్రవర్తకు లగు ఆళ్వారులు పన్నిద్దరు భక్తి మార్గ ప్రచారమునకు బాసటయై నిలిచి నారు. ఒక్కొక్కరి జీవితోదంత మొక్కొక లోకోత్తర భక్తియోగ సూత్రమునకు మహాభాష్యముగా - ఒక్కొక మహాకావ్యేతివృత్త ముగా భక్తి వాఙ్మయ భాండారమున కెత్తి నబావుటాగా పరిఢవిల్లిన మహా భాగులు వారు. తదుపరి విశిష్టాద్వైతముతో విశేషముగా కొన సాగిన భక్తి తత్త్వ ప్రచారము వీరశైవ విజృంభణతో పరాకాష్ఠ నందినది. అంతకుముందే ఆ యాళ్వారులు, ఈ నాయనారులు మొద లగు వైష్ణవ శైవ మతానుయాయు లగు నా మహానుభావులచే స్వయంవ్యక్తములైన భక్తి రచనలు, తదుపరి వారి జీవిత గాథలు, బోధలు నితివృత్తములుగా - పరంపరగా ప్రవృత్తములైన రచన లన్నియు గలిసి, దక్షిణ భారతమున నొక సువిశాలమైన భక్తి వాఙ్మయ కోశ మవతరిల్లినది. తమిళమున నీ యాళ్వారుల భక్తి గీతము లన్నియు నాలుగు వేల గ్రంథముగా - 'నాలాయిర దివ్య ప్రబంధ' మను పేర నాథమని సంకలితమై వెలయుచున్నది. ఇందు

దశావతార కథలకు, ముఖ్యముగా రామకృష్ణుల బాల్య క్రీడాదికము నకు ప్రాముఖ్యము. ఆ రచనలలో – తిరుమంగై, నమ్మ, పెరియ, పులశేఖరాళ్వారులవి సుప్రసిద్ధములు. పెరియాళ్వారు పుత్రి శ్రీ ఆండాళు (ఆముక్తమాల్యద, గోదాదేవి) శ్రీరంగనాథునే ప్రియునిగా నలచి, మధుర భక్తితో భావిత మంత కన్యగా గడపిన మహానుభావ. ఆమె చెప్పిన 'తిరుప్పావై' ఇప్పటికిని దాక్షిణాత్య వైష్ణవులయింట నిత్య పారాయణుల నెగడుచున్నది. ఇట్లు – తమిళమునగల శివభక్తి వాఙ్మయమున ముఖ్యముగా పేర్కొన దగినవి నంబి ఆండార్ నంబి ప్రారంభించిన 'తిరుముఱై' శైవసిద్ధాంత ప్రచారమున కవలంబముగా వెలసిన సంబంధర్, అప్పర్, సుందరమూర్తి నాయనారుల తేవారము, మాణిక్య వాచకర్ తిరువాశగమ్ తిరుమోక్కాయి, తిరుమూలర్, తిరు మందిరము మొదలగు ఆరువది ముగ్గురు నాయనారుల చరిత్రముగా వెలసిన పెరియ పురాణము తమిళ శైవ వాఙ్మయమున శిఖరప్రాయ మగు రచన.

కన్నడమున బసవేశ్వరునిచే, తవసుయాయులచే వీరశైవ వాఙ్మయము విశేషముగా ప్రవర్తిల్లమైనది. జన సామాన్యమున మత ప్రచార సౌలభ్యమున్కై వచన గ్రంథము లెక్కువగా వెలసినవి. పతాదృగ్గ్రంథసృష్టిలో అక్క మహాదేవి మొదలగు కవయిత్రులును పాల్గొనియుండుట విశేషము. కన్నడ శైవ వాఙ్మయమున కడమ ప్రక్రియలకును విశేష ప్రవక్తి గలదు. అయితే, ఆ వాఙ్మయ మంతటిని భక్తి వాఙ్మయ మనజెల్లదు. భక్తి ప్రబోధాత్మకమైనను అధికముగా దానిని మత ప్రచార వాఙ్మయ మనియే యనవలెను. అందు ముఖ్యములైన కొన్ని భక్తి రచనలు :- హరీశ్వరుని పంపా

శతకము, గిరిజాకల్యాణ చంపువు, శివగణ దరగళె గళు, శాఖువాంకుని సిద్ధారామ పురాణము, శరభ చరిత, భీమకవి బసవ పురాణము, చామరసుని ప్రభులింగలీల, విరూపాక్ష పండితుని చెన్నబసవ పురాణము మొదలగు ఆంధ్ర శివ కవులలో సగ్రగణ్యుడగు పాల్కురికి సోమనారాధ్యుని ప్రభావము కన్నడమునను బాగుగ గలదు. అతని బసవ పురాణాదులు కన్నడింపబడుటయే కాదు – అతడు కన్నడమున స్వయముగా శీలసంపాదనె, సహ్యసగణనామ, పంచరత్న మొదలగు గ్రంథములను రచించి యుండెను. కన్నడ వైష్ణవ వాఙ్మయమున భక్తి ప్రచురములగు గీత రచనల కెక్కువ ప్రాముఖ్యము. అందు నరహరితీర్థుని విష్ణుకీర్తనలు ప్రాచీనములు (క్రీ. శ. 1280 ప్రాంతము). క్రీ. శ. 1510 ప్రాంతమున శ్రీ చైతన్య మహాప్రభువు విజయనగరమునకు విచ్చేసిన కాలమున కన్నడ దేశములో మధ్వాచార్య ప్రవర్తితమైన వైష్ణవోద్యమమున కొక నూతనోత్తేజము గలిగెనది. అది కన్నడమున 'దాస వాఙ్మయ' మను పేర విశేష ప్రసిద్ధి నందిన వైష్ణవ భక్తి గీత సాహిత్యము ప్రాదుర్భవమునకు దారి తీసినది. ఆ దాస వాఙ్మయ ప్రవర్తకులలో సగ్రగణ్యులు పురందరదాసు, కనకదాసు. కన్నడ దేశమున వారి పాటలు వినబడని తావులేదు.

మలయాళమున అంత ప్రాచీన కాలములో వాఙ్మయమే లేదు. అచటలు కొన్ని ఆంధ్రములందు వాఙ్మయావిర్భావము జరిగిన నాటికి మలయాళ భాష కే స్థితి వ్యవస్థలు లేవు. క్రీ. శ. 14 – వ శతాబ్దినుండి కొంతె వాఙ్మయ సృష్టి జరిగినది. అందు గల కొలది భక్తి రచనలలో ముఖ్యమైనవి భద్రకాళిప్పాట్టు, తిరువాదిరైప్పాట్టు, చెరుస్సేరి నంబూద్రి రచన, కృష్ణగాథ, తుంచత్ రామానుజ ఎళుత్తచ్చన్ రచనలు కిళిప్పాట్టు (చిలుక పాటలు), హరినామ కీర్తనము, కృష్ణనాట్టం హరి కథలు మున్నగునవి.

తెలుగు దేశమునను శైవ వైష్ణవముల ప్రచారము సాగినది. భక్తి వాఙ్మయము ప్రక్రియా వైవిధ్యముతో బహుళముగా ప్రవర్తిల్లినది. అయితే – మన శివకవుల రచనలలో మత ప్రచార స్థానమే అధికము. అందందు భక్తికిని ప్రసక్తి లేకపోలేదు. అట్టివానిలో ముఖ్యములైనవి కొన్ని :– మల్లికార్జున పండితారాధ్యుని శివ తత్త్వ సారము, పాల్కురికి సోమనాథుని వృషాధిప శతకము, బసన పురాణము, యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకము మొదలగునవి. వైష్ణవ వాఙ్మయములో భక్తికి విశేష ప్రాముఖ్యము. తెలుగు దేశమున బహుళ భక్తి వాఙ్మయ ప్రవర్తకులైన వైష్ణవ కుటుంబముల వారిలో తాళ్ళపాకవారు సుప్రసిద్ధులు. వారు హరికీర్తనాచార్యులు. వేల కొలది పదములను, కీర్తనలను రచించి, కీర్తన వాఙ్మయమునకు పట్టుకొమ్మలైనవారు. తదితర రచనా ప్రక్రియలను యథోచితముగ సాధించినవారు. వారిలో అన్నమాచార్యులు, చెవతిరుమలయ్య, చిన్నన్న యను వారు ముఖ్యులు. వారి దెక్కనగా మధుర భక్తి సంప్రదాయము. కందాళ వైష్ణవ కుటుంబమువారును కవిత చెప్పనేర్చిన తమ శిష్యులను ప్రోత్సహించి, అనేక భక్తి రచనలు వెలయింపజేసినారు. ఇంకను – భక్తి తత్త్వము నెడ ప్రత్యేకమైన ఆసక్తి ప్రకటించి, తమ రచనలలో ఆ తత్త్వమును ప్రతిఫలింపజేసిన ప్రసిద్ధులైన మన మహాకవుల విషయము :– తిక్కనామాత్యుడు హరిహరాద్వైతమును స్థాపించి, అనాటి అస్తవ్యస్త మత వ్యవస్థను చక్కదిద్దగల ఒక మహత్తర సందేశము నాంధ్రజాతి కందజేసినాడు. అర్వాచీన కవులును కొంద రా మార్గము ననుసరించిరి. ఎఱ్ఱాప్రెగ్గడయు శంభుదాసు డయ్యు హరివంశ నృసింహ పురాణములను విష్ణు మాహాత్మ్య ప్రతిపాదక గ్రంథములను రచించినాడు. శ్రీనాథుడు హరవిలాస భీమ ఖండ కాశీఖండాది రచనలు చేసి, శివపారవశ్యమును – శివక్షేత్ర మాహాత్మ్యమును ప్రబోధించినాడు. పోతనామాత్యుడు తొలి భాగమున

తానువాదముచే అభిలాంధ్రమునను అఖండవర్తిగా భక్తిదీపమును నిలిపిన మహానుభావుడు. శ్రీ కృష్ణదేవరాయలు వైష్ణవ వాఙ్మయ సంతాన ఫల మగు గురుపరంపరా ప్రభావ ప్రసాదముగా అముక్త మాల్యద ననుగ్రహించినా డాంధ్రజాతికి. ధూర్జటి కాళహస్తీశ్వర శతకము పరశ్శతముగా తెనుగున గల భక్తి శతకముల కెల్ల తల మానికమైనది. అల్లే - అతని కాళహస్తీశ్వర మాహాత్మ్యము క్షేత్ర మాహాత్మ్యములలో నగ్రగణ్యమైనది. మధుర భక్తి సంప్రదాయ మున కథిష్ఠాన దైవత మగు మాధవుని హృదయేశ్వరియైన రాధిక కావ్య నాయికగా ప్రప్రథమున ఆంధ్రములో రసోత్తరముగా శ్రీ రాధామాధవ ప్రణయ ప్రబంధమును రచించినాడు చింతలపూడి ఎల్ల నార్యుడు. ప్రతి పద మధుర భక్తి బంధురములు - సూక్తి సుందర ములు నగు మువ్వగోపాల పదముల గాన ప్రతి ధ్వానములతో దివ్య గంధర్వ లోకము నాంధ్రసీమకు దింపినాడు క్షేత్రయ. నిధి తన పన్నిధికి వచ్చినను నిరాకరించి, భగవ త్సన్నిధినే తన జీవిత పరమావధిగా నెంచి, బ్రతుకంతా రామకీర్తనగా గడపిన మహానుభావుడు త్యాగయ్య. అతని కృతులు యావ ద్దక్షిణ భారతమును భక్తి సంగీత భంగీ తరంగితముగా నొనర్చినవి. అతడు వందలకొలది సంగీత కృతులనే కాక, నౌకా చరిత్ర మను నొక గేయ ప్రబంధమును, ప్రహ్లాద భక్తి విజయమను నొక నాటకమును అపూర్వ రస భావ భాగవతములుగా రచించినాడు. ఇట్లింకను గల కాంధ్రమున భక్తి రచన లనేక ప్రక్రియల సంతరించినవారు - ఎందరో మహానుభావులు. ఆ యా భక్తి రచనలకు జన సామాన్యమున బహుముఖ ప్రచారము గలిగించినవారు - ఆచార్యులు, పూజారులు, పౌరాణికులు, కూచిపూడి భాగవతులు, జంగాలు, జక్కులు, గొల్ల భాగవతులు, బవినీండ్రు, గొరగలు, దాసరులు, సాతాని జియ్యరులు, గుడిచేటులు (దేవదాసీజనము), హరి దాసులు (హరికథకులు) మొదలగువారు,

అటు ఉత్తర భారతమునను భక్తి వాఙ్మయము బాగుగా వెల్లి విరిసినది. తులసీదాసు, సూరదాసు, కబీరు ప్రభృతులవలన హిందీ వాఙ్మయము – నామదేవ్, తుకారామ్, సమర్థ రామదాసాదుల వలన మరాటీ వాఙ్మయమును, విద్యాపతి ప్రభృతులవలన మైథిలీ వాఙ్మయమును భక్తి తత్త్వ శబలితములైనవి. బంగాళమున ఉమాపతి, జయదేవ, పోయీకవులు, చండీదాసు, చైతన్యుడు మొదలగువారి వలన కృష్ణభక్తి రచనలు కోకొల్లలుగా వెలసి – 'కానూబినా గీత్ నై' (కృష్ణుడు వినా గీతము లేదు) అనున దొక నానుడి యైపోయినది. గుజరాతు సరేసరి – అది కృష్ణావతార క్రీడారంగము. అక్కడ కృష్ణభక్తి వాఙ్మయమునకు కొద వేముండును ? ఏనాడో ఆ మధుర – బృందావన సీమలలో మాగ్రోగిన మీరాబాయి భక్తి గీతములు, ఆ గీతములలో ప్రతిధ్వనించిన ఆ మహాభక్తురాలి మధుర హృదయ సంస్పందనములు తరతరముల నుద్రుతి లూగించుచున్నవి. గుజరాతులో వల్లభాచార్యుడు (ఇతడు తెలుగువాడట) ప్రారంభించిన 'పుష్టిమార్గము' అనే నూతనోద్యమము భక్తుని సర్వస్వము కృష్ణార్పణము కావలెనను సిద్ధాంతము గలది. దీనికి విశ్లదాస ప్రభృతుల వలన విశేష ప్రచారము గలిగినది. అనుయాయులనేకు లెప్పుడిరి. వారిలో గోసాలదాసను నాయన వల్లభాఖ్యాన మను కావ్యమును రచించినాడు. నరసింహ మెహతా అను నాయన వల్లభ మతమును మధుర భక్తి సంప్రదాయమును మేళవించి, అనేక భక్తి శృంగార పదములను రచించినాడు. గాంధీమహాత్ముని ప్రార్థన గీతమైన 'వైష్ణవ జనతో' పేనే కహీఏ' అనునది మెహతా రచనయే. ఈయన పదములే కాక, రసవదాఖ్యానములును కొన్ని రచించియుండెను. అన్నియు భక్తి గర్భితములే. కొన్ని భాగవతేతి వృత్తములు. 'సురత సంగ్రామ' మనునది అతని రచనలలో అతి స్వతంత్రమైన పోకడగల ఉత్తమ భక్తి కావ్యము. ఇతని గురించి, అద్భుత గాథ లనేకము గుజరాతునిండ అల్లుకొన్నవి. అయితే – అవి

అర్వాచీన కవులకు కావ్య వస్తువు లగుట విశేషము. నరసింహ మెహతా అనుయాయులలో ప్రేమానంద దయారాము లను భక్త కవులు ముఖ్యులు; ప్రసిద్ధులును. సిద్ధాంత రీత్యా వల్లభ మతము గొప్పదేకాని, రాను రాను - ఆచరణలో ఆచార్యుడే ప్రజవల్లభు నంశావతార మను విశ్వాస మతని అనుయాయులలో ప్రబలి, అవి యంతట బోక, వారును వీరును - కృష్ణుడు, గోపికలవలె రాసక్రీడ లాడ దొడగిరి. (చండీదాసు 'సహజయాన' సంప్రదాయముగూడ నించుమించు చట్టిదే.) అంతట నా మతమును వెల్లి తలలు వేయదొడగి నది. అయితే - అది గుజరాతులలో విశాలమైన మధుర భక్తి వాఙ్మయము వెలయుటకు దోహదము చేసిన విషయము విస్మరింప రానిది.

ఉత్కళ దేశమునను వంగదేశమునందువలె రాధాకృష్ణ ప్రణయ సంబంధియైన భక్తి వాఙ్మయమునకు ప్రచారము సాచ్చు. అంద ముఖ్యముగా పేర్కొన దగిన కావ్యములు కొన్ని :- కవి సూర్య బల దేవ రథ్ మహాశయుని 'కిశోర చంద్రానన చంపువు', అభిమన్యు సామంత సింహార్ 'బిదగ్ధ చింతామణి', దీనకృష్ణ దాసుని 'రాస కల్లోల' మొదలగునవి.

ఇట్లే - ఉత్తర భారతమున ఇతర ప్రాంతములందును ఇతర భాషలలోను భక్తి వాఙ్మయము కొంత కొంత ప్రవర్తిల్లినది. అయితే - పైని పేర్కొనబడిన భాషలలో గల భక్తి వాఙ్మయమున కున్నంత ప్రసిద్ధి-తత దితరమున గానరాదు. ఉత్తర భారతమున 'సూఫీ' తత్త్వ మొకటి ఉర్దూ హిందీ పంజాబీ మొదలగు భక్తి వాఙ్మయ ప్రభవమునకు కొంత దోహదము చేసినది.

ఆధునిక యుగమున పాశ్చాత్య సంస్కార ప్రభావ మధికమై, మన రచయితల దృక్పథము బహుధా విభిన్నతమైనది. వారి అభిరుచు

లలో – ఆశయములలో – వస్తు స్వీకరణలో – రచనా శిల్పికలలో వినూత్నతయు, వైవిధ్యము నధికముగా గోచరించుచున్నవి. భగవచ్చింతన తగ్గి, మానవ సమాజమువైపు రచయితల చూపు పయనిస్తు చున్నది. నాస్తికతయు బాగుగా ప్రబలినది. ఆస్తిక్యము కొందరిపట్ల నున్నను, అది హృదయములకు మాత్రము పరిమితమై, రచనలలో ప్రసరించుట మందగించినది. భక్తి రచనల ప్రాబల్యము నానాటికి పలుచబారిపోవుచున్నది. అయితే ఒక మాట :- పూర్వకాలమున సర్వ భారత మందును వివిధ భాషలలో రకరకములైన ప్రక్రియల ద్వారా రసనంతమైన వాఙ్మయము విశేషముగా ప్రవర్తిల్లి యుండుటకు మూలకారణములైన వానిలో ముఖ్యమైనది భక్తి యను విషయము సహృదయు లందరును అంగీకరింపదగినది. అది – సాహిత్యమును ప్రజా సన్నిహితము చేయుట కెంతగనో తోడ్పడినది.

భక్తి వాఙ్మయ ప్రక్రియలు - తత్త్వానుశీలనము

భారతీయ భక్తి వాఙ్మయమును పరిశీలించినచో ఆ రచనా ప్రక్రియలలో విశేష వైవిధ్యము గోచరించును. సాధారణముగా వాఙ్మయములో ప్రక్రియా వైవిధ్యమున కెంత యవకాశ ముండగలదో – అంతయు భక్తి వాఙ్మయమున గన్పట్టును. రచనా ప్రక్రియనుబట్టి వాఙ్మయ మంతయు ముప్తైరగులు – పద్యము, గద్యము, గేయము. ఈ మూడింటి న్యూన్ప ప్రయోగమునగాని, సమవాయ ప్రయోగమునగాని అనేక రచనాశిల్పికలు ద్యోతకమగును. పద్య కేవలములు శతకాదులు. గద్య కేవలములు చూర్ణికలు, వ్యాఖ్యానములు, విన్నపములు మొదలగునవి. గద్య పద్యోభయాత్మకములు చంపువులు. చంపూ రూపమున అనేక కావ్య ప్రబంధములు, పురాణ స్థల పురాణములును వెలసినవి. గేయ ప్రయోజనాత్మకములు దండకములు, తేవారములు, పాశురములు, అంక మాలికలు, త్రిపదము,

చతుష్పదులు, షట్పదులు, సప్త పదులు, అష్ట పదులు, రగడలు, ఏలలు, త్రిభంగులు, ధవళ శోభనములు, మేలుకొలుపులు, పదములు, గరబీలు, కృతులు, కీర్తనలు ఇత్యాదు లెన్నో గలవు. పద పద్యము లకు నడిమివాటముగా నడచునట్టివి ద్విపదాదులు. పద్య గేయాత్మక ములు ఉదాహరణములు. పద్య గద్య గేయాత్మకములు యక్షగాన ములు, ఏకాంతసేవాది ప్రబంధములు, హరికథలు మొదలగునవి. ఈ ప్రక్రియ లన్నిటను ఇతోధికముగ వివిధ భారతీయ భాషలలో భక్తి రచనలు వెలసినవి. (ఒక్క తెనుగునందును ఇంచుమించి చివి యన్నియు గలవు.) ఇందు దండకములు, అంకమాలికలు, తేవారములు, చూర్ణికాదులు - కేవలము స్తోత్రప్రాయ రచనలు. మేలుకొలుపులు, ధవళ శోభనాదు లొపచారికగీతాలు, చంపకములు, యక్షగాన హరికథాదులు కథాత్మకములు. శతక విన్నప కీర్తనోదాహరణాదు లనలైన భక్తి రచనలు. అవి కేవల స్తుతిపరములుగాక, కథాలంబనమును లేక నిసర్గ మనోహరముగా భక్తుకుని కవి యొక్క అనుభవము, అభినివేశముల ప్రేరణతో అతని హృదయమునుండి ప్రసవించిన భక్తి రస సంస్కృతములు. అందును, కీర్తనల యాపమున నున్న భక్తి రచనలకు ప్రచార మింతయు నంతయును గాదు. ప్రాచీన కాలమున భరతవర్ష మంతయు మహర్షుల ఉపనిషత్సూక్తములందువలెనే భక్తి - గీతమాధుర్యల లోలలాడినది. శతకములు సంస్కృత వంగ తమిళ కర్ణాటాంధ్రాది భాషలందు గలవు. అందు నీతి శృంగారాది భావాత్మకము లనేకము గలవు. అందులో భక్తి శతకముల దొక ప్రత్యేకత. అవి ప్రాయికముగా కపీష్టదేవతా మకుటములతో, భగవత్సంబుద్ధులతో, కర్తృ భావసాపేక్షములైన భక్త్యనుభవావేశాభివ్యక్తులతో వెలయు చుండును. భక్తి వచనములలో చూర్ణికలు, తేవారములు అనునవి కేవల స్తుతిపరములు. విన్నపము లట్లుగాక, వచన రచనలయ్యు ఒక చక్కని తూగు, సంగీతపు హొయలు గలిగి, భక్తి సూన్నతముగా -

భావ ప్రధానముగా నడచు భావ గద్యలు (Lyrical Prose). తెలుగున గల కృష్ణమాచార్యుని సింహగిరి నరహరి గీతములు మొదలగునవి ఈ కోవకు చెందునట్టివి.

ఇక ఉదాహరణాది కతిపయ ప్రక్రియలగూర్చి ప్రత్యేకముగా చెప్పవలసినది కొంత గలదు.

ఉదాహరణము

మన తెలుగున గల భక్తి వాఙ్మయములో ఉదాహరణ మొక విశిష్ట రచనా ప్రక్రియ. మన వాఙ్మయ మంతయు మొదటినుండియు మార్గదేశి భేదముచే ద్వివిధముగా ప్రవర్తిత మగు చున్నది. అందు మార్గసాహిత్యము పద్య ప్రధానమైనది. గేయ ప్రాముఖ్యముగలది దేశి. పద్య ప్రభేదము లగు వివిధ వృత్తములకును, గేయ ప్రభేద మగు రగడ యొక్క వికృతి వైవిధ్యముగల రచనా విశేషము లగు కళికోత్కళికలకును సమాన ప్రతిపత్తి గలిగి, మార్గ దేశి శాఖల కేక వాక్యత ఘటించిన ట్లవతరించిన సాహిత్య ప్రక్రియ ఉదాహరణము. ఆ కళికోత్కళికలు మధుర కవితా శాఖకు చెందిన గీత రీతు లగుటచే, ఉదాహరణము సంగీత సాహిత్యములకును నొక మధుర బాంధవ్య మును సంఘటించిన దనవచ్చును. అట్లే – మానవ జీవితములో మహత్తర విషయము లగు కవిత, భక్తి, సంగీత ప్రియముల కైక్య సిద్ధి ననుసంధించిన దీ యుదాహరణమే.

భగవన్మాహాత్మ్యము నుదాహరించు స్తోత్ర ప్రాయమైన రచన కావున నీ కావ్య ప్రభేదమునకు ఉదాహరణ మను పేరు ఉచితము. సార్థకమును. అస లాదికాలమున సర్వ వాఙ్మయ స్తోత్ర ప్రాయముగనే,

గేయ రూపముగనే ఆవిష్కృత మైనది. ఉదా : మన వేద ఋక్కులు, సామలు; గ్రీకుల డిథేరాంబ్ మొదలగునవి. ఈ ముదాహరణము దొక ప్రత్యేకత. కాలక్రమమున వాఙ్మయము స్తోత్ర రూపమాత్రము గాక, నైక వస్తు వర్ణనాఖ్యానపరిణతమై, వైవిధ్య రమణీయమై, అనేక కావ్య ప్రక్రియల రూపమున వ్యాప్తి గాంచినది. కాని, ఉదాహరణము కూడ కాలక్రమమున కేవల భగవన్మాహాత్మ్య ప్రతిపాదకముగా మాత్రమే కాక, మహనీయు డగు నొక మానవ మాత్రుని ప్రశంసకును తావలమైనదిగా పరిణమించి యున్నను, నాటికి, నేటికిని దాని ఆద్య ప్రకృతి యగు స్తోత్ర ప్రాయత్వ ధర్మమునకు క్షతి కలుగలేదు.

ఉదాహరణము స్తోత్ర ప్రాయ రచన మనగా – ఉత్త సాధారణ స్తోత్రము గాదు. అది యొక విశిష్టమైన రచనా పద్ధతి, నిబద్ధతయు కలది. సప్త విభక్తులు, తదుపరి సంబోధనా ప్రథమను గ్రహించి, వరుసగా నొక్కొక దానియం దొక్కొక పద్యము. వెనువెంట నవవిధ రగడలలో నొక రగడను గ్రహించి – అందొక కళిక, కళిక ఏ రగడ ప్రభేదమునకు చెందునో అందే ఆ కళికలో సగ మగు నొక యుత్కళిక, అదే విభక్తిలో అనగా – నొక్కొక విభక్తి లో నొక పద్యము, ఒక కళికయు, ఒక ఉత్కళికయు గలిసి యొక ప్రమాణాంశ (unit) గా జెప్పినచో – ఇట్టి వెనిమిది ప్రమాణాంశలు, మీద నొక సార్వ విభక్తిక పద్యమును గలిసి యొక ఉదాహరణ మగును.

ఈ యుదాహరణ కావ్య మహత్త్వ రహస్యము నిట్లూహించినా రాధుని ఓదాహరణక ర్తలలో నగ్రగణ్యు లగు కవి సమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు :– 'జగత్తంతయుఁ గ్రియారూపము.... ధాతువు సర్వదా విభక్త్యాశ్రయము....అందుచేత నన్ని విభక్తులతోఁ

బరమేశ్వరుని జెప్పినప్పుడు భగవంతుఁడు సర్వ క్రియాస్థాన భూతుఁడని వ్యంగ్యము.' మరి నే నిట్లనుకొందును :- ఉదాహరణము విభక్తి విశిష్టమైన రచనయే కాదు; భక్తి ప్రధానమును. భగవత్సాయుజ్యమే భక్తుని కపేక్షితము. కాని, అది సిద్ధించునందాక భగవంతుఁడు వేఱు; భక్తుఁడు వేఱు. భగవత్సాయుజ్య సిద్ధికై భక్తుడు చేయు సాధనయే భక్తి ప్రకటనము. అది స్తోత్ర రూపమున ఆవిష్కృత మగును. అనగా- స్తోత్రము నుదాహరించినవాఁడు వేఱు; అం దుదాహృతుఁడైనవాఁడు వేఱు. ఈ యర్థమునే విభక్తి తత్త్వము, తత్సంభావ మగు నుదాహరణము విశేషీకరించుచున్నవి. అనగా - అదియే ద్వైత విశ్వాస ప్రతిపత్తి. అది లేక భక్తి కర్థము లేదు. ఈ విభక్తి తత్త్వ పురస్సర ముగ భక్తిని ప్రకటించుటయే ఉదాహరణ కావ్య పరమార్థము.

ఈ యుదాహరణ రచనలు క్రీ. శ. 13 - వ శతాబ్ది నుండియే ఎక్కువగా తెలుగు భాషయందు మాత్రమే కన్పట్టుచున్నవి. పాల్కురికి సోమనాథుడు రచించిన బసవోదాహరణమే ఆఱు సంస్కృతమునను, ఇఱు తెనుగునను మొట్ట మొదటిది. క్రీ. శ. 1700 ప్రాంతమున సంస్కృతములో మఱి రెండుదాహరణములు మాత్రము వెలసినవి. అం దొకటి - తెలుగు వాఁడైన ఓరుగంటి రామయామాత్యుడు రచించిన శివోదాహరణము. రెండవది - మైసూరులో తిరుమలార్య డను నతడు రచించిన చిక్కదేవరాయోదాహరణము. (ఇది భగవత్పరము గాదు, రాజపరము.) తెనుగున మాత్రము పాల్కురికి సోమనాథుని నాటినుండి ఇప్పటిదాక ప్రతి శతాబ్దియందును ఎడ తప్పక యొకటో - రెండో ఉదాహరణములు వెలయుచు వచ్చినవి. ఒక 20-వ శతాబ్దియందే ఇప్పటి కైదుదాహరణములు వెలసినవి. తెనుగున ఇప్పటికి వెలసినవానిలో మొట్టమొదటిది వీరశైవ మత ప్రవర్తకు

డగు బసవేశ్వరుని గూర్చినది. కాగా, చిట్ట చివరిది విశిష్టాద్వైత ప్రవర్తకు డగు రామానుజాచార్యుని గూర్చినది. (శ్రీమాన్ చెలమచెర్ల రంగాచార్య కృతము) *

పల్లకి సేవా ప్రబంధము

క్రీ. శ. 16-17 శతాబ్దుల సంధి కాలమున తంజావూరిలో మహారాష్ట్ర ప్రభువుల యాస్థానమున పల్లకి సేవా ప్రబంధము లను భక్తి ప్రబంధములు రచనలో యక్షగానపు బాణీని పోలినట్టివి కొన్ని వెలసినవి. అందు శహాజీ కృతములుగా విష్ణు పల్లకి, శంకర పల్లకి సేవా ప్రబంధములు రెండు తెనుగున ఉపలభ్యము లగు చున్నవి. వానిలో నాయికలు (లక్ష్మియో, గౌరియో) నాయకులపాలికి చెలికత్తెలను పుత్తెంచుట. వారు పల్లకీలపై స్వామివారి సన్నిధికి తోడ్కొని వచ్చుట, అచ్చట అయ్యవారి యారగింపు సేవ, ఉభయుల పవళింపు సేవ ఇత్యాదులు ప్రవర్తితము లగుటయు విషయము. ఈ ప్రబంధములు నిన్న మొన్నటిదనుక తంజావుర పరిసర దేవాయతనములలో ఉత్సవ సందర్భమునందు ఆటు నిటు రెండు కోవలుగా పల్లకి బోయీల పాత్రలు ధరించిన నట్టువరాండ్రచే సాభినయముగ, సంవాద రూపమున ప్రదర్శింపబడుచుండెడివట. ఇవి ఉత్సవ దిదృక్షువు లగు భక్తజనుల హృదయములం దొక మధుర భావోత్సుకతా ప్రరోచన చేయజాలి, చూడ ముచ్చటగా నుండునట.

---

* ఇది - 'శ్రీమద్రామానుజోదాహరణ' మను శీర్షికతో - శ్రీ రామానుజ కీర్తి కౌముది - ఏడవ భాగమున ప్రకటింపబడినది. — సంపాదకుడు.

ఏకాంత సేవ

ఏకాంతసేవ యనగా - నిత్యార్చన సాగు దేవాయతనములలో ముఖ్యముగా భోగ నిలయము లగు వైష్ణవాలయములలో రాత్రి గుడి తలుపులు మూయుటకు ముందు అర్చకులు యథావిధి నుపచరించి, అమ్మవారి స్వామివారి యుత్సవ విగ్రహములను పానుపుపై పవళింప చేసి, గుడిచేటులు లాలిపాటలు పాడి, ద్వారపాలన నిమిత్త మష్ట దిక్పాలకులకు బహు పరాకులు చెప్పి వెడలి పోగా, ఇక నమ్మవారు స్వామివారికి చేయునదిగా ఊహింపదగిన పర్యంక సపర్య. అది యొక మధురాతి మధురమైన సేవ. అది యొక మహారాజునకు భృత్యమాత్రుడు చేయుదాని కంటెను. ఎన్నియో మఱుంగులు దొడ్డది. అట నాజ్ఞ లేదు. చిత్తము బత్తెము లసలే లేవు. అవి ఎదిరి ఆనందమునకు గాదు. ఆత్మ సంతృప్తికై మాత్రమే పచరించుకొనబడునది. తత్ఫలితము తత్రాపి సేవ్యుని చెందవచ్చుగాక. హృదయ నివేదనమే ఆ సేవ యందలి పరమాశయము. మధుర భక్తి ముదితాత్ములగు కవితంసులు కొందఱా సన్నివేశమును గ్రహించి, దానికి ప్రస్తావనగా ఇంత కథాంగము గల్పించి, నాయకుని వివిధోపచారములకు వివిధ గీత ప్రభేదములను ప్రయోగించి, ఏకాంతసేవా మకుటముతో ననేక మధుర గేయ ప్రబంధములు వెలయించిరి. అవి భక్తి శృంగారములకు, సంగీత సాహిత్యములకు నాలయములు.

ఈ యేకాంతసేవా ప్రబంధములు తత్త్వతః పల్లకిసేవా ప్రబంధముల వంటివే. యక్షగానములవలె నెట్టి రచనా విశేషమునైన నిముడ్చుకోగలట్టివి. ఈ కోవకు చెందిన రచనలు కొన్ని యక్షగానము లనియే వ్యవహృతము లైనవి. కొన్ని నాటక నామకరణముసే చేయించుకొన్నవి. ఈ జాతి కృతి రచన ఏమంత ప్రాచీనమైనదిగా

తోపదు. ఏ పందొమ్మిదవ శతాబ్దియందో యక్షగాన మొరవడిగా బయలుదేరిన దనుకొందును. అదియుగాక, తెలుగునందుమాత్రమే ఈ పేరిట ప్రబంధములు పది పండ్రెండు గన్పట్టుచున్నవి. ఉదా :- యడవల్లి సర్వేశ్వరశాస్త్రి ఉమామహేశ్వరై కాంతసేవ, మద్దిరాల వెంకటకవి ఏకాంత సేవావిలాసము మొదలగునవి.

హరికథలు

హరికథా కాలక్షేప సంప్రదాయము మనకు మహారాష్ట్రము నుండి సంక్రమించిన దనియు, ఇందులకు తుకారాముని అభంగములు మూలము లనియు, అభిజ్ఞుల భావన కావచ్చును. మరాటీ అభంగములు, తమిళ దేశము నందలి భాగవత కాలక్షేపములు, కన్నడ తాళమర్దళ, తెనుగు హరికథలు అన్నియు నొక్క కోవకు చెందునట్టివి. ప్రాయికముగా నన్నియు వివిధ భాగవతోపాఖ్యానము లితివృత్తము గలవి. రచనలో-యక్షగాన ప్రాయములు. దక్షిణ దేశమున నివి గత శతాబ్దిలోనే ప్రవర్తిల్లి, జన సామాన్యమున విశేష ప్రచారమును బొందినవి. గాన రూప కథాఖ్యానము వీని ప్రధాన స్వరూపము. భక్తి భావ ప్రబోధ లక్షణము వీని జీవ లక్షణము. భక్తి తత్త్వ వ్యాప్తికివి గొప్ప దోహదకారు లైనవి. కథాశ్రవణ ప్రవణమైన ప్రజాభిరుచికి చాల సంతృప్తినిగూడ ఒడ గూర్చినవి.

ఆరవ దేశమున గోపాలకృష్ణ భారతి, మళయాలమున కృష్ణన్ తంపి మొదలగు వారివలె ఆంధ్రమున హరికథా ప్రవర్తకులలో నగ్ర గణ్యుడు శ్రీమదజ్జాడాదిభట్ల నారాయణదాసు. ఆంధ్ర హరికథా పితామహుడతడు. హరికథా రచనమునందేకాక, ఆఖ్యానమునందును ఆరితేరిన జాణ డతడు. అతని హరికథ లాంధ్ర దేశము నందలి యూబాల గోపాలమును ఆనందాబ్ధి లోల లాడించినవి. ఆయనవి,

భాగేపల్లి అనంత రామాచార్య బాలాజీదాస ప్రభృతులవి హరికథ లాంధ్రమున వందకు పైచిలుకు గలవు. అం దెక్కు-న మహాభక్తులును, ప్రౌఢులు నైన పండితకవుల రచనలు. ఆ రచనా ప్రక్రియయు వివిధ గద్య పద్య గీతి రీతుల కాలవాల మగుట వలనను, విశిష్ట ప్రయోజనాత్మక మగుటయు హరికథలను గూడ ఉదాహరణాదులవలె పరిగణింపవచ్చును.

ఇట్లు బహు ముఖముల ప్రవృత్తమైన భక్తి తత్త్వము - భారతజాతిని, ఆ భక్తి రచనా పరంపర భారతీయ వాఙ్మయములను ప్రసీతము - పరిప్లుతము నొనర్చినవని నిరూపించుటయే ఈ విచార మొక్క- ముఖ్యోద్దేశము, ఈ భక్తి వాఙ్మయ శాఖల గూర్చి యింకను విపుల విమర్శయు, పరిశోధనమును బాగుగా జరుగవలసి యున్నది.

SVUORI LIBRARY

నామ సంకీర్తన మహిమ

'ఆర్షవిద్యాలంకార'

శ్రీ కల్లూరి చంద్రమౌళి, బి. యస్. సి.

★ ★ ★

భగవద్వైభవము

భగవంతుఁడు సర్వ వ్యాపకుఁడు; సర్వజ్ఞుఁడు; సర్వ శక్తి మంతుఁడు; సర్వాంతర్యామి; సృష్టి వ్యాపార కారణుఁడు. ఇట్టి భగవానుఁడు అనంత నామములతో నలరారుచు, ఆశ్రిత పారిజాతముగ విఖ్యాతి గాంచినాఁడు. ఇట్టి భగవానుని నామము – మహత్తర శక్తి సంభరితము; మహా ఫలప్రదము. కనుకనే —

" హరినామ కథన దావానల జ్వాలలఁ
గాలవే ఘోరాఘ కాననములు
వైకుంఠ దర్శన వాయు సంఘములచే
దొలగవే భవదుఃఖ తోయదములు

కమలనాభధ్యాన కంఠీరవంబుచేఁ
గూలవే సంతాపకుంజరములు
నారాయణ స్మరణ ప్రభాకర దీప్తి
దీఱవే షడ్వర్గ తిమిర తతులు

నలిన నయన భక్తినావచేఁగాక సం
సారజలధిదాఁటి చనఁగరాదు
వేయునేల ? మాకు విష్ణు ప్రభావంబు
వెలువడయ్య సూత ! ధీనమేత !!

(ఆంధ్ర మహా భాగవతము)

అని శౌనకాది మహా మునులు సూతమహర్షికి విన్నవించి, అతని వలన భగవద్వైభవమును అవగత మొనరించుకొని, భగవన్నామమును సంకీర్తించుచు, ఆ నామమునఁ గల మాధుర్యమును తనివిదీర నాస్వాదించి, ఆ మాధుర్యమును ప్రజ లందఱకును చవిఁ జూపిన మహానీయులు.

" ధీరులు నిరపేక్షులు నా
త్మారాములునైన మునులు హరిభజనము ని
ష్కారణము చేయుచుండురు
నారాయణుఁ డట్టివాఁ డనన్య చరిత్రా ! "

— (ఆంధ్ర మహా భాగవతము)

ఈ రీతిగా భగవన్నామ సంకీర్తనానంద లహరిలో నోలలాడిన ఆ మహర్షు లెంత ధన్యాత్ములో గదా !

నామ వైభవము

చిన్న వటబీజమున మహా వృక్షము దాఁగియున్నట్లు, సూక్ష్మమైన భగవన్నామమునందు మహత్తరమైన శక్తి ఇమిడి యున్నది. కనుకనే, భగవన్నామ సంకీర్తనాదులు స్వయం ప్రభావములై, సర్వ సంపూర్ణములై, సర్వ పాపహారకములై, సర్వ శుభశ్రేయోదాయకములై, నిత్య శాంతిప్రదములై, నిత్యానంద సంధాయకములై యొప్పుచుండును.

భగవన్నామ సంకీర్తనము - మానవుల చిత్త మనెడి దర్పణమునఁ గల మలినమును తొలఁగించి, దానిని స్వచ్ఛముగా ప్రకాశింప

జేయును. ఇందు వలననే - నామ స్మరణము వినా కర్మజ్ఞానములు నిష్ప్రయోజనము లని శాస్త్రములు వేనోళ్ళ చాటుచున్నవి. కనుక, దుఃఖ నివృత్తికిని, సుఖప్రాప్తికిని నామ స్మరణమే పరమ శరణ్య మని నిర్ణయింపఁబడినది.

" హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతి రన్యథా. "

— (నారద పురాణము : 1-41-15.)

హరినామ సంకీర్తనమే ముమ్మాటికిని తరణోపాయ మనియు, ఈ కలియుగమున అంతకంటెను మార్గాంతరము మఱియొకటి ముమ్మాటికిని లేదనియు, త్రికాలజ్ఞుఁడును - త్రిలోక సంచారియు - పరమ భాగవత శిఖామణియు - బ్రహ్మర్షియు నగు నారదుఁడు స్పష్టీకరించెను.

" సర్వదా సర్వకాలేషు యేఽపి కుర్వన్తి పాతకమ్
నామ సంకీర్తనం కృత్వా యాంతి విష్ణోః పరంపదమ్. "
" న దేశ నియమో రాజన్ న కాల నియమ స్తథా
విద్యతే నాత్ర సందేహో విష్ణో ర్నామానుకీర్తనే. "

సర్వదా - సర్వ కాలముల యందును చుపాక్రమ్యము చూచి యించు పాపాత్ములు సైతము - భగవన్నామ సంకీర్తనము వలన పరిశుద్ధులై, దేహాంతమున పరమ పదమును పొందఁగల రనియు, కట్టి భగవన్నామ సంకీర్తనము గావించువారలకు దేశ, కాల నియమములు లేవనియు పురాణములు ఘోషించుచున్నవి.

భగవన్నామ ప్రభావము అఖండము; అప్రతిహతము. ఆ నిర్వ చనీయమైన ఆ ప్రభావమును ఈ మూలాగ్రముగ నెఱిఁగిన వారెందఱో

...లను. అట్టి వారిలో - వ్యాస, పరాశర, శుక, శౌనక, సనక, ...నందన, సనత్కుమార, సనత్సుజాత, నారద, వశిష్ఠ, వాల్మీకి, ...మన, జాబాలి, విశ్వామిత్ర, అగస్త్య, యాజ్ఞవల్క్యాది మహా ...నులును, హనుమ దక్రూరాది భక్తాగ్రేసరులును - పన్నిద్ద ...ళ్వారులును, నాథ, యామున, రామానుజాది పూర్వాచార్యు ...ను - చైతన్య, వల్లభ, బలదేవ, తుకారాం, సమర్థరామదాసు, ...బీరు, దాదూ, రైదాసు, రామానంద, తులసీదాసు, సూరదాసు, ...రాబాయి, సక్కుబాయి, పోతన, రామదాసు, త్యాగరాజు, ...న్న మహాచార్యులు మున్నగు మహాభక్తులును ముఖ్యులు.

" ముదమున కాటపట్టు - భవమోహ మద ద్వీరదాంకుశంబు - సం
పదల కొట్టారు - కోరికల పంట - పరంబున కాది - వైరుల
న్నదల జయించు త్రోవ - విపదబ్ధికి నావగదా ! సదా భవ
త్పదముల నామ సంస్మరణ వాశరథీ ! కరుణాపయోనిధీ ! "

అని, నామ వైభవమును గోపన్న బహు భంగుల స్తుతించుచు - ...రమ దయానిధే ! పతితపావననామ ! హరే ! యటంచు సుస్థిర ...త్తులై, సదా భజన సేయు మహాత్ముల దరికేగ వలదని యమునిచే ...కన కింకరుల కానబెట్టినట్లు మెలుగెత్తి చాటినాడు.

" నిధిచాల సుఖమా ? రాముని సన్నిధి చాల సుఖమా ? "
" సంగీత జ్ఞానము భక్తి వినా సన్మార్గము గలదే మనసా ? "

అను భక్తి భావ సమన్వితమైన త్యాగయ్య గాన మాధుర్యమును మనము నేటికిని ఆస్వాదించుచునే యున్నాముగదా !

" అపశబ్దంబుల గూడియున్, హరిచరిత్రాలాపముల్ సర్వ పా
పపరిత్యాగము సేయుఁ గావున, హరిన్ భావించుచున్, పాడుచున్
జపముల్ సేయుచు, వీనులన్ విమల నక్షాంతంబుఁ గీర్తించుచుం
దపసుల్ సాధులు ధన్యులౌదురుగదా తత్త్వజ్ఞ చింతింపుమా ! "

అను భోతన్న మహోపదేశమును మన మొన్నటికిని మఱువజాలము గదా !

" ఇందిరా నామ మిందటికి - కుందవపు ముద్దవో గోవిందా !
అచ్యుత నామము అనంత నామము - ఇచ్చిన సంపద లిందటికి
సచ్చిద పిఱలు నాలుక తుదలు - కొచ్చి కొచ్చినో గోవిందా !
వైకుంఠ నామము పరద నామము - ఈకడ నాకడ నిందటికి
వాకుఁ దెరపులు పన్నెలు లోకాలఁ గూకులు వత్తులునో గోవిందా !
పండరి నామము పరమ నామము - ఎండలు వాపెడి దిందటికి
నిండు నిధానమై నిలిచిన పేరు - కొండల కోనేటివో గోవిందా !"

అను అన్నమాచార్యుల మధురాలాపనము నేటికిని మన కర్ణపుటములలో ప్రతిధ్వనించుచునే యున్నది గదా !

ఇట్టి భగవన్నామ సంకీర్తన ప్రభావ భాసితమైనదే భాగవత మతము. ఇది కేవలము భక్తి ప్రధానమైనది. భవ సాగర తరణమునకు మార్గ దర్శకమైనదే ఈ భాగవత మతము. దీనికి భగవన్నామ సంకీర్తనమే ముఖ్యమైన యంగము. నియమ నిష్ఠలు, ఆచార వ్యవహారములు మున్నగునవి దీనికి ప్రత్యంగములు. భవ సాగర తరణ సాధనమైన ఇట్టి భగవన్నామ సంకీర్తనము - భాగవత మతానుయాయులగు ముముక్షువులకు నిత్య కృత్యము.

అనంత నామములు గల భగవానుని, భక్తుడు ఏ ఒక్క నామమునైనను చిరకాలము మనన మొనరించుట - అత్యంత ఫల ప్రదము. ఇదియే భాగవత మత రహస్యము. చైతన్య మహా ప్రభువు - తన దివ్యానుభవ ప్రబోధములచే లోకమున కందించిన మధుర ఫల మిదియే.

" చేతో దర్పణ మార్జనం భవ మహాదావాగ్ని నిర్వాపణం
శ్రేయః కైరవచంద్రికా వితరణం విద్యా వధూజీవనమ్
ఆనందాంబుధి వర్ధనం ప్రతిపదం పూర్ణామృతాస్వాదనం
సర్వాత్మస్నపనం పరం విజయతే శ్రీ కృష్ణ సంకీర్తనమ్. "

— (శిక్షాష్టకము : 1.)

చిత్త మనెడి దర్పణమును పరిశుభ్రముగ, నిర్మలముగఁ జేయు నదియు, సంసార రూప మగు కారుచిచ్చును శమింపఁజేయునదియు - పరమ మంగళము లనెడి పద్మములు వికసించుటకు వెన్నెలను ప్రసాదించునదియు - 'పరా విద్య' అను సుందరికి ప్రాణమైనదియు - ఆనంద మనెడి సముద్రము నుప్పొంగించునదియు - అనుగడుగున అమృతమును బాగుగా జూపించునదియు - సకల జీవులకు నిర్మలత (Purity) స్నిగ్ధత (Mellowness) కలిగించునదియు, అద్వితీయము నగు శ్రీ కృష్ణ సంకీర్తనము సర్వోత్కృష్టత నొందుచున్న' దని చైతన్యుఁడు సంకీర్తనమును బహుధా ప్రశంసించెను. ఇది - ఇంతటి ప్రభావము గల దగుటవలననే —

" ఇదం శరీరం పరిణామ పేశలం
పతత్యవశ్యం శ్లథ సంధి జర్జరమ్
కిమౌషధైః క్లిశ్యసి మూఢ ! దుర్మతే !
నిరామయం కృష్ణరసాయనం పిబ ! "

— (ముకుందమాల - 31.)

ఓ మూఢుఁడా ! ఈ శరీరము పరిణామముతో గూడినట్టిది. దారుణ వ్యాధులచే ఒక్క క్షణ కాలములో నీ శరీరము పతనము కాఁగలదు. కనుక, మూఢుఁడా ! ఇంకను సామాన్యమైన మందుల

సేవించి, ఫలితము గానక, వ్యథపడనేల ? సంపూర్ణారోగ్యమును ప్రసాదించు 'శ్రీ కృష్ణభగవానుని నామామృతమునుగ్రోలు' మని కులశేఖలాళ్వారు లుద్బోధించిరి.

పరమ భాగవతాగ్రగణ్యులును - పరమైకాంతులు నగు పన్నిద్ద రాళ్వారుల దివ్య ప్రబంధములంతటను పరమార్థ మిట్లతి గంభీర ముగ ప్రకాశించుచునే యున్నది. ఈ రీతిగా భగవన్నామమును మధుర మధురముగ గాన మొనరించిన వారు - ఎందఱో మహానుభావులు. అట్టి మహానుభావుల మహాభావనము - బద్ధ చేతనులు నుద్ధరింపఁ గలదై, లోక కల్యాణదాయకమై విరాజిల్లుచుండుట - ఎల్ల ఱకును గమనార్హ ము.

భగవన్నామ సంకీర్తన ప్రభావము భక్తునిపై ఎట్లు ప్రసరించునో తెలియవలెను. కనుక, మున్ముందు - మానవుని బహి రంతర నిర్మాణ విశేషములను కూలంకషముగ గ్రహించినఁగాని, నాము ప్రభావము ఆమూలాగ్రముగ అవగతము కాఁజాలదు. ఇందునలన, ప్రకృతము ఆ విశేషముల నొకింత పరిశీలింతము.

మానవుఁడు - జనన మరణములు

" జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ
తస్మా దపరిహార్యార్థే న త్వం శోచితు మర్హసి. "

— (భగవద్గీత : 2-27.)

పుట్టిన వానికి చావును, చచ్చినవానికి పుట్టుకయు నిశ్చయము. కనుక, నివారింపఁగూడని విషయమునందు నీవు దుఃఖమును గల్గి యుండుట అనుచిత మని నరునకు నారాయణుఁ డుపదేశ మొనరించి యున్నాఁడు గదా ! అట్టి జనన మరణములు మనకు ప్రత్యక్షముగఁ

గన్పట్టు నిత్య సత్యములు. ఏవం విధములైన జనన మరణములు నిత్యము – నిరంతరాయముగ జరుగుచుండుట సర్వ విదితము. జన నమునకు పూర్వముగాని, మరణమునకు అనంతరముగాని శరీరమున కెట్టి మార్పును ఉండదు. ఒకవేళ ఏమాత్రమైన మార్పు ఉన్నదన్నను– అది పరిగణింపదగినంత మార్పు కాదని తత్త్వశాస్త్రవేత్తలు నిరూ పించియున్నారు. ఇది యిట్లుండ – శ్వాస, హృదయ స్పందనము ఎప్పుడు ఆగిపోవునో, అప్పుడే మరణము సంప్రాప్తించినట్లు గుర్తింప వలెననియు – ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములు, హృదయ స్పందము మాత్రమే ప్రాణ మున్న దనుటకు ప్రధానాధారము లనియు భౌతిక శాస్త్రవేత్తలు నిర్ణయించిరి. ఈ నిర్ణయము అశాస్త్రీయము. ఇది – తపసంపన్నులైన తాత్త్వికవేత్తలగు మహర్షుల నిర్ణయమునకు కేవ లము విరుద్ధము. ప్రాణము ప్రస్తుత శరీరమునుండి వీడిపోవుటయే మరణ మనియు, ఆ ప్రాణము మఱియొక శరీరమున ప్రవేశించుట జనన మనియు మహర్షులు – తమ తపఃప్రభావము వలనను, యోగా భ్యాస విశేషము వలనను బాగుగా నెఱింగి, తమ యీ నిర్ణయములను లోకమున ప్రకటింపగల్గిరి.

శ్వాస, హృదయ స్పందము – ఇవి రెంటను ఒకే తావునుండి వెలువడుననియు, పరస్పర సంబంధము గల్గియున్న వనియు మహర్షుల మనోభావన. ఈ భావమును భౌతిక శాస్త్రజ్ఞులు అంగీకరించుచునే యున్నారు. నవీన వైద్య శాస్త్ర నిపుణులు సైతము శాస్త్రములను సాధనములుగ గైకొని, ప్రయోగముల గావించి, ఈ సత్యమును మనకు ప్రత్యక్షముగ జూపెట్టుచునే యున్నారు.

అజప జపము - భగవ త్సాక్షాత్కారము

భక్తులు ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములను గావించుచునే భగవ న్నామ సంకీర్తనమును అఖండముగ జేయుచుందురు. ఇట్టి స్థితిలో –

వారిచే ఉచ్చరింపఁబడు నామము ఎట్టి ప్రయత్నము లేకనే శ్వాసతో సమ్మిళిత మగుచుండును. ఇట్లు నామము, ఉచ్ఛ్వాస నిశ్వాసములు అన్యోన్యముగ పెనవై చుకొని, వేఱు పఱచుటకు వీలుగాని విధమున నుండును. ఇట్లు రెండు పనులు ఏక కాలమున నిరంతరాయముగ జరుగు చునే యుండును. ఈ రీతిగా ఎడతెగక జేయు నామ సంకీర్తనము – 'అజప జపము' అని చెప్పఁబడును. ఇట్లు నిరంతరాయముగ సంకీర్తనము గావించు భక్తులు అనంత శక్తులను పొందఁగలరనియు, అట్టి దివ్యశక్తి వలన వారికి భగవత్సాక్షాత్కారము లభింపఁగల దనియు అనుభవజ్ఞులు ఘంటాపథంబుగా చెప్పుచుందురు. భగవత్సాక్షాత్కారమును బడసిన శిష్టి పరమ భాగవత శిఖామణులకును, భక్తత్రాణపరాయణుఁడగు భగవంతునకును ఎంతయో సన్నిహిత సంబంధ మేర్పడి యుండును. ఈ మహానీయులు – సర్వము విష్ణుమయముగా సంభావించి, అంతటను ఆ పరమాత్మనే ఆలోకించి ఆనందించుచుందురు. ఇట్టి స్థితి గతు లేర్పడ వలె నన్న, భక్తుని యింద్రియము లన్నియు భగవన్నామ సంకీర్తన యనఁబడు అగ్నిచే తప్తములై, పవిత్రీకరింపఁబడవలెను. అప్పుడు భౌతిక చక్షువు – దివ్య చక్షువుగ పరిణతిని పొందును. మనస్సు నిర్మలమై, స్వచ్ఛముగ ప్రకాశించును. హృదయము వికసించును. విశ్వమంతయు దివ్య స్వరూపముగా – ప్రేమమయముగా – భగవన్మయముగా గన్పట్టును. అనంతరము అట్టి భక్తుఁడు భగవదనుభూతిని బడసి, ఆత్మానందము నందును. తా నేమి జేయుచున్నను – భగవదాజ్ఞానుసారమే గావించుచున్నట్లు భావించును. తన శరీరములోని ప్రత్యణువునందును భగవంతుని స్పర్శయే అతనికి గోచరించును. ఇట్లాతని జీవితము పరిశుద్ధమై, పరమ పవిత్రమై, పరమాత్మ తత్త్వము నకు అతి సన్నిహిత మగును. కనుకనే – సంకీర్తనానందాబ్ధిలో నోలలాడు ముముక్షువునకు సకల లోకము సంతోషమయముగా – సత్య స్వరూపముగా సాక్షాత్కరించుచుండునని మహర్షులు నొక్కి వక్కా-

ణించిరి. ప్రతి శ్వాసతో భగవన్నామమును మిళిత మొనర్చి, నిరంత రాయముగ సంకీర్తించుచుండుటచేతనే ఇట్టి అమృత ఫలమ్ములు ఎవరి కేని లభించుచుండఁగలవు. భక్తుల కివి అనుభవ సిద్ధములు. ఇట్టి భక్తుల యనుభూతులు ఇతరులైన ప్రాకృతులకును మార్గదర్శక ములై, వారిలో నిద్రాణమై యున్న ఆధ్యాత్మిక చైతన్యమును జాగరిత మొనరించుచునే యుండును.

నామ రూపములు

సృష్టిలో నామరూపములు లోపించినచో – మానవుని మను గడయే కుంటువడును. అంచువలన, అవి అందఱికును అవశ్యాపేక్షిత ములు. ఏలన – రాముఁడు, కృష్ణుఁడు ప్రాణమిత్రు లనుకొనుఁడు. వా రిరువురిలో రాముఁడు – 'కృష్ణా !' అని పిలిచినంతనే 'ఆఁ !' అని కృష్ణుఁడు ప్రత్యుత్తర మిచ్చును గదా ! ఈ కృష్ణుఁ డెవరు ? ఇతరుని నుండి భిన్ననిగ సూచించు పేరుతో బిలువఁబడు యీ కృష్ణుఁడు శరీ రమా ? అట్లగుచో – 'ఆఁ !' అను సమాధానము ప్రాణములేని శరీ రమునుండి వచ్చునా ? ఎన్నిఁడును రానేరదుగదా ! అట్లుగాక, ప్రాణమే యిట్లు ప్రశ్నించునా ? అట్లగుచో – ప్రాణమునకు నామము గలదా ? శరీరముతో గాక, ప్రాణముతో మాత్రమే నామసంబంధము గల్గియున్నచో – శరీరము వీడిన ప్రాణము, రాముని పిలుపున కేల సమాధానము నీయదు ? నామము ప్రకటించు సాధన మగు శరీరము, ప్రాణమునుండి వేరగుటవలననే. ప్రాణము రాముని పిలుపునకు సమాధాన మొసంగఁ జాలదుగదా ! అదియును అసంభవ మనియే స్పష్ట మగుచున్నది. ప్రాణమునకు కృష్ణుఁడను నామ ముండియున్న దన్నను, అది ప్రాణమునకు శరీరముతో సంబంధ మున్నంతవఱకు

మాత్రమే అన్వయించును. ప్రాణము శరీరము వీడినంతనే, నామముతో తన సంబంధమును త్రెంచుకొనును. ప్రాణము, శరీరము ఏకమై యున్నంతవఱకును నామము అన్వయించు నని ఇంపువలన స్పష్ట మగు చున్నది గదా ! కనుక, నామి – నామముల సంబంధముకూడ ఇట్టి దనియే గ్రహింపవలెను. రామాయణ కృష్ణుని యెడతెగక పిలుచు చున్నచో కృష్ణుడును – 'ఆఁ ! ఇచ్చటనే యున్నాను' అని సమా ధాన మిచ్చుచునే యుండును. ఇది సహజ సిద్ధము; నిత్య – సత్యము. ఇట్లు ప్రతిశ్వాసతో భగవన్నామ సంకీర్తనము గావించు భక్తుడును భగవంతుని ప్రత్యుత్తరములను తా నొనరించు సంకీర్తనమునకు సము చిత ఫలములుగ పొందుచుండును.

"అహం భక్త పరాధీనః అస్వతంత్ర ఇవ ద్విజ"

అని, అంబరీషోపాఖ్యానమున భగవానుఁడు దూర్వాసునితో బలికినట్లు – భక్తి పరాధీనుఁ డగు భగవానుఁడు, ఇట్టి భక్తుల మనో రథముల నీడేర్చుచు, మధుర ఫలముల నందించుచు, పరమానందమును ప్రసాదించుచుండును. భక్తునకు – భగవానునికు గల అవినాభావ సంబంధము అనుభవైకవేద్యము.

శ్వాసకు, హృదయ స్పందమునకు ప్రాణమే మూలాధారము. అయినను – యోగాభ్యాసపరులై, సమాధిస్థితిలోఁ గల యోగులకు ఉచ్ఛ్వాస నిశ్వాసము లుండవు. హృదయము స్పందింపదు. మరణ చిహ్నములు జూపెట్టు స్థితి ప్రకటించుచుండును. కాని, అట్టి యోగుల శరీరము చెడిపోదు; శరీరము వాసన వేయదు. అది శవము కాదు గనుకనే ఇట్టి దుర్లక్షణము లుండవు. శరీరము యథాతథముగ నుండును. కాని, అవయవములు మాత్రము అట్టి యోగాభ్యాసపరునకు వశములై యుండును. ఆతడు ఆ అవయవముల చర్యల నరికట్టును.

ప్రాణమును బిగ పట్టును. ఇట్టి విచిత్రమైన పరిస్థితి అతనిలో నేర్పడి నను, అతఁడు సజీవుఁడై, సంశోభించుచునే యుండును. యోగాభ్యాస మూలమున సంప్రాప్తించిన దివ్య శక్తియే ఈ విచిత్ర పరిస్థితికి మూల కారణము. ఇట్టి దివ్య శక్తిని ప్రసాదించు అష్టాంగయోగ ప్రభావము అందఱకును అవశ్యగ్రహణీయము.

అష్టాంగ యోగములు - వాని ప్రభావములు

యమము - నియమము - ఆసనము - ప్రాణాయామము - ప్రత్యాహారము - ధారణము - ధ్యానము - సమాధి అనునవి అష్టాంగ యోగములు. అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము అనునవి యమ మని చెప్పఁబడును. ఈ యమము వలన చిత్తశుద్ధి గల్గును. శౌచము, సంతోషము, తపము, స్వాధ్యాయము, భగవదారాధనము అనునవి నియమ మని చెప్పఁబడును. ఈ నియమము వలన బాహ్యశుద్ధియు, అంతశ్శుద్ధియు ఏర్పడును. వక్షమును, భుజములను శిరస్సున నిశ్చలముగా నిటారుగా నిలిపి, శరీరమును సక్రమ విధానమున నుంచుట ఆసన మనఁబడును. ఇందు వలన, ఇంద్రియము లన్నియు స్వాధీనము లగును. ప్రాణాయామ మనఁగా - ఉచ్ఛ్వాస నిశ్శ్వాసముల మూలమున ప్రాణ గతిని వశమొనర్చుకొనుట. తత్ఫలితముగ నాడీశుద్ధి, చిత్తశుద్ధి కలుగును. ఇది - రేచక, పూరక, కుంభకము లని మూఁడు విధములు. రేచక మనఁగా - ఊపిరి విడచుట. పూరక మనఁగా - ఊపిరి పీల్చుకొనుట. కుంభక మనఁగా - ఊపిరి నిలుపుట. ఈ ప్రాణాయామమువలన భూమ్మిపై ఆసీనుఁడై యున్న యోగి, తేలికగ పైకి లేచుటకు తగిన శక్తియు, దివ్యానందమును లభించును. ప్రత్యాహార మనఁగా - ఇంద్రియములు తమ తమ విషయములను విసర్జించి, చిత్తముయొక్క స్వరూపమును

పొందుట. హృదయ కమలమునందు గాని, శిరస్సునందలి సహస్రార కమలమునందుగాని మనస్సును నిలుపుట ధారణ మనఁబడును. దీని వలన, ఇంద్రియము లన్నియు సంపూర్ణముగ వశము కాఁగలవు. ఇట్లు ఇంద్రియము లన్నియు వశమైన పిమ్మట, ఏక భావ ప్రవాహ రూప ముగాఁగల్గు జ్ఞానమే ధ్యానము. సమాధి యనఁగా – సర్వమును సర్వే శ్వరునకు సమర్పించుట. భగవంతుని శరణుపొందుటవలన ఇట్టి సమాధి స్థితి లభించును. బ్రహ్మానందానుభవమే దీనికి ఫలము. ఈ యోగ విధానము ననుసరించి – 'శ్వాస, హృదయ స్పందము ఆగిపోయినచో అది మరణమే యగు' నను భౌతిక శాస్త్రజ్ఞుల నిర్ణయము నిరస్తమగు చున్నది.

యోగి సమాధి స్థితిలో నున్నప్పుడు ప్రాణము స్థూల సూక్ష్మ శరీరముల నుండి కారణ శరీరమునకేగి, అట నిశ్చలముగా ప్రకాశించు చుండును. అట్టి స్థితిలో జీవుఁడు కారణ శరీరముతో మాత్రమే సంబంధము గలిగియున్నను, స్థూల సూక్ష్మ శరీరములను కలిపియుంచు కొలికి మాత్రము వీడియుండడు. ఇది మన భౌతిక చక్షువునకుఁ గన్పించు నదికాదు. అయినను, అందఱును విధిగా నంగీకరింపవలసిన సూక్ష్మ విషయ మిది. కనుక, స్థూల దృష్టికి యోగి మరణ చిహ్నములు గల్గి, చూచువారికి మరణించె నను అభిప్రాయమును గల్గించు విధమున గన్పట్టుచున్నను, అది ఆతని మరణము గానేరదు. ఆతని శరీరము అణు మాత్రము చెక్కుచెదరక, చెడక, యథాతథముగనే యుండును. ఇది మనకు ప్రత్యక్షముగ గన్పట్టు సత్యము. అట్టి స్థితిలో – స్థూల శరీరము కారణ శరీరమునకు వశమై యుండును. కారణ శరీరము మాత్రము స్థూల శరీరమునకు లొంగి యుండదు. యోగమునందు కడపటి దగు సమాధి దశ కియ్యవి సహజ లక్షణములు. ఈ సమాధ్యవస్థలో – ఉచ్ఛ్వాస నిశ్వాసములు లేకున్నను, జీవుఁడు కారణ శరీరమున

ఆనంద మనుభవించుచునే యుండును. ఇట్టి అద్భుత విషయములు - భౌతిక శాస్త్రజ్ఞుల ఊహలకు మిక్కిలి అతీతములైనవి.

జీవుడు శరీరాంతర్వర్తియై యుండును గావున, అట్టి స్థితిలో స్థూల శరీరము చెడదు. శ్వాసకు కారణము శరీర సంబంధ మగుట వలన, అట్టి సంబంధ మున్నంత వఱకును స్థూల శరీరముపై తన శక్తి సామర్థ్యములను ప్రదర్శించుచునే యుండు ననుట ఇట స్పష్టము.

నిరంతర భగవన్నామ స్మరణము, అజప జపము కారణ సూక్ష్మ శరీరములపై తన ప్రభావమును ప్రదర్శించునట్లే - స్థూల శరీరముపైనను తన శక్తిని ప్రసరింపఁజేసి, దానిని స్వాధీన మొనరించు కొని, తన సంకల్పానుసారము ప్రవర్తింపఁజేయుచుండును. యోగ శాస్త్రము లోకమున కుపదేశించిన పరమ రహస్య మిదియే. దీనిని మహర్షులు అనుభవపూర్వకముగను, శాస్త్రీయముగను నిరూపించి, విశ్వ వ్యాప్తి మొనరించిరి.

నామ ప్రభావము

" సంకీర్త్యమానో భగవా ననంతః ప్రుతానుభావో వ్యసనం హి పుంసామ్
ప్రవిశ్య చిత్తం విధునో త్యశేషం యథా తమోఽర్కోఽభ్రమివాతి వాతః. "

సూర్యుడు అంధకారమును, వాయువు మేఘములను ఎట్లు ఛిన్నాభిన్న మొనరించునో - అట్లే, నామ సంకీర్తనము గావించినచో అనంతుఁడైన భగవానుఁడు అట్టి భక్తుల హృదయ సీమలలో ప్రవేశించి, వారి సర్వ పాపములను పటాపంచలు చేయు నని భాగవత పురాణము నొక్కి వక్కాణించుచున్నది.

ఈ భాగవత సూక్తిచే, అత్యద్భుతమైన నామ ప్రభావము మనకు సుస్పష్ట మగుచున్నది గదా ! అయినచో ఇట్టి నామమునకు

అనుభవము, ప్రకటనా శక్తి ఆద్యావశ్యకములు. ఇం దే యొకటి లోపించినను, నామము మరుగునఁ బడియుండును. అప్పుడు అనుభవము వంటి స్పందమునకు, స్పర్శకు తుల్యమైన మఱే యొక స్పర్శ కొఱకు అన్వేషణము గావించును. తెలియని విషయము నెఱుక బఱచు జ్ఞానము వికసించు వఱకును - దానికి తుల్య మగు స్పర్శను గల్గించును. ఇట్టి నామము నుచ్చరించినంతనే, ఆ శబ్దము చెవియందలి మద్దెల పొరవంటి చర్మపు పొరకు తగులును. వెన్వెంటనే ఆ శబ్దము నరముల మూలమున మనస్సున ప్రవేశించును. అట్టి నామమునందలి రూపమును మనస్సును చిత్రించుకొనును.

నామముతో లీనమై యుండు స్పర్శను గల్గించు శక్తి నరములకు గలదు. కనుక, మన బాహ్యస్థితికి - దృశ్య ప్రపంచమునకు నరములే సంబంధమును గల్గించుచున్నట్లు తెలియనగును. నరములపై నామము మాత్రమే క్రియను, ప్రతి క్రియను చేయఁగలదు. ఈ నామ ప్రభావము కర్మ ప్రభావము కంటెను మిన్నగా నుండును. బాహ్య కర్మ కంటెను నామమునకు సంబంధించిన చర్యలు - సూక్ష్మాతి సూక్ష్మములు. ఇందువలన, భగవన్నామ ముచ్చరించుచున్నంతనే ఆ నామము శ్వాసతో మిళితమై, తన ప్రభావమును నరములపై ప్రసరింపఁజేయును భగవన్నామము - శరీరమునందును మనస్సునందును, సర్వేంద్రియములందును గల కల్మషమును తొలఁగించి, వానికి పవిత్రతనుఁ జేకూర్చును. అంతేకాదు - ఈ భగవన్నామమే సజ్జన సాంగత్యమును, సదాచార సంపదను ప్రసాదించును. ఇట్లీ నామము అంతటను - అన్నింటియందు తన ప్రభావమును ప్రదర్శించుచునే యుండును. నామ ముచ్చరించువారి ప్రతి పని యందును అది తన శక్తి సామర్థ్యములను ప్రకటించుచునే యుండును. ఇట్టి భగవన్నామోచ్చారణమునలన భక్తుఁడు అభ్యుదయ పథమున పురోగ

మించుచు, అధ్యాత్మికమైన దివ్య తేజమును, ఆత్మానుభూతిని పొందు చుండును. ఇట్టి దివ్యానుభూతులు - అట్టి భక్తుని నుండి బాహ్య ప్రపంచమునకును వ్యక్త మగుచునే యుండును. కావున, భగవన్నా మోచ్చారణముతో మిళిత మగు శ్వాసయే పవిత్ర భావములను, పరమ శాంతిని, పరమానందమును ప్రసాదించుటకు కారణమై యుండు నని తెలియవలయును. అదియునుఁ గాక, భగవత్సాక్షాత్కారమునకు సైతము ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములతో మేళవింపఁబడిన నామమే ప్రధాన కారణ మనియు గ్రహింపవలెను.

మానవుఁడు ఇతరోపాయముల కంటెను భగవన్నామ సంకీర్తనమువలననే భగవదనుగ్రహమును సులభముగ పొందగలఁడు. ఇట్టి నామ సంకీర్తన ప్రభావము - భాగవత మతానుయాయులకు బాగుగా తెలియును. ఇది - భవ సాగర తరణమునకు మిక్కిలి సులభోపాయము. ఇట్టి సులభోపాయమే సర్వ మానవ సంఘ సంక్షేమమునకు పరమ ప్రయోజనకరము. ఇట్టి సాధనయే సర్వేశ్వరానుగ్రహమును సరులకు ప్రసాదించును. అట్టి భగవదనుగ్రహము - భక్తుల మనఃపద్మముల వికసింపఁజేయును. భౌతిక ప్రపంచముపై అఖండ విజయమును ప్రసాదించును. ముక్తి నొసంగును. భాగవత మతముగా ప్రసిద్ధి గాంచిన వైష్ణవ మతము - ఇట్టి భగవన్నామ సంకీర్తనమునే ప్రబోధించు చుండుట గమనార్హము. భక్తి యుక్తమైన భగవన్నామ సంకీర్తన మును ప్రబోధించునది కావుననే - వైష్ణవ మతము దివ్య శక్తులను, దివ్యానుభూతిని, దివ్యధామమును ప్రసాదింపఁగల్గి ప్రకాశించు చున్నది.

" ఆర్తా విషణ్ణా శ్శిథిలా శ్చ భీతాః
ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః
సంకీర్త్య నారాయణ శబ్ద మాత్రం
విముక్త దుఃఖా స్సుఖినో భవన్తి. "

దారుణములైన శారీరక వ్యాధులచే బాధపడువారును, మర్మ రములైన మానసిక బాధలచే క్రుంగి క్రుశించువారును నారాయణ నామ సంకీర్తన గావించిన మాత్రమున – వివిధ వ్యధలనుండి విముక్తులై, సుఖ శాంతులను బడయఁగల రని మహాభారతము ఎలుగెత్తి చాటు చున్నది. కనుక, భగవన్నామ సంకీర్తనమే సకల రోగములకు దివ్యౌ షధ మని యెఱుంగవలయును.

" కొనరో కొనరో కూరిమి పండు
వునికి మనికి కెల్ల నొక్కఁ డే మందు
ధ్రువుఁడు గొనిన మందు - తొల్లియు
ప్రహ్లాదుఁడు చవిగాఁగొనిన మందు - చల్లని మందు
నిలిచి నారదుఁడు గొనిన మందు
జనకుఁడు గెలుపుతోఁగొని బ్రదికిన మందు
మొలచి నాలుగు యుగముల రాజులు
ఘనులు కలకాలము గొని కడగన్న మందు
అజునకుఁ బరమాయువై యొసంగిన మందు
నిజమై లోకములెల్ల నిండిన మందు
త్రిజగములు నెఱుఁగ తిరువేంకట్రాదిపై
ధ్వజ మెత్తఁ గోనేటి దరి నున్న మందు. "

ఈ సంకీర్తనములో అన్నమాచార్యులు భగవన్నామ ప్రభావ మును స్పష్టముగా బల్కినాఁడు. ఇట్టి భగవన్నామామృతమును గ్రోలినవారు – ఎంతటి సుకృతాత్ములు !

పర బ్రహ్మము శబ్ద బ్రహ్మము

నామము నాదోద్భూతము. నాదము శబ్దమయము. ఈ శబ్దమే సకల జగద్వ్యాపారమునకును మూలాధారము. సర్వాంతర్యామి

యగు పర బ్రహ్మమే అట్టి శబ్దమునకు మూలాధారము. సృష్టి కర్త యగు పర బ్రహ్మ మెట్లు అనాదియో - అట్లే, సృష్టి వ్యాపారమునకు మూలాధారమైన శబ్దముకూడ అనాది సిద్ధమే. పరబ్రహ్మ మెట్లు సర్వ పదార్థములందును వ్యాపించియుండెనో - అట్లే, శబ్దముకూడ సర్వ పదార్థములందును అనుస్యూతముగ వ్యాపించియున్నది. పర బ్రహ్మ మెట్లు సర్వ ప్రకాశకుడో - అట్లే, శబ్దముకూడ సర్వ ప్రకాశకము. బ్రహ్మములేక సృష్టిలో నేదియు ప్రకాశింపనట్లే, శబ్దము లేక సృష్టిలో ఏ వ్యవహారము జరుగనేరదు. ఏ వ్యవహారము లేక, సృష్టి వ్యాపారము జరుగనేరదు. ప్రపంచపు టునికికి, అంతర్యామి స్వరూపముగాఁ గల పరబ్రహ్మమే ఎట్లు కారణ మగుచున్నదో - అట్లే, శబ్దముకూట ప్రపంచపు టునికికి ఆధారభూతమై యలరారు చున్నది. ఇం దొకటి పరబ్రహ్మము, మరియొకటి శబ్దబ్రహ్మము. అవి భాజ్యములైన యీ రెంటికినిఁ గల అవినాభావ సంబంధము నిత్యమై, శాశ్వతమై యొప్పుచున్నది. కావున, శబ్ద బ్రహ్మ మగు భగవన్నామ మును ఆనన్యమైన భక్తి భావముతో సంకీర్తించినఁగాని, పరబ్రహ్మాభి ధేయుఁ డగు భగవన్నారాయణుని కృపాకటాక్షము భక్తులపై ప్రస రింపఁజాలదు. ఇందువలన, జనన మరణ రూపమైన ఈ సంసార సాగర మును తరించి, విముక్తి నందఁదలచిన సహృదయులు - సర్వకాల సర్వావస్థలయందును భగవన్నామ సంకీర్తన మొనరించి, సర్వాంత ర్యామియు, ఆనంద మయుఁడు నగు ఆ భగవానుని యనుగ్రహమును సంపూర్ణముగ బడసి, శాశ్వతానందము నందుదురుగావుత !

సంఘ సాహిత్యము - వైష్ణవ తత్త్వము

'విద్యా భూషణ - కవితా విశారద'

శ్రీమాన్ ధనకుధరం వరదాచార్యులు

శ్రీ రామానుజ కీర్తి కౌముదీ సంపాదకులు

★ ★ ★

అంజలి

" అఖిల భువన జన్మ స్థేమ భంగాది లీలే
వినత వివిధ భూత వ్రాత రక్షైక దీక్షే
శ్రుతి శిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే
భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తి రూపా. "

అవతరణిక

శ్రీ వైష్ణవ సంప్రదాయము అనాది సిద్ధము. శ్రీ లక్ష్మీదేవి మొట్ట మొదట సంప్రదాయ ప్రవర్తిక. అనంతరము ఆర్ష ప్రతిభ గలిగిన మహనీయులు - పరంపరాగతమైన ఈ సంప్రదాయమును ప్రచారము చేసిరి. ఆ ప్రచారము కాలక్రమమున విరళము కాగా - శ్రీ మద్రామానుజులు పునరుద్ధార మొనరించి, యోగ్య విధానము లను వెలయించిరి. ఇందును కొన్ని విశిష్ట భావములను వేఱుగా నిరూపించుకొని, శ్రీ వేదాంత దేశికులు - ఈ సంప్రదాయమునకు ఉత్తేజ నము సంపాదించిరి.

అవైదికములైన జైన బౌద్ధములను అణచి వేయుటలో - శ్రీ వైష్ణవ ధర్మము ఎంతగనో ఉపకరించినది. శ్రీ పాంచరాత్రాగ

మమునందును, పవిత్ర పురాణములందును నిరూపితమైన మహార్థము - ఉపనిషత్సూత్ర గీతలలో అనుగతమై యుండుటను సంభావించిన శ్రీమద్రామానుజులు - సనాతన ధర్మ వ్యాప్తికి గట్టిపూనిక వహించుటచే, శ్రీ విశిష్టాద్వైత సంప్రదాయ మర్యాద - భారతదేశమండే గాక, విదేశములందును రాణించినది. కర్మజ్ఞానములు, భక్తిప్రపత్తులు ఈ సంప్రదాయమునందు సునిబద్ధములై యున్నవి. వేదానుమోదము లేని ధర్మము నిలువదు. వేదానుమోదము పొందిన శ్రీ రామానుజ మతము లోకమునకు తారకమైనది.

దక్షిణ దేశమున నుదయించిన భక్తి స్రవంతి - ఉత్తర దేశమంతు వ్యాపించి వ్యాపించి, అంతటను విస్తృతమైనది. శ్రీమన్మధ్వాచార్య సంప్రదాయమునకు విశిష్టాద్వైతము నందలి విధానములే బలమును సంపాదించినవి. సంప్రదాయ పరంపరాగతమైన భక్తి ధార - ఒక జీవ నదియై, దేశమునఁ గల నిమ్నోన్నతములను చదును చేసి, సమున్నతిని పొందించినది. నింబార్కాచార్య వైష్ణవ ధర్మము అట్లు అంతగా వ్యాపించుటకు - శ్రీ రామానుజ సూక్తులే నిదానము. వల్లభాచార్యుల వాల్లభ్య వ్యాప్తికి ఈ సంప్రదాయమే హేతువు. బలదేవుని భావనా బలమునకు ఈ సిద్ధాంతమే ప్రాతిపదిక. శ్రీ చైతన్య ప్రభు మహా తత్త్వమునకును ఇదియే పునాది. సూరదాసు సూక్తులలో ఈ సంప్రదాయమే అనుగతము. తులసీదాసుని మధుర భాషితములకు ఇదియే మూలార్థము. తుదకు గాంధీ సిద్ధాంతమునకును ఈ వైష్ణవ ధర్మమే ప్రాణము. అత్యంత పామరులనుండి, మహా వైష్ణవులవఱకును అభివ్యాప్తమైన ఈ ధర్మము లోకపావనమైనది.

నాలుగు వర్ణములవారు - నాలుగు ఆశ్రమములవారు నలు దిక్కుల వ్యాపించిన ఈ ధర్మమును శరణు పొంది, ధన్యులైరి. స్వా

భావిక హృదయ మృదులత్వమునకు హేతువైన ఈ శ్రీ వైష్ణవ ధర్మము అందఱకును ఆవిస్మార్యము. ఆంధ్రావని ఆంతరంగమున వైష్ణవ ధర్మమును ఆర్ధించుటను చక్కగా అవగతము చేసికొన్నది. పెనుఁగు కవులు వైష్ణవ ధర్మగానము చేయఁగల్గినారు. శతకకారులు వైష్ణవ అనుభూతి కలిగి, కవితలను వెలయించినారు. పదకర్తలు శ్రీపాదముల పథాగమును ప్రోగుచేసి, కొండలు నిర్మించినారు. బ్రాహ్మణులలో - క్షత్రియులలో - వైశ్యులలో వైష్ణవ మర్యాదలు అతుకుకొని, నైతిక సంపద గలిగి శోభించినవి. ద్విజేతరులలో - ఆగమ బృంహితమైన వైష్ణవ ధర్మ పథము తీర్చి దిద్దిన బాటయై, గమ్యస్థానమును పొందింపఁజేయఁగల్గుచున్నది. ఇట్టి వైష్ణవ ధర్మ రాథకులలో ననేకులు భగవద్వైభవమును బాగుగా గుర్తించి, ఆత్మానందము నందియున్నారు.

భగవద్వైభవము అనిర్వచనీయమైనదని భక్తాగ్రేసరుల వక్కణ. అట్టి భగవద్వైభవము కంటెను భాగవత వైభవము మిక్కిలి మిన్నయైన దని, ఈ సంప్రదాయము సంభావించినది. ఈ యంశమును ఆళ్వారులు ఆచరణ పూర్వకముగా నిరూపించియున్నారు. వారు సహజముగా మహా భక్తులు. ఆ మహోన్నతులు నవ విధ భక్తి మార్గములలో పయనించి, అందందు గల ఆనందము ననుభవించి, ధన్యత గాంచిరి. ఆ పన్నిద్దరాళ్వారులు దక్షిణ భారతమునుండి ప్రవహింపఁజేసిన భక్తి స్రవంతి - ఉత్తర భారతము వఱకు పయనించి, నేఁటివఱకును అఖండముగా ప్రవహించుచునే ఉన్నది.

ఆ మహనీయుల సిద్ధాంతములు విశిష్టాద్వైతమునకు జీవగఱ్ఱలై వెలసినవి. వారి ద్రావిడ దివ్య ప్రబంధములు భక్తి ప్రచారోద్యమమునకు ఉపకరణములై యొప్పారినవి. అనంతర కాలీనులైన నాథ, యామున, రామానుజాది పూర్వాచార్య లందఱును వారి యడుగు

జాడలలోనే పయనించిరి. వారి సిద్ధాంతములను ఆధారముగ నిను కొనియే, విశిష్టాద్వైతమును సుప్రతిష్ఠిత మొనర్చిరి.

ఆళ్వారుల ప్రభావము అమ్మత్తమైన దని, వారి చరిత్రాంశములే లోకమునకు వే నోళ్ళ చాటుచున్నవి. వారు తమిళ ప్రదేశ వాసులకుఁ గల్గించిన ఆధ్యాత్మిక చైతన్యము అసామాన్యమైనది. వారు తమిళ భాషకు ప్రాణ పతిష్ఠ చేయుటలో జూపిన ఆస్థ నిరుపమానమైనది. వేద బాహ్యములైన ఇతర మతముల నెనుర్కొనుట యందును, శ్రీ వైష్ణవ సంప్రదాయమును సముల్లసింపఁజేయుట యందును ఆ మహనీయులు ప్రదర్శించిన ప్రజ్ఞా పాటవములు అపూర్వములైనవి. కావున, అట్టి ఆళ్వారుల బహుముఖ ప్రజ్ఞా విశేషములు సర్వులకును ఆవశ్యగ్రహణీయములై యున్నవి.

ఆళ్వారులకు సంబంధించిన విశేషాంశములు విపులముగాఁ దెలియవలె నన్న, ఆ మహనీయు లవతరించుటకు పూర్వము తమిళ ప్రదేశమున సంస్కృతి - సభ్యత లెట్లున్నవి ? ఆధ్యాత్మిక చైతన్య మే రీతిగా నున్నది ? ఆ దేశమునకు 'అసలు' తమిళ భాష యెట్లు వచ్చినది ? ఆ భాష యొక్క పుట్టు పూర్వోత్తరము లెవ్వి ? ఇత్యాది విషయము లన్నింటిని మొట్ట మొదట మనము స్పష్టముగా గ్రహింప వలసి యున్నది.

తమిళ భాషోత్పత్తి

అతి ప్రాచీన కాలమునుండియు మన భరత ఖండము ఏఁబది యాఱు దేశములతో విరాజిల్లు మన్నట్లు భగవ చ్ఛాస్త్రము వలన

తెలియవచ్చుచున్నది.[1] ఒక్కొక్క ప్రాంతములో ఒక్కొక్క భాష - ప్రధాన భాషగా వ్యవహరింపఁబడుట పరిపాటి.

ద్రవిడ దేశములో ముఖ్యముగా వ్యవహరింపఁబడు భాష - ద్రావిడ భాష. దీనిని 'తమిళ భాష' యనియు వ్యవహరించుచుందురు. ఇందలి 'ద్రావిడ' శబ్దము సంస్కృత భాషా జన్య మనియు - 'తమిళ' శబ్దము ద్రావిడ శబ్దమునకు వికృత రూప మనియు సంస్కృత భాషా భిజ్ఞుల యభిప్రాయము.[2]

ఈ ద్రావిడ భాషను ఒకా నొకప్రభు శిష్యుడు అగస్త్య మహర్షికి వింధ్య పర్వత ప్రాంతమున నుపదేశింప, అగస్త్యుఁ డా భాషను శ్రద్ధాసక్తులతో అధ్యయన మొనరించి, ద్రావిడ భాషా వేత్తగా విఖ్యాతి నార్జించెను. అంతే కాదు - అటనుండి శిష్య సమేతముగా నతఁడు పయనమై, దుర్గమ మగు వింధ్య పర్వత ప్రాంతమును నిర్గమించి, కీకారణ్యముల దాఁటి, సుదూరముగాఁ గల దక్షిణా పథ

---

1. " .... కురు పాంచాల మధ్యదేశ అంగ వంగ కళింగ మగధ మాగధ మాళవ నేపాళ చోళ సింహళ ద్రవిడ ద్రావిడ కర్ణాట నాట కరహాట విరాట మరాట పాండ్య పుళింద శూరసేన భోజ బాహ్లీక బర్బర కేకయ కుంతల కొంకణ వెంకణ కాశ్మీర చేర కేరళ చేది విదేహ విదర్భ సింధు ఘూర్జర సౌరాష్ట్ర మహారాష్ట్రాది షట్పంచాశద్దేశ విరాజితే ..... భరత ఖండే ....."

— (కల్యాణ ప్రకరణము - మహా సంకల్ప భాగము)

2. " On the Other hand '*Tamil*' is the Original word, or name on the analogy of which the word '*Dravida*' has been Coined by Sanskritits. "

— *K. RamaKrishnaiah,*

J. S. V. O. I; Vol 14, Pt, I.P.9.

మున కేతెంచి, అట ఆర్య సంస్కృతిని ద్రావిడ భాషామూలమున ప్రచారము గావింప సంకల్పించి, 'పొదియ మలై' అను నొక పర్వ తమున నివాస మేర్పఱచుకొని, అటనుండి ప్రచార ప్రబోధములఁ జేయ నుద్యమించెను.[3] ఇందువలన, ద్రావిడ భాషకు 'అగస్త్య భాష' యనియు పేరు వచ్చెను. అదియునుఁగాక, ఈ తమిళ భాష– 'అరవ భాష' యనియు లోకమున వ్యవహరింపఁబడసాగెను. ఈ అరవ భాషకు – 'అగత్తియమ్' (అగస్త్యియమ్) అను పేర నొక వ్యాకరణ శాస్త్రమునుఁగూడ అగస్త్యుడు రచించియుండె నని ప్రతీత యున్నది. కాని, ఇపు డా శాస్త్రము లభించుటలేదు. ఈ భాషా వ్యాప్తిని గుఱించి ముఖ్యముగా గమనింపవలసిన గాథ మఱి యొకటి కలదు.

"అది పార్వతీ పరమేశ్వరుల పరిణయ శుభ సమయము. ఆ వివాహ మహోత్సవమును వీక్షించుటకై దేవతలు, మహర్షులు ముప్పగువా రెందఱో కైలాస గిరికి విచ్చేసిరి. అట్లు విచ్చేసిన వారిలో – విశ్వ కర్మయు, అగస్త్య మహర్షియుఁ గూడ కలరు. వా రిరువురికిని విధి వశమున అట గొప్ప తగ వేర్పడెను. తీవ్ర రూపము దాల్చిన ఆ తగవులో – అగస్త్యుని రోషావేశము హద్దుల నతిక్రమించెను. అట్టి స్థితిలో అగస్త్యుడు విశ్వకర్మ నుద్దేశించి – 'ఓ విశ్వకర్మా ! లోక ములో నీకు సంబంధించిన విశ్వకర్మలనఁబరువా రందఱును నా శాపము వలన చండాలు రగుదురుగాక !' అని, అనేక పరుషోక్తులతో విశ్వ కర్మను శపించెను. అపుడు విశ్వకర్మయు పట్టఁజాలని ఆగ్రహము గల వాఁడై, దేవతల సమక్షమునందే, మహర్షియైన అగస్త్యు నుద్దేశించి – 'ఓ అగస్త్యా ! నీచే ప్రచారము గావింపఁబడు ద్రావిడ భాషయంతయు

---

3. శిలప్పధికారమ్ : 3–1, 14.

పిశాచ భాషగా మారిపోవుగాక ! నీవు రచించిన తమిళ వ్యాకరణ శాస్త్రము సైతము మ్లేచ్ఛ భాష వలె భ్రష్టమైపోవునుగాక !' అని ప్రతి శాప మిచ్చెను. అగస్త్యుఁ డంతలకు విచారగ్రస్తుఁడై, తనకు ద్రావిడ భాష నుపదేశించిన శివుని పరామర్శయైన లభింపమికి మిగుల వ్యాకులమునుఁ జెంది, అట నుండి పయనమై, ఒకా నొక అరణ్యమున కరిగి, అచట నిద్రాహారములు విరమించి, శ్రీ మహా విష్ణువును గుఱించి పది వేల సంవత్సరములు ఘోరమైన తపస్సు చేసెను. అగస్త్య మహర్షి కపుడు శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమై, 'ముసీంద్రా ! నేను వరదుఁడను. నీ తపస్సుకు మెచ్చి, నీ కిపుడు వర మిచ్చుటకై వచ్చియున్నాఁడను. కనుక, నీకు కావలసిన వరమును కోరుకొనుము' అని పలికెను. అగస్త్యుఁ డంతట విష్ణు భగవానునకు నమస్కరించి, ఆ దేవదేవుని అనేక విధముల సంస్తుతించి, తన ద్రావిడ భాషకు విశ్వకర్మవలన వాటిల్లిన విపత్తును విన్నవించి, ఆ విపత్తును పూర్తిగా రహిత మొనర్పవలసిన దని ప్రార్థించెను. అపుడు విష్ణు భగవానుఁడు అగస్త్యుని మనస్తాపమును ఉపశమింపఁ జేయ నెంచి, 'ఓ అగస్త్యా ! ఇఁక నీ విచారమును వీడుము. నా యంశతో ద్రవిడ దేశమున కొందఱని అవతరింపఁజేయఁగలను. అట్టి వారిచే ద్రావిడ భాష పునీతమై, పున రుజ్జీవింపఁబడగలదు. మఱి యొక విశేష మేమన, తామ్రపర్ణీతీరమునఁ గల 'కురుకాపురి' లో మహా యోగియు, మహా తేజశ్శాలియునై, 'శఠగోపులు' అనువా రొకఱు అవతరింపఁ గలరు. నా యంశతో నవతరించు అట్టి 'శఠరిపులు' మొదలగు వారిచే, నాలుగు వేల సంఖ్యలో పాశురములు ద్రావిడ భాషయందే రచింపఁ బడగలవు. ఆ పాశుర సముదాయము – 'నాలాయిర దివ్య ప్రబంధము' అను పేర విఖ్యాతి నార్జింపఁగలదు. ఆ దివ్య ప్రబంధమును అధ్యయన మొనరించినవారు ముక్తు లగుట నిశ్చయము. అందునను – శఠగోపులచే రచింపఁబడు 'తిరు వాయిమొళి' యను ద్రావిడ దివ్య ప్రబంధ

మును ఆకర్షించినంత మాత్రముననే, అట్టివారు నా లోకమున పూజింపఁబడుదురు. నేను ప్రసన్నుఁడనై, ద్రవిడ దేశములో - వివిధ ప్రదేశములందు అర్చారూపమున భక్తులకు దర్శన మిచ్చుచుండఁగలను. వేదార్థములు, ఆ యర్థములలోని రహస్యములు ద్రావిడ భాష లోనే లోకమున ప్రకాశింపఁబడగలవు. నాలుగు వేదములను ఆమూలాగ్రముగా వర్ణించిన విప్రుండైనను, ద్వయమంత్రాను సంధాన తత్పరుండైనను, తిరుమంత్రార్థగ్రహణ పారీణుండైనను ద్రావిడ దివ్య ప్రబంధములను అధ్యయనము చేయనియెడల, వైష్ణవత్వము సిద్ధింపఁజాలదు. కనుక, ఇఁక నీవు విచారింపవలదు" అని వరము ననుగ్రహించి, అంతర్ధానుఁడయ్యెను. అగస్త్యుఁడంతట పయనమై, మహర్షి మండలమును ప్రవేశించి, అందు తన తపఃఫలమును వెల్లడించి, సంతృప్తిఁజెందెను. తమిళ భాషోత్పత్తి క్రమ మిట్లు చరిత్రాంశములవలన తెలియవచ్చుచున్నది. [4]

తమిళ భాషా వికాసము

శ్రుతి స్మృతీతిహాస పురాణాదుల చేతను, భగవచ్ఛాస్త్రము చేతను ప్రభావితమైన భక్తి సిద్ధాంతము - భరత ఖండమున చిర కాలము నుండియు ప్రచలిత మగుచునే ఉన్నది. తమిళ ప్రదేశవాసులందును ధార్మిక ప్రవృత్తి కలదని, ప్రాచీన తమిళ వాఙ్మయమువలన తెలియుచున్నది. ఏది యెట్లున్నను - ఆళ్వారుల యుగము నందే, తమిళ వాఙ్మయ వియన్నది నుండి భక్తి స్రవంతి బయల్వెడలి, దక్షిణ భారతము మొదలుకొని, ఉత్తర భారతము వఱకును ఒక

---

4. ప్రపన్నామృతము : 73 వ అధ్యాయము

మహా ప్రవాహ రూపమున ప్రవహించి, భారతీయుల జీవితములను రస సిక్తము గావించె ననుట నిశ్చయము. అందువలన - ఆళ్వారుల యుగము మొదలుకొని, వైష్ణవాచార్యుల యుగమువఱకును నడుమగాఁ గల కాలము - భారతీయ వాఙ్మయ ప్రపంచమున ఒక స్వర్ణ యుగముగా సంభావింపఁబడినది. కావున, అట్టి స్వర్ణ యుగమే తమిళ భాషకు, తమిళ ప్రదేశమునకు ఒక మహా యోగ కాల మని మనము తలంపవచ్చును.

తమిళ ప్రదేశములో - పండితులకు, కవులకు తగిన ప్రోత్సాహ మిచ్చుటకై, వారి వారి రచనలను పరీక్షించి, ఆ యా రచనల విలువ లను నిర్ణయించు నిమిత్తమై, ఆ దేశ ప్రభువులు ఒక పండిత పరిషత్తు నేర్పఱిచిరి. ఆ పరిషత్తును - 'సంఘమ్' అని వ్యవహరించుచుండెడి వారు. తమిళ వాఙ్మయ చరిత్రను బట్టి, ఈ పరిషత్తు - క్రీ: పూ: 500 సంవత్సరముల నుండి, క్రీ: శ: 2 - వ శతాబ్దము వఱకును అమలులో నున్నట్లు తెలియవచ్చుచున్నది. ఇందువలన, ఆ నడుమగాఁ గల కాల మంతయు - 'సంఘ కాలము' అని వ్యవహరింపఁబడుచుండెడిది. ఱెండు పిమ్మట 3 - వ శతాబ్దమునుండి 5 - వ శతాబ్దము వఱకు గల కాలము 'జైన బౌద్ధ కాల' మనియు, 6 - వ శతాబ్దమునుండి 9 - వ శతాబ్దము వఱకు గల కాలము 'భక్తి కాల' మనియు చెప్పఁబడు చున్నది.

సంఘ కాలీనులైన విద్వత్కవుల కావ్య రత్నములచే సమృద్ధ సించిన తమిళ భాషా కుసుమము - ఆళ్వారుల దివ్య ప్రబంధములలోఁ గల వైష్ణవ ధర్మ పరిమళమును సంతరించుకొని, తత్పరిమళమును ఖరత ఖండమం దంతటను వ్యాపింపఁజేసి, సహృదయు లందఱకును పరమాహ్లాదమును గల్గించి, ప్రశంసాపాత్ర మయ్యెను.

సంఘ కాలము - ప్రకృతి పూజ

సంఘ పూర్వకాలపు రచనలలో 'తొల్కాప్పియమ్' అను పేరు గల గ్రంథ మొకటి మాత్రమే మన కిపుడు లభ్య మగు చున్నది. ఇది యొక లక్షణ గ్రంథము. ఈ గ్రంథమును 'తొల్కాప్పియనార్' అను నొక సుప్రసిద్ధ పండితుఁడు రచించినాఁడు. ఇందు సిద్ధాంతీకరింపఁ బడిన యంశము లన్నియు - పూర్వకాలమునఁ గల గ్రంథకర్తలచే స్పృశింపఁబడినవే. వారి సిద్ధాంతములకు అనుగుణ మైనట్టివే. ఈ విషయమును తన 'తొల్కాప్పియమ్' గ్రంథములో - తొల్కాప్పియనార్, తానే స్వయముగాఁ దెలిపియున్నాఁడు.[5] ఇందువలన, ఈ 'తొల్కాప్పియమ్' వెలువడునాటి కంఁటెను పూర్వమే, తమిళభాషలో కొన్ని గ్రంథము లున్నట్లు స్పష్ట మగు చున్నది. కాని, అట్టి ప్రాచీన గ్రంథములలో నే యొకటియు మన కిపుడు లభింపకున్నందున-'తొల్కాప్పియమ్' వెలువడునాటి కంఁటెను ముందు తమిళ ప్రదేశమున ఆధ్యాత్మిక చైతన్య మెట్లుండెడిదో తెలియఁజాలము. ఇందుచే 'తొల్కాప్పియమ్' గ్రంథ మూలమున మాత్రమే తమిళ ప్రజల ధార్మిక దృష్టిని మన మిపుడు గ్రహింపవలసియున్నది.

ప్రాచీన కాలములో తమిళ ప్రజలు ప్రకృతి సౌందర్యమ్ముపై మిక్కిలి మక్కువ గల్గియుండెడి వారనియు, పరిశుద్ధములైన అంతఃకరణములతో మెలగుచు, నిర్విచారముగ తమ తమ జీవితములను గడుపుచుండెడి వారనియు సంఘ కాలపు సాహిత్యము వలన తెలియు చున్నది. ఈ సంఘ కాలపు రచనలలో - ప్రేమ, శౌర్యము అనునవి

---

5. Tolkappiam - Porul Puraturai, Sutras 77 and 78.

రెండును విశేషముగ వర్ణింపఁబడియున్నవి. 'ఎట్టు తొగై' [6] (ఎనిమిది ఖండ కావ్యముల సంపుటము), 'పత్తు పాట్టు' [7] (పది ఖండ కావ్యముల సంపుటము) అను రెండు గ్రంథములే ఇందులకు పరమ ప్రమాణములు.

ప్రకృతి సంబంధమైన ఆనందమందు నిమగ్నమైన ఒకానొక నిశ్చిత జీవిత ప్రవృత్తిని ప్రస్ఫుటింపఁజేయు సంఘ కాలీనములైన కావ్యములు - కేవలము ప్రకృతిలోఁ గల మహత్తర శక్తులనేగాక, తదితరములైన అజ్ఞాత విషయముల నెన్నింటినో మనకు వ్యక్తము గావింపఁగలవు. అదియునుంగాక - వృక్షములు, అరణ్యములు, పర్వతములు మొదలగు వానిలోఁ గల శుభంకరములు - అశుంభకరములు నగు దేవతలను గుఱించిన వర్ణనలు గూడ, సంఘ సాహిత్యములో అట నట గన్పట్టుచుండును. అట్టి దేవతలను సంతుష్టి బఱచుటకై, ఆ నాఁటి తమిళ ప్రజలు ప్రార్థన చేయుచుండెడివారు. అపు డపుడు సూర్యచంద్రులనుఁ గూడ పూజించుచుండెడివారు. అట్టి పూజ - 'పైరై తొళుదల్' [8] అని వ్యవరింపఁబడుచుండెడిది. భక్తుఁడు భగవంతుని ఏ రూపమున ధ్యానించిన, ఆ రూపముననే భగవానుఁడు ఆ

---

6. నట్టిజై, కురున్తొగై, పట్టిప్పత్తు, పరిపాడల్, కలితొగై, నేడుతొగై, అహనానూరు, పురనానూరు.

7. తిరుమురు కట్టరుపడై, పొరునర్ - ఆట్రిపడై, శిరుపాణాట్రుపడై, పెరుంబాణాట్రుపడై, ముల్లైపాట్టు, మదురై - కాంచీ, నేడునల్ వాడై, కురంజి పాట్టు, పట్టిణప్పాలై, మలైపడు కడామ్.

8. Tolkappiam - Porul, Ahatinai 5, Nachinarkanyanar's Commentary and kulitogai, Palaikali, 16.

భక్తునకు సాక్షాత్కరింపఁగలదని - 'పరి పాడల్' అను గ్రంథములో నుల్లేఖింపఁబడియున్నది.[9] ఈ వాక్యము —

" యే యథా మాం ప్రపద్యన్తే
తాం స్తథైవ భజా మ్యహమ్. "

అను భగవద్గీతా ప్రబోధమును జ్ఞప్తికి దెచ్చును. కనుక, ఇట్టి సంఘ కాలపు సాహిత్యమునఁ గల విశేషములను దెలిసి కొనుటకు ముందు - త త్కాలమున కంటెను పూర్వము తమిళ ప్రదేశములో ప్రచలితమై యున్న ప్రకృతి పూజా సంబంధ మగు ప్రణాళికా స్వరూపమును ముఖ్యముగా మనము గమనింపవలసియున్నది.

తమిళ భూ భాగములు - తదధిదేవతలు

'తొల్కాప్పియమ్' అను గ్రంథములో - తత్కాలమున తమిళు లచే ఆరాధింపఁబడు ముఖ్య దేవతలను గుఱించిన వివరణ ముండుటచే, త న్మూలమున, ఆ యా విశేషములను మనము చాల వఱకు గ్రహింపఁ గలము. తమిళ ప్రదేశమునఁ గల జల వాయువులకు సంబంధించిన స్థితి గతుల ననుసరించి, ఆ ప్రదేశము నాల్గు భూ భాగములుగా విభజింపఁ బడినట్లు - ఈ 'తొల్కాప్పియమ్' మూలముననే తెలియవచ్చు చున్నది. అందలి ప్రతి భూ భాగమును, తమిళ ప్రజలు సర్వసామాన్య ముగ - 'తిణై' అని వ్యవహరించుచుండెడివారఁట ! ఈ నాల్గు 'తిణై'లకు - వే ఱ్వేరుగా నాల్గు పే ర్లున్నవి. ఇవి - 'ముల్లై' (అరణ్య ప్రాంతము), 'కురంజి' (పర్వత క్షేత్రము,) 'మరుదమ్' (సారవంతమైన పంటభూమి), 'నెయదల్' (సముద్ర ప్రాంతము) అను పేరులు

9. షిప్పాశర్ : 4, 11-56.

గలవి.[10] ఇవిగాక - 'పాలై' (మరు భూమి) అను నొక భూ భాగము కూడ ప్రత్యేకముగ నొకటి యుండెడి దఁట ![11] ఈ భూ భాగము లన్నింటి పరి రక్షణకై, వే ఱ్ఱేరుగా అధి దేవతలుకూడ ఏర్పఱుపఁబడి యున్నారు.[12]

వైఁబేరొక్కొనబడినవానిలో - 'ముల్లై' ప్రదేశమునకు అధి దేవత - 'మాయోన్' అనగా - శ్యామవర్ణము గల తిరుమాల (విష్ణువు). 'కురంజి'కి అధి దేవత - 'శేయోన్'. అనఁగా - గౌరవర్ణము గల 'మురుగన్' (సుబ్రహ్మణ్య స్వామి). గోవులు సంచరించు 'మరు దమ్' అను భూ భాగమునకు అధిదేవత - వర్షములను గురిపించు దేవేంద్రుఁడు. సముద్ర సాంతమునకు అధిదేవత వరుణుఁడు. అయిదవ ప్రత్యేక భూ భాగమునకు 'కొఱ్ఱవై' అనునది అధిదేవత.

తమిళ ప్రదేశమునఁ గల ఈ అయిదు భూ భాగములలో - ద్రావిడ ప్రజల కల్పనానుసారముగనే, ఈ అయిదుగురు దేవతలు ఆ యా స్థానములలో అధిష్ఠింపఁబడినట్లును, ఈ దేవతలు - ఆర్యుల దేవతలలో పూర్వము నుండియే సంబంధము గల్గి యున్నట్లును తెలియుచున్నది.[13] ఆ కాలమున, ఈ అధిదేవతలకు విడి విడిగా

---

10. Tolkappiam - Poruladhikaram - Ahatinai, Sutra 5.

11. ఈ విధమైన భూ విభజనము, భూ విభాగములకు అధి దేవతల నిర్ణయము - వైదిక వాఙ్మయమునందునుఁ గలదు. కృష్ణ యజుర్వేద సంహితలో - 3,4 సర్గలు పరిశీలింప నగును.

12. Tolkappiam - Poruladhikaram - Ahatinai, Sutra 30.

13. తమిళ్ నూల్ కళిల్ బౌద్ధమ్ : 11, 12 పుటలు.

ఆలయములుకూడ ఉండెడి వఁట ! ఈ అయిదుగురు దేవతలలో - 'మాయోన్' (తిరుమాల), 'మురుగన్' (సుబ్రహ్మణ్య స్వామి), 'కొట్రవై' అను మువ్వురు దేవతలను మాత్రము - మిగిలిన ఇరువురు దేవతల కంటెను ప్రధానులుగా తమిళ ప్రజలు భావించుచుండెడి వారు. ఇందువలన, ఇంద్రునకు - వరుణునకు గౌణ స్థానములు మాత్రమే లభించెను. ఈ యంశములు - సంఘ సాహిత్యమువలనను, శిలా శాసనముల వలనను మనకు సవిస్తరముగాఁ దెలియవచ్చు చున్నవి. [14]

'తొల్కాప్పియమ్' అను గ్రంథములో వర్ణింపఁబడిన తమిళ ప్రదేశము నందలి భూ భాగముల అధిష్ఠాన దేవతలకును, అనంతర కాలపు రచనలలో వర్ణింపఁబడిన దేవతలకును పోలిక చాల వఱకు కన్పట్టుచుండును. ఈ రెండు కాలముల నడుమ - దాదాపు రెండు మూఁడు శతాబ్దముల వ్యవధి యున్నట్లు స్పష్టముగాఁ దెలియుచున్నది. కనుక, ఆ తరుణము నందే, ఆర్య ద్రావిడ సంస్కృతులు రెండును ఏకమై యుండవచ్చు ననుటలో నేమాత్రము కూడ విప్రతిపత్తి లేదు. కారణ మేమన, 'తొల్కాప్పియమ్' వెలువడిన పిమ్మట వచ్చిన రచన లందును, ముఖ్యముగా - సంఘ కాలములో వెలువడిన రచనలందును వైదిక దేవతలను గుఱించి విస్తారముగ ప్రస్తావింపఁబడియే యున్నది.

ప్రకృతి సంబంధ మగు ఆనందముతోఁగూడిన తమిళ ప్రజల భక్తి భావము - క్రమ క్రమముగా వైదిక ప్రక్రియలతో సమ్మిళితమై, ఒకా నొక విశిష్ట భక్తి తత్త్వముగా పరిణమించినది. తత్ఫల

---

14. ఆళ్వార్‌గళ్ కాలనిలై - ము. రాఘవ అయ్యంగార్, 2, 3 పుటలు.

ముగా - తమిళ ప్రజల దేవతలలోఁగూడ మార్పులు, చేర్పులు కల్గుట తటస్థించెను.

పై జెప్పఁబడిన రీతిగా ఆర్య ద్రావిడ సంస్కృతులు రెండును ఏకమైనంతనే, రెండు విధములుగాఁ గల భక్తి సిద్ధాంతములు కూడ ఏకమైపోయినవి. ఈ ఏకీకరణము క్రీ. శ. 2, 3 శతాబ్దముల వఱకు జరుగుచునే ఉండెను. ఇందులకు ప్రమాణములు మనకు సంఘోత్తర కాలపు రచనలలో లభింపఁగలవు. ఆ మధ్య కాలపు రచనలలో - వైదిక దేవతలను గుఱించిన విశేషములు సైతము కన్పట్టుచునే ఉన్నవి.

'ముల్లై' అనఁబడు అరణ్య ప్రాంతములో నివసించు ప్రజలచే ఆరాధింపఁబడు 'మాయోన్' అను పేరు గల దేవతకు - మిగిలిన దేవత లందఱికంటెను అగ్ర స్థానము లభించినది. ఈ దేవత - కాల క్రమమున తన ప్రభావమును ఇతర భూ భాగములందును ప్రదర్శించెను. 'మాయోన్' అను శబ్దమునకు - 'నీలమేఘశ్యాముఁడైన భగవానుఁడు' అని యర్థము. ఈ భగవానునకు మఱి యొక పేరు - తిరుమాల.

'కురంజి' అనఁబడు పర్వత ప్రాంతమునకు ఏర్పఱుపఁబడిన అధి దేవతను - 'శేయోన్' అనియు, 'మురుగన్' అనియు వ్యవహరించు చుందురు. తమిళ ప్రదేశములో అవివాహితలైన కన్యలు - యోగ్యులైన భర్తలే తమకు లభింపవలె ననెడు ఆకాంక్షతో, ఈ దేవతను పూజించెడివారట. ఈ దేవతకు ఆయుధము బల్లెము. దండాయుధన్, దండపాణివేలన్, వేలాయుధన్, వేలవన్ అను పేరులు - ఈ దేవత యొక్క వీర స్వరూపమును సూచించునవియై యున్నవి. ఈ దేవతకు

సంస్కృతములో – కార్తికేయుఁడు, స్కందుఁడు మొదలగు పేర్లున్నవి. సుబ్రహ్మణ్య స్వామిగా ప్రసిద్ధిఁ జెందిన ఈ దేవతకు ఆలయములు కూడ నిర్మింపఁబడి యున్నవి. 'మరుదమ్' అనఁబడు సారవంతమైన పంట భూమికి అధిదేవత – మేఘాధిపతి యైన దేవేంద్రుఁడు. ఇతని ఆయుధము వజ్రము. నేల యంతయు బీటలువారి నప్పుడు – ఇతఁడు మేఘములను బంపి, వర్షములను కురిపించుచుండును. ఇతనికి ప్రియమైన భోజ్య పదార్థము – 'పొంగల్' అనఁబడు ముద్దాన్నము. మకర సంక్రాంతి సమయములో – తమిళ ప్రదేశమున ఈ దేవతను పూజించి, 'పొంగల్' (ముద్దాన్న) నివేదనముతో తృప్తి బఱచుచుండుట – నేఁటికిని పరిపాటిగా నున్నది. ఈ దేవతకు వాహనము – ఐరావత మనఁబడు గౌర వర్ణవము గల గజేంద్రము. ఈ దేవేంద్రునకు ఆ కాలమున ఆలయములుకూడ నిర్మింపఁబడుచుండెడివని తెలియుచున్నది. ఇంద్రుని వజ్రాయుధమునకు ప్రత్యేకముగా నొక ఆలయ మున్నట్లును 'శిల్పధికారము'లో నుల్లేఖింపఁబడి యున్నది.[15] మేఘాధిపతి యగు దేవేంద్రుని యనుగ్రహముచే సర్వ విధ సస్యములును సమృద్ధిగా ఫలింప, పాడి పంటలతో – సిరి సంపదలతో తుల దూఁగుచు, నిర్విచారముగ జీవిత యాత్రను కొనసాగించు తమిళ ప్రజలు – ఇంద్రుని యందు భక్తి విశ్వాసములు గలవారై, కృతజ్ఞతా సూచకముగ ఆ దేవేంద్రునకు ప్రతి సంవత్సరమును – 'ఇంద్ర విళా' (ఇంద్రోత్సవము) అను పేర, ఒక ఉత్సవమును జరుపుచుండెడివారఁట ! ఇట్టి మహోత్సవ వైభవ మంతయు – 'శిలప్పధికారము'నందే వర్ణింపఁబడి యున్నది.

---

15. శిలప్పధికారమ్ : కాదై - 9, 12.

'నెయదల్' అనఁబడు సముద్ర ప్రాంతమునకు అధిదేవత - వరుణుఁడు. ఈ దేవతను బెస్తవారు (జాలరులు) మిక్కిలి భక్తి శ్రద్ధ లతో పూజించుచుండెడివారు. ఈ దేవతకు తిమింగిల దంతము ఆయుధము. ఆ కాలమునఁ గల పాండ్యరాజు - సముద్ర ప్రాంతమునకు అధిదేవతయైన ఈ వరుణునకు ప్రతి సంవత్సరమును మహా వైభవముగా ఉత్సవమును జరిపించుచుండెడివాఁడట ! [16] ఈ వరుణునకును, ఆ దేవేంద్రునకును తంజావూరులో ఆలయము లుండెడి వని అచ్చటి శిలాశాసనముల వలననే తెలియవచ్చుచున్నది. [17]

'పాలై' అనఁబడు మరుభూమికి - 'కొట్రవై' అనునది అధిష్ఠాన దేవత. ఈమె - యుద్ధ రంగములో విజయమును చేకూర్చగల దని తనిళ ప్రజలకు గాఢమైన విశ్వాస ముండెడిది. ఇందువలన, యుద్ధ రంగమునందు విజయమును పొందగోరువా రందఱును, ఈ దేవతను పూజించుచుండెడివా రఁట ! [18] ఈ దేవతను సర్వ సాధారణముగా - 'మరవర్' అనఁబడు 'కల్లార్' ప్రజలు - అనఁగా, నీచజాతివారు విశేషముగ పూజించుచుండెడివారు. తమ దేవతను ప్రసన్నము గావించు కొనుటకై వీరు - కేవలము పశువులనే గాక, మనుష్యులను సైతము బలి యిచ్చుచుండెడివారఁట ! ఈ దేవతకు మూఁడు నేత్రము లున్నట్లు 'శిలప్పధికారము'లో వర్ణింపఁబడియున్నది.

---

16. శిలప్పధికారమ్ : పురమ్ - 9, 10.

17. South Indian Inscriptions : Vol. 1. P. 414.

18. Tolkappiam - Porul - Sutra 59.

తమిళ ప్రదేశములో వైష్ణవ ధర్మము

తమిళ భాషలో - 'తిరుమాలై' అనఁగా - విష్ణువు అనియు, 'తిరుమాలినై' అనఁగా - లక్ష్మీదేవి యనియు అర్థములు. ఏ తిఱుపురిలో, లక్ష్మీదేవిని 'పెరియ పిరాట్టి' యనియు శ్రీ వైష్ణవ సంప్రదాయులు వ్యవహరించుచుందురు. మొట్ట మొదట ఈ పెరియ పిరాట్టియే శ్రీ వైష్ణవ సంప్రదాయమును లోకమున ప్రవర్తిఁజేసి యున్నందున, ఈ సంప్రదాయమునకు 'శ్రీ సంప్రదాయము' అనుపేరు వచ్చెను. ఈ సంప్రదాయమును ఆ నాఁటి తమిళ ప్రజలు - 'తిరుమాలై ధర్మమ్' అని వ్యవహరించుచుండెడివారు. ఇది కాల క్రమమున - 'తిరుమాల ధర్మము' అని యనఁబడుట పరిపాటి యయ్యెను.

ఈ వైష్ణవ ధర్మము సంఘ సాహిత్యములో విస్తారముగనే గన్పట్టుచున్నది. అయినను, ఇతర మతముల ప్రాబల్యమువలన, ఈ ధర్మమునకు ఆ కాలమున తగినంత ప్రాచుర్యము లభించియుండలే దనియే చెప్పవచ్చును. కాని, అనంతర కాలమున ఈ వైష్ణవ ధర్మము ఆళ్వారుల దివ్య ప్రబంధముల మూలమున పరిపుష్టిని సంపాదింపఁగల్గెను. ఇట్టి ధర్మ పరిపుష్టికి పరిపూర్ణముగా నుపకరించిన ద్రావిడ దివ్య ప్రబంధములలోఁ గల విశిష్ట విషయములను - కాలాంతరమున, నాథ యామున రామానుజాది ఆచార్య వర్యులు బాగుగా గుర్తించి, ఆ యా విశిష్ట విషయములను తమ తమ దార్శనిక గ్రంథములలో విపులముగ విశదీకరించి, త న్మూలమున శ్రీ వైష్ణవ ధర్మ తేజమును భారత దేశమం దంతటను వెల్లివిరియఁజేసిరి.

శ్రీ వైష్ణవ ధర్మ ప్రాచీనత

సంఘ కాలమునకు పూర్వము వెలువడిన 'తొల్కాప్పియమ్' అను గ్రంథములో - తమిళ ప్రదేశమునఁగల అయిదు భూభాగములు

వర్ణింపఁబడియుండుఁ గాక, ఆ భూ భాగములకు సంబంధించిన అధిష్ఠాన దేవతలుకూడ అందు అభివర్ణింపఁబడినట్లు వైన పేర్కొనఁబడినది కదా ! అయినచో - ఇఁక, ఆ యధిదేవతలలో - 'మాయోన్' అనఁబడు విష్ణు భగవానున కెంతటి ప్రాముఖ్యముగలదో మన మిపుడు గమనింపవలసి యున్నది.

'తొల్కాప్పియమ్' రచయిత - తన గ్రంథమున అధిదేవతలను వర్ణించు సందర్భములో మొట్ట మొదట - 'ముల్లై' అనఁబడు అరణ్య ప్రదేశమునకు అధిదేవత యగు తిరుమాల (విష్ణువు) పేరునే ఉట్టంకించెను.[19] ఇట్లే - 'నేవికలార్' అను నొక సుప్రసిద్ధుఁడైన కవియు - తాను రచించిన 'పెరియ పురాణము'నందు, ఇతర దేవతలకంటెను తిరుమాల (విష్ణువు)కుఁ గల మహిమలనే విస్తారముగ ప్రస్తుతించుచు, ఆ దేవదేవుని - అరణ్య ప్రాంతమునకు అధి దేవతగా అభివర్ణించెను.[20]

దేవతలలో - విష్ణువునకుఁ గల ప్రాముఖ్యమును సూచించుటకై వ్యవహరింపఁబడు 'మాయోన్' శబ్దమే గాక, ఆ యర్థము నిచ్చెడు 'తిరుమాల' శబ్దము కూడ ఆ కాలమున తఱచుగా ప్రయోగింపఁబడుచుండెడిది. తిరుమాల - కేవలము మానవులను మాత్రమే గాక, సర్వ జీవరాసులను సంరక్షింపఁగలవాఁ డని 'తొల్కాప్పియమ్' అను గ్రంథమునందే విశదీకరింపఁబడి యున్నది.[21] ఈ లక్షణ శాస్త్ర

---

19. Tolkappiam - Aham - Sutra 5 and 30.

20. Periya Puranam - Thirukurri Purandara Puranam, Stanza. 16.

21. Tolkappiam - Porul - Sutra 60.

కారుఁడు తన గ్రంథమున - 'పువై నిలై' అను కవితా లక్షణములను వివరించుచు - 'ఉత్తముఁడైన రాజు, తిరుమాలతో పోల్చఁ దగిన వాఁడు' అని యుల్లేఖించి, [22] అనంత కల్యాణ గుణ గణ విశిష్టుండైన అట్టి తిరుమాలను బహు భంగులుగా కీర్తించి యున్నాఁడు. ఈ విద్వత్కవి - తన లక్షణ గ్రంథమున, ఇంతగా మఱి యే యితర దేవతను వర్ణించియుండలేదు. ఇందువలన, ఆ నాఁటి తమిళ ప్రజలు తిరుమాల మహిమలను ఎంతగా గుర్తించి యుండిరో మనము సులభముగాఁ జెలిసికొనవచ్చును.

'ముల్లై' అనఁబడు అరణ్య ప్రదేశములో నివసించు 'ఆయర్' కులజులు (గొల్లలు) - తమ యిష్టమైన దైవ మగు తిరుమాలకు సంబంధించిన మహిమలను వర్ణించు గీతములను మధురముగా గానము చేయుచు, ఆ దేవదేవుని వివిధ లీలలను విశేషముగా కొనియాడు చుండెడివారు. ఆ గొల్లపడుచులకు తమ భర్తలపై నెంతటి యనురాగ ముండెడిదో - అంతటి భక్తి భావమే తమ యిష్ట దైవ మగు 'మాయోన్' (తిరుమాల) యందును గలదు. [23] 'తొల్కాప్పియమ్' వెలువడిన నాఁటి (క్రీ. పూ. 5 - వ శతాబ్దము) నుండియే తిరుమాలకు సంబంధించిన గాథలు - తమిళ ప్రజల మనస్సులను విశేషముగ ఆకర్షింపసాగినవనియు, అందువలన, తిరుమాలకు సంబంధించిన చరిత్రాంశములు సంఘ కాలము నుండియే బాగుగా ప్రచారములోనికి వచ్చెనవనియు ఇందు మూలమున విశద మగు చున్నది.

---

22. 'నా విష్ణుః పృథివీపతిః' అని కదా ఆర్యోక్తి !

23. Tolkappiam - Porul - Sutra 84 and 85.

సంఘ సాహిత్యములో వైష్ణవము

సంఘ సాహిత్యమునకు సంబంధించిన రచనలలో – 'ఎట్టు తొలైకై' (ఎనిమిది ఖండ కావ్యముల సంపుటము) – 'పత్తు పాట్టు' (పది ఖండ కావ్యముల సంపుటము) – 'పదినేణ కీళ కణక్కు' (పదు నెనిమిది లఘు కావ్యముల సంపుటము [24]) అను మూఁడు గ్రంథములు మాత్ర మిపుడు లభ్య మగు చున్నవి. వీనిలో మొట్ట మొదటి దగు 'ఎట్టు తొలైకై' అను సంపుటమునఁ గల 'నట్టినైై' అను కావ్యము – మిగిలిన కావ్యము లన్నింటి కంటెను ప్రాచీనమైనదిగా మనము సంభావింపవచ్చును. ఇందు-తిరుమాల(విష్ణువు)కు సంబంధించిన వివిధగాథలు విస్తారముగ వర్ణింపఁబడి యున్నవి. ఇందలి ఒక కావ్య రచయిత – సమస్త విశ్వమును తిరుమాల మయముగా దర్శించినాఁడు. [25] విశ్వము నం దంతటను తిరుమాల యొక్క ప్రభావము వ్యాపించి యున్నట్లు గుర్తించినాఁడు. విశ్వమును తిరుమాలగా – తిరుమాలను విశ్వముగా విశ్వసించినాఁడు. [26] ఈ కావ్య సంపుటములో మంగళాచరణము

---

24. ఎట్టుతొకై, పత్తు పాట్టు అను సంపుటములలోఁ గల కావ్యముల పేర్లు ముందే తెలుపఁబడినవి. కనుక, ఇచట పదినేణ కీళ కణక్కు– అను సంపుటములోఁ గల కావ్యములు కొన్ని మాత్రము సూచింపఁబడుచున్నవి. ఇందు తిరుక్కుఱళ్, తిరికటుకమ్, నాన్మణి కటికమ్, శిరుపంచమూలమ్, నాలడియార్, కార్ నార్పదు. కళవళ నార్పదు, ఇనియై నార్పదు, ఇన్నా నార్పదు, ఎంతిపై, పళమొళి, ముమ్మొళి, కాంచి మున్నగు లఘు కావ్యములు మొత్తము పదునెనిమిది ఉన్నవి.

25. 'సర్వం విష్ణుమయం జగత్' అను సూక్తి – అతి ప్రాచీన కాలము నుండియు లోకమున ప్రచలిత మగుచున్నదే గదా !

26. వ్యాస రచితమైన మహాభారతము నందును విష్ణు భగవానుని విశ్వ రూపము వర్ణింపఁబడి యున్నది. శాంతి పర్వమునందు 336 – వ అధ్యాయములో 21 – వ శ్లోకము మొదలుకొని, 28 – వ శ్లోకము వఱకును పరిశీలింపుఁడు.

గాక, నూట డెబ్బది యైదు మంది కవులు రచించిన నాలుగు వందల కవిత లున్నవి. ఈ కవితలను రచించినవారిలో - ఎనమండుగురు స్త్రీలును కలరు. కపిలర్, ఉల్లోచనార్ అను పేర్లు గల ఇరువురు కవుల రచనలు - ఇందు, శేషించిన వారి రచనల కంటెను అధిక సంఖ్యలో నున్నవి. ఈ యిరువురిలో మొదటి కవి - ప్రకృతి సౌందర్యమునందే తాను తిరుమాలను దర్శించినట్లు, తన కవితలో విశదీకరించినాడు. ఇక రెండవ కవి - శ్యామ వర్ణము గల పర్వతమును, ఆ పర్వత పంక్తుల నుండి జల జల ప్రవహించు నిర్మలమైన నిర్ఝరిణిని పరిశీలించి నంతనే, తనకు తిరుమాల జ్ఞప్తికి వచ్చినట్లు తన కవితలో స్పష్టీకరించి నాడు. మఱి యొక కవికి - కాయా పుష్పమునందును,[27] నీల గగ నము నందును, సముద్ర తరంగములందును విష్ణువు కాన వచ్చినట్లు ఒక కావ్యములో నుట్టకింపఁబడియున్నది. ఇట్లే, సంఘ కాలమునఁ గల కవులలో ననేకులు - ప్రకృతి యందే తిరుమాలను దర్శించినట్లును, ఆ నాఁటి తమిళ ప్రజలు తిరుమాల మహిమలను కథల రూపమున తఱుచుగా కీర్తించుచుండెడి వా రనియును - 'నట్టిణై' అను కావ్యము వలననే తెలియవచ్చుచున్నది.

'పదిట్టు పత్తు' అను కావ్యములో 'కాప్పియట్టూరు కాప్పియ నార్' అను కవి - తనకు ఆశ్రయ మిచ్చిన 'నారముడి చేరల్' అను పేరు గల ఒకా నొక చేర రాజును విష్ణు భక్తునిగా అభివర్ణించినాడు. వరాహావతారముతో సర్వ భూ మండలమును సంరక్షించిన తిరుమాల (విష్ణువు)ను - సర్వ కాల సర్వావస్థల యందును, సద్భక్తితో ఆరా ధించుచుండవలసినదని, ఆ రాజు తన రాష్ట్ర ప్రజల నుద్దేశించి ఉద్బో

---

27. ఒకొ నొక పుష్ప విశేషము.

ధించినట్లు ఈ కావ్యములో నుల్లేఖింపఁబడి యున్నది. ఈ కావ్యము నందే మఱి యొక తావున – తిరుమాల భక్తులు స్నాన మాడి, ఉప వాస వ్రతమును బూని, తిరుమాల కోవెలకుఁ బోయి, అందు వేంచేసి యున్న దివ్య మంగళ విగ్రహమును సంసేవించి, అనేక విధములుగా ప్రస్తుతించి, తులసి మాలను ధరించియున్న ఆ తిరుమాల యొక్క చరణారవిందముల సన్నిధిలో పుష్పాంజలి సమర్పించి, తన్మయత్వ ముతో నృత్యము జేయుచుండెడివారని అభివర్ణింపఁబడియున్నది. ఇందు వర్ణింపఁబడిన ఆలయము – తిరువనంతపురములోఁ గల శేషశాయి యగు తిరుమాల వేంచేసి యున్నట్టిదని విద్వాంసుల అభిప్రాయము. [28]

'చెత్వ కట్టుంగో' అను నొక రాజు – తిరుమాల యందు తనకుఁ గల భక్తి ప్రపత్తులను పురస్కరించుకొని, నిత్య నైవేద్య దీపారాధ నాదుల నిమిత్తమై–'ఓమన్దూర్' అను పేరు గల గ్రామము నొకదానిని తిరుమాలకు శాశ్వత కైంకర్యముగా సమర్పించినట్లు – 'కపిలర్' అను కవి, ఒక కావ్యములో నుట్టకించియున్నాఁడు. కావున, తమిళ ప్రదేశ మునకుఁ జెందిన చేర రాజ్యములో – అతి ప్రాచీన కాలమునుండియు తిరుమాలార్చన జరుగుచున్నట్లు స్పష్ట మగుచున్నది.

'నక్కీరర్' అను పేరు గల ఒక కవి – 'పురనానూరు' అను తన కావ్యమున బలరాముని వర్ణించుచు, సముద్రములో సముత్పన్న ము లగు ధవళ వర్ణము గల శంఖముల కాంతివలె, బలదేవుని దేహకాంతి తేజరిల్లుచుండె ననియు – అతని ధ్వజముపై తాళవృక్ష చిహ్నము సంకేతింపఁబడియుండె ననియు ఉల్లేఖించియున్నాఁడు. [29] మఱియు –

---

28. 'తమిళముమ్ - వైష్ణవముమ్' - ఎమ్. రాఘాకృష్ణపిళ్ళై, 6 - వ పుట.

29. పురమ్ : 55-3-4.

ఆ బలరామునకు అనుజుఁడైన 'కణ్ణన్' (కృష్ణుని) శరీరము నీలమణి కాంతివలె విలసిల్లుచున్నదనియు, అతఁడే తిరుమాలగా సంభావింపఁ బడదగినవాఁడనియు ఈ కవి శేఖరుఁడు అభివర్ణించి యున్నాఁడు.[30]

'మాణక్కత్తునప్పసలైయార్' అను పేరు గల కవి 'కణ్ణన్' (కృష్ణ) మహిమలను తన కావ్యమున వివరించుచు, దేవ దానవులకు యుద్ధము సంభవించినప్పుడు, పగటి కాలమునఁ గూడ చీఁకటి వ్యాపించుటకై, అసురులు సూర్యుని కప్పివేసి రనియు - అప్పుడు భూమండల మంతయు అంధకార బంధుర మయ్యె ననియు - అందువలన, ప్రజలందఱును భయభ్రాంతులు కాఁగా, అప్పుడు నీలవర్ణ దేహధారియగు 'కణ్ణన్' (కృష్ణుఁడు) జగత్కల్యాణ కాంక్షతో మఱి యొక సూర్యుని సృష్టించి, ఆకాశమునఁ గన్పఱిచి, ప్రజలకు సంతుష్టి గల్గించె ననియు అభివర్ణించినాఁడు.[31] అదియునుఁ గాక, ప్రళయ కాలమున విష్ణువు వటపత్రశాయియై యుండు వృత్తాంతము సైతము ఈ కవిచే వర్ణింపఁ బడినది.[32]

'పరిపాడల్' అను గ్రంథమునందును విష్ణువును గుఱించిన వర్ణనలు విస్తారముగ నున్నవి. 'పాడల్' అనఁగా - 'గీతము' అని యర్థము. ఈ సంపుటమునఁ గల డెబ్బది కావ్యములలో - ప్రత్యేకముగ ఎనిమిది కావ్యములు కేవలము తిరుమాలకు సంధించిన వివిధ

---

30. పురమ్ : 174-1-5.

31. ,, : 57-1-8.

32. ,, : 191-1.

మహిమలను వర్ణించునవియై యున్నవి. ఈ సంపుటమునఁ గల మొదటి కావ్యములో – శేషశాయి యగు విష్ణు భగవానుఁడు అభివర్ణింపఁబడి యున్నాఁడు. ఛత్రము, ఆసనము, దీపము మున్నగునవియును ఇందు వర్ణింపఁబడి యున్నవి. నీల మేఘ శ్యాముఁడైన తిరుమాల యొక్క– వక్షస్థలమును వరలఁజేయు రమాదేవి – సత్య సుందరముల సమన్వయము వలె సంశోభించుచున్న దని, ఇందు కవి రమణీయముగా వర్ణించినాఁడు. తిరుమాలకు సంబంధించిన వివిధ భూషణములు గూడ ఇందు వర్ణింపఁబడి యున్నవి. ఆ భూషణము లెవ్వి యన, ప్రకృతిలోఁ గల వివిధ వస్తువులే. అగ్నిచే సమావృతమైన పర్వతమే ఆ తిరుమాలకు పీతాంబర మఁట ! ఇట్లే, ప్రకృతిలోఁ గల వస్తు జాత మంతయు తిరు మూలకు అలంకారప్రాయమైన భూషణ సముదాయముగా ఈ కావ్యమున వర్ణింపఁబడినది. ఈ కావ్య రచయిత – తన అకించనత్వమును, శేషత్వ పారతంత్ర్యములను, భగవన్మాహాత్మ్యమును వ్యక్తము గావించుచు – 'వేదవేద్యులైన మహర్షులు, విజ్ఞానవేత్తలైన మహానీయులు తిరుమాల మహిమలను పరిపూర్ణముగా గ్రహింపఁజాలని పరిస్థితిలో – అకించనుఁడనైన నేను, ఆ తిరుమాల మహిమల నన్నింటిని ఎట్లు వర్ణింపఁగలవాఁడను ? అవాఙ్మానసగోచరమైన ఆ దేవదేవుని మహా ప్రభావమును ఏ కొలఁదిగా వర్ణింపఁ దలచినను – అతని కృపా కటాక్షము అణుమాత్రమైనను నాపై ప్రసరించితీరవలెను' అని, తన కావ్యమునందే మఱి యొక తావున ప్రాసియున్నాఁడు.

బ్రహ్మరుద్రేంద్రాదు లందఱును తిరుమాలయొక్క– సంకల్పము వలన నుద్భవించినవాఁడే. స్వర్ణమయమై, ధగద్ధగాయమానముగ వెలుగొందు చక్రాయుధమును తన కర కమలమున ధరించిన ఆ తిరుమాలయే అఖిల ప్రపంచమునకును ఆదికారణము. అతఁడే, శ్రుతి స్మృతీతిహాసాదులలో నంతటను పరబ్రహ్మాభిధానుఁడుగా కీర్తింపఁబడు

చున్నాఁడు. అట్టి పరమాత్మను శరణు పొందిన వారలు ముక్తు లగుట నిశ్చయము, అనియు సంఘ సాహిత్యమునందు పలు తావులలో విశదీ కరింపఁబడియున్నది. ఈ కారణమును బట్టి, సంఘకాలీనులైన కవు లలో ననేకులు కేవలము వైష్ణవ హృదయు లనియే తెలియవచ్చు చున్నది.

పైన చేర్కొనఁబడిన 'పరిపాడల్' కావ్యమునందు గూడ, తిరు మాల ధరించిన యవతారములు కొన్ని వర్ణింపఁబడి యున్నవి. బల రాముఁడుకూడ దశావతారములలో నొకఁడు కనుక, సంఘ కాల ములో - కృష్ణునకు వలెనే బలదేవునకును ఆలయములు నిర్మింపఁబడి నట్లును, ఆ బలదేవునిఁ గూడ తమిళప్రజలు పూజించుచుండెడివా రనియు 'పరిపాడల్' కావ్యము వలననే తెలియవచ్చుచున్నది.

ఈ 'పరిపాడల్' కావ్యకర్త యగు 'కడువన వేయనార్' అను కవి, ముఖ్యముగా - భగవ చ్ఛాస్త్రమునందును, పురాణేతిహాసాదుల యందును గాఢమైన అభినివేశము గల వాఁడని మనము భావింపఁ వచ్చును. ఏల యన, భగవ చ్ఛాస్త్రము నందును, పురాణేతిహాసా దుల యందునుఁ గల తాత్త్విక విషయము లనేకములను ఈ కవి తన కావ్యములో తడప యున్నాఁడు. ఇందులకు ఒక్క ఉదాహరణము మాత్రము ఇట చాలును. పైఁ బేర్కొనఁబడిన భగవ చ్ఛాస్త్రాదు లలో వర్ణింపఁబడియున్న వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహములను నాల్గింటిని ఈ కవి తన కావ్యమున వరుసగా - చెంకణ కారీ, కరుంకణ వెళ్ళై, పొంకణ పచ్చై, పైంకణ్మాల్ అను పేర్లతో సంకేతించుచు, ఈ వ్యూహములకు సంబంధించిన విశేషాంశములను

సైతము అందే విశదీకరించియున్నాఁడు.[33] అదియునుఁ గాక, ఈ కావ్య సంప్రతమునందు – పృథివిని రక్షించిన వరాహావతారము,[34] ప్రహ్లాదుని భక్తి విశ్వాసములను సార్థకములఁ గావించిన నరసింహావతారము,[35] మూఁడు అడుగులతో ముల్లోకముల నాక్రమించిన వామనావతారము[36] సైతము బహు భంగులుగా ప్రస్తుతింపఁబడియున్నవి.

'పరి పాడల్' కావ్యములో – రెండవ గీతములను రచించిన 'కీరన్తైయార్' అను పేరు గల కవి – బలరాముని, కృష్ణుని ఒకే రూపముగ భావించుచు, అందునను – కృష్ణుఁడు (కణ్ణన్) విశేషించి, పరిపూర్ణావతారముతో విరాజిల్లువాఁడని సంభావించుచు, ఆ కృష్ణ భగవానుని – అనన్యమైన భక్తి భావముతో స్తోత్రము గావించియున్నాఁడు.[37] తనకు తిరుమాల – నిరంతరము తరుణ వయస్కుఁడుగా, జ్ఞాన స్వరూపుడుగా గోచరించుచుండునని స్పష్టీకరించినాఁడు.[38] లోక రక్షణార్థమై, భూ మండలములో వివిధ అవతారములు ధరించిన తిరుమాలయొక్క కల్యాణ గుణములను తన గీతమున విశేషముగా కీర్తించినాఁడు.

---

33. 'తిరుకోయిల్ పత్రిక (Vol. 11, Issue 3)లో 'వైష్ణవమ్' అను శీర్షిక గల వ్యాసము. వ్యాసకర్త - శ్రీ పి. శ్రీ. ఆచార్య, 21 - ప పుట.

34. పరిపాడల్ 4-10-21.

35. ,, 3-3 -34.

36. ,, 3-19-20.

37. ,, 2-20-23.

38. ,, 2-43-49.

'నల్లెళుదియూర్' అను నొక కవి - తిరుమాలను పరబ్రహ్మ ముగా భావించుచు, సర్వ వ్యాపకుఁడైన అట్టి తిరుమాల మహిమలను తన కావ్యమున మనోహరముగా వర్ణించినాఁడు.[39] మఱి యొక కవి - 'ఇరుంబైయూర్' అను క్షేత్రమునఁ గల తిరుమాలను ఒక గీతమున అభివర్ణించినాఁడు. ఆ క్షేత్రము - వేగావతీ తీరమునందు సుప్రసిద్ధ ముగాఁ గల 'అళగర్ కోయిల్' అని, విద్వాంసుల అభిప్రాయము.[40]

'కలిత్తొకై' అను కావ్యములో - బాల కృష్ణుని లీల లన్నియు వర్ణింపఁబడియున్నవి. ఇందు - కృష్ణుని ప్రాణములను హరించు నిమిత్తమై, కంసునిచే నియుక్తమైన 'కేశి' అను అశ్వరూపము ధరించిన రాక్షసునకు సంబంధించిన వృత్తాంత మంతయు సవిస్తరముగా నున్నది. ఈ 'కేశి'ని సంహరించిన కృష్ణుఁడు - ఏ తత్కాన్య కర్తయగు 'నల్లి నుత్తనార్' అను కవిచే, విశేషముగా కీర్తింపఁబడినాఁడు.[41] అది యును గాక, తనను హృదయ పూర్వకముగా శరణించిన ద్రౌపదిని కరుణించి, ఆమె యొక్క మానవీత్వమును రక్షించి, దుర్మార్గ గాములగు దుశ్శాసనాదుల గర్వము నణంచిన కృష్ణుని ప్రభావము సైతము - ఇందు పలు విధములుగా ప్రశంసింపఁబడినది.[42] మఱియు - సమస్త విశ్వమును మూఁడు అడుగులలో నాక్రమించిన త్రివిక్రమావతార వృత్తాంతముకూడ ఇందు అభివర్ణింపఁబడినది. ఈ 'కలిత్తొకై' కావ్యము నందే - పరిశుద్ధములైన కాషాయ వస్త్రములు ధరించి, పవిత్రములైన అంతఃకరణములు కలిగి, ఆదర్శప్రాయమైన ప్రవృత్తితో -

---

39. పరిపాడల్ : 3-18-28.

40. తమిళమమ్ - వైష్ణవమమ్; ఎఁ. రాధాకృష్ణపిళ్ళై, 26 - వ పుట.

41. ముల్లైకలీ - 103, 50-53.

42. ,, 1-81-120.

నివృత్తి మార్గమున, వైరాగ్య ప్రయుక్తములైన జీవితములను పయనింపఁజేయు వైష్ణవ సన్యాసుల మహత్తు వర్ణింపఁబడి యున్నది. ఆ మహనీయులు సర్వ సామాన్యముగా – 'భగవర్' అనియు, 'ముక్కోర్ భగవర్' అనియు వ్యవహరింపఁబడుచుండెడివారఁట ! తమిళ భాషలో 'ముక్కోల్' అనఁగా – 'త్రిదండము' అని యర్థము. కావున, ఈ 'ముక్కోల్' శబ్దమే – కాలక్రమమున 'ముక్కోర్' అను రూపాంతరమును పొందియుండవచ్చును. దీనినిఁబట్టి, ఆ వైష్ణవ సన్యాసులుకూడ, ఈనాఁటి వైష్ణవ సన్యాసులకువలెనే, త్రిదండములను ధరించుచుండెడివారని స్పష్టమగుచున్నది.[43] ప్రభువులు మొదలుకొని, సామాన్య ప్రజలవఱకు ఎల్లరును ఆ మహనీయుల యందు అత్యంతము పూజ్య భావము గల వారలై, ధార్మిక రంగమున వారి సంగు సలహాలను శిరసా వహించి, పాటించుచుండెడి వారఁట ! ఆ కాలమున రాజాధిరాజులు కూడ తిరుమాల (వైష్ణవ) ధర్మమును సమాశ్రయించి, అట్టి సనాతన ధర్మవ్యాప్తికై, బహు ముఖములుగా కృషి జేయుచుండెడివారని, 'కలిత్తొకై' అను కావ్యమువలననే వ్యక్తమగుచున్నది.

సంఘ కాలమునందు వెలువడిన కావ్య సంపుటములలో 'పదిపాట్టు' అనునది రెండవది. ఇది – పది ఖండ కావ్యముల సంపుటము. ఇందలి మొదటి కావ్యము ఒకానొక ప్రాచీన కవిచే రచింపఁబడినట్లు తెలియవచ్చుచున్నది. ఈ కావ్య సంపుటమునఁ గల 'పాణాట్రుపడై' అను మఱి యొక కావ్యమును రచించిన కవి – తనకు ఆశ్రయమొసంగిన తిరుమాల వంశమునందే తాను జన్మించినట్లు విశదీకరించి

---

43. ఇట్టి త్రిదండ సంన్యాసులే 'జీయరులు' అని వ్యవహరింపఁబడుచున్నారు.

నాఁడు.[44] ఈ కావ్యములో కవి - కాంచీపురమును వర్ణించు సందర్భమున, కాంచీ పట్టణము - బ్రహ్మను ధరించిన తిరుమాల యొక్క నాభినుండి వెలువడిన కమలమువలె అతిపురాతనమైన దనియు అభివర్ణించెను. అదియునుఁ గాక, ఆ కాంచీపురమునకు సమీపమున - 'తిరువేహా' అను తావులో, ఒక తిరుమాల కోవెల కల దనియు కవి యుల్లేఖించియున్నాఁడు.

'ముల్లై పాట్టు' (వన గీతము) అను కావ్యమును రచించిన 'నంపూదనార్' అను కవి - వామనావతారమును వర్ణించుచు, తిరుమాల - భువన సుందరమూర్తి యని కీర్తించుచు, అతని సర్వ వ్యాపకత్వమును ప్రస్తుతించెను. ఈ కావ్యము - 'ముల్లై' ప్రదేశమునకు అధిదేవత యగు 'మాయోన్' అనఁబడు తిరుమాలను స్తుతించుట తోడనే ఆరంభమైనది. బలిచక్రవర్తిని మూఁడు అడుగుల ప్రదేశమును అడిగి, ముల్లోకముల నాక్రమించిన వామనుని వృత్తాంతము - ఆ కాలమున లోక ప్రియముగా నుండెడి దని, ఈ కావ్యము వలన తెలియుచున్నది. బలిచక్రవర్తికిఁ గల గర్వము నంతయు భంగము గావించిన తిరుమాల మహిమను కీర్తించు నిమిత్తమై మధురలో - 'ఓణమ్' అను పేర, ఒక ఉత్సవమును మహా వైభవముగా జరుపుచుండుట పరిపాటిగాఁ గల దని, ఈ కావ్యమున విశదీకరింపఁబడియున్నది.

సంఘ కాలములో వెలువడిన మూఁడవ కావ్య సంపుటము - 'పదినేణ కీళ్ కణవమ్' అనునది. ఇందు - పదునెనిమిది ఖండ కావ్యములున్నవని మున్నే ఇందు సూచింపఁబడినది. ఈ కావ్యము లన్నింటిలో-

---

44. పొరున పాణాట్రుప్పడై : 29-31.

విశ్వ విఖ్యాతి గాంచిన 'తిరువళ్ళువర్' మహాకవి విరచిత మగు 'తిరుక్కురళ్' అనునది ప్రముఖ స్థాన మాక్రమించి యున్నది. ఈ కావ్య రచయిత 'అసలు' ఏ మతమునకుఁ జెందిన వాఁడై యున్నను - కావ్యమును రచించు తరుణమున మాత్రము తిరుమాలను తన దృక్పథ ములో నుంచుకొని యుండె ననుట నిర్వివాదాంశము. ఏల యన, ఈ కావ్యములో 'తిరువళ్ళువర్' - తిరుమాలకు సంబంధించిన కల్యాణ గుణములను విశేషముగా కీర్తించుటే గాక, భగవద్గీతలోఁ గల తాత్త్విక విషయముల నన్నింటిని, వివేచనాపూర్వముగ గ్రహించి, త త్సారాంశమును సైతము తన కావ్యమున పొందుపఱచియున్నాఁడు. అదియునుఁ గాక - 'అడియళందాన్' [45] (లోకమును ప్రవర్తింపఁ జేయు), 'తామరైక్కణ్ణన్' [46] (కమల దళ లోచనుఁడగు కృష్ణుఁడు) అను రెండు ప్రయోగములను కవి తన కావ్యమున ప్రయోగించి యుండుటనుబట్టియు - ఆ కాలమున లోకములో ప్రచలిత మగు చున్న తిరుమాల తత్త్వము - 'తిరువళ్ళువర్' మహా కవిని విశేషముగ నాకర్షించెనని మనము సులభముగా గ్రహింపవచ్చును.

'పదినేణ కీళ కణవమ్' అను కావ్య సంపుటముసండే 'తిరు కడుక్కుమ్' అను శీర్షికతో నొక ఖండ కావ్య మున్నది. ఇందు - తిరు మాలకు సంబంధించిన వివిధ లీలలు మొదలుకొని, వామన వృత్తాంత మును గలుపుకొని, శకటాసురుని సంహరించిన కృష్ణావతారము వఱ కును అనేక ఘట్టములు అభివర్ణింపఁబడియున్నవి. ఇందుఁ గల మంగళా చరణమునుఁబట్టి, ఈ కావ్య రచయిత యగు 'నల్లాదనార్' అను నతఁడు - వైష్ణవుఁ డనియే నొక్కి- వక్కాణింపవచ్చును.

---

45. తిరుక్కురళ్ - దోహా 610.

46. ,, 1103.

'నాన్మణి కడిగై' అను ఖండ కావ్య మొకటి - వై కావ్య సంపుటమునందే సంకలితమై యున్నది. ఈ ఖండ కావ్యము - 'విళంబీ నాగనాక్' అను కవిచే రచింపఁబడినది. ఇతఁడుకూడ, వైష్ణవుఁడనియే మనము భావింపవచ్చును. ఈతని కావ్యములో - ప్రారంభమున రెండు పద్యము లున్నవి. ఇందలి మొదటి పద్యములో - 'మాయోన్' (కృష్ణన్) ప్రస్తుతింపఁబడి యున్నాఁడు. చంద్రుడు - 'మాయోన్' ముఖ మండలమువలె నుండె ననియు, కిరణ సహిత్యుఁడైన సూర్యుఁడు - తిరుమాల యొక్క నయనములవలె నుండెననియు, 'పూవై' (నల్లఆవిసి చెట్టునందు వికసించిన) పువ్వును - అతని శరీర వర్ణమును తలపింపఁ జేయుచుండె ననియు, కవి - ఉపమాన వస్తువును ఉపమేయ వస్తువు కంటెను శ్రేష్ఠమైన దానినిగా వర్ణించెను.[47] ఇట్టి వర్ణనమునే వ్యతిరేకాలంకార మని, ఆలంకారికులు సంకేతించి యున్నారు. మంగళా చరణమునందలి రెండవ పద్యములో - 'కృష్ణన్' లీలలు కొన్ని వర్ణింపఁబడియున్నవి.

'ఇనియదు నార్పదు' అను కావ్యమును రచించిన 'పూదం చెందనార్' అను పేరు గల కవియు వైష్ణవుఁడనియే విద్వాంసుల అభిప్రాయము. ఈ కవి - తన కావ్యములో, కృష్ణ లీలలను మనోహరముగా వర్ణించియున్నాఁడు.

సంఘోత్తర కాలములో ?, 4 శతాబ్దములందు - అయిదు ఉత్తమ కావ్యములు వెలువడినవి. అవి శిలప్పధికారమ్, మణిమేఘలై,

---

47. 'తిరుకోడల్' (Vol. III. Issuse 4)లో - 'తిరుమాల్ పిపాడు' అను శీర్షిక గల వ్యాసము. వ్యాసకర్త — శ్రీ. పి. శ్రీ. ఆచార్య.

జీవక చింతామణి, వళయాపతి, కుండలకేశి అను పేర్లతో సుప్రసిద్ధ ములై యున్నవి. ఈ మహా కావ్యములే గాక, ఆ కాలమున ఉత్తమ శ్రేణికిఁజెందిన అయిదు లఘు కావ్యములుకూడ వెలువడినవి. ఇవి - నీలకేశి, చూడామణి, యశోధర కావ్యమ్, నాగకుమార కావ్యమ్, ఉదయణన కథై అను పేరులు గలవి.

'ఇళంగో' అను పేరు గల కవిచే - శిలప్పధికారమ్' (నూపుర కావ్యము) రచింపఁబడినది. ఈ కవి సహజముగా బౌద్ధ ముని యయ్యును - తన కాలమునఁ గల వివిధ ప్రసిద్ధ మతములను సైతము శిలప్పధికారమునందు ప్రస్తావించి యున్నాఁడు. ఈ సందర్భమున నితఁడు తిరుమాల ధర్మమును విస్తారముగ ప్రశంసించియుఁడుట - గమనావశ్యకమైన యంశము. ఆయరులు (గొల్లలు) కృష్ణుని ప్రార్థించుచు - 'కురవై' (రాచక్రీడ) అను నృత్యము చేసినట్లు ఈ కావ్యమున అభివర్ణింపఁబడి యున్నది. ఇట్టి సన్నివేశమును సర్వ సామాన్యముగ - 'ఆయచియర్ కురవై' అని యందురు. ఈ శీర్షికతో వివిధ నృత్యములు శిలప్పధికారములో విశేషముగా వర్ణింపఁబడి యున్నవి. వీనిలో - 'కురవైకూత్తు' అను నృత్యమే తె దితర నృత్యము లన్నింటి కంటెను ముఖ్యమైనది.[48] ఈ నృత్యము లన్నియు - ఆయర (గొల్ల) కులమునందే ఆచరణమునం దున్నట్లు, ఈ కావ్యమున వ్యక్తము గావింపఁబడినది. విఘ్నములు కలుగకుండుటకును, కష్టములు వాటిల్ల కుండుటకును ఆయరులు (గొల్లలు) తమ ఇష్ట దైవ మగు కృష్ణుని ప్రార్థించి, 'కురవై కూత్తు' నృత్యము చేయుచుండెడివా రఁట !

---

48. ఈ 'కురవై కూత్తు' నృత్యమే - భాగవతమున రాసలీలగా అభివర్ణింపఁబడి యున్నది.

ఒక్కొక్క సమయమున కృష్ణుఁడు కూడ – 'నప్పిన్నై' [49] అను తన ప్రియురాలిని, అగ్రజుఁడైన బలరాముని తోడ్కొని, నృత్యము చేయు చుండెడివాఁడనియు ఈ కావ్యమునందే సూచింపఁబడి యున్నది.

ఇచ్చట ఒక్క విశేషమును మనము ముఖ్యముగా గమనింప వలసియున్నది. ఏమన, కణ్ణన్ పత్నులలో – 'నప్పిన్నై' అను కాంతా లలామకు తమిళ ప్రపంచమున గొప్ప ప్రాముఖ్య మున్నది. ఈమె – కృష్ణునకు మిక్కిలి ముఖ్యమైన ప్రియురాలు. ఆయర కులోత్పన్న యైన ఈ నప్పిన్న – కొన్ని తావులలో 'పిన్నై' అనియు, మఱి కొన్ని సందర్భములలో 'సీళ' యనియు పేర్కొనఁబడియున్నది. కృష్ణుఁడు విష్ణువు యొక్క అవతారముగా అభివర్ణింపఁబడినది. ఏది యెట్లున్నను, ఆ కాలపు తమిళ ప్రజలు – 'కణ్ణన్', 'నప్పిన్నై' అను వారల నిఱు వురిని ఆదర్శప్రాయులుగ సంభావించి, వారిని అనుకరించుచుండెడివా రని తెలియుచున్నది. ఇందులకు – ఈ క్రింది వృత్తాంతమే ఒక తారాణ మనవచ్చును.

పూర్వము ద్వాపర యుగమున 'నాగ్నజిత్తు' అను నొక రాజు – తన ప్రియ పుత్రిక యగు 'నాగ్నజితి' అను కన్యను, ఏడు గో వృషభములను వశము గావించు కొనఁగల్గిన వీరపురుషున కొసంగవలె

---

49. రాధను తమిళ భాషలో – 'నప్పిన్నై' అని వ్యవహరించుచుండుట పరిపాటి.

"We Venture to conjecture that Nappiannai is the Tamil nam of Radha." **V. R. R. Dikshitar,**

"Krishna in Early Tamil Literature" in Indian culture, Vol : IV (1837-38), P. 269.

నని నిశ్చయించుకొని, తన నిశ్చితాభిప్రాయమును లోకమునకు విశద పఱచెనఁట ! ఈ వార్తను కృష్ణుఁడు విని, ఎట్లైనని ఆ నాగ్నజితిని చేపట్టవలెనని కృతనిశ్చయుఁడై, వెంటనే పయనము సాగించి, నాగ్న జిత్తు కడ కేగి, అతని సంకల్పమును సఫలము గావించి, అతని సుతను తన సతిగా పరిగ్రహించి, సంతసము నందెను. ఈ గాథ – భాగవత పురాణములో విపులముగా నుల్లేఖింపఁబడియే యున్నది. అయినను, ఈ క్రింద పొందుపరుపఁబడు ఒక్క శ్లోకము వలననే పై వృత్తాంత మును మనము చాలవఱకు గ్రహింపవచ్చును.

" తస్య సత్యాభవత్ కన్యా దేవీ నాగ్నజితీ నృప
న తాం శేకుర్ నృపా వోఢు మజిత్వా సప్త గోవృషాన్. "

— (భాగవతము : 10-58-31, 32.)

ఇట్లే, తమిళ ప్రదేశమునందుఁ గల కన్యలు – వీరవరులైన యువకులను తమ తమ భర్తలుగా వరించుచుండెడి వారఁట ! ఈ విధానమును 'యెరు తబుల్' అనియు – 'వృష వశీకరణ' మనియు వ్యవహరించుచుండెడివారు. ఇట్టి స్వయంవరమునకు తమిళ ప్రదేశ ములో నొక విచిత్ర ప్రక్రియ అమలులో నున్నట్లు, చరిత్ర పరిశోధన మూలమున తెలియవచ్చుచున్నది.

ఒక ఆవరణములో బలిష్ఠములైన కొన్ని ఆఁబోతులను ప్రవేశ పెట్టి, వానిని డప్పులు మొదలుగాఁ గల వాయిద్యములచేతను, తదితరములైన వివిధోపాయములచేతను భయపెట్టుచుందురు. భయో త్పాతముఁ జెందిన ఆ యాఁబోతులను వెంటనే వెలుపలకు వెడల నిచ్చుచుండ, ఆ మార్గమున పొంచియున్న వీర యువకులు – తమ బాహు బలము నంతటిని వినియోగించి, ఆ యాఁబోతులను వశము గాంచుకొనుటకై అనేక విధములుగా ప్రయత్నించుచుందురు. కాని,

అట్టి వారిలో కొలఁది మంది మాత్రమే విజయమును సాధింప, వారి కంఠములలో కన్యలు జయమాలలను వేసి, వారిని గౌరవ భావముతో తమ తమ భర్తలనుగా పరిగ్రహించుచుండెడివా రఁట ! ఇట్టి స్వయం వర విధానము తమిళనాడులో నేటికిని అట నట గలదని తెలియ వచ్చుచున్నది. [50]

పై ఁబేర్కొనఁబడిన పంచ మహా కావ్యములలో – 'మణి మేఖలై' అనునది రెండవది. ఇది – శీత్తలై చాత్తనార్ అను కవిచే రచింపఁబడినది. ఈ కావ్యమున బౌద్ధ ధర్మ స్వరూప నిరూపణమే కవికి ముఖ్యోద్దేశమైయున్నను ఇందు సందర్భోచితముగా వైష్ణవ ధర్మ మహాత్వముకూడ ప్రశంసింపఁబడి యున్నది. అదియునుఁ గాక, కృష్ణు నకు సంబంధించిన వివిధ గాథలు, కురవై కూత్తు నృత్యము మున్నగు నవియును ఇందు అభివర్ణింపఁబడి యున్నవి. [51]

'చూడామణి' అను కావ్యములోఁ గల కథానాయకుని గుణ ములు – 'కణ్ణన్' కల్యాణ గుణములతో పోల్చఁబడి యున్నవి కావున, ఆ కాలములో తిరుమాల ధర్మము అధిక ప్రచారమునందే కలదనియు,

---

50. " It seemed in a way a test for a man to be fit husband for a lady. The rearing of bulls and letting them loose with some prize for the capture have become a regular social and popular amusement which persists even to this day in the Tamil Districts. "

— V R R. Dikshikar,

— *'Indian culture' Vol. IV pp. 270, 271.*

51. మణిమేఖలై : 19-65-66.

తమిళ ప్రజలు తిరుమాలకు సంబంధించిన కథలను చదువుచుండెడివారనియు, చదువుచుండగా వినుచుండెడివారనియు ఈ కావ్యమువలన మనము గ్రహింపవచ్చును.

రామాయణగాథను ఇతివృత్తముగా గైకొని, తమిళ భాషలో నొక మహా కావ్యమును రచించి – 'కవి చక్రవర్తి' అను బిరుదమును సముపార్జించిన కంబ మహాకవి (11 – వ శతాబ్దము) కంటెను పూర్వమే, సంఘ కాలమున – 'వెణ్బా' అను వృత్తముతో మఱి యొక కవిచే రచింపఁబడిన రామాయణ మహా కావ్యము – తమిళ వాఙ్మయ ప్రపంచమున ప్రసిద్ధి వహించియుండెనని పండితుల అభిప్రాయము.[52]

క్రీస్తు శకారంభములో వెలువడిన 'అహనానూరు' 'పురనానూరు' అను సంఘకాలీనములైన కావ్యములందును – రామాయణమునకు సంబంధించిన కొన్ని గాథలు అచ్చటచ్చట పొందుపఱుపఁబడియున్నవి. ఆంజనేయుఁడు లంకా పట్టణమునకు వెళ్ళి వచ్చిన పిమ్మట – సీతాదేవి యొక్క స్థితి గతులను గ్రహించిన శ్రీరాముఁడు – పాండ్య దేశమున దక్షిణ ప్రాంతమునఁ గల ఒకా నొక విశాల వట వృక్షము కడ, వానర వీరులతో సమావేశ మేర్పఱచి, విషణ్ణ వదనుఁడై, జానకీ దేవిని లంకాపురినుండి తోడ్కొనివచ్చు విషయమై చర్చించుచుండెనని యు, ఆ సమయమున – ఆ వటవృక్షమ్మున్పై విహరించుచున్న విహంగములు కలకలారావములఁజేయ నారంభింప, కొంత తడవు చర్చను విరమింపవలసివచ్చె ననియు, ఆ పక్షుల కలకలారావములు ఉపశమించిన యనంతరము మఱల ఆ చర్చను కొనసాగించె ననియు –

---

52. 'కంబన్ కణ్ణ తమిళకమ్' — స్వామి చిదంబనార్, 20 - వ పుట.

'అహనానూరు' అను కావ్యములో నొక తావున వర్ణింపఁబడి యున్నది. [53]

ఇట్లే - 'పురనానూరు' అను కావ్యమునందును కొన్ని గాథలు కల్పించుకొనును. ఒకప్పుడు ఒక రాజు - ఒక కవిరాజును వివిధములైన కొన్ని స్వర్ణాభరణములతో సత్కరించెనఁట ! కాని, ఆ కవిరాజుకు ఆ యాభరణముల నెచ్చటెచ్చట - ఏ యే విధముగా ధరింపవలెనో తెలియ లేదు. ఈ వృత్తాంతమును కావ్య రచయిత తన కావ్యమున ప్రస్తా వించుచు, అందుల కుదాహరణముగా - రామాయణగాథ నొకదానిని బేర్కొనియున్నాఁడు. ఆ ఉదాహరణ మెద్ది యన, రావణునిచే గొని పోఁబడుచున్న సీతాదేవి - తన నగల నన్నింటిని మూట గట్టి, దానిని వానరులు సంచరించు తావునఁ బడవై చెనఁట ! అవు డా మూటను వానరులు విప్పి, అందలి యాభరణములను ధరింపవలె నని తలంచిరి. కాని, ఏ యాభరణములను ఎచట ఏ రీతిగా ధరింపవలెనో తెలియక, తిక మక పడసాగిరి. అట్లే, ఈ కవిరాజు కూడ ప్రభువుచే బహుమాన ముగా నొసంగఁబడిన ఆ యాభరణములను ధరింపవలసిన విధానము తెలియక తిక మక పడెనఁట ! [54]

ఇట్టి ప్రమాణములనుబట్టి, తమిళ ప్రదేశములో - సంఘ కాలము నాఁటికే, తిరుమాల (విష్ణువు)కు సంబంధించిన అవతార కథలు బహుళ ప్రచారములో నుండెడి వనియు, తమిళ ప్రజలలో వైష్ణవ ధర్మము వ్యాపించి యున్న దనియు తెలియవచ్చుచున్నది.

---

53. అహనానూరు - 70.

54. పురనానూరు - 378.

ఆలయములలో తిరుమాలార్చన

తమిళ ప్రదేశమునకు సంబంధించిన దేవాలయ చరిత్ర - అతి ప్రాచీనమైనది.[55] ఆ దేశమునఁ గల దేవాలయములలో - దేవతా విగ్రహములు సుందర సుశోభితములై, నయనానందకరములై, భక్త కల్పద్రుమములై విరాజిల్లుచున్నట్లును, ఆ దేవతామూర్తులకు నిర్ణీత మైన ఒకా నొక ప్రణాళిక ననుసరించి, ఆరాధనాదులు జరుగు చున్నట్లును, సంఘ సాహిత్యములో స్పష్టీకరింపఁబడియున్నది. అందు నను - తిరువరంగమ్ (శ్రీరంగము), తిరువేంగడమ్ (తిరుమల), తిరు పతి, తిరుమాలిరుం శోలై, తిరు క్కుఱుగూరు, తిరు క్కుఱుం గుడి, తిరు క్కణ్ణపురమ్ మున్నగు దివ్య క్షేత్రములలోఁ గల తిరుమాల కోవెల లకు సంబంధించిన వృత్తాంతములు విస్తారముగ పేర్కొనఁబడియుండుటే గాక, ఆ యా క్షేత్రములందు వివిధ రూపములతో విరాజిల్లు తిరు మాలకు - నిత్య పూజలు, ఉత్సవములు మహా వైభవముగా జరుగు చున్నట్లును విశదీకరింపఁబడియున్నది.

తిరువరంగ (శ్రీరంగ) క్షేత్రమునఁ గల కోవెలలో వేంచేసి యున్న తిరుమాల (శ్రీరంగనాయకస్వామి) - ఆదిశేషునిపై పవళించి, నీలమేఘ వర్ణము వలె విరాజిల్లుచున్నట్లు - శిలప్పధికారమునందు వర్ణింపఁబడియున్నది.[56] ఈ గ్రంథమునందే మఱి యొక తావున, తిరువేంగడము (తిరుమల)లో - అర్చారూపమున దర్శన మిచ్చుచున్న

---

55. 'Origin of South Indian Temple' - Dr. Venkatramaiha

56. శిలప్పధికారమ్ : 2, 35-40.

తిరుమాల (శ్రీ వేంకటేశ్వరస్వామి) - కర కమలములలో శంఖ చక్రములను ధరించినట్లును వర్ణింపఁబడియున్నది. [57]

'పరిపాడల్' అను కావ్యములో - 'తిరుమాలిరుం కోయిల్' అను క్షేత్రమునఁ గల ఆలయములో వేంచేసియున్న కమలదళలోచనుఁడును, శ్యామసుందర విగ్రహుఁడు నగు తిరుమాల - మానవుల దుఃఖములను దూరదూరము చేయఁ గల వాఁడని వర్ణింపఁబడినది. [58] 'పెరుం పాణాట్టుప్పడై' అను కావ్యములో - కాంచీపురమునకు సమీపమునఁ గల 'తిరు వేహా' అను క్షేత్రమున విలసిల్లు తిరుమాల కోవెల అభివర్ణింపఁబడియున్నది. [59] ఇందువలన, సంఘ కాలములో - నప్పన్న సహితుఁడైన కణ్ణన్, బలరాముఁడు తమిళ ప్రజలచే విశేషముగా పూజింపఁబడుచున్నట్లును, ఈ మువ్వురునుఁ గల ఆలయ మొకటి మధురలో నున్నట్లును, అది - 'వెళ్ళై నగర్ కొట్టమ్' అని వ్యవహరింపఁబడుచున్నట్లును తెలియవచ్చుచున్నది. [60]

సంఘ కాలపు ఉత్తరార్ధమునందును, సంఘోత్తర కాలమునందును తమిళ ప్రదేశమునఁ గల కొన్ని తిరుమాల కోవెలలలో (విష్ణ్వాలయములలో) - శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రము ననుసరించియు, మఱి కొన్ని ఆలయములలో వైఖానస ఆగమ శాస్త్రము ననుసరించియు అర్చనాదులు జరుగుచున్నట్లు - 'శిలప్పధికారమ్' 'పరిపాడల్' అను కావ్యముల మూలముననే తెలియుచున్నది. ఆ కాలము నందును తిరుమాల కోవెల ప్రాంగణమున, అభిముఖముగాఁ గల ధ్వజస్తంభమునందు - 'పెరియ తిరుమొడి' (గరుడాళ్వారు)

---

57. శిల్పధికారమ్ : 2, 41-45. 58. పరిపాడల్ - 15.

59. పెరుంబాణాట్టుప్పడై : 371-374. 60. శిలప్పధికారమ్ : 5, 171-172.

వేంచేసియున్నట్లు సంఘ సాహిత్యములలో వర్ణింపఁబడియున్నది. కావున, సంఘకాలములో - తమిళ ప్రదేశమునఁ గల విష్ణ్వాలయములందు, అర్చనాది కార్య కలాపములు యథావిధిగా జరుగుచుండెడి వనియు విశేషోత్సవములలో తమిళ ప్రజలు మిక్కిలి ఉత్సాహముతో - భక్తి విశ్వాసములతో పాల్గొనుచుండెడివా రనియు మనము సంభావింప వచ్చును.

ఆళ్వారులు - భక్తి ప్రచారము

దక్షిణ భారతమున, వివిధ ప్రదేశములలో - వివిధ సమయము లందు - ఆళ్వారులు పన్నిద్దఱు దైవాంశ సంభూతులై, సర్వ వేద సారమును తమ ద్రావిడ దివ్య ప్రబంధములలో ప్రసరింపఁజేసి, అందు - భక్తి వైశిష్ట్యమును విస్పష్టముగా వ్యక్తము గావించి, భక్తి పదవి నధిష్ఠించుటకు సర్వులును సమానాధికారులే యని అనేక విధములుగా నిరూపించి. భక్తి సిద్ధాంత స్థాపనమున అగ్రగణ్యులుగా విఖ్యాతి నార్జించెను.[61] తాము రచించిన దివ్య ప్రబంధముల మూల మున తమిళ భాషకు పవిత్రత చేకూర్చి, తమిళ ప్రదేశమునకు నూతన శోభను సంతరింపఁ జేసిరి. తమ యుగమున తమిళ ప్రజలలోఁ గల ప్రేమ భావమును భగవంతుని వైపుకు మఱల్చి, వారిని భక్తి తత్పరుల గావించి, భగవంతునకును - భక్తులకును నడుమ - తాము పురుష కారభూతులుగా విరాజిల్లిరి.

మఱియును - ఆ యాళ్వారులు తమ యుగమునఁ గల స్థితి గతులను బాగుగా గమనించి, త త్కాలమున లోకములో అలము కొనియున్న జైన బౌద్ధాది అవైదిక మతముల బారినుండి ప్రజలను పరిరక్షించి, దేశమం దంతటను భక్తిపయమైన వాతావరణమును సృజించి, సనాతన ధర్మమును పునరుజ్జీవింపఁజేసిరి.

మహనీయులైన ఆ పన్నిద్దరాళ్వారులచే రచింపబడిన పాశుర ములు మిక్కిలి రసవత్తరములై రాణించుటచే - అవి పఠితలను, శ్రోతలను ఉజ్జీవిత లూగించుటే గాక, తమిళ వాఙ్మయ మహోదధి కుండి వెలువడిన ఆ మధుర గీతములు - భారతీయుల హృదయ క్షేత్రములను పరిప్లావితముల గావించి, బ్రహ్మానందమున నోలలాడించి వైచినవి. కావున, ముముక్షువులు ఆళ్వారుల ద్రావిడ దివ్య ప్రబంధ ములలోగల ప్రబోధములను గ్రహించి ప్రయోజనమును పొందుదురు గావుత !

" ధర్మం భజస్వ సతతం త్యజ లోకధర్మాన్
సేవస్వ సాధుపురుషాన్ జహి కామతృష్ణామ్
అన్యస్య దోష గుణచింతన మాశు ముక్త్వా
సేవా కథారస మహో నితరాం పిబ త్వమ్. "

---

62. "Alwars are the first people who gave a new shape to Bhakti School, making simple, designed not for serving the purpose of worship by the eleit but, subserve the similar ends for the quite Ordinary folk. "

— *History of Tirupati, Vol-I*, pp. 73, 74

Dr. S. Krishnaswami Ayyangar.

★ ★ ★

పన్నిద్దరాళ్వార్ుల వైభవము

'వైయాకరణ పంచానన - విద్వత్కవి సార్వభౌమ - ఆగమాచార్య - పండిత'

శ్రీ మాన్ రొంపిచర్ల పార్థసారథి భట్టాచార్యులు

★ ★ ★

భూ మి క

" పరం బ్రహ్మ పరంధామ యోఽసౌ బ్రహ్మ తథాపరమ్
త మారాధ్య హరిం యాంతి ముక్తిమ వ్యతి దుర్లభామ్ "

— (విష్ణు పురాణము : 1-11-46.)

శ్రీహరి నాశ్రయించి, అనన్య భక్తితో నారాధించి, ప్రపన్నులై విరాజిల్లు వారు - బ్రహ్మాదులకు గూడ నలభ్య మగు పరమ పదమును పొందగల రని విష్ణు పురాణము విశదీకరించిన విధముగా - శ్రీమన్నారాయణ చరణారవిందముల నాశ్రయించి, తరించినవా రెందఱో కలరు. అట్టివారిలో - ఆళ్వారులు ముఖ్యముగా చేర్కొనఁ దగినవారు. వారి యవతార వైభవము, భక్తి వాఙ్మయము పరంపరాగతమైన శ్రీ వైష్ణవ సంప్రదాయమును మిక్కిలి సమున్నతిఁ జేసినవి. అట్లు సమున్నతమైన శ్రీ వైష్ణవ సంప్రదాయము అనంతర శతాబ్దములలో నవతరించిన ఆచార్యులకు ఆలంబమై, వారి పవిత్రాశయముల కెంతయో ప్రాచుర్యమును గల్పించినది. ఇట్టి ఆచార్య వైభవమును దెలిసికొనుటకు ముందు - ఆళ్వారుల యవతార వైభవమును, భక్తి వాఙ్మయమును అవగాహన మొనరించుకొనుట - అత్యంతము ఆవశ్యకము.

పరిచయము

" భూతం సర శ్చ మహ దాహ్వయ భట్టనాథ
శ్రీ భక్తిసార కులశేఖర యోగివాహాన్
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్ర మిశ్రాన్
శ్రీమ త్పరాంకుశ మునిం ప్రణతోఽస్మి నిత్యమ్."

ఇది - ఆళ్వారులను గుఱించిన స్తుతి. ఇందు - పూదత్తాళ్వారు, పొయిగై యాళ్వారు, పేయాళ్వారు, పెరియాళ్వారు, తిరుమళిశై యాళ్వారు, కులశేఖరాళ్వారు, తిరుప్పాణాళ్వారు, తొండరడిప్పొడి యాళ్వారు, తిరుమంగై యాళ్వారు, నమ్మాళ్వారు అను పది మంది ఆళ్వారులు కీర్తింపఁబడుచున్నారు యతీంద్రమిశ్రు లనఁగా - శ్రీమ ద్రామానుజులు. వీరిని ఆళ్వారుల ప్రస్తావనలోఁ జేర్చుట - గౌర వార్థమై యున్నది. వీరి కీ గోష్ఠియం దన్వయము లేదు. పన్నిద్దరు (పండ్రెండు మంది) ఆళ్వారు లనునది కూడ, ఒక పక్షము కలదు. ఆ పక్షములో - పై జెప్పిన పది మంది కాక, 'శ్రీభక్తి సార' యను చోట, శ్రీ శబ్దముచే - 'ఆండాళ్' అను అర్థము చెప్పి, 'శ్రీమ త్పరాంకుశ' యను చోట, శ్రీమత్ శబ్దముచే మధుర కవులను జెప్పి కాని, 'యతీంద్ర మిశ్రాన్' అను చోట, మిశ్ర శబ్దముచే శ్రీరామ మిశ్రులను గాని, పండ్రెండు సంఖ్యను సాధింతురు. దివ్య ప్రబంధము లకు ప్రథమాశ్రయ మగు 'పెరియ కోవిల్' (శ్రీరంగము) నందు 'అరైయర్లు' శ్రీరంగ నాథునకు 'కట్టియం' చెప్పు నప్పుడు 'పది న్మర్ పాడుం పెరుమాళ్' (పది మంది ఆళ్వారులు పాడిన దేవుఁడు) అని యనుసంధించుట - మొదటి పక్షమునకు గమకము. నాలాయిర దివ్య ప్రబంధ నిర్మాతలలో - 'ఆండాళ్', 'మధురకవి' ఈ యిరువుర ను చేర్చబడుట చేఁడవ పక్షమునకు సాధకము. ఇట్లే - లోక వ్యవహా రము ప్రసిద్ధి జెందినది.

పై పండ్రెండు మందియు, వే ర్వేరుగా నిర్మించిన వే ర్వేరు ప్రబంధములను సంకలనముఁ జేసి, ఔచిత్యము ననుసరించి పౌర్వా పర్యమును కల్పించిన ప్రాచీనులు - ఆ గ్రంథ సముదాయమునకు 'నాలాయిర దివ్య ప్రబంధము' (నాల్గు వేల ద్రావిడ గీతములు గల గ్రంథము) అని వ్యవహరించుచు వచ్చిరి. శ్రీ మద్రామానుజులకు ప్రశిష్యులును - కూరత్తాళ్వారుల శిష్యులు నగు 'తిరువరంగత్తముద నార్' రచించిన 'రామానుజ నూత్తందాది' యను మఱి యొక ప్రబంధము కూడ కలదు. దీనిని సైతము, నాలాయిర దివ్య ప్రబంధ భాగముగా పరి గణించు పక్ష మొకటి యున్నది.

నాలాయిర దివ్య ప్రబంధము - త ద్వివరణము

ముదలాయిరము (మొదటివేయి) : ఇది పది ప్రబంధములలో 947 పాశురములు కలిగి, మేడుగురు ఆళ్వారులచే రచింపఁ బడినది. దీని వివరణ మిది :—

ప్రబంధ సంఖ్య	ప్రబంధ నామము	పాశుర సంఖ్య	రచయితలు
౧.	తిరుప్పల్లాండు	12	పెరియాళ్వారు
౨.	పెరియాళ్వార్ తిరుమొళి	461	,,
3.	తిరుప్పావై	30	ఆండాళ్
౪.	నాచ్చియార్ తిరుమొళి	143	,,
౫.	పెరుమాళ్ తిరుమొళి	105	కులశేఖరాళ్వార్
౬.	తిరుచ్చంద విరుత్తమ్	120	తిరుమళిశై యాళ్వార్
౭.	తిరుమాలై	45	తొండరడిప్పొడి యాళ్వార్
౮.	తిరుప్పళ్ళి యెళుచ్చి	10	,,
౯.	అమలనాది పిరాన్	10	తిరుప్పాణాళ్వార్
౧౦.	కణ్ణినుణ్ శిరుత్తాంబు	11	మధురకవి యాళ్వార్

రెండవ ఆయిరము : ఇది మూఁడు ప్రబంధములలో 1134 పాశురములు కలిగి, ఒక్క తిరుమంగై యాళ్వారుచే రచింపఁబడినది. దీని వివర మిది :—

౧.	తిరుమొళి	1084	తిరుమంగై యాళ్వార్
౨.	తిరుక్కురుం దాండగమ్	20	,,
3.	తిరునెడుం దాండగమ్	30	,,

ఇయర్పా (మూఁడవ వేయి) : పది ప్రబంధములలో - మత భేదముచే 593, 711, 817 పాశురములు కలిగి, ఆరుగురు ఆళ్వారులచే రచింపఁబడినది. దీని వివరణ మిది :—

౧.	ముదల్ తిరువందాది	100	పొయ్గై యాళ్వార్
౨.	రెండాం తిరువందాది	100	పూదత్తాళ్వార్
3.	మూన్రాం తిరువందాది	100	పే యాళ్వార్
౪	నాన్మ్మగం తిరువందాది	96	తిరుమళిశై యాళ్వార్
౫.	తిరువెళుక్కూత్తి త్తిరు క్కై	1	తిరుమంగై యాళ్వార్
౬.	శిరియ తిరుమడల్	1, 40, 77½	,,
౭.	పెరియ తిరుమడల్	1, 80, 148½	,,
౮.	తిరువిరుత్తమ్	180	నమ్మాళ్వార్
౯.	పెరియ తిరువందాది	87	,,
౧౦.	తిరువాశిరియమ్	7	,,

(రామానుజ నూత్తందాది 108 పాశురములు)

నాల్గివ వేయి : 'తిరువాయిమొళి' యను పేర 1102 పాశురము లలో నమ్మాళ్వారులచే రచింపఁబడినది. ఇది - 'భగవద్విషయ' మని విఖ్యాతి గాంచినది.

౧.	తిరువాయిమొళి	1102	నమ్మాళ్వార్

పై లెక్క ప్రకారము, నాలాయిరము నందలి అవాంతర ప్రబంధముల సంఖ్య ఇరువది నాలుగు అనునది సంప్రతిపన్న విషయము. కాని, ముందు చెప్పిన రామానుజ నూత్తందాది ప్రబంధముకు ఇరువది నాల్గింటిలో నొక్కటిగ వడగలవారు లెక్కించుచు, ముదలాయిరము నందలి తిరుప్పల్లాండు ప్రబంధమును పెరియాళ్వార్ తిరుమొళితో చేర్చి, ఆ రెంటిని ఒకే ప్రబంధముగ భావింతురు. తెన్నల వారు రామానుజ నూత్తందాదిని ఈ యిరువది నాల్గింటిలో చేర్చుట లేదు. 'నాదనుక్కు నాలాయిర మరుళినాన్', అను నమ్మాళ్వారుల బిరుదము ననుసరించి, నాథమునుల నాఁటికే, దివ్య ప్రబంధము నాలాయిర వ్యవహారము కలిగిన దగుటచే, నాథమునుల తరువాతి కాలపు దగు 'రామానుజ నూత్తందాది'ని నాలాయిర ప్రబంధ గణనములో చేర్చుట యుక్తము కాదని వీరి మతము. ఇందుకు సాధకముగ - "కృత్వా విశ్వహితం ప్రబంధ యుగళం శ్రీ భట్టనాథ స్సుధీః" అను దివ్య సూరి చరిత్ర ప్రమాణమును వీరు చెప్పుదురు.

ఇట్లే - నాలాయిర మందలి పాశుర సంఖ్య యందును అభిప్రాయ భేదము కానవచ్చుచున్నది.

'ఇయర్పా' యందలి 'శిరియ తిరుమడల్', 'పెరియ తిరుమడల్' అను రెండు ప్రబంధములను, ద్రావిడ లక్షణ వేత్తలు ఒక్కొక్క గ్రంథముగ లెక్క చేయుటచే, వాని మత ప్రకారము నాలాయిర గ్రంథ సంఖ్య 3776 మాత్రమే అగు చున్నది. నాలాయిర మనునది

ప్రాయోవాద మని వా రంతురు. వడగలవారు పై రెండు ప్రబంధములలో – 'శిరియ తిరుమడల్'ను నలువది గ్రంథములుగాను, 'పెరియ తిరుమడల్'ను యెనుబది గ్రంథములుగాను విడదీసి, 'రామానుజ నూత్తందాది'ని కలిపి, మొత్తము గ్రంథ సంఖ్యను 4002 గ చెప్పుదురు. తెన్గల వారు – శిరియ తిరుమడల్' ను $77\frac{1}{2}$ గ్రంథములుగను · 'పెరియ తిరుమడల్' ను $148\frac{1}{2}$ గ్రంథములుగను విభజించి, మొత్తము సంఖ్యను 4000 లుగ చెప్పుదురు.

" కృతినః కమలావాస కారుణ్యైకాన్తినో భజే
ధత్తే య స్తూక్తి రూపేణ త్రివేదీ సర్వయోగ్యతామ్. "

— (దయా శతకము : 3 శ్లో.)

అని ప్రశంసింపఁబడు ఆళ్వారులు, విష్ణు భగవానుని యందు ప్రపత్తిని లోకమున వ్యాపింపఁ జేయుటకై –

" యద్య ద్విభూతిమ త్సత్త్వం శ్రీమ దూర్జితమేవ వా
తత్త దేవావ గచ్ఛత్వం మమ తేజో ఽంశ సంభవమ్. "

— (భగవద్గీత : 10-41.)

అనునట్లు – భగవ దంశచే అప్పు డప్పు డవతరించుచు వచ్చిరి.

" తామ్రపర్ణీ నదీ యత్ర కృతమాలా పయస్వినీ
కావేరీ చ మహాభాగా ప్రతీచీ చ సరస్వతీ. "

" కలౌ ఖలు భవిష్యన్తి నారాయణ పరాయణాః
క్వచి త్క్వచి న్మహాభాగా ద్రావిడేషు చ భూరిశః. "

— (భాగవతము : 11-5-38, 39.)

ఈ మొదలగు పురాణ వచనములకు లక్ష్యము, ఈ యాళ్వారులే యని ప్రీతీతి.

శ్రీ వైఖానస, పాంచరాత్ర భగవచ్ఛాస్త్రముల ననుసరించి ప్రతిష్ఠింపఁబడి ఆరాధింపబడెడి భగవదాలయములలో - పుణ్య క్షేత్రములయందలి అర్చామూర్తులను ఈ ఆళ్వారులు ప్రపత్తి జేసి, తాము తరించి, ఇతరులను తరింపఁజేయుటకై, రసవత్తరములును - గంభీరార్థకములు నగు గీతములను ద్రావిడ భాషలో గానము జేసిరి. ఇట్లు గానము చేయఁబడిన పన్నిద్దరాళ్వారుల నాలాయిర దివ్య ప్రబంధము ఈ క్రింది రీతిగా రూపొందినది.

	గ్రంథకర్త	ప్రబంధ సంఖ్య	గ్రంథ సంఖ్య	గ్రంథ నామము.
౧.	పూదత్తాళ్వార్	1	100	ఇయర్పాభాగము.
౨.	పొయిగై యాళ్వార్	1	100	,,
3.	పే యాళ్వార్	1	100	,,
౪.	పెరియాళ్వార్	1 లేక 2	(12+461)471	,,
౫.	తిరుమళిశై యాళ్వార్	2	216	ఇయర్పా ముదలాయిర - భాగము.
౬.	కులశేఖరాళ్వార్	1	105	ముదలాయిర భాగము.
౭.	తిరుప్పాణాళ్వార్	1	10	,,
౮.	తొండరడిప్పొడియాళ్వార్	2	55	,,
౯.	తిరుమంగై ఆళ్వార్	6	1135, 1255, 1361	తిరుమొళి ఇయర్పా భాగము.

౧౦. నమ్మాళ్వార్	4	1296	ఇయర్పా భాగము తిరువాయి మొళి.
౧౧. ఆండాళ్	2	173	ముపలాయిర భాగము.
౧౨. మధుర కవి	1	11	ముపలాయిర భాగము.
(తిరువరంగత్తముదనార్)	1	108	(రామానుజ నూత్తందాది)

నాలాయిర వ్యాఖ్యానములు

ఈ నాలాయిర దివ్య ప్రబంధమునకు పరిపూర్ణములైన వ్యాఖ్యానములు కొలదిగ మాత్రమే కలవు. అట్టి వానిలో 'పెరియ వాచ్చాం బిళ్ళై' ప్రాసిన వ్యాఖ్యానము విశేష ప్రచారములో నున్నది. పెరియాళ్వార్ల తిరుమొళికి మాత్రము 'పెరియవాచ్చాంబిళ్ళై' వ్యాఖ్యానము లభింపలేదు. లుప్తమైన దీనికి మణవాళ మహా మునులు వ్యాఖ్యానము ప్రాసిరి. పెరియవాచ్చాంబిళ్ళ వ్యాఖ్యానమును వడగల తెంగల సంప్రదాయ పెద్దలిరువురును ఆదరించిరి. ఇది గాక, 'పెరియ పరకాల జీయర్' అను వడగల జీయరొకరు రచించిన సంపూర్ణ వ్యాఖ్యాన మింకొకటి కలదు. ఈ రెండు వ్యాఖ్యానములును - 'మణి ప్రవాళము' అనగా - సంస్కృత ప్రచురమైన ద్రావిడ భాషలో రచింపబడి యున్నవి.

ఆధునికులలో - తెంగల సంప్రదాయ మగు శ్రీ ప్రతివాది భయంకరం అణ్ణంగరాచార్యులవారును, వడగల సంప్రదాయ మగు శ్రీ ఉత్తమూరు వీరరాఘవాచార్యులవారును ప్రాసిన వ్యాఖ్యాన ములు కలవు. ఇవియును మణి ప్రవాళ రచనలే.

ఆళ్వారులలో - 'ప్రపన్న జన కూటస్థులు' అను గౌరవముచే నమ్మాళ్వారులను, వారి ప్రబంధములలో - 'భగవద్విషయము'

అను గౌరవముచే తిరువాయిమొళిని, సంప్రదాయజ్ఞులు విశేషముగా కొనియాడెదరు. ఈ కారణమువలన, 'తిరువాయిమొళి'కి సంగ్రహము గను, విస్తారముగను అనేక వ్యాఖ్యానములు వెలువడినవి. అందు - 'తిరుక్కురుగై ప్పిరాన్ పిళ్ళాన్' (కురుకేశచంద్ర జలధి) అను వారు శ్రీమద్రామానుజుల యాజ్ఞానుసారము 'తిరువాయిమొళి'కి తొలు తగా 'ఆరాయిరప్పడి' వ్యాఖ్యానమును వ్రాసిరి. వీరు - శ్రీ మద్రా మానుజులకు సాక్షాత్తుగా శిష్యులు. ఈ వ్యాఖ్యానము శ్రీ విష్ణు పురాణ ప్రక్రియ ననుసరించి, సంఖ్యాతమైన దని ప్రతీతి యున్నది. ఆవల, వేదాంత ముని' అనెడి 'నంజీయర్' - శ్రీ భాష్య ఫక్కి ననుసరించి, 'ఒంబదినాయిరప్పడి' అను వ్యాఖ్యానమును తిరువాయిమొళి కిని, కణ్ణినుణ్ శిరుత్తాంబునకును వ్రాసిరి. వారి తర్వాత 'కలివైరి దాసన్' అను నంబిళ్ళ, చాలమంది శిష్యులకు ప్రవచనము చేయఁగా - వారి కాలక్షేపములను శ్రవణ గోచర మొనరించుకొనిన 'నడువిల్ తిరు వీధిప్పిళ్ళై' సహాదలక్షగను, 'పెరియవాచ్చాంబిళ్ళై' శ్రీ రామాయణ ప్రక్రియలో 'ఇరువత్తు నాలాయిరప్పడి' వ్యాఖ్యానమును 'వడక్కు త్తిరువీధిప్పిళ్ళై' శ్రుత ప్రకాశికా ప్రక్రియలో 'ముప్పత్తారాయిర ప్పడి' వ్రాసిరి. నంబిళ్ళై వ్యాఖ్యానము ఒక్క తిరు విరుత్తమునకు మాత్రము లభించుచున్నది. పెరియవాచ్చాంబిళ్ళై కుమారుల నాశ్ర యించిన అళగియ మణవాళ జీయరు 'పన్నీ రాయిరప్పడి, వ్యాఖ్యాన మును, శ్రీ మద్భాగవత ప్రక్రియ ననుసరించి యనంతరము వ్రాసిరి. వీరు - తిరు విరుత్తమును కూడ వ్యాఖ్యానించిరి.

ఆళ్వారులు - అవతార వైభవము

1. పొయిగై ఆళ్వారులు :—

కాంచీపురమున వేగావతి పుష్కరిణియందు, ద్వాపర యుగ మున 862901 సంవత్సరములు గతించిన, సిద్ధార్థి సంవత్సర తులా

మాసమున, శ్రవణా నక్షత్రముతో గూడిన శుక్ల పక్ష అష్టమీ మంగళవార శుభ దినమున, శంఖాంశచే అవతరించిరి. వీరికి కాంచి యందలి దేవనాథునియందు భక్తి యధికము.

2. పూదత్తాళ్వారులు :—

'మల్లాపురము' అని ప్రాచీన వ్యవహారము గలిగియున్న నేటి 'మహాబలిపుర' మందు-పొయిగై యాళ్వారు అవతరించిన మరునాడు, ధనిష్ఠా నక్షత్రముతో గూడిన నవమీ బుధవాసరమున, గదాంశచే మాధవీ కుసుమమున అవతరించిరి. వీరికి - శ్రీరంగనాథుని యందు ప్రపత్తి యధికము.

3. పేయాళ్వారులు :—

'మయూర పురము' అని ప్రాచీన వ్యవహారము కలిగి యుండిన నేటి మైలాపూరు (మద్రాసు) నందు పూదత్తాళ్వారు అవతరించిన మరునాడు శతభిషా నక్షత్రముతో గూడిన దశమీ గురువారమున నందకాంశచే ప్రపక్కరిణియం దవతరించిరి.

వీరు మువ్వురును అయోనిజులు; ద్విజ సంస్కారము లేక - ప్రాకృతము లగు సన్న పానామములను గ్రహింపక, భగవ దనుభవమునే ధారకముగ దేహయాత్ర గడుపుచును చిరకాలము స్వయోగ మహిమచే, అనగా - 3,200 సంవత్సరములు భూమిపై జీవించి యుండి, ఆవల సిద్ధి బొందిరి. ఆళ్వారు లందఱలో పురాతను లగుటచే వీరలకు ముద లాళ్వారు లని వ్యవహారము కల్గినది. వీరు సమకాలికు లగుటయు వీరి రచనలు ఏకావలంబనము లగుటయు కూడ ఈ వ్యవ హారమునకు కారణము లైనవి. నమ్మాళ్వారులు వీరలను 'ఓడిత్తిరి యుం యోగిగళ్' అని అన్వర్థ నామముతో ననుసంధించి వ్యవహరించి

నట్లు చెప్పదురు. ఈ మూవురును దేశాటనము సాగించుచు, దైవ యోగముచే ఒకనాఁటి చీఁకటి రాత్రి యందఱును 'తిరుక్కోఁన లూర్' అను గ్రామము చేరిరి. ధారాపాతముగ వర్షము కురియు చుండఁగా - తల దాఁచుకొనుటకై ఏదైన నొక యాశ్రమమును వెదకుచు, వారు తిరుగ నారంభించి, పోయిగై యాళ్వారు లొకయింటి వాకిట నిలిచి, దీనముగా లోనివారలను బిలిచి తావు నడిగిరి. ఆ గృహము మృకండు ముని యాశ్రమము. అంను మృకండుఁడు తన గృహిణితో నివసించుచుండెను. అతఁడు శ్రీకృష్ణ పరమాత్మను గృహార్చ్చయం దారాధించుచుండెను. అతఁడు ఆళ్వార్ల దీన యాచన మును విని, మన్నించి, తలుపు తెరువఁగా - అతఁడు లోనికిఁ బోయి, ఇరుకైన నడవలో పరుండెను. ఆ మృకండుఁడు లోనికిఁ బోయెను. ఇంతలో రెండవవారు కూడ ఆ చోటునకే వచ్చి పిలువఁగా- మొదటి వారు బదులు చెప్పుచు, ఇరుకైన ఈ చోట ఒక్కరు పండుకొనుటకు మాత్రమే తావు కలదని చెప్పఁగా - రెండవవారు ఆ చోట నిరువురు కూర్చుండ వచ్చునే యని యడిగిరి. అంతట తలుపు తెరువఁగా - లోనికి వచ్చి, ఇరువురును కూర్చుండిరి. ఇంతలో - మూడవ వారును అచ్చటకే వచ్చి పిలుచుటయు, లోని యిరువురును - ఇరువురు కూర్చుండుటకు మాత్రమే ఇచ్చట తావు కలదని యనఁగా - మూడవ వారు ఇరువురు కూర్చుండి తావున మూవురు నిలుచుండ వచ్చునే యని యడుగఁగా - తలుపు తెరచినంతట మూవురును ఆ చోటున అతి శ్రమతో నిలుచుండిరి.

తప స్సంపన్ను లగు మూవురు భాగవతులు యాదృచ్ఛికముగ నచ్చట చేరుటను పరమాదరముతో కటాక్షించిన మృకండుని యారాధ్య దైవ మగు అర్చామూర్తి - ఆ మహానుభావుల పరిష్వంగ సుఖము నభిలషించి, తన రాణులతో గూడి, త్రివిక్రమ రూపియై, వారల నమమ సాక్షాత్కరించెను. క్రొత్త మనుష్యుల రాక ఫలన కలిగిన ఒత్తిడి మాత్రము ఆళ్వారులకు తెలియవచ్చినది కాని,

ఆ గాఢాంధకారములో ఆ క్షేత్రంగా వచ్చిన వారల రూపము వారలకు కనబడనందున వారలు కలవరపడుచు, తుద కది భగవన్మాయ యని నిశ్చయించుకొని, తన్మయతతో పూదత్తాళ్వారులు 'వైయంపగళియూ' అని యారంభించియు, రెండవ వారు - 'అన్బేతగళియూ' అని యారంభించియు, మూడవ వారు - 'తిరుక్కండేన్' అని యారంభించియు - వరుసగా మూడు వేరు వేరు ప్రబంధములను పాడి, భగవానుని సాక్షాత్కారమును ప్రశంసించిరి. ఈ మూడు ప్రబంధములే ముదలాయిరము నందలి మూడు 'తిరువందాదులు'. వరుసగ భగవానుని జూచి - 'ఓ దేవా! మేము ధన్యులము. నీ విప్పుడు మాకు సాక్షాత్కరించిన ఈ చోటనే రూపముగ సర్వాకారమున వేంచేసి, తరువాతి తరములవారి ననుగ్రహింపు' మని ప్రార్థించిరి. భగవానుడల్లే నిలిచిపోయెను. ఇంతలో ఈ యలజడిని విని, లోనుండి వచ్చిన మృకండునకును భగవత్సేవా భాగ్యము లభించెను. తదనంతరము ఆళ్వారులును యథాక్రమముగ తమ సంచారమును సాగించిరి.

తెనుఁగున - 'నడమ' నుటకు సంస్కృతమున - 'దేహళి' యందురు. దేహళియం దవతరించిన కతమున, ఈ దేవునకు దేహళీశుఁడనియు వ్యవహారము కల్గినది. అవతార స్వరూపమున త్రివిక్రమ రూపముననుండుటచే 'త్రివిక్రముఁ' డనియు - 'ఉలగళంద పెరుమాళ్' అనియును ఈ దేవుని బిలుతురు.

4. తిరుమళిశై యాళ్వారులు :—

మహిసార పురము (తిరుమళిశై) అను గ్రామమునందు భృగు వంశజుఁడగు భార్గవులు అనునొకద్విజోత్తముఁడు కనకాంగియమ్మ అను భార్యతో నివసించు చుండెను. ఆయన చిరకాలము సంతానము లేక, సంతాన ప్రాప్తికై యజ్ఞము చేసి, భగవదనుగ్రహమును పొందెను,

కనకాంగియమ్మ గర్భము ధరించి, పండ్రెండు మాసములు గర్భమును మోసి, ఒక మాంస పిండమును కనెను. ఇది ముదలాళ్వారు అవతరించిన ద్వాపర మందలి 857489 విభవ సంవత్సర మకర మాస కృష్ణ పక్షమున మఘా నక్షత్రము కూడిన దశమీ గురువాసరము. ఆ భార్గవుఁడు తన చుర్విధికి వగచి, ఆ పిండము నెత్తి, ఒక వస్త్రమునఁ గట్టి, భద్రముగ నొక పేము పొదయందు విడచెను. కాలము గడచి, పండ్రెండు సంవతర్సములు నిండఁగా - సురక్షితముగ నున్న ఆ మాంస పిండమునకు కర చరణా ద్యవయము లేర్పడి, చైతన్యము కలిగి, వృద్ధి జెంద నారంభించెను. ఒకనాఁ డా యడవియందు సంచరించెడి 'తిరువాళన్' అను మేదరి యొకఁడు, అనాథయై పడియున్న ఆ బిడ్డను చూచి కనికరించి, దాని నెత్తి తీసికొనిపోయి - 'కుముదవల్లి' అను తన భార్య కిచ్చి, పెంచు మని చెప్పెను. ఆ దంపతులకు బిడ్డలు లేకుండుటచే కూడ వా రెంతయో మక్కువగ బిడ్డను కాపాడుచుండిరి. కాని, ఆ బిడ్డ మాత్రము మేదరియింటి అన్నపానములు తాకుటలేదు. ఏకాగ్రతతో భగవద్ధ్యానము చేయుచుండెను. ఈ బిడ్డయే - తిరుమళిశై యాళ్వారు లైరి. వీరు సుదర్శనాంశ సంభూతులు. వీరి యోగ్యతను గమనించిన ఆ గ్రామ మందలి వృద్ధ శూద్రుఁ డొకఁడు అప్పు డప్పుడు క్షీరముల దెచ్చి, ఆళ్వారుల కిచ్చుచుండెను. ఆళ్వారు లా పాలను త్రాగుచుండి, ఒకనాఁడు అతని యందు కరుణించి, పీత శేష మగు క్షీరమును అతని కిచ్చి, అతని భార్య కీయవలసిన దని చెప్పిరి. అతఁ డట్లు చేసెను. ఆ పాలను త్రావిన యా శూద్రభార్య గర్భమును ధరించి, సకాలమున - 'కణికణ్ణన్' అను పరమ భాగవతోత్తముఁ డగు పుత్రుని కనెను. అతఁడు పెరిగి పెద్దయై, ఆళ్వారులయందు భక్తి కలిగి యుండెను. ఒకప్పుడు ఆళ్వారులతో కలసి - 'కణికణ్ణుఁడు' కాంచీ నగరమునకు పోయి, అచ్చట కాలము గడుపుచుండెను. ఆ యూర - పల్లవ రాజు చే

యౌవనమం దభిమానింపఁబడి, వార్ధక్యము రాఁగా – త్యజింపఁబడి, దేహయాత్రకై శ్రమపడుచుండెడి దాసి యొక్కఁతె కలదు. ఆమె – తిరుమళిశై యాళ్వారులను చూచి, ఆయన భక్తుఁ డని యెరిఁగి, పరిచర్య చేయ మొదలిడెను. ఇట్లుండ – కొంత కాలమున కా దాసి యందు కనికరించిన కణికణ్ణుఁ – 'నీకేమి కావలె' నని యడుగఁగా – ఆమె తన దీన వృత్తము చెప్పుకొని, తిరిగి రాజాదరమునకు తగినట్లు తనకు యౌవనము కావలె నని యడిగెను. 'అల్లే యగు గాక' యని ఆమె నాతఁ డనుగ్రహించగా · ఆ యమ నిండు యౌవనముతో నల రారెను. యాదృచ్ఛికముగ నొక్క నాఁడు పల్లవ ప్రభు వామెను చూచుట తటస్థించగా – రా జామెయందలి మార్పును చూచి, ఆశ్చర్యము చెంది, ఆమెను రావించి, పూర్వము వలె తన యాశ్రయమున నుండు మని కోరెను. ఆమెయు – అతనితో నుండెను. వార్ధక్యమునఁ బడుచున్న రాజు, తన దాసి వలె తానును యౌవనము నంది, విషయ సుఖముల ననుభవింపఁగోరి, ఆమె నందుకు మార్గ మడిగెను. ఆమె – తనకు కణికణ్ణుని కృపచే యౌవనము లభించిన చరిత్రము చెప్పఁగా – రాజు విని, సంతసించి, అతని బిలిపించెను. కణికణ్ణుఁడు రాజాస్థానమునకు వచ్చెను రా జాతనిఁ జూచి, తా నాతని బిలిచిన కథను మఱచి, తనపై కవిత్వము చెప్ప మని యాజ్ఞాపించెను. కణికణ్ణుఁ డట్లు మనుష్యుని బొగుటకు నిరాకరించఁగా – రాజు కోపించి, అతనిని మరునటి ఉదయములోఁగా తన పట్టణము విడిచి పోవఁగు నని ఆజ్ఞాపించెను. కణికణ్ణుఁడు అల్లే యని, ఆచార్య లగు తిరుమళిశై యాళ్వారుల యొద్ద కేగి, రాజాజ్ఞను దెలిపి, తన కాజ్ఞ నొసంగి పంపు డని వేడెను. భక్తుని వియోగమును సహింపఁజాలని ఆళ్వారులు కూడ కణికణ్ణుని

వెనుకనే ప్రయాణమై, ఆ యూర నున్న వేగానేతు అను అర్చా మూర్తిని కూడ తమతో రమ్మని యాజ్ఞాపించిరి. వారి వెంటనే పట్టణ మంతలి భాగవతోత్తము లందఱును రాజును నిందించుచు, ఆళ్వారుల ననుసరించి పో సాగిరి. పట్టణము కళా విహీన మయ్యెను. మరునాఁడు రాజు - ఈ అత్యాహితమును తెలిసికొని, తన పరివారముతో తిరు మళిశై యాళ్వారులు విడిది యున్న ప్రక్క గ్రామమునకు పోయి, అపరాధ క్షమాపణము చేసికొని ప్రార్థించగా, కరుణించి, తిరుమళిశై యాళ్వారులు తిరిగి అర్చామూర్తి సహితముగ కణికణ్ణనితో కలిసి కంచికి వచ్చిరి. ఆళ్వారుల యభ్యర్థన ననుసరించుటచే - 'వేగానేతు' పెరుమాళ్ళకు నాఁటి నుండి 'యథోక్తకారి' - లేక, 'శొన్నవణ్ణం శెయ్యుం పెరుమాళ్' అను వ్యవహారము కలిగెను.

తిరుమళిశై యాళ్వారులు పూర్వ వయసున తిరుమళిశై గ్రామమం దున్నప్పుడు సర్వదా శాస్త్ర పరామర్శము చేయుచుండుట వాఁడుక. వీ రొకప్పుడు శివ మతమును పరామర్శించుచు, దానియం దాసక్తి కలిగియుండిరి. ఇట్టి స్థితిలో వీరి ననుగ్రహించుటకై పే యాళ్వారులు వీరి వద్దకు వచ్చి, వీరితో మాటలాడనలె నని యాశ జెంది, ధ్యాన నిష్ఠలో నున్న తిరుమళిశై యాళ్వారులను పలుకరింప జాలక, వేచి యుండిరి. ప్రయోజనము లేక పోయెను. తిరుమళిశై యాళ్వారు వారితో పలుకలేదు. పే యాళ్వారు లోక యుక్తి నొక దాని బన్ని, ఒక తులసి మొక్కను వెకలించి తెచ్చి, ఆళ్వారుల యెదుట వారు చూచుచుండఁగా ఒక గుంట త్రవ్వి, దానిలో ఆ మొక్కను తలక్రిందుగా ప్రాతి, ఒక చిల్లి కుండలో దూరమం డుండి ఉదకమును తెచ్చి, ఆ మొక్క పాదులో పోయుచుండెను. భక్తి సారులు కన్ను దెఱచి, అతనిని చూచి పరిహసించుచు - 'నీకేమి పిచ్చి పట్టినదా ? ఎవ్వరై నను తలక్రిందుగా మొక్కను ప్రాతుట కలదా ?

నీవు తెచ్చు చిల్లికుండలో ఉదకము ఇక్కడకు తెచ్చుటకు ముందే జారి పోవునే ?' అని ప్రశ్నించెను. పే యాళ్వారు లాతని పరిహాసము నకు సంతసించి – 'నాకు పిచ్చి పట్టలేదు, దేవదేవుఁ డగు నారాయ ణుని విడిచి, నీవు శివ ధ్యాన మొనరించు చున్నావు. మూలమును విడిచి, శాఖ లవలంబించుచున్న నీవే పిచ్చి వాడవు. శివుఁ డాదిగాఁ గల దేవత లిచ్చు ఫలము లీ చిల్లికుండలోని జలములకు పోలినవి. మోక్ష పర్యంత మా ఫలములు రావు' అని బదులు చెప్పఁగా – భక్తి సారు లా మాటల యర్థమును గ్రహించి, నాఁటి నుండి దేవ తాంతర చింతనము మాని, పరమ వైష్ణవుఁడై ప్రకాశించెను.

ఒకా నొక్కప్పుడు భక్తిసారుఁ డను రసవాది యొకఁడు తిరు మళిశై యాళ్వారుల యొద్ద కేగి, తన శక్తిని బొగడుకొనుచు, ఆ యాళ్వారులను తన వశముఁ జేసికొనఁగోరి, ఒక ఇనుప ముక్కను తెచ్చి, దానిని ఓషధీ శక్తిచే సువర్ణముగఁ జేసి చూపెను. నిస్పృహు లగు తిరుమళిశై యాళ్వారులు ఆతని పరిహసించుచు – తన చెవిలో మలము (గుబిలి) తీసి, ఒక ఇనుప ముక్కపై వేయఁగా – అదియు బంగార మాయెను. భాగవతుల శరీరమందలి మలమునకు సైతము సంకల్ప మాత్రముచే ఏ పదార్థమునైనను ఇచ్చి వచ్చినట్లు మార్చి వచ్చు నని అతనికి నిరూపింపఁగా – అతఁడు లజ్జితుఁడై మరలి పోయెను.

ఒకనాఁడు పార్వతీ పరమేశ్వరు లాకాశమందు విహరించుచు, మహీసార పురక్షేత్రముపైకి రాఁగా – పార్వతి పరమ శివునిఁ జూచి, మహా తపస్సంపన్నుఁ డగు ఆళ్వారుల చెంత కేగి, వారి కేదైన వర మీయఁదగు నని వేడెను. తిరుమళిశై యాళ్వారుల చిత్త వృత్తి నెఱింగిన పరమ శివుఁడు – అతఁడు తమ నాదరింపఁ డనియు,

తా మచ్చటికి పోవుట నిరర్థక మనియు చెప్పిన మాట వినక, పార్వతి నిర్బంధించగా - వా రిరువురును విమానము దిగి, ఆళ్వారుల మెదుట నిలిచిరి. ఆళ్వారులు వారలను చూచి, తమ రాకకు కారణ మడు డగా - వారు తిరుమళిశై యాళ్వారులను చూచుటకు వచ్చితి మని చెప్పిరి. 'చూచితిరిగదా ! ఇక పోవచ్చు'నని తిరుమళిశై యాళ్వారులు బదులు చెప్పగా - వారు సంకోచముతో తిరుమళిశై యాళ్వారుల కేదైన వర మీయ గల మని చెప్పిరి. అందుకు తిరు మళిశై యాళ్వారులు చిరు నగవుతో - ' మీ వరములు నా కక్క రలే' దనగా - వారు 'యేదైన కోరు' మని నిర్బంధించిరి. అందుకు తిరుమళిశై యాళ్వారు లిట్లు మూడు వరముల నొక్కటి తరువాత నొకటి యడుగ నారంభించిరి. 'నేడు మృతిజెందెడి వానిని రేపటి వఱకు జీవింపజేయగలవా ?' అనునది మొదటి ప్రశ్న. ఆ పని తనది కాదని హరమేశ్వరుడు బదులు చెప్పెను. 'ఒకనికి మృత్యువు రాకుండ చేయగలవా ?' అనునది రెండవ ప్రశ్న. దీనికిని వెనుకటి ప్రత్యుత్తరమే చెప్పబడగా - 'మోక్షము నీయగలవా ?' అని కడపటి ప్రశ్న నడిగెను. మోక్ష ప్రదా నార్హత శ్రీమన్నారాయణు నడిగాని, తనకు లేదని శివుడు బదులు చెప్పెను. భక్తిసారులు స్మిత వదనులై, 'నీ వరములు నా కక్కఱలేదు. 'తదా దర్శిత పంథానం' అనునట్లు విష్ణుదేవుని యాజ్ఞ ననుసరించిన కార్యములను మాత్రమే చేయగలిగిన నీవు స్వతంత్రుడవు కావు. నే నా విష్ణుదేవు నాశ్ర యింతును నీవు పోవచ్చును !' అని చెప్పగా - ఆ దంపతులు మఱలి పోయిరి. పరిభూతుడగు శివుడు ఫాల నేత్రమును తెఱచినంత, తిరు మళిశై యాళ్వారులు పాద నేత్రమును తెఱచి, తమ తమ పరాక్ర మములను చూపిన కథ లిచ్చట నుల్లేఖించుట గ్రంథ విస్తర మగును.

ఒకనాడు తిరుమళిశై యాళ్వారులు - 'పెరుం పులి యూర్' అను గ్రామమునకుఁబోయి, అచ్చట భగవదాలయమునకు ప్రదక్షిణము చేయుచుండఁగా - అప్పుడచ్చట వేదాధ్యయన మొనర్చుచున్న కొందఱు బ్రాహ్మణులు ఆళ్వారులను జూచి, అతఁడు బ్రాహ్మణ సంస్కారములు లేనివాఁడగుటను యెఱిఁగి, అతని యెదుట వేదాధ్యయనము చేయ తగదని చెప్పుకొనుచు, అధ్యయనము చెప్పుట మానిరి. ఆళ్వారులు వీథి దాటి పోఁగా - వారలు తాము అధ్యయనము విడచిన చోటు జ్ఞాపకము రాకను, వేఱొచ్చారణమే శక్యము కాకను కలవర పడిరి. ఇంతలో - ఆళ్వారు లా యాలయమం దర్చకులు చేయు యాగమునకు బోయి సేవించి, వారి వలన అగ్ర పూజను స్వీకరించిరి. అచ్చటి ఋత్విక్కులును, సభస్యులును యజమానిపై కోపించిరి. యజమానుఁడు ఆళ్వారుల మహిమ నెఱిఁగినవాఁడగుటచే భగవానుని ప్రార్థింపఁగా - అర్చామూర్తి ఆలయమునం దుండి వెలుపలకు వచ్చి, ఆళ్వారులపై శంఖ చక్రములతో సాక్షాత్కరింపఁగా - అందఱును భయపడి, ఆళ్వారులను యజమానుని ప్రశంసించిరి. ఈ సందర్భము వీథిలో కలవరపడుచుండెడి వైదికులకు తెలిసి, వారలకు గల్గిన వేద విస్మృతికి కూడ భాగవతాపచారమే కారణమై యుండునని నిశ్చయించిరి. తిరుమళిశై యాళ్వారుల యొద్దకేగి, తమ అపరాధమునకు చింతించి, పశ్చాత్తాపమును తెలిపిరి. ఆళ్వారులు చిరు నగవుతో ఆ ప్రక్క బడియున్న ఒక నల్లని వడ్లగింజను చేతిలో దీసికొని, దానిని గోటితో చీల్చి చూపెను. దాని యర్థమును వా రెఱిఁగి, తాము అధ్యయనమును విడిచిన చోటు - 'కృష్ణానాం వ్రీహిణాం నఖ నిర్భిన్నమ్' అను చోటుగా స్మృతికి దెచ్చుకొని, తమ పాఠమును కొనసాగించిరి. అంత నాళ్వారులు వారలను చూచి, తనకు సకల వేద వేదాంగములు తెలియు ననియు, ద్విజ సంస్కార రహితుఁడగుట

ప్రత్యక్షముగా వేదోచ్చారణము చేయరా దనియు చెప్పి, వారల నాశ్వాస పఱచి, తమ క్రోవ బోయిరి. ఇట్టి కథ లింకను అనేకము కలవు. తిరుమళిశై యాళ్వారు లిట్లు మహిమా సంపన్నులై, రమారమి 2,300 సంవత్సరము లీ భూమియందు జీవించి, కుంభకోణ క్షేత్రమందు సిద్ధి జెందిరి.

5. పెరియాళ్వారులు :—

శ్రీ ధన్విన్యవ్య పురము (శ్రీవిల్లిపుత్తూరు) నగరమున కలి 47 - వ సంవత్సర మగు క్రోధన వర్ష మిథున మాసమున స్వాతీ నక్షత్రముతో కూడిన శుక్ల ఏకాదశీ భానువార శుభ దినమున గరుడాంశచే బ్రాహ్మణ కులమున నవతరించిరి. వీరు - పురశ్శిఖు లగు ద్విజ శ్రేష్ఠులు. తండ్రి ముకుందాచార్యులు. తల్లి - పద్మావతిఅమ్మ. అన్న - కులంబియర్. వీరికి నంద నన కైంకర్య మందును, శ్రీ భాగవత - శ్రీ విష్ణు పురాణ పఠనమునందును ప్రపత్తి మెండు. శ్రీ విల్లిపుత్తూరు ఒక చిన్న గ్రామము. దానిని పాండ్య ప్రభువులు పరిపాలించుచుండిరి. ఒక నాటి రాత్రి పాండ్య ప్రభువు చోర రూపముతో రాత్రి వేళ నగరమందు సంచరించుచు, ఒక వాకిటి అరుగు మీద ఇరువురు క్రొత్త మనుష్యులను చూచి, వారలతో కుశల ప్రశ్నల చేయుచుండుటలో వారు —

" వర్షార్థ మష్టౌ వ్రయతేత మాసాన్ నిశార్ధ మర్ధం దివసం యతేత
వార్ధక్య హేతో ర్వయసా నవేన పరత్రహేతో రిహ జన్మనా చ. "

— (హితోపదేశము.)

అను శ్లోకమును చెప్పిరి. రాజు తనకు గల్గిన ఐహికము లగు సకల భాగ్యములకు పరమ తృప్తి బడసినవాడగుటచే, వారలు

చెప్పినట్లు పరలోకమునకై తా నేమియు చేయలేదే యని చింత కలుగఁగా – చకితుఁడై, మరునాఁడు మంత్రుల రావించి, పరలోక హితమునకై తాను చేయఁదలచిన కార్యమునకై, మొదటిదిగ పర దేవతా వామార్థ్యము నిర్ణయము కావలయు నని ఆలోచించి, అట్టి నిర్ణయము నొక విద్వత్సదస్సున తెలియఁగోరి, అట్టి సదస్సును మధురా నగర మందు జరుగునట్లు ఏర్పఱచెను. సదస్సు ఏర్పాటు చేయుటకు రాజ పురోహితు లగు శెల్వ నంబి ప్రధాన ప్రేరకులు. విద్యా శుల్కము కూడ విస్తారముగ సంకల్పింపఁబడెను. నానాదేశ ముల నుండి వాద శూరు లగు పండితులు మధురా నగరము నలం కరించి, ప్రసంగములఁ జేయసాగిరి. భక్త వత్సలుఁడగు వటపత్ర శాయి పెరియాళ్వారులకు అశరీరియై సాక్షాత్కరించి, మధురా నగరమునకుఁ బోవ నాజ్ఞాపించెను. *

వైదుష్య పటిమ లేని పెరియాళ్వారులు ఏనుకాడఁగా – భగ వానుని ప్రేరణముచే ఆతఁడు మధుర కేగి, వాదించి, వాద గోష్ఠి యందు ప్రతి పత్రుల నోడించి, విష్ణువే పరదైవత మని స్థాపించిరి. పాండ్య రాజు సంతసించి, శుల్కము నాళ్వారులకు సమర్పించి, తన పట్టపు ఏనుగుపై గజవాహనోత్సవమును అమిత వైభవముతో గావించెను. ఆ వైభవమును కటాక్షించుటకు శ్రీ భూ దేవులతో గూడి, గరుడ వాహనారూఢుఁడై శ్రీ మహావిష్ణువు మధురానగ రాకాశమందు సాక్షాత్కరించుటయు, ఆళ్వారు లా సేవకు తన్మయతఁ జెంది, భగవానునకు దృష్టి దోషము కలుగు నను శంకచే 'పల్లాండు' పాడుటయు జరిగినది.

తరువాత – సంతానము లేని పెరియాళ్వారుల నభిమానించి, భూదేవి – ఆండాళ్ రూపముతో తులసీ వనమం దవతరించి, పెరియా

---

* స్వప్న మందు సాక్షాత్కరించె ననియు మతాంతరము కలదు.

ళ్వారుల శిక్షణములో పెరిగి పెద్దదియై, అనన్య చిత్తయై, భగవానుని ప్రేమించి, తాను ధరించిన పుష్పమాలలను భగవానుడు ఆశ పడు నంతటి దశకు భగవానుని చిత్తమును కరగించి, 'ఆముక్త మాల్యద' (శూడికొక్కుడుత్త నాచ్చియార్) అనుపేరప్రసిద్ధియై, రంగనాథునియొక్క అర్చామూర్తిని పరిణయ మాడి, భగవత్సాయుజ్యమును పొందు టయు సంభవించెను. ఆండాళ్ పరిణయమైన వెనుక, పుత్రీ విరహము నకు క్లేశము చెందిన పెరియాళ్వారులను రంగనాథుడు కరుణించి, యాదేశించగా - ఆళ్వారులు ఆండాళ్ యొక్క విగ్రహమును నిర్మించి, ఆమెతో శ్రీరంగనాథుని యొక్కయు గరుడ భగవానుని యొక్కయు మూర్తులను సైతము యథావిధిగ ప్రతిష్ఠింపించి, చాల కాల మారాధించుచు వచ్చిరి. దేహావసానమునకు 'తిరుమాలిరుం శోలై' దివ్య క్షేత్రమునకు వచ్చి, ౫౬ - న సంవత్సర ప్రాయమున దేహము చాలించిరి. ఈ గురుతు లన్నియు అచ్చట నేడును కలవు.

6. కులశేఖరాళ్వారులు :—

చేర రాజ్యమున కొల్లి దేశములో - 'తిరువంజిక్కళమ్' అను గ్రామమున అభిషిక్త క్షత్రియ కులమందు పరాభవ సంవత్సరమున కుంభ మాసమున పునర్వసు నక్షత్రముతో గూడిన శుక్ల పక్షమున దశమీ గురువాసర శుభ దిన మందు కౌస్తుభాంశచే అవతరించిరి. తండ్రి - దృఢవ్రత మహారాజు. అన్న - శేరన్. చోళ చేర పాండ్య దేశములను కులశేఖరుడు పాలించెను. రఘురామునియం దీతనికి భక్తి మెండు. బాల్యము నుండియు విరక్తుడై, పరమ భాగవతుడై యొప్పెను. సంస్కృతమున 'ముకుంద మాల' అను నొక స్తోత్ర గ్రంథమును రచించెను. ఒకప్పుడు శ్రీ రామాయణమును వినుచున్న కులశేఖరాళ్వారులు - రాముడు పదునాలుగు వేల రాక్షసులతో ఏకాకియై యుద్ధమునకు తలపడిన ఘట్టమును వినినంతనే కలవరపడి, తన్మయుడై, ఏకాకి యగు రామభద్రునికి సాయముగ తన సేనతో

తాను పయాణమై తరలినట్లును, అతని యప్పటి చిత్త వృత్తిని కని పెట్టిన పౌరాణికుఁడు బుద్ధిమంతుఁ డగుట వలన, ఒక దూత ముఖమున ఆ యుద్ధ మిప్పుడె సమాప్తమై, రాక్షస వధ పూర్తియై, రాముఁడు జయముతో యుద్ధభూమినుండి మరలి రాగా - 'భర్తారం పరిషస్వజే' అనినట్లు జానకి జయార్హుఁ డగు రాముని ఆలింగనము చేసి కొని గారవించె ననియు చెప్పిన వర్తమానము వినిపింపఁగా - కులశేఖరాళ్వారు లాశ్వాసము జెంది, యుద్ధ సన్నాహము నుండి విరహితుఁ డాయె ననియు - ఐతిహ్యము కలదు.

కులశేఖరాళ్వారులు వైష్ణవ పక్షపాతియై, ఇతరుల నెవ్వరిని పురస్కరించకుండుటను ఈర్ష్యతో చూచుచు వచ్చుచున్న కొంద అధికారులు ఒకప్పుడు రాజ సౌధము నుండి అమూల్య మగు నొక్క యాభరణమును దొంగిలించి, ఆ చౌర్యము తమ సౌధ మందలి పరిచయముగ సంచరించెడి భాగవతుల వలన జరిగె నని చాడీలు చెప్పిరి. రాజు వారల మోసమును తెలిసికొని, వైష్ణవు లట్టి యతిక్రమము చేయ రని తాను శపథము చేసి, శపథమున దృష్టాంత ముఖముగ చూపెను. రాజు ఒక భాండమును తెప్పించి, అందొక నాగుబామును పెట్టి మూసి, కొన్ని దినములు దాని కాహారము లేకుండ శుష్కింపఁ జేసి, ఆవల ఆ భాండమును సభకు తెప్పించి, తన శపథమును చెప్పుచు, ఆ భాండమున తన చేతి నుంచెను. పాము రాజున కెట్టి యపకృతి చేయకుండఁగా చూచి, సభవా రాశ్చర్య పడిరి. ప్రతి పక్షులును తమ కపటము కార్యకారి కాకుండుట నెఱిఁగి, లజ్జించి, రాజుకు క్షమాపణము చెప్పుకొనిరి.

ఇట్లు 67 సంవత్సరములు రాజ్య మేలి, కులశేఖరులు అంబా సముద్ర సమీప మందలి మన్నారు కోవిల్ గ్రామ మందు పరమ పదించిరి.

7. తిరుప్పాణాళ్వారులు :—

శ్రీరంగమునకు సమీపమున 'ఉరైయూర్' గ్రామవంపు కలి 120 సంవత్సరములు గడచిన దుర్మతి సంవత్సర వృశ్చిక మాసమున రోహిణీ నక్షత్రము కూడిన కృష్ణపక్ష విదియా బుధవారమందు శ్రీవత్సాంశచే ధాన్యపు కంకియం దవతరించిరి. అయోనిజులై యవతరించి, వివిక్తముగ పడియున్న శిశువు నొక పంచమ కులజుడు తెచ్చి పెంచెను. వీరు ద్విజ సంస్కారములు లేకను, ప్రాకృతము లగు నన్న పాదుల స్వీకరించకను భగవన్నామమును పాడుచు, దేవాయాత్ర గడువు చుండిరి. వీరు గాత్రమునను - జంత్రమునను గానము చేయఁగల సమర్థులు. ఒక దినమున తిరుప్పాణాళ్వారులవఁదు కరుణించి, రంగనాథుఁడు తనకు తీర్థకైంకర్యము చేయు లోకసారంగముని యను కైంకర్య పరుని అర్చక ముఖముగ బిలిచి, తిరుప్పాణాళ్వారులను తన భుజముపై నెక్కించుకొని, శ్రీరంగమునకు తెమ్మని యాజ్ఞాపించెను. లోకసారంగముని తిరుప్పాణాళ్వారుల యొద్ద కేగి, భగవన్నియమనము చెప్పఁగా - తిరుప్పాణాళ్వారులు భయముతో పంచమఁడగు తన పాద స్పర్శచే పుణ్యభూమి నపవిత్రము చేయఁజాల నని చెప్పఁగా, భగవన్నియమనము మేరకు ఆయనను తన భుజముపై నెక్కించుకొని, లోకసారంగముని శ్రీరంగమునకు చేర్చెను. రంగనాథుఁడు తిరుప్పాణాళ్వారులం దనుగ్రహించి, తన దివ్య మంగళ విగ్రహమును సాక్షాత్కరింపజేయఁగా - ఆతఁడు భగవానుని శుభాశ్రయ దివ్య మంగళ విగ్రహమును 'అమలనాది పిరాన్' అని యారంభించి. పది పాశురములలో పాదాది కేశాంతము వర్ణించి

పాడ నారంభించి, పదవ దగు 'కొండ ల్వణ్ణనై' పాశురము ననుసంధించుచు భగవానునియందు అంతర్ధానము చెందిరి.

8. తొండరడిప్పొడియాళ్వారులు :—

చోళ దేశ మందలి మండంగుడి గ్రామమున కలి 298 సంవత్సరములు గడచిన ప్రభవ సంవత్సర ధను ర్మాసమున జ్యేష్ఠా నక్షత్రముతో గూడిన కృష్ణపక్ష చతుర్దశీ మంగళవార శుభ దినమున వసమూలాంశజే సామశాఖీయ బ్రాహ్మణ వంశమం దవతరించిరి. తండ్రి వేద విశారదులు. వీరికి బాల్యమందు తల్లి దండ్రులచే విప్రనారాయణులని నామకరణము చేయబడెను. పెరిగి పెద్దయై, ఈయన శ్రీరంగమందు నిత్య నివాసము సంకల్పించుకొని, బ్రహ్మచారియై, భాగవతులగు శ్రీ వైష్ణవ గృహములలో మధూకరము చేసి జీవించుచు, భగవానునకు తులసీ కైంకర్యము చేయుచుండెను. కావేరికి ఆవలియొడ్డున గల "డ్వర్ యూర్" అను గ్రామమున చోళ రాజునకు అభిమాన మగు దేవదేవి యను నొక దాసి నివసించుచుండెను. ఆ దాసి తన చెలికత్తెలతో నిత్యము శ్రీరంగమునకు వచ్చిపోవు నలవాటు కలదై యుండెను. ఆమె యాతాయాతములలో మార్గమందు తొండరడిప్పొడియాళ్వారుల నంద నవనము కలదు. ఒకనాడామె నంద వనము రాగా - దైవ గతిచే వర్షము కురియుచుండెను. తొండరడిప్పొడియాళ్వారు లామెను యాశ్రమమునకు ఆహ్వానించి, ఉపచరించెను. ఋష్యశృంగునివంటి తొండరడిప్పొడియాళ్వాల ప్రవృత్తిని చూచిన చెలికత్తె, తన నాయకితో తొండరడిప్పొడియాళ్వారుల వైరాగ్యమును - ధృతిని ప్రశంసింప మొదలిడెను. అందుకు దేవదేవి పరిహసించి, తా నా బ్రాహ్మణుని తన సామర్థ్యముచే వలపించి, వ్రత భ్రష్టుని చేయగల నని ప్రతినఁ జేసి, ప్రయత్నింపసాగెను. ఏవియో

యొక వ్యాజము కల్పించుకొని, ఆ యమ ప్రతి దినము తొండడిప్పొడియాళ్వారుల యాశ్రమమునకు వచ్చి, తన హీన భావములను ఆ యాళ్వారులపై ప్రదర్శింపసాగెను. ఆ యాళ్వారులకును అనుభవింప వలసిన ప్రారబ్ధ శేష ముండుటచే - దాని ననుభవింపఁ జేయుటకై భగవానుఁడు సంకల్పించిన ఈ విచిత్ర సంఘటనమునకు తొండరడిప్పొడియాళ్వారులు క్రమ క్రమంగా లక్ష్యమై దేవదేవికి వశుఁడై, తన కైంకర్యమును - అనుష్ఠానమును త్యజించి, ఆమెతో విషయ సుఖముల ననుభవించుచు · సంపూర్ణముగ క్రమముగ శ్రీరంగ క్షేత్రమును సైతము విడచి, ఉరయూరుకే చేరెను. కృత కృత్యమైన దేవదేవి కొంత కాలమునకు వేశ్యా సహజ మగు దౌష్ట్యము నవలంబించి, తనకు శుల్కము నీయక తన యింటికి రారాదని యాతని తరిమి వైచెను. అకించను డగు ఆ యాళ్వారులు ద్రవ్యము తెచ్చుటకు శక్తి లేకను - చిరానుభూత మగు నామె స్నేహమును విడచుటకు మనసు రాకను క్లేశపడుచుండెను. ఆ నాఁటితో ఆ యాళ్వారులకు ప్రారబ్ధశేషము నశింపఁగా - శ్రీ రంగనాయకి భగవానునితో భాగవతోత్తము లగు తొండరడిప్పొడియాళ్వారుల ననుగ్రహింప వేఁడుట తటస్థించెను. భగవానుఁడు సమ్మతించి, ఆ రాత్రి శయనాధివాసమునకు వెనుక తానే ఒక వైష్ణవుని వేషమును ధరించి, సన్నిధిలోని సువర్ణపాత్రము నొక దానిని చేతఁ దీసికొని, దేవదేవి గృహమున కేఁగి, ఆ పాత్రము నామె కిచ్చి, తాను విప్రనారాయణుని శిష్యుఁడ ననియు - తన యాచార్యు లీ పాత్రమును శుల్కముగ నీయఁబంపి రనియు చెప్పి, మరలిపోయెను. సంతోషముతో దేవదేవి యా రాత్రి - ఆ యాళ్వారుల నాదరించెను. మరునాటి ఉదయమున సన్నిధిలో స్వర్ణ పాత్ర లేకుండుటను కనిపెట్టిన కైంకర్యపరులు కల వరపడి, వెదకి, ఆ పాత్ర దేవదేవి యింట నుండుట నెట్లో కనిపెట్టి,

ఆమెను నిర్బంధించిరి. ఆమెయు - తన నిరపరాధిత్వమును చెప్పుకొనుచు - తొండరడిప్పొడియాళ్వారులచే తన కాపాత్ర మోయఁబడిన చరిత్రము చెప్పెను. రాజభటులా యాళ్వారులను బంధించి, నిర్బంధించి, హింసింప సాగిరి. ఇంతలో - భగవానుఁడు అర్చక ముఖమున నానిష్టుఁడై, విప్రనారాయణుని ఏకాంత భక్తిని, ప్రారబ్ధ శేషానుభవమునకై యాతనికిఁ గల్గిన అవాంతర ప్రవృత్తిని, నేటి కట్టి ప్రారబ్ధానుభవ పూర్తిని విశదముగ చెప్పి, పాత్రను సన్నిధికి తెప్పించి, ఆ యాళ్వారులను విడిపించెను. నాఁటినుండియు విప్రనారాయణులును - దేవదేవియు పరమ భాగవతులై జీవిత శేషమును గడిపి, కృతార్థులైరి.

ఈయెడ తొండరడిప్పొడియాళ్వారులు 'తిరుప్పళ్ళి యెళుచ్చి' యందలి తుది పాశురమున 'ఉన్నడి యార్క్-ట్పఱుత్తాయ్' అను వాక్యముచే తనకు భగవద్భక్తి కలిగి యుండియు దేవదేవితో ఏకాంత సంగమమువంటి విషమ పరీక్షా సమయము లందు ఆ భక్తి తనను కాపాడలేకపోయిన దనియు - భాగవతులెవ్వరైనను అట్టి సమయము లందు తన కండయై యున్నచో - వారలు తన దుఃస్థితికి పాలుగాకుండ తమ యుపదేశములచే కాపాడియుందు రనియు దృఢముగ నమ్మి, భాగవతోపసదనము యొక్క- పరమావశ్యకతను-మాహాత్మ్యమును ప్రశంసించిరి.

ఇట్లే, వారి వేరొక ప్రబంధమగు 'తిరుమాలై' యందును 'మేమ్ పోరుళ్ పోగవిట్టు' 'అడిమైయి ఱుక్-డిమై' 'తిరుమఱు మార్వనినై' 'వానుళ్వార్' 'పళుదిలా' 'అమ్మావోర్' అను ఆరు పాశురము లందును భాగవత శేషత్వము తమకు పరమోద్దేశముగ ననుసంధించిరి. ఇట్లు నూట అయిదు సంవత్సరములు దేహయాత్ర గడిపి, శ్రీరంగమందే పరమపదించిరి.

9. తిరుమంగై ఆళ్వారులు :—

చోళ దేశమున 'కురైయలూర్' అను గ్రామమందు కళ్ళర్ (మ్లేచ్ఛ) కులమున కలి 207 సంవత్సరములు కడచిన నల సంవత్సరమున కార్తీక మాసమందు కృత్తికా నక్షత్రము కూడిన పూర్ణిమా గురువారము శుభ దినమున శాంగాంశచే నవతరించిరి. తల్లి దండ్రులు వీరికి నీలుడని నామకరణము చేసిరి. ఈతడు 'తిరుమంగై' యను నొక చిన్న ప్రదేశమున కధిపతియై యుండి, తంజావూరు ప్రభువులకు సామంతుడై యుండెను. ఈతని ధైర్య సాహసములకు మెచ్చిన ప్రభువు ఈతని తమ సేనాధిపతిగ జేసి, ఆదరించుచు వచ్చిరి. ఇతనికి గుఱ్ఱపు స్వారీ చేయుట యందును, కత్తిసాము చేయుట యందును నైపుణ్య మెక్కువ. కొంతకాలమున కీతడు బల గర్వముచే ప్రభువులను సరకు సేయక, వారి కీయవలసిన కప్పమును కట్టక, కాల యాపనము చేయసాగెను. ప్రభువులు వర్తమానము పంపినను ఆదరించక, రాజ భటులను నిరాకరింపసాగెను. అంతట ఆ బలవంతుని మాయోపాయముచే వశపఱచుకొనఁగోరిన రాజు తానే స్వయముగ నీలుని యొద్దకు స్నేహ భావముతో నున్నట్లు నటించుచు వచ్చి, మాటలాడుచునే - అతని బట్టి ఖైదిగా డీసికొనిపోయి, కారాగృహమున బంధించెను. ఇట్లు నీలునకు కారాగృహవాసము కొంతకాలము గడువఁగా - ఒక రాత్రి కాంచీ వరమఁడు స్వప్నమందు సాక్షాత్కరించి, నీలు నాశ్వాస పఱచి, కాంచీ నగరమున తన సన్నిధికి సమీపమున నొక్క చోట మహానిధి యొకటి కల దనియు - దానినిఁ గనిపెట్టి త్రవ్వి తెచ్చి, అందులోని ధనముచే రాజు కీయవలసిన పైకమును చెల్లించి మిగిలిన ద్రవ్యమును సద్వినియోగము చేయు మనియు చెప్పెను.

మరునాఁ డాతఁడు స్వప్న వృత్తాంతమును రాజున కెరింగించెను. రాజును - ఆశ్చర్యముతో నీలుని కారాగృహమునుండి విడిపించి, తన భటుల నిచ్చి, ఆతని కాంచికి పంపెను. నీలుఁడు కాంచికి పోయి, వరదుఁడు చెప్పిన గురుతులనుబట్టి నిధికై వెదకెను గాని, రెండు దిన ముల వఱకు నిధి యాతని కగు పడక వ్యధపడ్డ వదలించెను. మఱునాఁడు వరదుఁ డా నిధి యుండు చోటును గురుతు చూపఁగా - నీలుఁ డా చోటును త్రవ్వి, అక్కడ లభించిన ద్రవ్యమును తెచ్చి, రాజు నెదుట బెట్టి, స్వీకరింపఁ గోరెను. రాజు సంతసించి, తాను - ముం దేల తనకు కప్పము కట్టకుంటి వనియు, ఈ ద్రవ్యమిప్పుడు లభించిన తెఱఁగును చెప్ప మని కోరఁగా - ఆతఁడు వినయముతో - అయ్యా ! లోగడ కూడ మీకు కప్పము కట్టఁగూడ దను దురభిప్రాయముతో నే నూర కుండలేదు. ఆ ద్రవ్య మప్పటి కప్పము సాధు సమారాధనమునకై వెచ్చింపఁబడుటచే కట్టలేకపోయితిని. ఈ ద్రవ్యము వరదుని యను గ్రహముచే భూమియందు అయాచితముగ లభించిన దని చెప్పెను. ఈ చిత్ర చరిత్రము నాకర్ణించిన రాజు సంతసించి, ఆ ద్రవ్యమును త్రిప్పి ఆతనికే యిచ్చివేసి, గౌరవించి పంపెను.

ఆ కాలమున "తిరువళ్ళిక్కు-లం" అను సమీప గ్రామమున నొక పుష్కరిణి యందు అల్లి పుష్పమున నొక యాఁడుబిడ్డ యవతరించి, ఆ యూర నొక భాగవతునిచే పెంచబడుచుండెను. సంతానము లేని ఆ భాగవత దంపతు లా బిడ్డను పెంచగా - ఆ యమ పెరుగుచుండెను. ఆమెకు 'కుముద వల్లి' యని తలిదండ్రులు పేరు పెట్టిరి. ఆమె క్రమ ముగ యువతియై - లోకోత్తర సౌందర్యముతో నలరారు చుండుటను చూచిన నీలుఁ డామెను మోహించి, ఆమెను పరిణయ మాడ గోరి, ఆమె తండ్రికి తన కోర్కెను చెప్పెను. ఆతఁడు తృప్తి చెందియు - లోకాచారము రీతిని ఆ నిర్ణయము తనకు మాత్రమే చేయవలయు నని

పలికి, ఆమెతో కూడ ఈ ప్రస్తావము చేసెను. ఆమెయు – నీలుని శక్తి సామర్థ్యములను పరస్పరము విని యుండుటచే తన సమ్మతిని దెలుపుచు – అతనిని పరిణయ మాడుటకు ముం దాతఁ డాచరించ వలసిన కొన్ని నియమములు పాటింపవలె నని బదులు చెప్పెను. ఆ నియమములను తప్పక తా ననుసరించుటకు సిద్ధమై యున్నట్లు వాగ్దా నము తీసికొని, తన నియమముల నామె ఇట్లని విశదము చేసెను. మొదటి నియమము – అతఁ డొక శ్రీ వైష్ణవుని సన్నిధి యందు పంచ సంస్కా–రములను విధి విహితముగ పొందుటయు, రెండవ నియమము – అతఁడు నియత వ్రతముగ శ్రీ వైష్ణవ తదీయారాధనమును యావ జ్జీవ కృత్యముగ సంకల్పించి, ప్రతి దినము నాలుగు వేల మంది శ్రీ వైష్ణవులకు తదీయారాధన చేయుటయు – ఆమె కోరెను. అందుకు వెంటనే నీలుఁడు సంతోషముతో నంగీకరించి, నియమ నిర్వహణకు ప్రతిజ్ఞ చేసి, అట నుండి తిరునరైయూర్ (నాచ్చియూర్ కోవిల్) దివ్య దేశమున కేఁగి, భగవానుని తనకు శంఖ చక్రాంకనము చేయ ప్రార్థించి, వారి వలన శంఖ చక్రాంకనమును పొంది, మరలి వచ్చి, సమీప మందలి 'మంగైమతం' అను చోట 'అళకియ శింగర్' స్వామిని ప్రతిష్ఠ జేయించి, భాగవత నిత్య తదీయారాధన కైంకర్య మును ప్రారంభించెను. తిరుమంగయాళ్వారులకు ఆచార్యుఁడైన, శంఖ చక్రాంకనము చేసిన గురుతుగ 'తిరునరైయూర్' దివ్య క్షేత్ర మందలి అర్చావతార మూర్తి యగు భగవానునకు చతుర్భుజములు లేక శంఖ చక్రములను ధరించిన రెండు భుజములే కలవని ప్రతీతి. అర్చావతార మున నాచార్య పదవిని లోభించి, ఇచ్చటి మూర్తి మాత్రమే చతు ర్భుజములను పరిత్యజించి ద్విభుజములతో నుండె నని తెలియుచున్నది.

ఇట్లు నీలుఁడు కుముదవల్లి కోరిక్ర ప్రకారము ఆ నియమముల నీ విధముగ ననుష్ఠించి, పరమ భాగవతోత్తముఁడై ఆమెను పరిణయ

మాడి, చిరకాలము సంసార సుఖముల ననుభవించుచు – ఏమరుపాటు లేక, నిత్య తదీయారాధన కైంకర్యమును యథా సంకల్పితముగ నెర వేర్చుచు, కాలము గడుపుచుండెను. కొంత కాలమునకు తన యొద్ద గల సర్వస్వమును తదీయారాధన క్రింద వ్యయము కాగా – నిర్ధ నుడై, ద్రవ్యార్జనమునకు మార్గాంతరము తెలియక, దారులు కొట్టి, ఆ వైష్ణవు లగు శ్రీమంతులను దోచి, ద్రవ్యము నార్జించి, ఎటులనో తన వ్రతమునకు అంతరాయము రాకుండ తదీయారాధనమును సాగించు చుండెను. ఆతని కీ పనులందు కుడిభుజముగ సాయపడెడి నలువురు అంతరంగు లగు శిష్యులు కూడ నుండిరి. ౧. తొరావళక్కన్ (వాదమందు ఓటమి లేని వాడు) ౨. నీర్ మేల్ నడప్పాన్ (నీటిపై నడచువాడు) 3. తాళూనువాన్ (బిరుదములను ఊనువాడు) ౪. నెళవిల్ ఒదుంగువాన్ (నీడలో నీడయై దాగి నడచెడివాడు) అని వారల పేరులు అన్వర్థములై యమరి యుండును. 'ఆడల్ మా' అను అశ్వము కూడ వాం కొకటి యుండెను

ఇంట్లుండ నొకనాడు తదీయారాధనకు తన యొద్ద సొమ్ము లేకుండుటను విచారించుచు, నీలుడు అరణ్యమునకు పయనమై, శిష్యు లతో సంచరించు చుండెను. ధనికు లగు బాటసారు లెవ్వరు గాని యెచ్చట చూచినను కనుబడలేదు. ఆతడు పరమ దుఃఖితుడై విచారించుచుండుటను చూచిన భక్తవత్సలుడగు భగవానుడు కరుణించి, సర్వాభరణములతో నలంకరింపబడిన యొక్క బాటసారి వేషమును ధరించి, ఆ యరణ్యమున సంచరించుచుండెను. ఆ బాట సారిని చూచిన అతని శిష్యులు పరుగెత్తి, బాటసారిని చక్కగా పరి శీలించి చూచి, తమ నాయకున కెఱిగింపగా – అందఱు కలిసి,

బాటసారిని బెదరించి, ఆభరణము లీయు మని నిర్బంధించిరి. పరమ దయాళు డగు భగవాను డేమియు మారు పలుకక ఆభరణము లన్నియు తీసికొన నిచ్చెను. అన్ని యాభరణములను వలచికొనిన నీలుఁడు పాంథుని కాలి వ్రేలి నున్న మట్టె యొకటి అతని శరీరమున మిగిలి యుంటను పరీక్షించి, దానిని తీయ యత్నించగా - అది రాలేదు. అంత నాతఁడు తన పండ్లతో గట్టిగ కరచి, ఆ పాదాంగుళీయము నూడ బెఱికి, భద్ర పఱచుకొని, సొమ్ముల సన్నింటిని ఒక మూట కట్టి యెత్తికొని పోం డని శిష్యులకు చెప్పెను. వా రెంత బలముతో మూట నెత్తినను అది భారమై, వారలకు ఎత్తుట కలవి కాకుండినంతట నీలుఁడే స్వయముగ తన యావ చ్చక్తిని వినియోగించి, మూట నెత్త జూచెను. అతనికిని సాధ్యము కాలేదు. అంత నాతఁడు కోపోద్రేకమున పాంథుని జూచి, 'ఓ పథికుఁడా ! ఈ యాభరణములను నేను తీసి కొంటిని. ఇది నా సొత్తు. నీ వీ సొమ్ములను నాకు చేరకుండుటకై ఏ దో యొక మంత్రము పెట్టి, వీనిని నేను తీసికొనిపోవుట కలవి కాకుండ చేసియుండవలెను. నీ వా మంత్రమును విడిపించి - ఈ మూటను నేను తీసికొని పోవు నట్లు సాయపడుటయే గాక, నీ మంత్ర మును నా కుపదేశింప వలయును కూడ. అట్లు గాక - నీవు కుయుక్తి వన్ని, నన్ను మోసగింతు వేని, ఇదిగో ! ఇదే నా ఖడ్గము. దీనికి నిన్ను ఎరచేసి, వధించెదను' అని బెదరించెను. భగవానుఁ డాతని స్థైర్యమునకు మెచ్చి - 'ఓ చోరాగ్రేసరా ! నా మంత్ర మమోఘ మైనది. తప్పక నే నా మంత్రమును నీ కుపదేశింతును. నీవు స్నానము చేసి, పరిశుద్ధుఁడవై రమ్ము' అని చెప్పి, అతఁ డట్లు చేయఁగా - దగ్గరకు దీసికొని, బుజ్జగించి, తిరుమంత్రమును అర్థ సహితముగ నుప దేశించి కృతార్థుని చేసెను. నీలుఁడు భగవానుని పాదాంగుళీయాభరణ మును పండ్లతో కరచి తీసినప్పుడే - భగవ త్ప్రాదోదకాస్వాదము

కలిగి, ఆతఁడు భగవత్కృపకు పాత్రుఁడై, ఉపదేశమునకు అర్హుఁడాయెను. మంత్రోపదేశము వలన తత్త్వ జ్ఞానముచే పరిశుద్ధాంతరంగుఁడై - 'వాడి నేన్ వాడి' మొదలగు పాశురములఁ బాడ నారంభించెను. ఆ నాఁడు వివాహ దివ్యాలంకారములతో పథిక వేషమున సాక్షాత్కరించిన రంగనాథుని - సమీప మందలి 'తిరువాలి' యను క్షేత్రమందు తిరుమంగయాళ్వారులు ప్రతిష్ఠింపించి, ఆరాధించుచు వచ్చిరి. నేఁటికిని - కల్యాణ 'రంగనాథు' డఁను పేరిట ఈ దివ్య దేశమందు భగవానునకు వ్యవహారము కలదు.

ఒకప్పుడు తిరుమంగయాళ్వారులు తమ సంచారములో - 'శీర్ కాళి' (శియ్యాళి) అను క్షేత్రమునఁ బోవుచుండ, శైవ సమయ వాదులు వాదమునకు గడంగిరి. తిరుమంగయాళ్వారులు తమ వాద బలముతో వారి నోడించి, త్రివిక్రమ మూర్తిపై పాడిన పాశుర ముల ఒద్దికకు వారలు మెచ్చి, సమర్పించిన ఒక అపూర్వ మగు వేలాయుధము బహుమానముగ స్వీకరించి, దానిని తమకు నిరూపిత స్వరూపముగఁ జేసికొని, జీవిత శేషమున దానిని ధరించుచు వచ్చిరి.

క్రమముగ దివ్య దేశములను వెక్కింటిని సేవించుటలో మార్గ వశమున శ్రీరంగ క్షేత్రమునకు వచ్చి, రంగనాథుని ఆలయమునకు ప్రాకారమును నిర్మించుటకై సంకల్పించెను. ప్రాకార నిర్మాణమున కారంభించి, పనులు జరుగుచుండఁగా అంతలో - నాగ పట్టణమున నొక దేవాలయమందు శక్తి విగ్రహ మొక్కటి బంగారుతో చేయఁ బడినది కల దని కర్ణాకర్ణిగ విని, అచ్చటి కేగి, తన బుద్ధి బలముచే ఆ విగ్రహము నెట్లో సాధించి, దొంగిలించి తెచ్చి, కరగించి, అందుచే లబ్ధ మగు విస్తారమైన ద్రవ్యముచే రంగనాథునకు 'ఆవినాథన్ తిరు వీథి' అను గొప్ప ప్రాకారమును (నాల్గవ ప్రాకారమును) - 'ఆయిర

క్కాల్ మండపము' (వేయి స్తంభముల మంటపమును) కట్టించెను. ప్రాకారమును నిర్మించునప్పుడు మార్గములో ఋజు రేఖపై తొండ రడిప్పొడియాళ్వారులచే నిర్మింపఁబడిన నందవనము అడ్డము రాఁగా- ఆ యాళ్వారుల యందలి ప్రతిపత్తిచే ప్రాకారపు గోడను నంద వనమునకు తప్పించి, త్రిప్పి కట్టించిరి. నేటికిని నందవన హద్దులలో ప్రాకారము వంకర తిరిగి, కనఁబడుచున్నది. అందుకు తొండరడిప్పొడి యాళ్వారులు ప్రీతులై, సంతోష పారవశ్యమున తిరుమంగై యాళ్వా రుల ననుగ్రహించి, వారికి - 'అరుళ్ మారి' (కృపా వర్షము) అని ప్రశంసించి, గౌరవించిరి.

కైంకర్యములు పూర్తి చేయునప్పుడు కర్మ కారులకు ఆనాఁటి కానాఁడు భత్యము నిచ్చి, దేహ యాత్రను జరిపించుచు - మాస వర్ష వేతనముల నొకే తూరిగ పని యంతయు పూర్తియైన పిమ్మట నిచ్చుటకు ఒడంబడికయై, పని వారలు కైంకర్యములఁ జేయుచు ఎచ్చిరి. ప్రాకారా ద్యుద్దిష్ట కైంకర్యములు పూర్తి కాఁగా, వారలు తమ తమ కూలి నీయు డని తిరుమంగై యాళ్వారులను ఒత్తిడి చేయసాగిరి. ఆ యాళ్వారులును యుక్తి పన్ని, కూలివారల నంద ఱును నమ్మించి, కావేరి కావలి తీరమున ధనము కల దనియు, అచ్చ టకు పోవుద మనియుఁ దెల్పి, అందఱను నావ నెక్కించి, నావ కావేరి మధ్యమున జేరిన పిదప తన యొద్ద పైకము లే దనియు చెప్పి, ఆ నావను అమాంతముగ కావేరిలో ముంచివేసెను. అందలి జనులు కావేరి యందు మునిగి, దేహములు చాలించి, ముక్తి నంది రని ప్రతీతి. నేటికిని ఈ కావేరి శాఖను - 'చంపునది' అను నర్థ మిచ్చు - 'కొల్లడమ్' అను తమిళ పదముతో వ్యవహరింతురు.

ధర్మదారతో తిరుమంగై యాళ్వారు లనేక క్షేత్రములను సేవించి, తన వైదుష్యమును చిరస్థాయి చేసెడి అనేక ప్రబంధములను

పాడుచు – తిరిగి కొంత కాలమునకు శ్రీరంగమునకు వచ్చి, ఒకానొక కార్తిక పూర్ణిమా శుభ దినమున శ్రీరంగనాథుని యెదుట 'తిరుప్పుకు రుందాండగం' అను స్వ నిర్మితము లగు రెండు ప్రబంధములను విన్న వించఁగా – రంగనాథుఁడు సంతసించి, నాఁటి దినము తమకు జరుపఁ బడెడి చూర్ణోత్సవమును తిరుమంగై యాళ్వారులకు జరుపుట ట్లాన తిచ్చిరి. అందు కా యాళ్వారులు సమ్మతింపక, తాను కోరునది తనచే నిర్మింపఁబడిన వేయి స్తంభముల మండపమున (రంగనాథుఁడు) వేంచేసి, నమ్మాళ్వారుల 'తిరువాయ్‌మొళి'ని వినుట మాత్రమే యని ప్రార్థించెను. అందుకు రంగనాథుఁ డంగీకరించి, తాము సంకల్పించిన చూర్ణోత్సవ విధానమును మార్పు చేసి, చూర్ణోత్సవ సామగ్రిని 'ఆళ్వార్ తిరునగరి'కి పంపి, ఉత్సవమును ఆ సామగ్రితో నమ్మాళ్వారులకు జరిపించి, నమ్మాళ్వారుల విగ్రహమును మధురకవులతో సహా శ్రీరంగమునకు రావించి, వైకుంఠ ఏకాదశి యారంభించి, వరుసగా పది దినములు రాత్రు లందు అధ్యయనోత్సవమును వేయి స్తంభముల మంటపమందు సంకల్పించి, రంగనాథుఁడు దివ్య ప్రబంధములను వినెను. పూర్వాచార రీతిని ఆ పది దినము లందును వేద పారాయణము జరుపఁబడుచుండుటచే – ఆ వేదాధ్యయనమునకు అవరోధము గాకుండునట్లు ద్రవిడ వేదాధ్యయనము రాత్రు లందు నిర్ణయింపఁబడెను. అందువలననే ఈ యుత్సవమును – 'శాపత్తు' అని వ్యవహరింతురు. అధ్యయనోత్సవము పూర్తియై, నమ్మాళ్వారుల విగ్రహమును మధురకవులు ఆళ్వార్ 'తిరునగరి'కి తీసుకొని పోయిరి. ఇట్లు చాల కాలము ప్రతి సంవత్సర మీ యుత్సవము జరుగుచుండెను.

కావేరీ ప్రవాహము యొక్క ఔద్ధత్యము వలన రాక పోకలు స్తంభించుటచే, నమ్మాళ్వారులను దూర దేశ మంచుండి, సకాలములో శ్రీరంగమునకు తెచ్చుట అసాధ్యమై, చాల కాల మీ యుత్సవము నిలిచి పోవుచు కూడ నుండెను. కొంత కాలము నిలిచి పోవుట అవద్యముగా తోచి, శ్రీ రామానుజ యుగమున నమ్మాళ్వారుల విగ్రహము నొక దానిని శ్రీరంగ దేవాలయమున్కై ప్రత్యేకముగ నిర్మించి ప్రతిష్ఠించి, ఆ విగ్రహమునే ఉపయోగించుచు, అధ్యయనోత్సవము జరుపఁబడినట్లును శ్రీ రామానుజుల కాలములో - ఆళ్వార్ తిరునగరి విగ్రహ సంబంధము శ్రీరంగమునకు విడిచి పోయినట్లును చెప్పుదురు.

తిరుమంగై యాళ్వారులకు తిరువాలి తిరునగరి యందు విగ్రహ ప్రతిష్ఠ చేయఁబడి, ఆరాధనము జరుగుచు వచ్చుచున్నది. అర్చా సమాధి యందు వెలసిన దివ్య మంగళ విగ్రహములలోని కెల్ల ఇచ్చట ఈ యాళ్వారుల బింబము సౌందర్యమున మించిన దని యందురు. రెండవ విగ్రహమును శ్రీ విల్లి పుత్తూర్ ఆండాళుగను, మూఁడవ విగ్రహమును శ్రీ పెరుంబూదూరు ఉడైయవరులదిగను పరిగణింపఁదగు ననియు చెప్పుట కలదు.

'కలియన్' (క్రూరుఁడు) అనియు - 'పరకాలన్' (ఇతర మతముల వారికి కంటకుఁడు) అనియును తిరుమంగై యాళ్వారులకు సార్థకములైన నామాంతరములు కలవు. వీరు 105 సంవత్సరములు భౌతిక దేహముతో సంచరించి, అంత్య కాలమున 'సిద్ధాశ్రమము' అని ప్రసిద్ధి జెందిన 'తిరుక్కురుంగుడి' క్షేత్రమున రంగనాథుని ఆజ్ఞ ననుసరించి, సిద్ధి పొందిరి. ఆ చోటున వారి జ్ఞాపక చిహ్నముగ ఒక ఆలయము కట్టఁబడి, అందు తిరుమంగ యాళ్వారుల విగ్రహము ప్రతిష్ఠింపఁబడి, నేఁటికిని ఆరాధింపఁబడుచున్నది.

10. నమ్మాళ్వారులు :—

వీరు కురుకాపురి యను దివ్య క్షేత్రమున కలిలో ప్రథమ వత్సర మగు ప్రమాద వర్షమున వృషభ మాసము నందు విశాఖా నక్షత్ర ముతో గూడిన శుక్ల చతుర్దశీ శుక్రవారమున కర్ణాటక లగ్నమున 'వెళ్ళాళర్' అను చతుర్థ జాతి యందు విష్వక్సేనాంశచే అవతరించిరి. తండ్రి పేరు 'కారి' యనియు, తల్లి పేరు – ఉడైయవంగై' యనియు, తల్లి పుట్టినిల్లు 'తిరువణ్ పరిశారం' అనియు చెప్పుదురు.

కారి తండ్రి – శెందామరై కణ్ణన్. వారి తండ్రి అచ్యుతులు. వారి తండ్రి అరంతాంగి. వారి తండ్రి తిరువళుదివళనాడన్.

కారి దంపతులు చిరకాలము సంతానము లేక – తిరు క్కురుం గుడి' క్షేత్రమున స్వామిని ప్రార్థించి, ప్రీతు డగు భగవానుని తమకు పుత్రుడై యవతరించునట్లు కోరిరి. భగవాను డట్లే విష్వక్సేనుని కాజ్ఞాపించి, తాను విష్వక్సేనులయం దావిష్టుడై, ఆ దంపతుల గర్భమున శిశువై యవతరించెను. ఈయననే – 'నమ్మాళ్వారులు' అందురు. నేడును – 'తిరుక్కురుంగుడి'యందు ఈ యాళ్వారుల విగ్రహము ప్రత్యేకముగ లేదు. ఆ క్షేత్ర మందలి అర్చామూర్తియే నమ్మాళ్వారులుగ అవతరించి నట్లు చెప్పుటచే, వేరుగ నమ్మాళ్వారుల విగ్రహము ఉండ నవసరము లేక, అట్లు ప్రతిష్ఠింపలే దని యందురు.

ఇట్లు జనన మందిన నమ్మాళ్వారులు, జన్మించినది మొదలు ప్రాకృత శిశువు వలె క్షీర పానము సేయుట – మల మూత్ర విసర్జ నము సేయుట – ఏడ్చుట మొద లగు మానవ లక్షణములు లేక,

మౌనముతో నుండెను. ఈ అయోమయావస్థను పండ్రెండు దినముల కాలము వేచి చూచుచున్న తలిదండ్రులు - తమ దురదృష్టమునకై వగచి, ఆ యూరి యందలి ఆదినాథుని సన్నిధికి తీసికొని పోయి, ఆ బిడ్డను గురించిన తమ క్లేశములను భగవానునకు విజ్ఞాపించుకొనఁ దలచి, అటకు బోయిరి. కొంత సేపటికి నమ్మాళ్వారులు వారలదృష్టి పథమును తప్పించుకొని, భూమిపై దొరలుచు, చెంత నున్న చింత చెట్టు మొదలికి పోయి, అందలి చిన్న కోటర మందు ప్రవేశించి, బయటకు రాక, అచటనే ఉండి పోయిరి. ఎప్పటి వలె అన్న పానాదుల గ్రహింపక, దేహయాత్ర గడుపుచుండెను. ఈ రీతిగా పదునారు సంవత్సరములు గడచెను.

ఆ కాలమున పరమ భాగవతు లగు మధురకవి యాళ్వారులు తీర్థ యాత్రలఁ జేయుచు ఒకనాఁడు యమునా తీరమున నుండఁగా - దక్షిణ దిశయం దొక్క- దివ్య తేజము వారికి గోచరించెను. అపూర్వ మగు నా తేజమును లక్ష్యముగ బెట్టుకొని, దక్షిణ దిక్కు-ననే ప్రయాణము సాగించి, క్రమముగ కురుకాపురికి చేరెను. అచ్చట నుండి దక్షిణమున నా తేజస్సు కనఁబడకపోఁగా - అచ్చటి వారల నా యూరి యందలి విశేషములను గూర్చి ప్రశ్నించెను. అందుకు వారలు నమ్మాళ్వారుల విచిత్ర ప్రవృత్తిని చెప్పఁగా - మధురకవులు తింత్రిణీ వృక్ష మందలి నమ్మాళ్వారులను చూచి, వారి జ్ఞాన సంపత్తిని తెలిసికొని, ఆశ్రయించి, తనకు జ్ఞానోపదేశము జేయు మని ప్రార్థించిరి. నమ్మాళ్వారులు సంతసించి, మధురకవులకు తిరుమంత్ర మును, ద్వయమును, చరమ శ్లోకమును, తిరువాయ్ మొళిని అర్థ సహితముగ నుపదేశించి, 'అవావర' పాశురము నుపదేశించుటతో అవతారమును చాలించిరి. 'తిరువాయ్ మొళి' ఉపదేశ కాల మందు

గూడ – 'పత్తుడై అడియవర్' 'ఎమ్మాళ్వీట్టు' 'ఉణ్ణిలావియ' పాశురముల నను సంధించుచు, ఒక్కొక్క పాశురమును చెప్పునప్పుడు మోహ వశమున పడిపోయి, ఒక్కొక్క మారును ఆరు మాసములకు తెలివి తెచ్చుకొని, పై గ్రంథమును సాగించుచు వచ్చినట్లు చెప్పుదురు. ఒకే పదునారు సంవత్సరములలో అవతార పరిసమాప్తియును – 'తిరువాయ్ మొళి' ఉపదేశమును జరిగిన దని యొక మతము. మూన ముద్రతో ప్రపంచ సంబంధము లేక యుండి, రెండవ పదునారు సంవత్సరములలో 'తిరువాయ్ మొళి' రచనమును అవతార సమాప్తియు నని మఱి యొక మతమును కలదు. 35 సంవత్సరములు మాత్రమే వీరి లీలా విభూతి నలంకరించి యుండిరి.

మధురకవులు 'ఆళ్వార్ తిరునగరి' యందు ఆళ్వారుల విగ్రహమును ప్రతిష్ఠించి, రమారమి మూడు వేల సంవత్సరము లారాధించిరి. కొంత కాలమునకు 'తిరువాయి మొళి' లుప్తమై పోగా – నమ్మాళ్వారులు నాథమునులకు సాక్షాత్కరించి, 'తిరువాయిమొళి'తో పాటు తక్కిన మూడు ప్రబంధములను ఉపదేశించిరి.

11. మధురకవి యాళ్వారులు :—

వీరు ముదలాళ్వారులకు సమ కాలికులు. ద్వాపర యుగము 863100 సంవత్సరములకు పైబడిన విక్రమ సంవత్సరములో – మేష మాసముతో గూడిన చైత్ర శుక్ల గురువారము చిత్రా నక్షత్ర యుక్త మగు శుభ దినమున, పాండ్య దేశము నందలి 'తిరుక్కోళూర్' గ్రామమున, జైమినీయ సామశాఖా బ్రాహ్మణ కుటుంబమునందు గదాంశచే నవతరించిరి. జన్మించినది మొదలు విష్ణు భక్తి సంపన్నులై యుండి, కలి యుగమున ననువర్తించి, నమ్మాళ్వారుల నాశ్రయించి, ఆచార్య ప్రతిపత్తి యందలి భక్తి ప్రపత్తులను తమ యనుష్ఠానమున ప్రకటించిరి.

12. ఆండాళ్ :—

'శ్రీ విల్లి పుత్తూరు' నందు శ్రీ విష్ణు చిత్తుని తులసీవన ములో - ఒకా నొక కటక మాస పూర్వ పక్ష చతుర్థీ పూర్వ ఫల్గుసీ నక్షత్ర యుక్త మంగళవారమున, వరీయాన్ నామ యోగ, భద్ర కరుణ తులా లగ్న మందు భూదేవి యంశచే నవతరించెను.

బాల్యము నుండియు భగవద్భక్తి యం దవగాహించి, పరమ భాగవత శిఖామణియై పెరిగి, తా నలంకరించు కొనిన తులసీ దామము లకై వటపత్రశాయి ఆశ పడునట్లు ఆ దేవునకు తనపై వ్యామోహ మును కల్పింపఁ జేసి, 'తిరుప్పావై', 'నాచ్చియార్ మొళి' యను రెండు ప్రబంధములను రచించి, శ్రీ వైష్ణవ మతమునకు మహోప కారము చేసి, రంగనాథుని పరిణయ మాడుటకై ధనుర్మాసమున నియతముగా వ్రత మాచరించెను. మార్గ దర్శకమైన ఆ వ్రతము మార్గళి మాసమున శ్రీ వైష్ణవ గృహములలో నేఁటికిని మహా వైభవముగా జరుపఁబడుచున్నది.

కవి పండిత పరిచయము

శ్రీమాన్ కొమాండూరు రామానుజాచార్యులు :



కలం పేరు :- 'మధుశ్రీ' జననము :- 6-7-1928. జన్మస్థానముతక్కెళ్ళపాడు అగ్రహారము, ప్రకాశం జిల్లా. జననీ జనకులు :- కంచమ్మ, శ్రీరంగాచార్యులు. విద్యాభ్యాసము :- శ్రీ భావనారాయణ సంస్కృ కళాశాల - పొన్నూరు, ప్రభుత్వ బోధనాభ్యసన కళాశాల - కర్నూలు. అభ్యసించిన భాషలు:- తెలుగు, సంస్కృతము, అరబము. అభ్యసించిన విద్యలు:- సాహిత్య, అలంకార శాస్త్రములు. డిగ్రీలు :- భాషాప్రవీణ, పండిత శిక్షణ, S. S. L. C. విరుదులు :- విమర్శక విద్వాన్స్వతంత్ర. ఉద్యోగము :- కావలి, కందుకూరు Z. P. ఉన్నత పాఠశాలలో-ఆంధ్ర ప్రధాన పండితులుగా చిరకాలము ఉద్యోగమును నిర్వహించి, ఇటీవల ఉద్యోగ విరమణ గావించి, ప్రస్తుతము విశ్రాంతి వేతన మందుము, ఉలవపాడులో నివాసమేర్పఱుకొని యున్నారు. పదవులు:- కందుకూరు తాలూకా రచయితల సంఘాధ్యక్షులు. సమ్మానములు :- కందుకూరు తాలూకా చయితల సంఘమువారు ఎట్టన జయంతికి సన్మానము. నెల్లూరు, కనిగిరి, గుంటూరు పట్టణములలో గల వర్ధమాన సాహిత్య సంస్థలచే సమ్మానములు.

అభిరుచులు :- సాహిత్యము, చరిత్ర పరిశీలన, కావ్య పఠనము ఇత్యాదులు.

రచనలు :- (1) మధురస్తుతి (2) మణిహారము (3) శ్రీస్తుతి (4) ప్రకాశం జిల్లా సాహిత్యప్రకాశిక (5) మాల్యాద్రి వైభవము (6) స్తోత్ర పారిజాతము (7) వెలుగొండస్వామి చరిత్ర (8) శ్రీ శైలాద్దంకి విద్వాభూషణ సింగరాచార్యులవారి చరిత్ర (9) కవిసార్వభౌముడు (10) అజ్ఞాతాంధ్రకవులు (11) శ్రీ వేంకటేశ్వర కరావలంబ స్తోత్రము (12) శ్రీ కోదండరామ

సుప్రభాతము (3) కంపుకూరు సీమచరిత్ర మున్నగునవి. భారతి, ఆరాధన, నవ్తగిరి, ప్రపంతి, సమాలోచన వంటి అనేక పత్రికలలో - కతిపయ పద్య గద్య విమర్శలు, శాఖపత్రగ్రంథ సమీక్షలు ప్రచురితములు.

విశేషాంశములు :- అనేక సాహిత్య సదస్సులలో - సాహిత్య, ఆధ్యాత్మిక విషయములపై ఉపన్యాసములు. ఆకాశవాణిలో ప్రసంగములు కొన్ని ప్రసారితములు

శ్రీమాన్ గొట్టుముక్కల రమాకాంతాచార్యులు :

ఆంధ్రప్రదేశమున గల సుప్రసిద్ధ దివ్య క్షేత్రములలో నొకటి యగు మంగళగిరి పేరి జన్మస్థానము. జననము : 1882 ఆస్తమయము : 1962. వీరికి సంస్కృ తాంధ్ర సాహిత్యములందేగాక, ఆంగ్ల భాషా సాహిత్యములందును అసమానమైన ప్రజ్ఞాపాటవము లుండెడివి. పండిత ప్రకాండులుగా - కవికంఠీరవులుగా - విమర్శక శిరోమణులుగా వీరు విఖ్యాతిని సంపాదించిరి. ఉభయ వేదాంతములలో వీరికిగల వైదుష్యమును గుర్తించినవా రనేకులు వీరికి సన్మానములు చేసి, సత్కా రముల గావించి, విరుదముల నొసంగి, మిక్కిలి ప్రశంసించి యుండిరి.

వీరు బాలకాలము రెవెన్యూ డిపార్టుమెంటులో - తాలూకా తహశీలుదారుగా ఉద్యోగమును నిర్వహించి, విశ్రాంతి వేతన మందుచు, బాపట్ల పట్టణములో స్థిరనివాస మేర్పఱచుకొని యుండెడివారు.

వీరు బాల్యమననే అవధానముఁ జేయ నారంభించి, వానిని నైపుణ్యముతో నిర్వహించుచుండెడివారు. అట్టి తరుణమునందే, ఇంగ్లీషు నుండి 'గేసలిజీ' (Gray's Elegy) ని తెన్గించిరి. సంస్కృతమునుండి యామునాచార్యుల స్తోత్రరత్నమును,

మహాభాష తాంతర్గతమగు భగవద్గీతను ఆంధ్రీకరించిరి. 1930, 1933, 1936, 5945, 1949 సంవత్సరములలో - పాటలీపుత్రము, మైసూరు, కాశీ, బొంబాయి పట్టణము అందు జరిగిన ప్రాచ్య విద్వన్మహా సభలలో బాగ్గాని, వివిధ విషయము లపై మహోపన్యాసము లొసంగి. పండిత ప్రశంసల నందుకొని యుండిరి. శ్రీవైష్ణవ పత్రిక, కల్యాణి, ప్రపన్నసుధ, ముముక్షువు, రామకృష్ణప్రభ మొదలగు మానపత్రిక లలో వీరి వ్యాసములు విశేషముగ ప్రచురింపఁ బడుచు, పాఠకుల ప్రశంసలకు పాత్రము లగుచుండెడివి. రచనలు :- విశ్వవిద్యాలయము, గోకుల నిర్మాణము, అస్తమయము (నాటకము), ఆచార్య స్మృతి మున్నగునవి వీరి తెలుగు కృతులు. సంస్కృతములో - భగవ దపకార సంగ్రహము, మంగళాద్రి లక్ష్మీనృసింహ స్తోత్ర తత్త్వము, యదుగిరీశ ముక్తాహారము, శ్రీనివాస స్తవరాజము, గీతారహస్య జిజ్ఞాస, సూత్రమత జిజ్ఞాస, యోగరహస్య జిజ్ఞాస, భగవన్మత కౌస్తుభము ఇత్యాదులు. ఆంగ్ల భాషలో - 'In the Temple of Truth' (సత్య నికేతనము) అను పేరు గల పద్యకావ్యము. ఇది ఆంగ్ల కవిశేఖరులచే విశేషముగా ప్రశంసింపఁబడినది.

శ్రీమాన్ పొడిచేటి శ్రీరంగాచార్యులు

ఆంధ్రప్రదేశములో సుప్రసిద్ధ క్షేత్ర మైన భద్రాచలము వీరి జన్మస్థానము. జననము రుధిరోద్గారి నామ సంవత్సర ఆషాఢ శుద్ధ త్రయోదశి (26-8-1924).

వీరు భద్రాచలమునఁ గల శ్రీ సీతా రామాలయార్చక కుటుంబములోని వారు. తానీషా కాలమున రామదాసుచే కొనిరా బడిన వైష్ణవకుటుంబము వీరిది.

పరమ భాగవతాగ్రేసరులును - శ్రీ వేణుగోపాలకృష్ణ పీఠాధిపతులును వగు కీ॥పే॥ శాయనాచార్యులు, కీ॥శే॥ సీతమ్మ గారలకు వీరు చతుర్థ పుత్రులు. సుప్రసిద్ధ

పాంచరాత్రాగమ విద్వాంసులును - చరిత్రశేషులు నగు సీతారామానుజాచార్యుల వారికి కనిష్ఠ సోదరులు. వీరు - కర్షణాది ప్రతిష్ఠాంతము వఱకు దేవయాజ్ఞికమును, నాలాయిర దివ్య ప్రబంధములను, శ్రీ పాంచరాత్ర దివ్యాగమ శాస్త్రములను అధ్యయనమొనర్చిరి.

డిగ్రీలు :- మద్రాసు విశ్వ విద్యాలయమునకు సంబంధించిన 'సాహిత్య శిరోమణి', 'తెలుఁగు విద్వాన్', చిత్తూరు సంస్కృతభాషా ప్రచారము సభ వారి 'వేదాంత కోవిద', హైదరాబాదు రాజ్య హిందీ సభ వారి 'రాష్ట్రభాషా భూషణ్' మున్నగునవి.

ఉద్యోగములు :- నల్లగొండ, మునగాల, సూర్యాపేట మున్నగు పట్టణములలోఁ గల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా కొంతకాలము పనిచేసిరి. ఇట్లుండ, ఉత్తరప్రదేశ ప్రభుత్వముచే ఆంధ్రపండితులుగా ఎన్నుకొనఁబడి, కొంతకాలము గోరక్‌పూర్ ప్రభుత్వ కళాశాలలోని సాయంకాల కక్ష్యలలో ప్రభుత్వోద్యోగులకు తెలుఁగు డిప్లొమా కోర్సుకు శిక్షణ నొసంగి, అనంతరము ఉద్యోగ విరమణ గావించి, విశ్రాంతి వేతన మందుచు, జన్మస్థానమగు భద్రాచల క్షేత్రమునందే ప్రస్తుతము నివాస మేర్పరచుకొని యున్నారు.

వీరు - 'శ్రీ భద్రాచలక్షేత్ర మాహాత్మ్యము' అను నొక గ్రంథమును రచించి, ప్రచురించిరి. అనేక సందర్భములలో - పలు తావులలో పండిత సన్మానములు పొందిరి.

వీరు - మహా మంత్రసిద్ధులు, నిత్య సాధకులు, సంస్కృతాంధ్ర హిందీ భాషలలో గొప్ప వక్తలు, రచయితలు. సాహిత్య - వేదాంతములు, ఆగమశాస్త్రములు వీరి అభిమాన ధనములు.

శ్రీమాన్ వేదాంతం జగన్నాథాచార్యులు

జననము :- జయనామ సంవత్సర జ్యేష్ఠ బహుళ తదియ (24-6-1894).
జన్మస్థానము :- గుంటూరుజిల్లా, బాపట్ల తాలూకా, చందవోలు గ్రామము. వీరు అప్పికట్ల గ్రామములో నివసించుచుండెడి వారు. భగవచ్ఛాస్త్ర, అలంకారశాస్త్ర, ధర్మశాస్త్ర, పూర్వమీమాంసాశాస్త్ర, తర్కశాస్త్ర, వేదాంతశాస్త్ర, వ్యాకరణ శాస్త్రములలో వీరు ఉద్దండ పండితులు. దాదాపు ఇరువది సంవత్సరములపాటు పిఠాపురము మహారాజావారి సంస్థానమున ఆస్థాన పండితులుగా నుండిరి. గోవర్ధన పీఠాధిపతులు, మేలుకోట పీఠాధిపతులు మున్నగు మహనీయులచే - 'వేదాంత రత్న' 'న్యాయ రత్నాకర' 'విద్యా భూషధి' 'సాహిత్య రత్న' 'మహా విద్వాన్' అను బిరుదములతో సంభావింప బడిరి. సుప్రసిద్ధ భారతీయ విద్వాంసులును, 'పద్మశ్రీ', 'పద్మభూషణ' బిరుదాలంకృతులు నగు శ్రీరాధాకుముద ముఖర్జీ (కలకత్తా)వారిచేతను, మహారాజుల చేతను అనేక యోగ్యతా పత్రములను పొందిరి. అనేక సంస్థానములలో వార్షిక సన్మానముల నందుకొనిరి. తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన పండితులుగా పదవి నధిష్ఠించి, దాదాపు మూడు దశాబ్దముల కాలము తమ పదవిని అత్యంత సమర్థతతో నిర్వహించుచేగాక, 'శ్రీ వేంకటాచల క్షేత్ర మాహాత్మ్యము' అనుపేర నొక మహా గ్రంథమును రచించిరి. దానిని తిరుమల తిరుపతి దేవస్థానములవారు సర్వాంగ సుందరముగా ముద్రించిరి. ఈ జగన్నాథాచార్యులవా రిపుడు కీర్తిశేషులు.

శ్రీమాన్ బృందావనం రంగాచార్యులు

జననము :- 13-2-1929. జన్మ స్థానము :- ప్రకాశంజిల్లా - పరుచూరుకు సమీపమునఁ గల పీరన్నపాలెము. జనని జనకులు:- రాఘవమ్మ, తాండవకృష్ణమాచార్యులు. శ్రీమాన్ రంగాచార్యులు గారు తమ పితృపాదుల వద్ద సంస్కృతాంధ్ర భాషలలో సుశిక్షితులై, అనంతరము తెనాలి సంస్కృత కళాశాలలో నాల్గు సంవత్సరములు విద్యాభ్యాసము చేసి, 'భాషా ప్రవీణ' పరీక్షలో ప్రథములుగా ఉత్తీర్ణులై, ఆంధ్ర విశ్వ విద్యాలయమున బంగారు పతకమును బహుమానముగా పొందిరి. అనంతరము 35 సంవత్సరముల కాలము పరుచూరులో - యార్లగడ్డ రామన్న ఉన్నత పాఠశాలలో ఆంధ్రోపాధ్యాయులుగా పని చేసి, 1987లో ఉద్యోగ విరమణ చేసిరి,

రచనలు :- (1) ఆదర్శమూర్తులు (2) త్యాగమూర్తులు (3) పుణ్యమూర్తులు (4) దివ్యమూర్తులు (5) తేజోమూర్తులు (ఇవి యైదును గద్య కావ్యములు) (6) భక్తపోతన (7) బాల నాటికలు (8) అప్పాజీ (9) దివ్య దీక్ష - అన్నమాచార్య (టి. డి డి. ప్రచురణ) (10) గుహుడు (ఆంధ్ర విశ్వ విద్యాలయము వారిచే, బి ఏ. తెలుగు పాఠ్యముగా సంకలింపఁ బడిన పద్యకావ్యము) (11) శబరి (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము వారిచే, బి.ఏ. తెలుఁగు పాఠ్యము నకు స్వీకరింపఁబడిన పద్యకావ్యము) ఇంకను - (12) పూజా పుష్పాలు (13) మురళి (14) బాలబోధ మొదలైన పద్యరచన లనేకములు. ఇట్లు వివిధ ప్రక్రియలలో నేటివఱకు శ్రీరంగాచార్య లేఖినినుండి వెలువడిన కృతిరత్నములు ముప్పదింటికి మించి యుండును.

ఆంధ్రపత్రిక, ప్రభ, జ్యోతి, కృష్ణావంటి ప్రముఖ పత్రికలలో వీరి గద్య పద్యరచన లనేకములు ప్రచురితములు. ప్రముఖ కవిపండితులతో కలిసి భువన విజ

యము, భారతావతరణము మొదలైన సాహిత్య రూపక ప్రదర్శనములలో పాల్గొని పేరు గాంచిరి. భాగ్యనగరమున ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినవుడు - వీరు భువనవిజయ సభలో పొల్గొని, ప్రభుత్వ పక్షమున ఘనసన్మానము పొందిరి. 4-8-86 తేదీన మద్రాసులో - యార్లగడ్డ వెంకన్నచౌదరి అవార్డును స్వీకరించేరి. విభవ ఉగాది పర్వదినమున హైదరాబాదు - రవీంద్రభారతిలో - కవి సమ్మేళనమున ముఖ్య మంత్రిచే ఘన సన్మానము పొందిరి.

తిరుపతి, సింహాచలము, అన్నవరము, శ్రీశైలము మున్నగు ప్రముఖ దేవాలయములలో ఆధ్యాత్మిక ప్రసంగము లనేకములు చేసిరి. ఆకాశవాణి విజయవాడ కేంద్రమునుండి వీరి ప్రసంగములు, స్వీయకవితలు కొన్ని ప్రసారములై, ప్రశంసలు పొందినవి. సహృదయులుగా, సాహితీ సమారాధకులుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా వక్తలుగా, మధుర కవులుగా వీరు సుప్రసిద్ధులు.

శ్రీ రావూరి ప్రసన్న సత్యనారాయణ

జన్మస్థానము :- గుంటూరు మండల మునకుఁ గల కావూరు గ్రామము.
జననము :- 2-8-1938.

వీరు 1946-54 సంవత్సరముల నడుమ – స్వగ్రామమైన కావూరులోనే ప్రాథమిక విద్య నభ్యసించిరి. 1954-56 సంవత్సరముల నడుమ, నిడుబ్రోలు కళాశాలలో ఉన్నత విద్య నభ్యసించిరి. 1956–59 సంవత్సరముల నడుమ, ఆంధ్ర విశ్వకళా పరిషద్ఆంధ్ర భాషా శాఖలో బి.ఏ. ఆనర్సు తరగతిలో విద్యాభ్యాసము గావించి, ప్రథమ శ్రేణిలో నుత్తీర్ణత నందిరి. 1960వ సంవత్సరమున ఎం.ఏ. పట్టమును స్వీకరించిరి. 1959వ సంవత్సరమునందే, ఆంధ్ర విశ్వకళా పరిషద్ఆంధ్ర భాషలో పిహెచ్.డి. పట్టమునకై ప్రారం

ఛించిరి. 1959–60 సంవత్సరముల నడుమ యూనివర్శిటీ గ్రాంట్సు కమీషన్ వెర్చి స్కాలరుగాను పరిశోధన గావించిరి.

'భక్తితత్త్వము - ఆంధ్ర వాఙ్మయము' అనునదియే వీరి పరిశోధన విషయము. వైదిక సంస్కృత వాఙ్మయమును పరిశీలించి, అందు వికీర్ణముగ గనిపించు భక్తితత్త్వము యొక్క స్వరూపమును ఒక్కచో నిరూపించి, అట్టి భక్తితత్త్వము యొక్క స్వరూపము ఆంధ్ర వాఙ్మయమునం దెట్లున్నదియు నిరూపించుటయే వీరి పరిశోధన లక్ష్యము.

చిన్ననాటి నుండియు వీరు ఆంధ్ర వాఙ్మయమునెడ అభిరుచి గలవారు. వివిధ సాహిత్య విషయములపై సుమారు ఇరువది వ్యాసములు వీరివి పత్రికలలో ప్రచురింపఁ బడినవి.

ఆచార్య : యస్వీ జోగారావు

జన్మస్థానము :- పార్వతీపురము. విజయనగర మండలము. జననము :- విభవనామ సంవత్సర భాద్రపద బహుళ తృతీయ 2-10-1918. జననీ జనకులు:- మంథా సరస్వతమ్మ, భారద్వాజ, వాగ్గేయ కారిణి, శిష్టా సాంబశివరావు భార్గవులు కవి. పట్టములు :- ఎం.ఏ తెలుగు ప్రథమశ్రేణి, ప్రథమ స్థానము. 1952 పి.హెచ్.డి. స్వర్ణపతక పురస్కారముతో 1957. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, వాల్తేరు. బిరుదములు :- 'మధుర సరస్వతి', 'మహాకవి', 'సాహితీ రత్నాకర'. పురస్కారములు - (1) బి.ఏ. ఆనర్సు, ఎం.ఏ. సర్వ ప్రథమ స్థానము నిమిత్తము ఆంధ్ర విశ్వకళా పరిషత్ బహుమతులు, 1952. (2) ఆం. వి. క. ప. ఆర్జు విభాగములో సర్వోత్తమ పరిశో

ధన నిబంధము నిమిత్తము 'సర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు' నామాంకిత పరిశోధన సువర్ణపథకము 1959. (3) చేసిన జానపద సారస్వత వరిపస్యకు గుర్తింపుగా - హైదరాబాదులో - ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ పక్షమున ముఖ్యమంత్రిచే సన్మానము 1970. (4) విశ్వవిద్యాలయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆంధ్రప్రభుత్వ సత్కారము - సనద, నగదు, రజత పతకము 1980. పదప్రగతి :- 1) 1954-'56 : భారత ప్రభుత్వ పరిశోధన పండితులు. 2) 1926-'65 : ఆంధ్ర విశ్వకళా పరిషత్తులో లెక్చరర్, రీడరు. 3) 1965'67 : సోవియట్ దేశములో - లెనిన్‌గ్రాడ్ విశ్వవిద్యాలయమున తెలుగు ప్రొఫెసరు. 4) 1968 - '76 : గుంటూరు ఆం. వి. క. ప. పరమ పట్టభద్ర కేంద్రమున ఆంధ్ర శాఖాధ్యక్షులు. 5) 1976 - '79 : వాల్తేరులో ఆం. వి. క. ప. ఆంధ్ర శాఖాధ్యక్షులు 6) 1980 - '85 : ఆం. వి. క. ప. ఆర్ట్సు, కామర్సు, లా కళాశాలలకు అధ్యక్షులు. 7) 1986 జాతీయ ఆచార్యులు (National Professor) 1988 జూన్‌లో ఉద్యోగ విరమణ. విశాఖపట్టణములో స్థిర నివాసము.

కొన్ని సభ్యత్వములు :- 1) గుంటూరు మండల రచయితల సహకార సంఘము అధ్యక్ష పదవి - 1972-'76. 2) ఆం. వి. క. ప. సిండికేట్, సెనేట్, ఎకడమిక్ కౌన్సిలు, బోర్డు ఆఫ్ రిసెర్చ్ మొదలగువానిలో సభ్యత్వము. 3) ఆం. వి. క. ప. ప్రాచ్య విద్యావరిషత్తు అధ్యక్షులు. 4) ఆం. వి. క. ప. తెలుగు స్టడీస్ బోర్డు అధ్యక్షులు. 5) శ్రీ వేంకటేశ్వర, ఉస్మానియా, బెంగుళూరు, బనారసు మొదలగు విశ్వవిద్యాలయముల తెలుగు స్టడీస్ కోర్సులలో సభ్యత్వము. 6) పూర్వోత్తరములు, కాకతీయ, అన్నామలై, మద్రాసు, మైసూరు, ధార్వారు, మొదలగు విశ్వవిద్యాలయముల ఎం ఏ; ఎం.ఫిల్; పిహెచ్.డి. పట్ట పరీక్షల సభ్యత్వము, అధ్యక్షము. 7) ఢిల్లీ, వారణాసి కేంద్ర విద్యాలయములు, యు.పి.యస్.పి. మొదలగువాని ఉద్యోగ నిర్ణయ విధాన సమితులలో సభ్యత్వము 8) భారతప్రభుత్వ విద్యాశాఖ, యు.జి.సి. భాషావిభాగము, సాహిత్య అకాడమీ, అలహాబాదు జ్ఞానపీఠము మొదలగువానికి సలహాదారులు. 9) ప్రకృతము ఆలిండియా ఓరియంటల్ కాన్ఫరెన్సు, ఫోక్‌లోర్, ప్లేన్‌నేమ్సు, ఆం. ప్ర. సాహిత్య అకాడమీ మొదలగు సంస్థలలోను, గతములో - భారత ప్రభుత్వ యువనాయక, పయోజన విద్యా, ఎన్.సి.సి. శిక్షణ శిబిరములందు సభ్యత్వము. 10) ఒక సంపత్సరకాలము గుంటూరు రోటరీ క్లబ్బులో - డైరక్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ సర్వీసు.

రచనలు - ముద్రితములు :- 1) పంచకల్యాణి (ఖండకావ్యముల సంపుటి) 2) సప్తతంతువు (విమర్శనాత్మక సంపుటి) 3) ఆంధ్ర యక్షగాన వాఙ్మయచరిత్ర (డాక్టరేట్ పట్టి పరిశోధన నిబంధము) 4) అప్సరస (గేయ నృత్యనాటికలు 5) ఉప నిషత్తు (ఖండకావ్యముల సంపుటి) 6) సువర్ణ శృంఖల (కథానికల సంపుటి) 7) మధుర మాధవం (నాటికల సంపుటి) 8) అమెరికన్ సాహిత్యం (ఆంగ్లము నుండి అనువాదము) 9) సారస్వత నీరాజనము (సాహిత్య వ్యాస సంపుటి) 10) మహాకవి మార్గము (తిక్కన విరాటపర్వ విమర్శ) 11) తెలుగు జీవుడు (వ్యాకరణ మీమాంస) 12) రోటరీదర్శిని 13) ప్రసన్న కువికాయుధము (అతి వినూత్న విలక్షణ ప్రణాళికమైన మహాకావ్యము) 14) యక్షగానము (ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభ ప్రచురణ) 15) శారదా పీఠము (సమీక్ష) 16) క్రీడాభిరామ సమీక్ష 17) అడిగొప్పుల హోరుగాలి (కావ్యము) 18) శృంగార సర్వజ్ఞము (కావ్యము) 'ఊహాప్రహేళిక' అను అభినవ సారస్వత ప్రక్రియ - వీరి అపూర్వ సృష్టి, ఇప్పటి కైదారు ప్రకటింపబడినవి.

అముద్రిత గ్రంథములు :- 1) కాదంబరీస్వాదము 2) మహాకవిమార్గము (తిక్కన భారత సమగ్ర సమీక్ష) 3) The Andhra People's Theatre. 4 బృహత్సంహిత (వరాహ మిహిర కృతికి అనువాదము) 5) Chips from a Writer's Workshop 6) షేక్స్పియరు సంపద 7) అరవింద సౌరభము 8) Russian - Telugu Phrase Book 9) రష్యను సాహిత్య దర్శనం 10) అప్రాచ్య లోకాభిరామాయణం 11) సారస్వతానుభవం 12) సహస్రధార (నెపోలియన్ ప్రతిభ) 13) చోమోలుంగ్మా (నవల) 4) ఆసేతు శీతాద్రి.

పరిష్కృత గ్రంథములు - ముద్రితములు :- 1) సముఖము వేంకట కృష్ణప్పనాయకుని రాధికా సాంత్వనము 2) శారదా విపంచి 3) మేలుబంతి 4 కచ్ఛపీ శ్రుతులు 5) వ్యాసపీఠము 6) నా యెఱుక 7) బాటసారి 8) ఆది భట్ల నారాయణదాస సారస్వత నీరాజనము.

ఇంకను ఆంధ్రప్రభుత్వ పాఠ్యగ్రంథముల సంపాదకత్వము, సాహిత్య అకాడమీ ప్రచురణలలో సహకారము మొదలగునవి.

ముద్రిత వ్యాసములు :- పలుపత్రికలలో, ప్రత్యేక సంచికలలో, పలుసంపుటములలో - పలు విషయములపై ఆంధ్రాంగ్లములలో పరశ్శతము.

విశేషాంశములు :- 1) వీరి మార్గ దర్శకత్వములో - ఇప్పటికి పదునెనిమిది (18) మంది డాక్టర్ పట్టభద్రులైనారు. అది ఆంధ్రా యూనివర్సిటీకి రికార్డు. అందు ఇరువురు వీరి వలెనే ఉత్తమ పరిశోధన నిబంధము నిమిత్తము బంగారు పతకము లందుకొన్నారు. 2) వీరి శిష్యులు ముగ్గు రీ నాడు - మూడు విశ్వవిద్యాలయములో తెలుగు ప్రొఫెసర్లుగా ఉన్నారు. 3) వీరు పర్యటించిన విదేశములు - సోవియట్ యూనియన్, అమెరికా, కెనడా, ఇంగ్లండు, ఫ్రాన్సు జర్మనీ, ఇటలీ మొదలైన అనేక యూరపు దేశములు. 4) అద్భుత ప్రతిభతో అనేక వినూత్న సాహితీ సభలకు రూపకల్పన చేసినారు. ఉదాహరణకు : బ్రహ్మ సభ, ఇంద్ర సభ, సరస్వతీ సామ్రాజ్యము, మన్మథ సామ్రాజ్యము, శృంగార, ధర్మాసనము, త్రైలోక్య విజయము, కనకాభిషేకము, అష్ట కష్టావధానము, సవరన తరంగిణి మొదలగునవి. అన్నిటి అధ్యక్ష స్థానము వీరిదే.

శ్రీ కల్లూరి చంద్రమౌళి



జన్మస్థానము :- గుంటూరుజిల్లా, తెనాలి తాలూకా, మోపల్లు గ్రామము.
జననము :- విళంచి నామ సంవత్సర కార్తీక మాసము (15-11-1898).

వీరు స్కాట్లండు దేశమున గల ఎబర్డీన్ విశ్వ విద్యాలయములో వ్యవసాయ శాస్త్ర మధికరించి, పట్టభద్రులై, 1922 లో స్వదేశమునకు తిరిగి వచ్చిరి. ప్రభుత్వో ద్యోగము చేయ నొల్లక, స్వాతంత్ర్య సమరములో పాల్గొని, సత్యాగ్రహ రంగమున పురోగమించి, చాలకాలము కారాగార వాసము చేసిరి. అట్టి కారాగారవాస సమయము నందే, పండిత మిత్రుల తోడ్పాటుతో సంస్కృ తాంధ్ర సాహిత్యములలో ప్రవేశ మును సంపాదించిరి.

1938 నుండి 1940 వఱకు - గుంటూరు జిల్లా బోర్డు అధ్యక్షులుగా పదవిని నిర్వహించి మండల ప్రజల మన్ననలకు పాత్రులైరి. 1947 లో భారత దేశమున కాంగ్రెసు ప్రభుత్వ మేర్పడిన సమయమున ఉమ్మడి మద్రాసు రాష్ట్రిమములో 1952 వఱకు ఆయిదు సంవత్సరములు అమాత్యులుగా నుండి, సహకార సంస్థలను, స్థానిక సంస్థలను తీర్చి దిద్దిరి. ఆంధ్ర రాష్ట్రి మవతరించిన యనంతరము మఱల అమాత్య పదవి నలంకరించి 1955 నుండి 1956 వఱకు రెవెన్యూ, దేవాదాయ, ధర్మాదాయ శాఖలను నిర్వహించి, ఆయా శాఖలకు నూతనో త్తేజమును గల్పించిరి. విశాలాంధ్ర మవతరించిన తదుపరి 1960 నుండి 1962 వఱకు అమాత్య పదవి నధిష్ఠించి, దేవాదాయ ధర్మాదాయ శాఖలను కడు సమర్థతతో నిర్వహించిరి.

1947–52 సంవత్సరముల నడుమ - అమాత్యులుగా నున్న తరుణము నందే వీరు సంస్కృతాంధ్రాంగ్ల భాషా విశిష్ట పాండిత్య సమలంకృతులును, 'సంస్కృత సాహితీ వల్లభ' 'సారస్వత సారజ్ఞ' ఇత్యాది బిరుదాంకృతులును, వంశ పరంపరాగత రామాయణ పారాయణ నిర్వహణ సంపన్నులు, జ్ఞాన - వయో వృద్ధులు నగు శ్రీమాన్ సుందరాచారియర్ (B.A: B.L.) గారి సన్నిధిలో శ్రీమద్రా మాయణమును శ్రద్ధాసక్తులతో అధ్యయనము గావించి, అందలి మాధుర్యమును తా మాస్వాదించుటయే గాక, 'శ్రీ రామాయణ సుధా లహరి' యను పేర నొక మహా

గ్రంథమును రచించి, ప్రచురించి, తన్మూలమున శ్రీ మద్రామాయణ మాధుర్యమును ఆంధ్ర మహాజనులకు చవి జూసిరి.

వీరి రామాయణ సుధా లహరిలో - వాల్మీకి హృదయము నవలోకించి, పరమ హర్షము నందిన పశ్చిమ గోదావరీ మండలమున గల తణుకు నగర పండిత మండలి- ఉస్మానియా విశ్వకళా పరిషదు పాధ్యక్షు లగు డాక్టరు సూరి భగవంతముగారి అధ్యక్ష తన 1956 లో ఒక మహాసభ నేర్పఱచి, అందు వీరికి సువర్ణ సంశోభితములైన స్వాగత పత్రములను, ఆర్ష విద్యాలంకార బిరుదమును సమర్పించి, సన్మానించిరి.

ఆంధ్ర రాష్ట్రావతరణానంతరము అమాత్యులుగా నున్న తరుణము నందే వీరు – శ్రీశైల క్షేత్రమును జీర్ణోద్ధరణ మొనర్ప పలెనని నిశ్చయించి, అందుల కొక సంఘమును నెలకొల్పి, గుంటూరు పట్టణమునందే వంపన్నులగువారినుండి లక్ష రూపాయలను విరాళముగా సేకరించి, ఆలయ పునరుద్ధరణ కార్యక్రమమును ఆరంభించిరి.

విశాలాంధ్ర మవతరించిన యనంతరము అమాత్య పదవి నధిష్ఠించి యున్న తరుణమున, ఆంధ్రదేశమునఁ గల సుప్రసిద్ధములైన దేవాలయములను పునరుద్ధరింప వలె నని తలంచి, అందుల కొక పథకమును తయారు చేసి, భద్రాచలము నందలి శ్రీ సీతారామాలయ పునరుద్ధరణకై తాము స్వయముగా మొట్ట మొదటనే పదివేల రూపాయలను విరాళముగా సమర్పించిరి. అనంతరము దేశవాసుల నుండి అచిర కాలములోనే 19 లక్షల రూపాయలను విరాళముగా సేకరించి, శ్రీ భద్రాచల క్షేత్ర మును కలియుగ వైకుంఠముగా తీర్చి దిద్దుటకై ఆ ద్రవ్యమును వెచ్చించి, అపర రామదాసుగా విఖ్యాతి గాంచిరి.

బొంబాయిలో - కే. యం. మున్షీ ప్రభృతులచే సంస్థాపింపఁ బడిన సంస్కృత విశ్వకళా పరిషత్ పంచమ వార్షికోత్సవమును 1955 లో - తాము ఆంధ్రరాష్ట్రమున అమాత్యులుగా నున్న తరుణమునందే, నాటి రాష్ట్రపతి యగు శ్రీ రాజేంద్ర ప్రసాద్ మహాశయుల ఆధ్యక్షతన – తిరుపతి క్షేత్రములో నేర్పఱచి, భారతదేశమునఁ

గల ప్రముఖ పండితుల ననేకుల నాహ్వానించి, వారి పాండిత్య ప్రకర్షలను బాగుగా నవగతము గావించుకొని, వారిని సముచిత రీతిని సన్మానించిరి.

కేంద్రప్రభుత్వము వారు నెలకొల్ప నెంచిన ప్రథమ సంస్కృత విశ్వవిద్యాలయమును తిరుపతి క్షేత్రమున సంస్థాపించి, సంస్కృత భాషా వ్యాప్తికి సముద్యమించిరి.

1964 లో - తిరుమల తిరుపతి దేవస్థానముల పాలక వర్గమునకు అధ్యక్షులై, తిరుమలలో - 'శ్రీ వేంకటేశ్వర ఆర్ష సంస్కృతి సదస్సు' అను నొక సంస్థను నెలకొల్పి, తన్మూలమున ప్రతి నిత్యము శ్రీ స్వామివారి సన్నిధానమున - చతుర్వేద పారాయణము, శ్రీ వేంకటాచల క్షేత్ర మాహాత్మ్య—భాగవత—రామాయణ పారాయణములు, పురాణ ప్రవచనములు, పండితోపన్యాసములు, హరికథా కాలక్షేపములు, భజన కాలక్షేపములు, సంగీత సభలు మున్నగునవి నిరంతరాయముగా జరుగునట్లు తగిన ఏర్పాటు గావించిరి.

గుంటూరు - చంద్రమౌళి నగరము నందలి 'తపో వన' మను సౌధమున చాలకాలము గడపి, అనేక సాహిత్య - ఆధ్యాత్మిక కార్యక్రమము లందు పాల్గొనుచే గాక, అనేక గ్రంథములను రచించి, భార్యా వియోగానంతరము - జన్మస్థాన మగు మోపల్లు గ్రామమున ప్రస్తుతము తమ జీవిత శేషమును గడుపుచున్నారు.

రచనలు :- 1) రామాయణ సుధాలహరి 2) భారతీయ ప్రతిభ 3) వేదామృతము 4) వైతు - రాజ్యాంగము 5) నానాదేశ రాజ్యాంగములు 6) ఆండాళ్ వైభవము 7) దేవాలయములు 8) మతము - భౌతిక శాస్త్రము 9) పురుషార్థములు 10) సంస్యాసాశ్రమము 11) దివ్య జీవనము 12) ఆచారములు-ఆడంబరములు 13) యుగ సమీక్ష 14) వేద సుధాకరము మున్నగునవి ఇవి యన్నియు ముద్రిత గ్రంథములే. ఇంకను అముద్రిత గ్రంథము లనేకములు కలవు.

శ్రీమాన్ రొంపిచర్ల పార్థసారథి భట్టాచార్యులు

జననము :- మన్మథ నామ సంవత్సర భాద్రపద శుద్ధ చతుర్థీ భానువారము (8-9-1895). జన్మస్థానము :- కృష్ణా జిల్లా - బందరు తాలూకా, ఆకుల మన్నాడు గ్రామము.

బందరు సమీపమునఁ గల గూడూరు నోబుల్ బ్రాంచి స్కూలులో ప్రాథమిక విద్యను, బందరు నోబుల్ హైస్కూలులో ఆంగ్ల విద్యను అభ్యసించిరి. ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసము చేయు తరుణము నందే సంస్కృత పండితుల కడ పంచకావ్యముల జదివి, మత - సాహిత్య సంబంధలైన వ్యాసము లనేకములు రచించి, గురువుల మన్ననలకు పాత్రులైరి.

1913 వ సంవత్సరమున తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాలలో విద్యార్థిగాఁ జేరి, సిద్ధాంత కౌముదితో విద్యాభ్యాస మారంభించి, కాలక్రమమున, సాహిత్య - మీమాంసా - న్యాయ శాస్త్రములు సధికరించి, ఆ శాస్త్ర పరీక్షలలో నుత్తీర్ణత నందిరి.

తిరుపతిలో విద్యాభ్యాసము గావించుకొని, 1919-లో స్వగ్రామమునకు తిరిగి వచ్చు సమయమున, వీరి పాండిత్యమును, ప్రతిభను గుర్తించిన వారు కొందఱు — తిరుపతి దివ్య క్షేత్రము నందే వీరిని గౌరవింప వలెనని నిశ్చయించి, 'మహోపాధ్యాయ', 'వైయాకరణ కేసరి' బిరుదాలంకృతు లగు శ్రీ మున్నం వైయాకరణ నుబ్బరాయాచార్యుల వారి యధ్యక్షతన నొక విద్వన్మహాసభ నేర్పఱచి, అందు వీరికి - వైయాకరణ పంచానన' అను బిరుదము నొసంగి, వీరిని ఘనముగా సత్కరించిరి

ఈ బిరుదు సత్కారములను వీరు స్వీకరించి, స్వగ్రామమునకు చేరిన తదుపరి, జ్యేష్ఠ సోదరులైన శ్రీమాన్ శ్రీనివాసాచార్యుల వారి వద్ద వైఖానసాగమ శాస్త్రమును అధ్యయనము గావించిరి.

రాజ గురువులును, ఉభయ వేదాంత పారంగతులు నగు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల అప్పలాచార్యులుగారును, 'చతుర్శాస్త్ర విద్వాన్', 'మహా కవి' బిరుదాలంకృతు లగు శ్రీమాన్ కిణాంబి గోపాల కృష్ణమాచార్యులుగారును, మటికొండ ఱును నూజివీడు సంస్థానమున ఆస్థాన పండితులుగా నున్న సమయములో - ఆ విద్వాంసులు వీరి ప్రతిభా వ్యుత్పత్తులను బాగుగా గుర్తించి, వీరి పాండిత్య ప్రకర్షను ఉయ్యూరు ప్రభువులకు నివేదించి, వారిచే 1922-లో 'విద్వత్కవి సార్వభౌమ' అను బిరుదము నిప్పించి సత్కరింపఁ జేయుటయే గాక, వీరిని ఉయ్యూరు ఆస్థాన విద్వాంసులుగా కూడ నియమింపఁ జేసిరి. తదాది మూడు సంవత్సరములవఱకు వీరు ఆ ప్రభువులతో కలిసి మెలిసి కాలక్షేపము జేయుచు, 'మదనానంద భాణమ్' అను గ్రంథమును రచించి, ప్రచురించిరి.

1925–31 సంవత్సరముల నడుమ మద్రాసులో శ్రీమాన్ మణ్ణాళి కృష్ణమాచార్యుల వారివద్ద నాలాయిర దివ్య ప్రబంధముల నధ్యయనము గావించి, అది నుండి శ్రీరంగ క్షేత్రమునకుఁ జేరి, అచ్చట శ్రీరంగ నారాయణ రామానుజ జీయరు స్వామిగా విఖ్యాతి గాంచి యున్న శ్రీమాన్ కారప్పన్‌గాడు దేశిక వరదాచార్యుల వారి సమక్షమున 'శ్రీ యతీంద్ర ప్రవణ చెట్టి చారిటీస్' లో పలుమారులు భగవద్విషయముపై ప్రవచనము గావించి, ఆ మహనీయులచే ప్రశంసా పూర్వమైన మంగళాశాసనము బడసిరి.

అటు పిమ్మట వీరు 1943వ సంవత్సరమున తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో - శ్రీ వైఖానస ఆగమశాస్త్రాధ్యాపమునకై నియమింపఁబడి, 1955 వఱకును ఆ పదవిని నిర్వహించిరి.

1955 లో వేదపాఠశాలా విభాగము తిరుమలకు మార్చబడినందున, ఆ పాఠశాలోద్యోగమునుండి వీరు విరమించిరి.

అనంతరము శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య విద్యా పరిశోధక కేంద్రమునందు ఆగమశాస్త్ర పరిశోధకులుగా తిరుమల తిరుపతి దేవస్థానములవారిచే నియుక్తులైరి. కాని, ఒక సంవత్సర కాలము గడుచుసరికి, ఆ సంస్థ - శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయము వారికి స్వాధీనము చేయబడినందున, విశ్వవిద్యాలయ నిబంధనముల ననుసరించి వయఃపరిమితి మీరి యుండుటచే, వీ రచ్చటినుండి ఉద్యోగ విరమణ చేయవలసివచ్చెను. అయినను, తిరుమల తిరుపతి దేవస్థానముల వారు—వీరి బహుముఖ ప్రజ్ఞా విశేషములను గుర్తించినవా రగుటచే, వీరిని విడువ జాలక, ఆ దేవస్థానములకు ఆగమ విద్వాంసులుగా నియమించిరి. తదాది చాలకాలమువఱకు తిరుమల తిరుపతి దేవస్థానములకు సంబంధించిన నిర్మాణ కార్యక్రమములు, విశేషోత్సవాదులు వీరి సూచనల ననుసరించియే జరుగుచుండెడివి.

వీరి ప్రజ్ఞా ప్రాభవములు - అంతటను వ్యాప్తములైనందున, 1967లో వీరు రాష్ట్రపతి బహుమానమును పొందగల్గిరి. అనంతరము వీరిని తిరుపతి క్షేత్రమున శ్రీ వైఖానస యువజనమండలి వారు 1967 డిశంబరులో - శ్రీమాన్ మాడభూషి అనంత శయనం అయ్యంగారి యధ్వర్యమున - 'ఆగమ చక్రవర్తి' అను బిరుదముతో ఘనముగా సన్మానించుటే గాక, ఒక అభినందన సంచికను గూడ ప్రచురించిరి. అనంతరము 1968-లో ఒంగోలు, నెల్లూరు, బాపట్ల పట్టణములలో వీరికి సత్కారములు జరుగుటే కాక, బాపట్ల సభలో వీరికి - 'మహోపాధ్యాయ' అను బిరుదము గూడ ఈయబడినది.

సంపన్నులు విరాళముగా నొసంగిన రూ. 1,50,000/- విరాళ ద్రవ్యముతో వీరు తిరుమల క్షేత్రమున 'శ్రీ వైఖానసాశ్రమ' మను పేర ఒక ధర్మశాలను నిర్మించిరి. వీ రిపుడు కీర్తిశేషులు.

రచనలు :- 1) మదనానంద భాణమ్ 2) దశవిధ హేతు నిరూపణమ్ 3) మరీచి సంహిత 4) ఆనంద సంహిత 5) నీతి రామాయణమ్ 6) శ్రీ భగవదర్చా ప్రకరణమ్ 7) క్రియాధికారమ్ 8) జ్ఞానకాండమ్ 9) శ్రీనివాస దీక్షితీయమ్ 10) మంగళా శాసన స్వరమాలిక మొదలగునవి.

సవరణలు

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
7	7	ణేతి హాసము	ణేతిహాసము
,,	12	పునఃి	పునఃి
8	4	సూత్రములను	సూత్రము లను
,,	11	గానుఁ	గాను
,,	17	ద్వయాత్మకము	ద్వయాత్మకము
9	2	తషముగా	తమముగా
10	5	వనుజ	మనుజ
11	5	కూద్రులని-	కూద్రు లని-
,,	6	పరులని	పరు లని
,,	12	ఇటు	ఇట్లు
,,	23	వస్యేతి	మస్యేతి
12	8	' పుల'లో	'జీవుల'లో
17	22	మఱియును.	మఱియును,
18	9	వేదాంతా ను	వేదాంతాను
20	6	మగు నకి	మగునరికి
21	21	స్పష్టీకంప	సృష్టీకరింప
22	3	లోక మున	లోకమున
24	22	బ ధ	బంధ
26	11	ప్వామ	పూర్వము
,,	13	శ ణించు	శరణించు
27	4	వునకు	జీవునకు
,,	22	పోవువ టి	పోవువంటి

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
28	7	మ గళ	మంగళ
,,	22	య దు	యందు
,,	24	మ గళ	మంగళ
29	15	ని డి చి	నిందించి
30	2	పు కి	పురికి
,,	8	విష్ణు హ్రస్ర	విష్ణుసహస్ర
,,	15	ఉద్గ్రి థ	ఉత్గ్రింథ
31	5	వక్షిణీ	మక్షిణీ
,,	9	కా ణ	కారణ
34	17	ధ ర్మమునకే	ధర్మమునకే
37	7	శ్రేష్టములై	శ్రేష్ఠములై
,,	18	మహాభూవ గుణాః	మహాభూత గుణాః
42	6	నారదో శ్రావయన్	నారదోఽశ్రావయన్
43	20	దీని ండి	దీనినుండి
45	8	పరిశోధన	పరిశోధన
,,	18	ప్రయాజనము	ప్రయోజనము
,,	24	యు డును.	యుండును.
48	20	మోక్షోపాయ	మోక్షోపాయ
50	11	బోధి ప	బోధింప
55	7	దరించునో	ధరించునో
,,	15	పాంచరాత్రగమ	పాంచరాత్రాగమ
56	11	శిరోధా ర్యము	శిరోధార్యము
58	2	నొన్చ	నొనర్చి
69	7	అభితపు	అభిత ప్త

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
69	25	చె ప్ప	చెప్పి
73	15	అంత ్నయంతయై	అంతర్నితయంమై
,,	19	అ ్చక	ఆర్చక
75	11	క ్మ	కర్మ
83	5	కూ ్మ	కూర్మ
86	13	వ్వెలయించు	న్వెలయించు
88	15	మున్గ	మున్గ
,,	18	కనభీమతము	కనభిమతము
91	4	మొనర్పజాల	మొనర్పగజాల
104	6	ననుష్ఠించిప	ననుష్ఠించిని
107	15	వచనములకును	వచనములకును
109	1	్తి త ్త్వము	భ ్తిత ్త్వము
110	7	యుఁడునో	యుండునో
,,	15	గూ ్చన	గూర్చిన
111	12	లేకు డుట	లేకుండుట
116	7	అగ్నిష్టోమాది	అగ్నిష్టోమాది
119	15	ఆమృతు	అమృతు
120	23	వదలఁదు.	వదలదు.
125	21	భే ములచే	భేదములచే
132	10	ప్రౌడవాదము	ప్రౌఢవాదము
144	15	భడెక్కు న	భక్తుడైన
147	24	ఇ ్ఫటి	ఇప్పటి
148	11	లక్షీయో	లక్ష్మీయో
154	7	నస్త్యేవ	నాస్త్యేవ
161	3	సంకీరించు	సంకీర్తించు
166	2	ఆద్యావశ్యకములు.	అత్యావశ్యకములు

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
166	3	ఆప్పుడు	అప్పుడు
,,	5	అన్వేషణము	అన్వేషణము
,,	19	జేయును	బేయును.
69	12	శబ్దముకూట	శబ్దముకూడ
,,	16	అనన్యమైన	అనన్యమైన
72	3	ఆవిస్మార్యము	అవిస్మార్యము
,,	,,	ఆంతరంగమున	అంతరంగమున
,,	4	ఆర్థించుటను	ఆర్థించుటను
80	6	ప్రస్పుటింపబేయు	ప్రస్ఫుటింపజేయు
96	7	గీతముంమ	గీతమును
05	21	Diksikar	Diksitar
10	4	మిక్కిఁతి	మిక్కిలి
16	13	మరుశినాన్,	నురుశినాన్'
20	26	సిద్గార్థి	సిద్ధార్థి
28	10	నిర్బంధించిరి.	నిర్బంధించిరి.
33	2	వయాణమై	ప్రయాణమై
35	3	న ధించుచు	నంధించుచు
42	6	తియ	తీయ
44	15	ద్యుద్దిష్ట	దుద్దిష్ట
48	3	దేశ మంచుండి	దేశమం దుండి
48	19	యూ	యూరి

—) o (—



Rs. 35-00

SRI RAMANUJA KEERTHI KOUMUDI

(Encyclopaedia of Vaishnavism)

VOL. I

★

EDITOR :

Dh. VARADACHARYULU

(Vidya Bhushana - Kavita Visarada)

PUBLISHERS :

Sri Ramanuja Keerthi Koumudi Granthamala

Sri Lakshminarayana Puram

GUNTUR - 522 006.

★

PRICE

R